


# అభివృద్ధి - విధ్వంసం

కె. బాలగోపాల్





- భూమి
- భావజాలం
- కోర్టులు
- కోస్టల్ కారిడార్

# అభివృద్ధి - విధ్వంసం




- భూమి
- భావజాలం
- కోర్టులు
- కోస్టల్ కారిడార్

# అభివృద్ధి-విధ్వంసం
## భూమి, భావజాలం, కోర్టులు, కోస్టల్ కారిడార్

మానవహక్కుల వేదిక ప్రచురణ
**Human Rights Forum Publication**

ప్రచురణ సంఖ్య: 36
ప్రచురణ కాలం: అక్టోబర్ 2015
కాపీలు: 1000
వెల: 100 రూపాయలు
కవర్: అనంతు
డిటిపి: కెవిఆర్
ముద్రణ: నవ్య ప్రింటర్స్

ప్రతులకు:
**ఎస్. జీవన్ కుమార్**
3-12-117/ఎ-2/బి, పి.ఎస్. కాలనీ,
గణేష్‌నగర్, రామంతపూర్,
హైదరాబాద్-500 013
ఫోన్: 040-27039519

**ప్రజాశక్తి, నవోదయ బుక్‌హౌస్‌లు**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org
బాలగోపాల్ రచనల కోసం: www.balagopal.org

# మా మాట

ఇది 'సరళీకరణా'నంతర ఆంధ్ర (తెలంగాణతో సహా) దేశ చిత్రపటం. కొత్త అభివృద్ధి తెచ్చిన కొత్త విధ్వంసాన్ని నమోదు చేసిన హక్కుల పత్రం. పాతికేళ్ల క్రితం మొదలై ఇప్పటికీ కొనసాగుతున్న ఒక బీభత్స దృశ్యం. చూడాలనుకున్నవారికి తప్ప ఇతరులెవరకీ కనబడని రక్తగాయాల రహస్య నిలువు, అడ్డుకోతల పటం. ఏమంత సుఖంగా ఉండదు దీన్ని చదవడం.

1990ల్లో మొదలైన నూతన ఆర్థిక విధానాలు క్రమక్రమంగా ఎలా తమ విధ్వంస విశ్వరూపాన్ని ఆవిష్కరించాయో ఈ పుస్తకంలోని ఒక్కొక్క వ్యాసం ఒక్కొక్క పాఠంలా మనకి తెలియజేస్తాయి. విద్య, వైద్యం లాంటి మామూలు అభివృద్ధికి సైతం నోచుకోని దేశ మారుమూల ప్రాంతాలను ఎంచుకుని ఒక రహస్య సునామీలా అవి వాటిపైకి విరుచుకుపడి బడుగుల జీవనాన్ని ఎంత ఛిన్నాభిన్నం చేశాయో బాలగోపాల్‌గారు అనేక వ్యాసాలు, ఉపన్యాసాలు, రిపోర్టులు, కరపత్రాల రూపంలో చాలా వివరంగా తెలియజేశారు. ఇప్పుడు వాటన్నిటినీ కలిపి 'అభివృద్ధి–విధ్వంసం' పేరిట ఐదు సంపుటాలుగా తీసుకువస్తున్నాం. ఆ సిరీస్‌లో ఇది మొదటిది. ఇందులో అభివృద్ధి భావజాలం, కోర్టులు–అభివృద్ధి, కోస్టల్ కారిడార్, భూపంపిణీ–సేకరణ పేరుతో నాలుగు విభాగాలున్నాయి. సౌలభ్యం కోసం వాటిని విడగొట్టామే కాని అన్నిట్లోను కనిపించేది వీళ్లూ వాళ్లూ అన్న తేడా లేకుండా అన్ని రాజకీయ పార్టీలూ, పాలనా యంత్రాంగమూ, కోర్టులూ అనుసరిస్తున్న, బలపరుస్తున్న అభివృద్ధి నమూనా మీద బలమైన విమర్శ, తీవ్రమైన వ్యతిరేకత.

ఒకే విషయాన్ని మళ్లీ మళ్లీ చెప్పినట్టనిపించే ప్రమాదం లేకపోలేదు. కాని "రాజ్యాంగ విరుద్ధం, చట్ట విరుద్ధం, జీవించే హక్కుకు భంగకరం" లాంటి మాటలు పోలీసులకు, ప్రభుత్వానికి ఎన్నిసార్లు చెపుతాం అని ఒకసారి ఎవరో కించిత్ విసుగ్గా అన్నప్పుడు "వాళ్లు ఎన్నిసార్లు ఆ పని చేస్తే అన్నిసార్లూ చెపుతాం" అని ఏ మాత్రం తడుముకోకుండా జవాబిచ్చారు బాలగోపాల్‌గారు. ఇందులో కొన్ని విషయాలు మళ్లీ మళ్లీ అంతే వివరంగా రావడానికి కారణం అదేనని ఆయన మాటల్లోనే మేము కూడ మనవి చేసుకుంటున్నాం.

**మానవహక్కుల వేదిక**
**3 అక్టోబర్ 2015**

# ఇందులో...

అమర్త్యసేన్ సరళీకరణకు మెరుగులు దిద్దుతున్నాడా? . . . . . . . . . .5
అమర్త్యసేన్‌ను అనుసరించాలంటే మన పాలకులు ఏం చేయాలి? . .10
మళ్ళీ రైతుల ఆత్మహత్యలు . . . . . . . . . . . . . . . . . . . . . . .14
ఈ ప్రాకులాట అవమానకరం . . . . . . . . . . . . . . . . . . . .17
ఈ కరువు మళ్లీ వస్తుంది జాగ్రత్త . . . . . . . . . . . . . . . . . . .20
మనుషులు లేని 'పర్యావరణం' . . . . . . . . . . . . . . . . . . . .23
ఫీల్‌గుడ్ అబద్ధానికి బలమైన జవాబు అవసరం . . . . . . . . . . . . . .26
అక్రమ కనెక్షన్ల క్రమబద్ధం మేలు! . . . . . . . . . . . . . . . . . . .30
ప్రకృతిని దానిపాటికి ఉండనిద్దాం . . . . . . . . . . . . . . . . . . .33
అభివృద్ధి పథంలో ఎన్ని ప్రాణాలర్పించుకుంటూ పోతాం? . . . . . .36
మధ్యతరగతి మందహాసం.. లక్ష కారు...! . . . . . . . . . . . . . .40
'ఐటి' భావజాలం తొలగిపోయేనా? . . . . . . . . . . . . . . . . . . .44
ప్రజాస్వామ్యానికి 'తాయిలాల' తెగులు . . . . . . . . . . . . . . . . .48
అదే పాలన, అదే విధ్వంసం . . . . . . . . . . . . . . . . . . . .52
అభివృద్ధి విధ్వంసం . . . . . . . . . . . . . . . . . . . . . . . . .56
సహజవాయువుపైన మొదటి హక్కు స్థానికులకేనా? . . . . . . . . .71
సర్దార్ సరోవర్ ప్రాజెక్టు: సుప్రీంకోర్టు కళ్లకు 'అభివృద్ధి' గంతలు . .74
అభివృద్ధే అయితే అబద్ధాలేల? . . . . . . . . . . . . . . . . . . . .92
కోస్ట్‌ను కబళిస్తున్న 'కారిడార్' . . . . . . . . . . . . . . . . . . .97
చర్చలకు కూర్చునే ముందు... భూమి సమస్యను అధ్యయనం చేయండి 113
ప్రజాభూమి కమిషన్ ఆవశ్యకత, కర్తవ్యాలు . . . . . . . . . . .117
వై.ఎస్. భూమి భాగోతం: ప్రజల కోణం . . . . . . . . . . . .129
పేదల భూములను కంపెనీలకు కట్టబెట్టే కొత్త 'భూసంస్కరణల' ప్రహసనం 133
సిపిఐ(ఎం) భావ దారిద్ర్యం . . . . . . . . . . . . . . . . . . . .173
వామపక్షాలూ... ఆలోచించండి . . . . . . . . . . . . . . . . . .178
ప్రభుత్వం మీ భూమికోసం వస్తే... . . . . . . . . . . . . . . . .182
భూములెందుకు ఇచ్చేయాలి? . . . . . . . . . . . . . . . . . . .194
భూసేకరణ, పునరావాస బిల్లులు: అసలే అరకొర... ఆపై ఆలస్యం . .199

# అమర్త్యసేన్ సరళీకరణకు మెరుగులు దిద్దుతున్నాడా?

అమర్త్యసేన్‌కు నోబెల్ బహుమతి లభించడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్న చర్చ వామపక్షాలలో జరుగుతున్నది. ఆయనను మరొక కీన్స్ (Keynes) గా చూడాలా? అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభానికి ఒక ఉపశమన మార్గాన్ని సూచించిన వ్యక్తిగా అర్థం చేసుకోవాలా? 1930లలో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొన్న సంక్షోభానికి జవాబుగా కీన్స్ కొన్ని ప్రతిపాదనలు చేసాడు. మార్కెట్‌లో డిమాండ్‌ను పెంచడానికి ప్రభుత్వం చురుకుగా చర్యలు తీసుకోవాలని చెప్పాడు. ఆర్థికరంగంలో ప్రభుత్వానికి ఏ పాత్ర లేదనీ 'మార్కెట్ శక్తుల'కే వదిలిపెడితే ఆ శక్తులే కాగల పని చేసుకుపోతాయనీ చెప్పే సంప్రదాయక లిబరల్ ఆర్థిక సిద్ధాంతాలకిది విరుద్ధం. అయితే కీన్స్ ప్రతిపాదన పెట్టుబడిదారీ వ్యవస్థకు చాలా ఉపయోగపడింది. ఉత్పాదనకూ డిమాండ్‌కూ మధ్య అసమతుల్యం ఏర్పడి ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయినప్పుడు ప్రభుత్వం చొరవ తీసుకొని డిమాండ్‌ను పెంచే కార్యక్రమం చేపట్టాలనే ఆలోచన ఆనాటి నుండి పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక విధానాలలో భాగమయిపోయింది.

అమర్త్యసేన్ సేవలు ప్రస్తుత ప్రపంచీకరణ దశలో అదే పాత్ర నిర్వహిస్తున్నాయనీ, తద్వారా ఆయన ప్రస్తుత ప్రపంచ పెట్టుబడిదారీ వ్యూహాన్ని కాపాడడానికీ దానికి ప్రజలలో కొంత ఆదరణ కల్పించడానికీ ఉపయోగపడు తున్నాడనీ, అందువల్లనే ఆయనకు నోబెల్ బహుమతి లభించిందనీ వాదిస్తున్న వాళ్లున్నారు. ఇంతటి కుట్రను ఊహించని వాళ్లు సహితం, అమర్త్యసేన్

పెట్టుబడిదారీ వ్యవస్థ ఆచరించలేని సూచనలను ప్రతిపాదించడం ద్వారా అది వాటిని ఆచరించగలదేమోనన్న భ్రమలు కల్పిస్తున్నాడనీ, అందువల్లనే ఆయనకు నోబెల్ బహుమతి లభించిందనీ వాదిస్తున్నారు.

సామ్రాజ్యవాద ప్రయోజనాలకు తోడ్పడకపోతే నోబెల్ బహుమతి ఎందుకిస్తారు? అన్న ప్రశ్న దగ్గర మొదలుపెట్టి తర్కిస్తే అతను ఏ ప్రయోజనం చేకూరుస్తున్నాడో వెతికే పద్ధతిలోనే విశ్లేషణ జరుగుతుంది. కానీ పాశ్చాత్య దేశాలలో జరిగేదంతా సామ్రాజ్యవాద ప్రయోజనాల పరిరక్షణే కాదు. ఇక్కడ ఉన్నట్టే అక్కడ కూడ భిన్న ప్రయోజనాలున్నాయి. విభిన్నమైన విలువలున్నాయి. పరస్పర విరుద్ధమైన ఆలోచనలూ ఆకాంక్షలూ ఉన్నాయి. వీటిలో దేని ప్రభావం ఏ మేరకు నోబెల్ బహుమతులను ఎంపిక చేసే స్వీడిష్ అకాడమీ మీద ఉంటుందని నిర్ణయం చేయడానికి కావలసిన సమాచారం ఎవరి దగ్గరా లేదు. అంత మాత్రం చేత సామ్రాజ్యవాద ప్రయోజనాల 'ప్రభావమే' ప్రధానమని నమ్మవలసిన అవసరమేమీ లేదు. నిజమే, ఇప్పటిదాకా అర్థశాస్త్ర బహుమతి పెట్టుబడిదారీ ప్రయోజనాలకు నష్టకరమైన ఆలోచనలు చేసిన వారికెవ్వరికీ ఇవ్వలేదు. జోన్ రాబిన్సన్‌కు సహితం ఇవ్వలేదు. అటువంటిది ఇప్పుడు అమర్త్యసేన్‌కు ఇచ్చారు. మళ్లీ వచ్చే సంవత్సరం నుండి పాత మూసలోకే పోవచ్చు. దీని వెనుక ఏవో కుట్రలు ఊహించుకోవడం కంటే అమర్త్యసేన్ ఆలోచనలు, ఆ ఆలోచనలలోని విలువలు ప్రజలకు ఏ మేరకు మేలు చేస్తాయో, ఏ మార్పుకు దోహదం చేస్తాయో చర్చించుకోవడం మేలు.

కీన్స్ ఆలోచనలు మొట్టమొదట సంప్రదాయక బూర్జువా అర్థశాస్త్రాన్ని కొంత ఇబ్బంది పెట్టినప్పటికీ వేగంగానే ఆమోదం పొందాయి. పెట్టుబడిదారీ దేశాల ప్రభుత్వాల పాలనా విధానాలలో భాగమయ్యాయి. ఇప్పుడవి కూడ 'సంప్రదాయక విధానాలు' అయిపోయాయి. అమర్త్యసేన్ ఆలోచనలు సంపూర్ణంగా ఎప్పటికీ పెట్టుబడిదారీ పరిపాలనా విధానాలలో భాగం కావు, కాలేవు. 'మానవ పెట్టుబడి' (హ్యూమన్ కేపిటల్) అనే భావనలో ఇమడగల కొన్ని అంశాలు మాత్రం కాగలవు. అవయినా ఏ మేరకు నిజంగా పెట్టుబడిదారీ పాలనా విధానాలలో భాగమవుతాయనేది వేచి చూడవలసిందే.

కీన్స్ ప్రత్యక్షంగానే పెట్టుబడిదారీ ఆర్థిక మాంద్యానికి జవాబు వెతికే కర్తవ్యాన్ని తన ముందు పెట్టుకున్నాడు. అయితే సృజనాత్మకమైన ఆలోచనా శక్తి ఉన్నవాడు కాబట్టి సంప్రదాయ విరుద్ధంగా ఆలోచించాడు. అమర్త్యసేన్ చేసింది అది కాదు.

ఆయన ఎంపిక చేసుకున్న సమస్య ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏ విధంగా పరిష్కరించాలన్నది కాదు; దానివల్ల దెబ్బతింటున్న ప్రజలకు కొంత ఉపశమనం కల్పించి ప్రపంచీకరణకు ప్రజామోదం తెచ్చిపెట్టాలంటే ఏం చేయాలన్నది కాదు.

అమర్త్యసేన్ కేవలం అర్థశాస్త్రవేత్త కాదు. నైతిక తత్వవేత్త కూడ. సమానత్వం, న్యాయం, మంచి మొదలయిన నైతిక భావనలపైన ఆయన చాలా లోతుగా తాత్విక చర్చ చేసాడు. బహుశా ఆయన అర్థశాస్త్ర పరిశోధనల కంటే ఇదే ముఖ్యమైనదేమో (దీనికి నోబెల్ బహుమతి ఇచ్చే ఏర్పాటు లేకుండవచ్చుగాక). అయితే ఈ విలువల చర్చను ఆయన కేవలం అమూర్తంగా చేసి ఊరుకోకుండ అర్థశాస్త్రానికి అన్వయించి ఆర్థిక పరిస్థితుల, విధానాల విమర్శలో భాగం చేస్తాడు.

అయితే ఈ చర్చ చేసేటప్పుడు ఆయన విశ్లేషణ మార్క్సిస్టులకు అలవాటయిన పద్ధతిలో సాగదు. తాను నిర్వచించే విలువలు ఏ వ్యవస్థలో సాధ్యమవుతాయి? ఆ వ్యవస్థను అందుకోవాలంటే ఏం చేయాలి? అనే పద్ధతిలో సాగదు. సమానత్వం, న్యాయం, మంచి సంపూర్ణంగా సిద్ధించే 'వ్యవస్థ' నొకదానిని మనం ముందుగానే నిర్వచించుకొని దానికి కావలసిన బాటను నిర్దేశించుకోగలమన్న విశ్వాసమే సందేహాస్పదమయినదని ఈ శతాబ్దపు కమ్యూనిస్టు విప్లవ ప్రయత్నాల చరిత్ర సూచిస్తున్నది కాబట్టి అమర్త్యసేన్ ఆ పద్ధతిలో వివేచించకపోవడాన్ని తప్పుపట్టనవసరం లేదు. దీని అర్థం, మనం ప్రతిపాదించే విలువలకూ మన చుట్టూ ఉన్న పరిస్థితులకూ మధ్యనున్న సంబంధాన్ని చూడకుండా ఉండాలని గానీ, చూడకుండ ఉండడం సాధ్యమని గానీ కాదు. కానీ దానికీ, ఒక 'విముక్తి' బాటను ప్రతిపాదించని నైతిక ఆలోచన పనికిరాదనడానికీ చాలా తేడా ఉంది.

అమర్త్యసేన్ పద్ధతి వేరు. ఆయన సమానత్వం, న్యాయం, మంచి మొదలైన విలువల గురించి లోతుగా చర్చ చేస్తాడు. ఇతర తత్వవేత్తలు వాటికి ఇచ్చిన నిర్వచనాలను విమర్శనాత్మకంగా పరిశీలిస్తాడు. అవి నిర్దిష్టమైన పరిస్థితులలో ఏ విధంగా పనికి రాకుండా పోతాయో, లేక వైరుధ్యాలకు దారితీస్తాయో చూపిస్తాడు. చివరికి తనదైన నిర్వచనాన్ని ప్రతిపాదిస్తాడు.

తాను ప్రతిపాదించే న్యాయం ఫలాన 'ఉత్పత్తి వ్యవస్థ'లో మాత్రమే సాధ్యం అవుతుందని ఆయన అనడు. నిజానికి అది కేవలం ఉత్పత్తి వ్యవస్థకు సంబంధించిన విషయం కాదు. అయితే ఒక్కొక్క సామాజిక పరిస్థితులలోనూ (అందులో ఉత్పత్తి వ్యవస్థే కాక ఇతర సాంఘిక వ్యవస్థలూ, పరిపాలనా వ్యవస్థ,

రాజకీయ వ్యవస్థ, సాంస్కృతిక విలువలు కూడ ఉంటాయి) ఈ న్యాయానికి ఉండే అవరోధాలను గుర్తిస్తాడు. ఈ గుర్తింపు ఆ పరిస్థితుల మీద బలమైన విమర్శ పెట్టడానికొక సాధనంగా పనిచేస్తుంది.

అమర్త్యసేన్ నైతిక చర్చకు ప్రాతిపదిక మనిషి. మనిషికి అప్పటి పరిస్థితిలో ఉండే శక్తి, అర్హత, యోగ్యత, అవకాశాలు ఆయనకు ప్రమాణం. వీటిని పెంచేది న్యాయం అనీ, తగ్గించేది అన్యాయం అనీ అంటాడు. ఈ నిర్వచనంలో ఏ సమస్యలూ లేవని కాదు. నిజానికి న్యాయానికి, సమానతకూ ఏ నిర్వచనం ఇచ్చినా దానిని అన్వయించేటప్పుడు ఏదో ఒక వైరుధ్యం ఎదురుకాక తప్పదనీ, అన్ని వైరుధ్యాలనూ అధిగమించే నిర్వచనం ఏదీ ఉండదనీ అమర్త్యసేన్ అంటాడు. దీని అర్థం న్యాయాన్ని గురించి, సమానత గురించి ఆలోచించడం మానేయాలని కాదు. నా దగ్గరే అసలయిన జవాబు ఉందన్న అహంభావాన్ని వదులుకోవాలని మాత్రమే. ఉన్నంతలో ఎక్కువ ప్రశ్నలకు జవాబు చెప్పగల నిర్వచనాన్నీ ఎక్కువ సంతృప్తి ఇవ్వగల ఆలోచననూ కొంత వినయంతో స్వీకరించడంలో తప్పేమీ లేదు.

ప్రపంచీకరణ, సరళీకరణ క్రమాలు దేశంలో సామాన్య ప్రజల శక్తినీ, అవకాశాలనూ పెంచగలవని అమర్త్యసేన్ నమ్ముతాడు. అయితే ఇది జరగాలంటే ప్రజలకు కొంత ప్రాథమికమైన బలాన్ని అందించే చర్యలు ప్రభుత్వం అనుసరించాలంటాడు. వాటిలో విద్య, ఆరోగ్యం, సాంఘిక (ముఖ్యంగా లైంగిక) అసమానతల తొలగింపు లేక తగ్గింపు, విధాన నిర్ణయాలలో ప్రజలకు భాగస్వామ్యం, విధాన నిర్ణయాలను ప్రభావితం చేయడానికి అవసరమైన రాజకీయ స్వేచ్ఛ మొదలయినవి ముఖ్యమయినవి. వీటిని కల్పించే విధానాలు లేకుండా సరళీకరణ, ప్రపంచీకరణ చేపడితే దేశంలో పేదరికం, అసమానతలు, హింసా దౌర్జన్యాలు పెరిగే ప్రమాదం ఉందనీ ప్రస్తుతం భారత పాలకులు అనుసరిస్తున్న సరళీకరణ విధానాలు ఆ బాట మీదనే ఉన్నాయనీ అమర్త్యసేన్ అంటాడు.

ఇవన్నీ ఉన్నా, సరళీకరణ, ప్రపంచీకరణ ప్రజల బలాన్నీ అవకాశాలనూ నిజంగా (అంటే సమానతకు అమర్త్యసేన్ ఉపయోగించే ప్రమాణాలకు అనుగుణంగా) పెంచుతాయన్న అభిప్రాయంతో విభేదించవచ్చును. అమర్త్యసేన్ వ్యక్తం చేసే ఈ అభిప్రాయం కార్పొరేట్ పెట్టుబడికి ఉండే బలాన్నీ దాని వికృత నైజాన్నీ తక్కువగా అంచనా వేస్తుందని నా అనుమానం. అయినప్పటికీ

ప్రపంచీకరణ వల్ల నిజంగా న్యాయం జరగాలంటే ఏమేమి చేయవలసి ఉంటుందో అవేవీ చేయకుండ ప్రపంచీకరణ బాట మీద దేశాన్ని పెట్టడం అసమానతల పెరుగుదలకూ పేదరికం పెరుగుదలకూ హింసాదౌర్జన్యాలకూ దారి తీస్తుందంటూ అమర్త్యసేన్ వివరంగా చేసే విమర్శ భారత పాలకులు (ముఖ్యంగా మన చంద్రబాబు) అనుసరిస్తున్న విధానాలకొక చెంపపెట్టుగానే భావించాలి. అమర్త్యసేన్ విమర్శ ఈ విధానాలకు మెరుగులు దిద్దే హితోపదేశం కాదు. వాటిని తీవ్రంగా ఎండగట్టే విమర్శ. సవివరంగా, విశ్లేషణాత్మకంగా చేసే ఈ విమర్శ పాలకుల విధానాలను వ్యతిరేకించే రాజకీయ కృషికి, ప్రజా ఉద్యమాలకు చాలా బలం సమకూర్చగలదు. నిజానికి ఆయన పెట్టే విమర్శను చివరిదాకా తీసుకుపోతే అది ప్రపంచీకరణనే అసాధ్యం చేయగలదు. ఎందుకంటే న్యాయానికీ, సమానతకూ ప్రమాణంగా అమర్త్యసేన్ ప్రతిపాదించే 'ప్రజల సామర్థ్యం' అనే భావన (దాని సంపూర్ణ అర్థంలో) కార్పొరేట్ పెట్టుబడి నైజానికే విరుద్ధమైనది.

**జనంబాట**

**నవంబర్ 1998**

# అమర్త్యసేన్‌ను అనుసరించాలంటే మన పాలకులు ఏం చేయాలి?

నోబెల్ బహుమతి వచ్చిన అర్థశాస్త్రవేత్త అమర్త్యసేన్‌ను కీర్తించడానికి మన పాలకులకు అభ్యంతరమేమీ ఉండదు. ఒక భారతీయుడికి బహుమతి రావడం భారతదేశానికి గర్వకారణమే. గర్వకారణాలు మనకెక్కువ లేవు కాబట్టి దొరికిన దాన్ని పట్టుకొని ఊరేగడానికి మన వాళ్లకు అభ్యంతరమేం ఉండదు. ఈ మేరకు అమర్త్యసేన్‌కూ సుస్మితా సేన్‌కూ తేడా ఏమీ లేదు.

అయితే అమర్త్యసేన్ ఘనతను చూసి మన భాగ్య విధాతలు సంతృప్తి చెందడానికి ఇంకొక కారణం కూడ ఉంది. ఆర్థిక విధానాలలో సరళీకరణనూ ప్రపంచీకరణనూ ఆయన సమర్థిస్తాడు. అవి మంచివేననీ, దేశానికి అవసరమేననీ అంటాడు. ఆ మేరకు వామపక్షాల, ప్రజాతంత్రవాదుల విమర్శను తిప్పికొట్టడానికి అమర్త్యసేన్ పనికొస్తాడు. కానీ భారత పాలకులు అనుసరిస్తున్న సరళీకరణ, ప్రపంచీకరణ విధానాల గురించి అమర్త్యసేన్ చేసిన విశ్లేషణను జాగ్రత్తగా చదివితే ఆయన ఆలోచనలలో మన పాలకులు సంతోషించడానికీ, ప్రజాతంత్రవాదులు బాధపడటానికీ ఏమీ లేదు.

సరళీకరణను, ప్రపంచీకరణను అమర్త్యసేన్ బేషరతుగా సమర్థించడు. వాటివల్ల పేదప్రజానీకానికి మేలు జరగాలంటే అందుకు కావలసిన 'శక్తి' లేక 'సామర్థ్యం' వారికి ప్రభుత్వం ముందుగా కల్పించవలసి ఉంటుందంటాడు. అది లేకుండా ప్రపంచీకరణ చేపడితే దానివల్ల కొందరికి మేలు, కొందరికి కీడు జరుగుతుందనీ పేదరికం పెరుగుతుందనీ అసమానతలు పెరుగుతాయనీ అంటాడు.

మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటిమాటికీ ఉదాహరణలుగా చూపించే సింగపూర్, దక్షిణ కొరియా, తైవాన్, హాంగ్‌కాంగ్‌లు (వాటి బాటలోనే పోతున్న థాయిలాండ్, చైనాలు) ప్రపంచీకరణ చేపట్టక ముందే భూసంస్కరణలు చేపట్టాయి. అక్షరాస్యత బాగా సాధించాయి. ఆరోగ్యం విషయంలో ఒక కనీస ప్రమాణాన్ని సాధించాయి. ఇవి చేయబట్టి ఆ దేశాలు చేపట్టిన సరళీకరణ, ప్రపంచీకరణ క్రమాల వల్ల పేదలు కూడ కొంత ప్రయోజనం పొందగలిగారు. వారి జీవన ప్రమాణాలు కూడ పెరిగాయి.

కానీ ఇవి సాధించకుండ – పేదల చేతిలో కొంత శక్తి సామర్థ్యాలు పెట్టకుండ– ప్రపంచీకరణ బాటలో ఆర్థిక వ్యవస్థను పెడితే అందుకు విరుద్ధమైన ఫలితాలు ఉంటాయని అమర్త్యసేన్ అంటాడు. దీనికి బ్రెజిల్‌ను ఉదాహరణగా చూపిస్తాడు. బ్రెజిల్ చేపట్టిన సరళీకరణ ఫలితంగా ఆ దేశ జాతీయ ఆదాయం పెరిగింది, తలసరి ఆదాయమూ పెరిగింది. కానీ దాంతోపాటు పేదరికం పెరిగింది, పేదల జీవన ప్రమాణాలు పడిపోయాయి, అసమానతలు పెరిగాయి, హింసాదౌర్జన్యాలు పెరిగాయి.

ఇండియా ఈ విషయంలో బ్రెజిల్ బాటలో ఉంది తప్ప తైవాన్ బాటలో కాదు, దక్షిణ కొరియా బాటలో కాదు, చైనా బాటలో కాదు అని అమర్త్యసేన్ అంటాడు. ఈ విమర్శను మన పాలకులు – ముఖ్యంగా చంద్రబాబునాయుడు – అర్థం చేసుకుంటే అమర్త్యసేన్ తమ విధానాలకు మద్దతు ఇస్తున్నాడని ఇంకెప్పుడూ అనరు.

భూ సంస్కరణలు పేదల చేతిలో ఆదాయాన్ని పెడతాయి. విద్య, ఆరోగ్యాలు పనిలో నైపుణ్యాన్నీ, శక్తినీ పెంచుతాయి. వీటితో పాటు పాలనా విధానాలను ప్రభావితం చేయగల రాజకీయ స్వేచ్ఛనూ, పాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించే సంస్కరణలనూ, సంప్రదాయక సాంఘిక అసమానతలను తొలగించడం ద్వారా ప్రజలకు పెరిగే సామాజిక అవకాశాలనూ కూడ అమర్త్యసేన్ ప్రజల 'శక్తి సామర్థ్యాల'లో భాగంగా లెక్కిస్తాడు. ఇవి పెరగకుండా దేశాన్ని సరళీకరణ బాటలోనూ ప్రపంచీకరణ బాటలోనూ పెడితే అది చాలా నష్టానికీ కష్టాలకూ దారితీయగలదని హెచ్చరిస్తాడు.

ప్రజాస్వామ్యం, రాజకీయ స్వేచ్ఛల విషయంలో ఇతర మూడవ ప్రపంచ దేశాల కంటే భారతదేశం కొంచెం మెరుగే గానీ తక్కిన విషయాలలో చాలా వెనుకబడి ఉంది. విద్య, వైద్యం, పేదరికం అనే మూడు విషయాలలో ఆఫ్రికాలోని

అతివెనుకబడిన దేశాలతో బాటు భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు అట్టడుగు స్థానంలో ఉన్నాయి. దీని గురించి ఏమీ చేయకుండ ప్రపంచీకరణ చేపడితే అది చాలా చేటు చేస్తుందన్న అమర్త్యసేన్ విమర్శను మన పాలకులు సీరియస్‌గా తీసుకున్నట్టయితే, వారి పాలనా విధానాలను చాలా మార్చుకోవలసి ఉంటుంది.

భారతదేశంలో అక్షరాస్యత 50 శాతం మాత్రమే ఉంది. అంటే నూటికి 50 మంది నిరక్షరాస్యులని అర్థం. దక్షిణ కొరియాలో అక్షరాస్యత 97 శాతం, హాంగ్‌కాంగ్‌లో 100 శాతం, థాయిలాండ్‌లో 94 శాతం, చైనాలో 80 శాతం. స్త్రీలలో అక్షరాస్యత మన దేశంలో 39 శాతం మాత్రమే కాగా చైనాలో 68 శాతం, దక్షిణ కొరియాలో 95 శాతం, థాయిలాండ్‌లో 92 శాతం.

ఆరోగ్య ప్రమాణాల మాటకొస్తే, భారతదేశంలో సగటు జీవితకాలం 59 సంవత్సరాలు కాగా తూర్పు ఆసియా దేశాలన్నిటిలోనూ (అంటే సరళీకరణ, ప్రపంచీకరణ ద్వారా వేగంగా అభివృద్ధి సాధించిన దేశాలలో) అది 70 సంవత్సరాలకు పైనే ఉంది. పసిపిల్లలలో మరణం రేటు భారతదేశంలో 1000 జననాలకు 79 కాగా, దక్షిణ కొరియాలో 13 మాత్రమే, థాయిలాండ్‌లో 26 మాత్రమే, చైనాలో 31 మాత్రమే.

ఈ అభివృద్ధిని ఆ దేశాలు సరళీకరణ ద్వారా సాధించినది కాదు. సరళీకరణ క్రమం మొదలుపెట్టక ముందే ఆ దేశాలలో భూ సంస్కరణల అమలు వల్ల, బాధ్యతాయుతమైన విద్యా ఆరోగ్య విధానాల వల్ల దీనికి ప్రాతిపదిక ఏర్పడి ఉండింది. చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం తన పద్ధతిలో ఆ అభివృద్ధి సాధించగా, ఇతర తూర్పు ఆసియా దేశాలలో కమ్యూనిస్టేతర (కమ్యూనిస్టు వ్యతిరేక అనొచ్చు కూడ) ప్రభుత్వాలు తమ పద్ధతిలో సాధించాయి. విద్యా ఆరోగ్య రంగాలలో భారతదేశం ఈనాడు (అంటే తాను సరళీకరణ విధానాలు చేపట్టేనాటికి) సాధించిన ప్రగతి కంటే, తూర్పు ఆసియా దేశాలు ఆనాడే (అంటే తాము సరళీకరణ విధానాలు చేపట్టేనాటికి) ఎక్కువ సాధించి ఉన్నాయి. అందువల్లనే ఈ దేశాలలో సరళీకరణ, ప్రపంచీకరణల వల్ల జాతీయ ఆదాయం పెరగడమే కాక పేదల జీవన ప్రమాణాలు కూడ పెరిగాయి. కానీ ఆ ప్రాతిపదిక లేకుండ ప్రపంచీకరణ బాటలో బయలుదేరిన భారతదేశంలో అదే జరుగుతుందన్న నమ్మకం లేదు. బ్రెజిల్‌లో లాగ జాతీయ ఆదాయం ఒక వైపు పెరుగుతుండగా మరొకవైపు పేదరికం పెరగగలదు. ప్రజలలో అనారోగ్యం, అవిద్య పెరగగలవు. చంద్రబాబునాయుడు నమూనా సరళీకరణ ఇదే పరిణామానికి దారితీయగలదని అమర్త్యసేన్ హెచ్చరిస్తాడు.

మన పాలకులు అమర్త్యసేన్‌ను నిజంగా ఆదరించదలచుకుంటే ఈ హెచ్చరికను పట్టించుకోవాలి. కాని పట్టించుకునే సూచనలు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. పట్టించుకోకపోగా, సంక్షేమ విధానాలను వెనక్కి తీసుకుపోతున్నారు. ప్రజలకు శక్తి సామర్థ్యాలు కల్పించే అంశాలలో అమర్త్యసేన్ విద్య, ఆరోగ్యం, ఆదాయ వనరులనే కాక సామాజిక సమానత్వాన్నీ రాజకీయ ప్రజాస్వామ్యాన్నీ పాలనలో ప్రజల భాగస్వామ్యాన్నీ కూడ లెక్కబెడతాడు. తూర్పు ఆసియాదేశాలు, చైనాలకంటే ఒక్క ప్రజాస్వామ్యం విషయంలో మనకు మెరుగయిన రికార్డు ఉందని అమర్త్యసేన్ మెచ్చుకుంటాడు. అది అందరూ ఒప్పుకునే వాస్తవం కూడ. దానిని కాపాడుకుంటూ సంక్షేమ విధానాలను పెంపొందించే పద్ధతిని మన ప్రభుత్వాలు అనుసరిస్తే ప్రపంచీకరణ వల్ల ప్రజల మీద పడే దెబ్బను కొంతయినా ఉపశమింపజేయగలుగుతారు. కానీ మన పాలకులు ప్రపంచీకరణకు సంక్షేమ విధానాలే కాదు, ప్రజాస్వామ్యం కూడ అడ్డమనే భావిస్తున్నారు. రెండింటినీ ధ్వంసం చేస్తున్నారు. ఈ వాస్తవానికీ అమర్త్యసేన్‌కు ఇస్తున్న మెచ్చుకోలుకూ పొంతన ఏమీ లేదు.

**ప్రజాతంత్ర వారపత్రిక**

**29 నవంబర్ 1998**

# మళ్ళీ రైతుల ఆత్మహత్యలు

రైతుల ఆత్మహత్యలు మళ్ళీ వార్తలలో తరచుగా కనిపిస్తున్నాయి.

ఇప్పటిదాకా మెదక్ జిల్లాలో ఎక్కువ జరిగినట్టున్నాయి. చనిపోయిన వారి కుటుంబాలతో మాట్లాడితే వర్షాభావం ప్రధాన హేతువుగా కనిపిస్తుంది. కానీ అదే నిజమయితే ఆత్మహత్యల సంఖ్య ఈ మధ్య కాలంలోనే పెరగవలసిన అవసరం లేదు. వర్షాభావం రైతులకు – అందులోనూ తెలంగాణ రైతులకు – కొత్త కాదు.

సంప్రదాయక పంటలు వేసిన రోజులలో పోతే వేసిన గింజలు పోతాయి, వస్తే నాలుగు గింజలు మిగులుతాయి అనే పరిస్థితి ఉండేది. ఆ బతుకులో ఆశకు తావు లేదు. ఆత్మహత్యకు హేతువు లేదు.

అయితే అట్లాగే బతికితే ఒక తరానికీ రెండవ తరానికీ తేడా ఏమీ ఉండదు. పెద్దలు చేసిన గొడ్డు చాకిరీయే పిల్లలూ చేస్తారు, వాళ్ల పిల్లలూ చేస్తారు. వాళ్లు బతికినట్టే వీళ్లూ బతుకుతారు. 'అభివృద్ధి' అనేది తెలియనప్పుడు ఎన్ని తరాలైనా ఇట్లాగే బతికారేమో గానీ ఆ భావనతో పరిచయం ఏర్పడిన తరువాత అదింక సాధ్యం కాదు.

దురదృష్టమేమిటంటే అభివృద్ధి అనే దానిమీద కోరిక పుట్టిన రైతాంగానికి అందుబాట్లో ఉండే అభివృద్ధికి ఒక నిర్దిష్టమైన రూపం ఉంది. దానిని కేవలం 'బూర్జువా అభివృద్ధి' అనలేం. బూర్జువా అభివృద్ధికి సాధారణంగా ఉండే అవలక్షణాలకు మరికొన్ని అవలక్షణాలు వచ్చి చేరగా రూపం తీసుకున్న అభివృద్ధి ఇది. స్థిరమైన సాగునీటి వనరుల లేమి, అదుపులేని ఎరువుల, మందుల ధరలు, భరోసాలేని వాటి నాణ్యత, 'పెద్ద కులాల' వారికి తప్ప ఇతరులకు సులభంగా అప్పు పుట్టని ఆర్థిక జీవితం, ఎప్పుడొస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని కరెంటు, చిన్న రైతులకు పనికి రాకుండా పోతున్న గ్రామీణ బ్యాంకుల వ్యవస్థ,

గిట్టుబాటు ధరకు పంట కొనుక్కోవడానికి ముందుకు రాని ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థలు మొదలయినవన్నీ కలిసి తెలంగాణలో చిన్న రైతుల చావుకొచ్చింది. ఆశ పడడానికి సహితం ఈ మాత్రం అవకాశంలేని కారణంగా కాబోలు రాయలసీమలో రైతులకు అభివృద్ధీ లేదు, ఆత్మహత్యలూ లేవు.

జొన్నలు తిని జొన్నలు ఏరిగి బతకకుండ పత్తి మీదికి మనసెందుకు పోవాలని వాళ్లనే తిట్టొచ్చు. వాన కురవక పోతే చంద్రబాబునాయుడేం చేస్తాడని దబాయించవచ్చు. అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకునే పిరికితనానికి సానుభూతి కూడనా అని వెక్కిరించవచ్చు.

ఎన్ని వ్యాఖ్యలయినా చేయొచ్చు గానీ ఒక సత్యాన్ని ఎవ్వరూ కాదనలేరు. కొంచెం బాగుపడదామని ఆశపడే రైతు ఎవరైనా అప్పుల సుడిగుండంలో ఇరుక్కునే 'రిస్క్' తీసుకోక తప్పని పరిస్థితి ఈ రోజు ఉంది. చెప్పుకోవలసిం దేమిటంటే ఇది ఎంత మాత్రం 'అనివార్యం' కాదు, 'సహజం' కాదు. ఇదొక అభివృద్ధి నమూనా పర్యవసానం. ఏవో కాల్పనిక ప్రత్యామ్నాయాలను దృష్టిలో పెట్టుకొని ఈ మాటలు అనడం లేదు. ఏ కష్టాలూ ఏ సంక్షోభం లేకుండా ఒకరి అభివృద్ధి అందరి అభివృద్ధిగా సమాజం సమిష్టిగా పురోగమించే చిత్రం కల్పన అనే ప్రస్తుతానికి అనుకుందాం. ఎందుకంటే దానిని నిర్మించే మార్గం తమకు తెలుసుననుకున్న వారు ఈ శతాబ్దంలో ఘోరంగా భంగపడ్డారు. కానీ దాని అర్థం ఆ ఆదర్శం చచ్చిందనీ కాదు, పెట్టుబడిదారీ నమూనాకు అందరూ ఇంక దాసోహమనాలనీ కాదు, దానిని మరింత వికృతంగా తయారు చేసే నైసర్గిక, సాంఘిక, చారిత్రక పరిస్థితులకు దాసోహమనాలని అంతకంటే కాదు.

ఒక ప్రభుత్వమనేది లేకపోతే మనుషులు ఒకరి ప్రాణాలనూ ఆస్తినీ మరొకరు దోచుకుంటారని చెప్పి 'ప్రభుత్వం' ఏర్పడిందని ఒక సిద్ధాంతం ఉంది. అది నిజమో కాదో కానీ ప్రభుత్వం అనేది ఏర్పడిన తరువాత మనుషులు ఒకరి శ్రమనూ ఆత్మగౌరవాన్నీ స్వేచ్ఛనూ మరొకరు దోచుకోకుండా అదుపు చేసే బాధ్యత దానిపైన ఉందన్న అభిప్రాయం ఉనికిలోకి వచ్చింది. ప్రచారమయ్యింది. అనేక రకాల అసమానతలు రాజ్యం ఏలుతున్న మన సామాజిక పరిస్థితులలో ప్రభుత్వం ఈ బరువు స్వీకరించడం చాలా అవసరం.

అదేమీ తనకు లేదని ప్రభుత్వం అనుకోవడం తెలంగాణలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలకొక ముఖ్య కారణం అని రెండేళ్లనాడు పెద్ద సంఖ్యలో జరిగిన ఆత్మహత్యలపైన పరిశోధన జరిపిన వారందరూ అన్నారు. పెట్టుబడిదారీ అభివృద్ధిలో రైతులు పాల్గొనాలనీ, పాల్గొని తాము బాగుండడమే కాక రాష్ట్ర

వ్యవసాయరంగం పెరుగుదల రేటును పెంచాలనీ కోరుకోవచ్చు. కానీ అందులో పాల్గొనాలంటే రైతులకు పెట్టుబడి కావాలి. పరిస్థితులు ఎప్పుడూ ఒకలాగ ఉండవు కాబట్టి రైతు ఎక్కడికీ పారిపోడులెమ్మన్న భరోసాతో అప్పులిచ్చే వాళ్లు కావాలి. ప్రైవేట్ ఫైనాన్షియర్లు ఆ పని చేయరు కాబట్టి ప్రభుత్వ బ్యాంకులు ఆ పాత్ర నిర్వహించాలని 30 ఏళ్లనాడు అనుకున్నాము. అందుకోసమే బ్యాంకులను జాతీయం చేస్తున్నామన్నారు.

పెట్టుబడి పెట్టి పత్తిలాంటి వ్యాపార పంటలు పండిస్తే దానికి గిట్టుబాటయ్యే ధర పలకాలి. మార్కెట్ పరిస్థితులు అందుకు అనుకూలంగా లేకపోతే పంట కొనుక్కుని, అవసరమైతే నిలవ ఉంచుకొని రైతులను బతికించే కొనుగోలు వ్యవస్థ ఉండాలి. ప్రైవేట్ కొనుగోలుదార్లు ఈ పని చేయరు కాబట్టి ప్రభుత్వ కొనుగోలు సంస్థలు ఈ పాత్ర నిర్వహించాలి.

'అభివృద్ధి'కి తోడ్పడే  విలువైన పంటలు వేయాలంటే ఎరువులు, మందులు కావాలి. వాటి ధరలపైన, నాణ్యతపైన నియంత్రణ ఉండాలి. ఈ పని ప్రభుత్వం మాత్రమే చేయగలదు.

ఈ 'విలువైన' పంటలకు సాగునీరు కావాలి. ప్రాజెక్టులయితే రైతులు కట్టుకోలేరు. ప్రభుత్వమే ఆ పని చేయాలి. బావులకయితే అప్పులు ఇవ్వాలి, కనీసం పేద రైతులకు చవగ్గా కరెంటు ఇవ్వాలి. కరెంటు తగిన మోతాదులోనూ రీతిలోనూ వచ్చేటట్టు చూడాలి. ఈ బాధ్యతలు ప్రభుత్వం నిర్వర్తిస్తేనే రైతులు 'అభివృద్ధి' బాటలోకి అడుగుపెట్టి చావకుండా బయటపడగలరు.

ఈ బాధ్యతల నుండి ప్రభుత్వం వెనక్కి తగ్గడం ఒక దశాబ్దకాలంగా చూస్తున్నాం. రైతుల ఆత్మహత్యల వెనక ఉన్న అనేక కారణాలలో అతి ముఖ్యమైనది ఇది.

చంద్రబాబు 'విజన్' ఈ వైఖరికి మరింత సంపూర్ణ రూపం ఇస్తుంది. రైతులనూ వ్యవసాయాన్నీ వ్యవసాయ ఉత్పత్తులతో వ్యాపారం చేసే కార్పొరేషన్లతో ముడిపెట్టి ప్రభుత్వం తప్పుకోవడం 'విజన్' ప్రతిపాదించే వ్యవసాయ విధానం. రైతులకు అప్పులిచ్చేదీ ఉత్పత్తులు కొనుక్కునేదీ ఆర్చేదీ తీర్చేదీ ఈ కార్పొరేషన్లే.

ఇంకా అంత దూరం పోకుండానే ఇన్ని ఆత్మహత్యలు చూస్తున్నాం. 'స్వర్ణాంధ్రప్రదేశ్'లో ఇంకెన్ని చూడనున్నామో!

**ప్రజాతంత్ర వారపత్రిక**
**23 జనవరి 2000**

# ఈ ప్రాకులాట అవమానకరం

**బి**ల్ క్లింటన్ రాక సందర్భంగా ఢిల్లీ నుండి వెలువడే ఒక ఆంగ్ల దినపత్రిక ఒక కార్టూన్ ప్రచురించింది. అమెరికా అధ్యక్షుడి భారత పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు చూడడానికి ముందుగా అతని అధికార బృందం వచ్చి ఉంది. అతను ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను దర్శించబోతున్నాడు కాబట్టి ఆ అధికారులు ఆగ్రా నగర పాలక అధికారులను వెంటబెట్టుకొని తాజ్‌మహల్ దగ్గరకు పోయారు. వివిధ కోణాల నుండి ఆ కట్టడాన్ని చూసినాక, 'తాజ్‌ను కొంచెం పక్కకు జరపడం సాధ్యమవుతుందా? బిల్‌కు ఇంకొంచెం బాగా కనపడుతుంది' అని వాళ్లు తమతో ఉన్న ఆగ్రా నగర పాలక అధికారులను అడుగుతారు.

'ఇది మరీ అతిశయోక్తి' అనగల పరిస్థితి సహితం ఇప్పుడు లేదు. క్లింటన్‌ను ఎట్లాగయినా హైదరాబాద్ రప్పించి హైటెక్ సిటీ చూపించి భారతదేశంలో 'ఐటి'కి హైదరాబాదే కేంద్రమని రుజువు చేసుకోవడానికి చంద్రబాబు పడ్డ ప్రయాస తెలిసిందే. అది 'ఐటి' పెట్టుబడులను రాష్ట్రంలోకి రప్పించుకోవడానికి మాత్రమే కాదు. తన పాలనా దక్షతను, ఆధునీకరణ కాముకతను అమెరికా అధ్యక్షుడి ముందు ప్రదర్శించుకోవడానికి కూడ. ఆ పాలనా దక్షతలో భాగంగానే క్లింటన్ నగరంలో ఉండబోయే ఒకటి రెండు గంటల మహాభాగ్యానికి నగరంలో బిక్షగాళ్లెవరూ ఆ రోజు కనిపించడానికి వీలులేదని కూడ రాష్ట్ర ప్రభుత్వం తాఖీదు జారీ చేసింది. ఆ ఒక్క పూట భిక్ష అడిగే హక్కు చంద్రబాబుకు మాత్రమే ఉండాలని జోక్ చేసుకున్నప్పటికీ, ఒక విదేశీ పాలకుడిని మురిపించడానికి ఈ స్థాయికి మన పాలకులు దిగజారడం నిజంగా చాలా బాధాకరం.

వ్యక్తిగా క్లింటన్ ఏ మాత్రం గౌరవించదగ్గవాడన్నది అప్రస్తుతమే కావచ్చు. అమెరికా దేశస్థులకు మన ముఖ్యమంత్రి పాట్లు చెప్తే నవ్వుతారేమో కూడ. అయితే

అమెరికా ప్రభుత్వాన్ని మెప్పించడం ఇవ్వాళ అంతర్జాతీయ రాజకీయాల ఏకైక మూల సూత్రం అయింది. రెండవ ప్రపంచ యుద్ధమప్పటి నుండి అమెరికా ఒక ముఖ్య అగ్రరాజ్యంగా ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు నిర్ణయించడంలో అమెరికాకు ఈ యాభై ఏళ్లగా ప్రముఖ పాత్ర ఉంది.

ఆర్థిక వ్యవస్థ మాత్రమే కాక విభిన్న దేశాల మధ్య తగాదాలను శాంతియుతంగా పరిష్కరించడం కోసం ఏర్పాటు చేసుకున్న ఐక్యరాజ్య సమితి మీద కూడ అమెరికా ప్రభావం బలంగా ఉండింది. సామరస్య పరిష్కారం సాధ్యం కానప్పుడు ప్రపంచ దేశాల ప్రతినిధిగా బలప్రయోగానికి పాల్పడే అధికారం అంతర్జాతీయ చట్టంలో (దానినెవరూ గౌరవించారని కాదు గానీ) ఐక్యరాజ్య సమితికి మాత్రమే ఉంది కాబట్టి ఈ ప్రభావం వల్ల అధికారికంగా బల ప్రయోగానికి పాల్పడడం అమెరికాకు సులభం అయింది.

అయినప్పటికీ 1990ల దాకా అమెరికాది ఏకఛత్రాధిపత్యం కాదు. అంతర్జాతీయ రాజకీయాలలో సోవియట్ రష్యా పోటీ ఉండింది. బహుశా అంతకంటె ముఖ్యంగా, ప్రపంచంలో ఏ దేశానికైనా ఎప్పుడయినా వర్తించే ఏకైక ఆర్థిక అభివృద్ధి నమూనా ఒకటి ఉందన్న అభిప్రాయం ఆనాడు లేదు. స్థానిక ప్రత్యేకతలుంటాయనీ అభివృద్ధికి భిన్న నమూనాలుంటాయనీ నమ్మిన రోజులవి.


1990ల తరువాత ఈ రెండు విషయాలలోనూ మార్పు వచ్చింది. అమెరికా పాలకుల మెప్పు కోసం ప్రాకులాడడం మరింతగా పెరిగింది. సోవియట్ రష్యా కూలిపోవడంతో ఐక్యరాజ్య సమితిలోనే కాక బయట కూడ అమెరికాకు తిరుగులేకుండా పోయింది. క్రమంగా ఐక్యరాజ్య సమితి అమెరికా చేతిలోని పనిముట్టుగా మారింది. ప్రపంచ దేశాల మధ్య తగాదాలను సామరస్యంగా పరిష్కరించుకునే వేదికగాను, అది సాధ్యం కాని పక్షంలో శాంతికి విఘాతం కలిగిస్తున్న దేశం మీద ప్రపంచ దేశాల తరఫున పరిమితంగా బలప్రయోగం చేసే ఉమ్మడి వ్యవస్థగానూ ఉద్దేశించిన ఐక్యరాజ్య సమితి అమెరికా పనిముట్టుగా మారి, ఆ దేశ పాలకులు తమ స్వంత నిర్ణయం ప్రకారం చేసే దాడులకు 'అంతర్జాతీయ చట్టం' అనే ముసుగు తగిలించుకునే అవకాశం లభించింది.

ఆర్థిక అభివృద్ధి విషయంలో 'అమెరికా నమూనా' తప్ప వేరే ఏదీ లేదనే అభిప్రాయం కూడ బలపడింది. సోషలిజం సంగతి దేవుడెరుగు సంక్షేమ పెట్టుబడిదారీ వ్యవస్థ కూడ ఆచరణ సాధ్యంకాని తెలివితక్కువ ఆదర్శం అన్న అభిప్రాయం ఒక వైపు, పెట్టుబడిదారీ అభివృద్ధిలో సహితం స్థానిక అవసరాలు,

ప్రయోజనాలు అనే వాటికి చోటేమీ ఉండదని మరొకవైపు అభిప్రాయాలు బలపడ్డాయి. అందుకే మన ముఖ్యమంత్రి ఈ రాష్ట్ర అభివృద్ధి కోసం ఉద్దేశించిన 'విజన్ 2020' పత్రాన్ని ఆస్ట్రేలియాకు చెందిన కన్సల్టెంట్‌తో రాయించగలిగాడు. ఈ రెండు కారణాల వల్ల ఇవాళ అమెరికా పాలకుల మెప్పుకోసం ప్రాకులాట పెరిగింది. దానివల్ల రాగల భౌతిక ప్రయోజనాల కోసమే కాక, 'మేము కూడ ఈనాటి జ్ఞానం ఎరిగిన వారమే'నని ఆ జ్ఞానానికి ఆద్యులయిన అమెరికా వారికి చూపించుకోవాలనే చాపల్యం వల్ల కూడ మూడవ ప్రపంచ దేశాల ప్రముఖులు వారి వెంటపడుతున్నారు. ఈ పోటీలో మన ముఖ్యమంత్రి మిగిలిన వారికంటె ఒక్కడుగు ముందుండడం మనం సిగ్గుపడవలసిన విషయం అనడంలో సందేహమక్కరలేదు.

**ప్రజాతంత్ర వారపత్రిక**
**19 మార్చి 2000**

# ఈ కరువు మళ్లీ వస్తుంది జాగ్రత్త



కరువు ఈ సంవత్సరం పెద్దఎత్తునే వచ్చింది. గుజరాత్, రాజస్థాన్ దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి.

కరువొచ్చినప్పుడు చర్చ తక్షణ ఉపశమన చర్యల మీదనే ఎక్కువ ఉంటున్నదనీ, దీర్ఘకాలిక నివారణోపాయాల మీద ప్రధానంగా దృష్టి పెట్టడం అవసరమనీ అంటుంటారు. ఈ మాటలు కూడ కరువొచ్చినప్పుడే అంటుంటారు.

అయినప్పటికీ అది కరెక్టే.

అయితే ఇంకొంచెం దూరం పోయి ఆలోచించవలసిన అవసరం కూడ ఉంది. కరువు నివారణకు దీర్ఘకాల నివారణోపాయాలు రూపొందించడానికి కావలసిన చోటు ప్రభుత్వ సామాజిక ఆర్థిక విధానాలలో ఉందా? ఒక సంవత్సరం కాకపోతే ఒక సంవత్సరం కరువొస్తుంటుంది కాబట్టి అటువంటి నివారణోపాయాలకు చోటు ఉండాలనేది సామాజిక ఆర్థిక విధానాల పునాది లక్షణాలలో ఒకటయి ఉండాలి కదా?

ప్రకృతి వనరులను, మానవ పరిశ్రమ వాటిలో తీసుకురాగల అభివృద్ధిని ఏ విధంగా చూస్తామనేది ఇక్కడ కీలకమైన ప్రశ్న. మనుషుల జీవనానికి ఆధారంగా చూస్తామా, లేక సామాజిక సంపద పెరుగుదలకొక సాధనంగా చూస్తామా? సామాజిక సంపద పెరుగుదలకు సాధనంగా చూసినప్పుడే అవి ఏదో ఒక రోజు అందరికీ జీవనాధారం కూడ కల్పించగలుగుతాయనీ, కేవలం జీవనాధారంగా చూస్తే అభివృద్ధికి నోచుకోక పెరుగుతున్న జనాభాకు జీవనాధారంగా కూడ సరిపోవనీ వాదించడం ప్రస్తుత అధికార అభివృద్ధి సిద్ధాంతం.

ఇది నిజమేనా? ప్రకృతిని పెట్టుబడికి వనరుగా మాత్రమే చూస్తూ 'ఏదో ఒకరోజు అభివృద్ధే అందరికీ తిండి పెడుతుంది' అని హామీ ఇవ్వడంలో గల

సౌలభ్యం ఏమిటంటే ఆ 'ఏదో ఒక రోజు' ఎప్పుడొస్తుందో చెప్పలేక పోవడం, చెప్పవలసిన అవసరం లేకపోవడం. ఇప్పుడు మనవాళ్ల నమూనాలో ఆ అభివృద్ధికి పెట్టుబడి ప్రధానంగా బయటి నుండి రావాలి. దానికి మూల్యం సంపద తరలింపు రూపంలో చెల్లించుకోవాలి. ఆ బయటి పెట్టుబడిని ఆకర్షించడం కోసం ఇక్కడి పట్టణ ప్రాంత ఎగువ, మధ్య తరగతులలో విలాసవంతమైన జీవనశైలిని ప్రోత్సహించాలి. సంపద పెంచుకునే అవకాశాన్నీ దాచుకునే అవకాశాన్నీ భద్రంగా కాపాడాలి. దీనికి కూడ ప్రకృతి చాలా మూల్యం చెల్లించాలి. 'అనివార్య'మైన ఈ అవాంతరాలను దాటి అభివృద్ధి ఏ రోజు పేదలకందరికీ అందుతుంది, కొందరికి కొంచెం కొంచెం అందుతూ ఉంటుంది. అది ఈ 'అభివృద్ధి'కి రాజకీయ పునాదిని ఒక మేరకు కల్పించడానికి మాత్రం పనికొస్తుంది.

ప్రకృతి వనరులను మనుషుల జీవనాధారంగా చూసినట్టయితే ఇక అభివృద్ధి శూన్యమైన జీవితమే శరణ్యమా? పెరుగుతున్న జనాభా వల్ల జీవన ప్రమాణాలు పడిపోకుండా కాపాడుకోవడంతోనే సరిపోతుందా? మనుషుల జీవనాన్నీ జీవితాన్నీ ప్రమాణంగా పెట్టుకొని అందరినీ ఒకే తాటి మీద ('ఏదో ఒక రోజు' కాకుండా) ముందుకు నడిపించే విధానరచన కోసం 20వ శతాబ్దంలో కమ్యూనిస్టు పాలకులు చేసిన ప్రయత్నాలు విఫలమైన మాట సత్యమే కాని దానికి ఏ ప్రత్యామ్నాయమూ లేదా? కమ్యూనిస్టులు ఊహించుకునే భూలోక స్వర్గం కాకపోయినా కనీసం మానవీయత లక్షణంగా గల జీవితం సాధ్యం కాదా?

21వ శతాబ్దం ఈ అన్వేషణలో ఉంటుందని నేను అనుకుంటున్నాను. కానీ దానికి 'స్టార్టింగ్ ట్రబుల్' చాలా ఉంది. కమ్యూనిస్టు ప్రయోగం విఫలమయిందని కమ్యూనిస్టులు ఒప్పుకోరు. ఒక ప్రత్యామ్నాయం సాధ్యం కాగలదేమో చూద్దామని ఇతరులనుకోరు.

కరువు మాటకొస్తే, ఇప్పుడున్న అధికార దృక్పథం దీనికి ఏం జవాబు చెప్పగలదు? చిన్న కమతాల సేద్యానికి సెలవు చెప్పి, పెద్ద పెద్ద క్షేత్రాలలో పెట్టుబడిదారీ సేద్యాన్ని, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి దిగుమతులనూ ప్రోత్సహించాలనేది చంద్రబాబు నుండి అటల్ బిహారీ దాకా ఇప్పుడు మన పాలకులందరి విధానం. ఈ విధానానికి కరువు నివారణతో ప్రత్యక్ష సంబంధమేమీ లేదు. కరువులు ఎప్పటిలాగే వస్తూనే ఉండవచ్చు. భూమిని పెట్టుబడికి వనరులుగా చూడడం పెరిగే కొద్దీ భూవనరుల విధ్వంసం, భూగర్భజలాల దుర్వినియోగం ఎక్కువ జరిగి కరువులు మరింత ఎక్కువగా కూడ రావచ్చు.


అప్పుడు గ్రామీణ పేదలకు ఇప్పుడున్న పాటి భద్రత  కూడ – రెండెకరాల రాళ్లకూ పుట్టలకూ తిండిలేని రెండెడ్లకూ యజమాని కావడం అనే భద్రత – ఉండదేమో. తిండికోసం, నీళ్లకోసం వలసలు ఇప్పటిలాగే జరుగుతుంటాయి. అయితే సంవత్సరానికో రెండేళ్లకో వర్షాలు పడి నేల పచ్చబడితే తిరిగి రావడానికి ఆ రెండెకరాల భూమి కూడ ఉండదు. కాబట్టి ఏ పట్టణంలోనో రిక్షా తొక్కుకుంటూనో మూటలు మోస్తూనో జేబులు కత్తిరిస్తూనో ఉండిపోవచ్చు.

ఒక్క తేడా ఉంటుంది.  ఇప్పుడింకా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనేదొకటి ఉంది. దాని గిడ్డంగులలో ధాన్యం ఉంది. కరువు కాలంలో ఆ ధాన్యం కరువు ప్రాంతాలకు పోగలదు, గంజి కేంద్రాలనైనా నడిపించగలదు. ఈ గిడ్డంగులను ఒక్కసారిగా మూసేసే ఆలోచనేదీ ఇప్పట్లో లేకపోవచ్చును గానీ నేల పచ్చగా ఉన్న రోజులలో ఈ గిడ్డంగులూ, వాటి కోసం మిల్లులపైన విధించే లెవీలూ స్వేచ్ఛా విపణికి ఆటంకం కలిగించే అసమర్థపు పాత విధానాల అవశేషాలుగా కనిపిస్తాయి కాబట్టి 'ప్రభుత్వం ఇచ్చేది కాదు, అవకాశాలు కల్పించేది మాత్రమే'ననే ప్రస్తుత పాలక సిద్ధాంతం రాబోయే రోజులలో ఈ వ్యవస్థను క్రమంగా నయినా క్షీణింపజేయదన్న నమ్మకమేమైనా ఉందా?

పదేళ్ల తరువాత మళ్లీ ఇటువంటి కరువొస్తే ఆ చిత్రం ఇంకా భయంకరంగా ఉంటుందేమో? ఈ ఊహ అయినా మన పాలకుల కళ్లు, మేధావుల కళ్లు కొంచెం తెరిపిస్తుందా? లేకపోతే డాలర్లు విరజిమ్మే వెలుగుల చీకట్లు ఈ చిత్రాన్ని కూడ కమ్మేస్తాయా?

**ప్రజాతంత్ర వారపత్రిక**
**20 ఏప్రిల్ 2000**

# మనుషులు లేని 'పర్యావరణం'



పర్యావరణాన్ని ప్రజల కోసం కాపాడాలనుకునేవారు, పర్యావరణాన్ని ప్రజల నుండి కాపాడాలనుకునే వారు అని పర్యావరణ ఉద్యమకారులలో రెండు రకాలు. ప్రజల కోసమే కాపాడాలనుకున్న పర్యావరణాన్ని తెలిసో తెలియకో ధ్వంసం చేసే చర్యల గురించి ప్రజలకు హితవు చెప్పవలసిన అవసరం రావచ్చు. అది వేరే సంగతి. కానీ పర్యావరణాన్ని ప్రజల కోసం కాక ప్రజల నుండి కాపాడాలనుకునే వారికి ప్రజలు వట్టి 'న్యూసెన్స్'గా మాత్రమే కనిపిస్తారు.

అటువంటి 'పర్యావరణ ఉద్యమకారులు' కోర్టుకెక్కడం, పార్కులనూ రోడ్లనూ గాలినీ వెల్తురునూ మురికివాడల ప్రజల నుండి కాపాడమని 'ప్రజా ప్రయోజన వ్యాజ్యం' నడపడం, కోర్టులు అదే ధోరణితో స్పందించి తీర్పులివ్వడం ఈ మధ్య బొంబాయిలోనూ, ఢిల్లీలోనూ జరిగింది. ఉద్యమాలూ న్యాయస్థానాలూ ప్రజాస్వామ్యంలో భాగం కాబట్టి ఈ పెడధోరణుల గురించి మాట్లాడుకోవడం అవసరం. మనుషుల బాగోగుల కంటే వేరే ఏది ముఖ్యమన్నా అనుమానించవలసిందే. అందమయిన నగరాలు, విదేశీ పర్యాటకుల మెప్పు పొందే నగర అభివృద్ధి ఇందుకు మినహాయింపు కాదు. కానీ పర్యావరణ పరిరక్షణను ఈ కళ్లతో చూసే ఉద్యమకారులూ ఉన్నారు. న్యాయమూర్తులూ ఉన్నారు. సుప్రీంకోర్టయితే ఈ మధ్య ఒక తీర్పులో 'అక్రమ చొరబాటుదారులకు' (గుడిసె వాసులకిదొక అందహీనమైన పేరు) పునరావాసం కల్పించడమంటే జేబు దొంగలను సత్కరించడమేనంది.

బొంబాయి మహానగరం వెలుపల సంజయ్‌గాంధీ జాతీయ ఉద్యానవనం అనే 117 చ.కి.మీల వైశాల్యం గల అడవి లాంటిది ఉంది. అందులో ఒకటి రెండు

పులులూ, సింహాలూ కూడ ఉన్నాయంట. ఊపిరాడని బొంబాయినగర వాసులకు అక్కడ అప్పుడప్పుడు 'సఫారీలు' ఏర్పాటు చేస్తారు.

అంతవరకు అభ్యంతరం లేదు. కానీ ఆ నగరంలో నిలువనీడ లేని పేదలు ఆ అభయారణ్యం అంచులో గుడిసెలు వేసుకోసాగారు. వాళ్లు 'జేబు దొంగలు' కాదు. (జేబు దొంగలకు మాత్రం ఒక గూడు అక్కరలేదా అన్నది వేరే ప్రశ్న) బొంబాయిని ఒక మహానగరంగా తయారు చేసిన శ్రామికులు, అదొక నగరంగా మనగలగడానికి శ్రమ చేస్తున్న శ్రామికులు, ఫ్యాక్టరీలలో పని చేసేవాళ్లు, ఆటోలు నడిపేవాళ్లు, అంట్లుతోమేవాళ్లు, ఇళ్లు కట్టే వాళ్లు, ఇళ్లు ఊడ్చేవాళ్లు.

కాలక్రమంలో దాదాపు 4 లక్షల జనాభా అక్కడ చేరారు. గుడిసెలు వేసుకున్నారు. రోడ్లూ, నీళ్లూ, కరెంటూ, స్కూళ్లూ అడిగారు. కొంత పొందారు. 117 చ.కి.మీ.ల విస్తీర్ణంలో 1.7 చ.కి.మీ.లు (మాత్రమే) వారి పాలయ్యాయనేది ప్రభుత్వ అంచనాయే.

వీరి ఉనికి వల్ల సఫారీ సౌందర్యం దెబ్బ తినిందో ఏమో, బొంబాయిలోని ఒక పర్యావరణ సంస్థ వారందరినీ అక్కడి నుండి తొలగించాలంటూ హైకోర్టులో 'ప్రజా ప్రయోజన వ్యాజ్యం' వేసింది. ఆ గుడిసెవాసులే తమకందరికీ శాశ్వతంగా పట్టాలివ్వాలని అదే కోర్టులో కేసు వేసి ఉంటే, అది ప్రభుత్వ విచక్షణకు సంబంధించిన విషయమనీ అందులో కోర్టులు జోక్యం చేసుకోజాలవనీ, విచక్షణాయుతమైన పాలనా నిర్వహణకూ చట్టాన్ని అమలు చేయించే న్యాయస్థానాల విధులకూ మధ్య కచ్చితమైన విభజనరేఖ ఉందనీ, దానిని అతిక్రమించడం ప్రజాస్వామ్యానికి అపచారమనీ ఆ కోర్టు అని ఉండేదనడానికి సందేహించనక్కరలేదు.

కానీ వాళ్లను తొలగించడం మాత్రం ప్రభుత్వ విచక్షణకు సంబంధించిన విషయమని బొంబాయి హైకోర్టు అనుకోలేదు. వారినందరినీ – దాదాపు 4 లక్షల మందిని – నిర్ణీత గడువులోపల తొలగించమని ప్రభుత్వానికి ఆదేశం ఇచ్చింది. వారికి పునరావాసం కల్పించడానికి చోటు కోసం వెతుకుతున్నామని ప్రభుత్వం కొంచెం మొహమాటపడుతూ విన్నవించుకోగా, 'వారి గెంటివేత అప్పటిదాకా ఆగనక్కరలేదు. ముందు ఆ చొరబాటుదారులను అక్కడి నుండి తొలగించి ఆ తరువాత వారికెక్కడ జాగా చూపిస్తారో ఆలోచించుకోండి' అనింది. వారిని తొలగించడానికి పోలీసు బలగాలు చాలకపోతే సైన్యాన్ని ప్రయోగించమనింది. ఏ విధంగా తొలగించాలో ఎంత కాలం లోపల తొలగించాలో వివరిస్తూ ఒక ప్రణాళిక తయారు చేసి తన తీర్పులో భాగంగా జారీ చేసింది.

కేసు వేసిన 'పర్యావరణవాదులు' సహితం ఇంత గొప్ప తీర్పు వస్తుందని ఆశించి ఉండరు.

ఢిల్లీలోనయితే ఇటువంటి పని సుప్రీంకోర్టే చేసింది. ఆ నగరంలో గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్నమాట వాస్తవమే. అది ప్రజలందరి ఆయురారోగ్యాలకు హానికరమన్నది కూడ వాస్తవమే. అయితే అందుకోసం సుప్రీంకోర్టు వెనకా ముందూ  చూడకుండా జారీ చేస్తున్న ఆర్డర్లే చాలా ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రత్యామ్నాయం గురించి ఏమీ ఆలోచించకుండ, పాతబడిన సిటీ బస్సులన్నిటినీ రేపు పొద్దున్నే షెడ్లలోకి పంపించేయాలని ఒక రోజు ఆర్డర్ జారీ చేసింది. అసలే రవాణా సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉన్న దేశ రాజధాని ప్రజలు ఆ తరువాత అనుభవించిన యాతన వర్ణనాతీతం.

ఆపైన మరొక ప్రజా ప్రయోజన వ్యాజ్యానికి స్పందిస్తూ, నగరం మధ్యలో ఉన్న ఫ్యాక్టరీలన్నీ తక్షణం నగరం నుండి బయటకు వెళ్లిపోవాలని సుప్రీంకోర్టు ఆర్డర్ జారీ చేసింది. అది ఆర్థికంగా సాధ్యం కాని యాజమాన్యాలు ఫ్యాక్టరీలను మూసేయాలని ఆదేశించింది. దాంతో డజన్ల సంఖ్యలో  ఫ్యాక్టరీలు మూత పడ్డాయి. వేల సంఖ్యలో కార్మికులు నిరుద్యోగులయ్యారు. అంతకు ముందెన్నడూ జరగని విధంగా ఢిల్లీ నగర వీధులలో సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ధర్నాలు, ఊరేగింపులు జరిగాయి.

నిజానికి ఈ రెండు ఆదేశాలూ తక్షణమే అమలు కావాలన్న పద్ధతిలో కాకుండ ప్రజల కష్టనష్టాలను లెక్కలోకి తీసుకొని ఒక టైం టేబుల్  ప్రకారం అమలు కావాలని సుప్రీంకోర్టు అని ఉండవచ్చు. కానీ మనుషుల బాగోగుల కంటే 'పర్యావరణం' ముఖ్యమయిపోయినప్పుడు అటువంటి ఆలోచనలు రావు. అసలు పర్యావరణాన్ని మనుషుల అవసరాల నుండి వేరు చేసి చూడడంలోనే తప్పుంది. ఆ అవసరాల వల్ల  పర్యావరణానికి హాని ఉండనే ఉండదని కాదు. ఒక్కొకసారి ఉంటుంది. ఒక్కొకసారి తీవ్రంగానూ ఉంటుంది. అయినప్పటికీ ఆ అవసరాల నుండి వేరుచేసి 'పర్యావరణాన్ని' అమానవీయంగా నిర్వచించుకొని కాపాడాలనుకోవడం అమానుషమైన ఆదేశాలకు దారి తీస్తుంది.

**ప్రజాతంత్ర వారపత్రిక**
**15 అక్టోబర్ 2000**

# ఫీల్‌గుడ్ అబద్ధానికి బలమైన జవాబు అవసరం

నోరున్న వాళ్లను సంతృప్తి పరచినట్టయితే నోరులేని వాళ్లకోసం ఏమీ చేయనక్కరలేదన్న ప్రాథమిక రాజకీయ సత్యాన్ని ఇప్పుడు యావద్దేశం గ్రహించినట్టుంది. నిజానికి ఈ సత్యం తెలియని వారెవరూ లేరుగానీ సంక్షేమ రాజ్యంలో దీనిని అనుసరించడం, ఆచరించడం అనుచితం అని యాభైఏళ్లు అనుకున్నారు. ఇప్పుడు అనుకోవడం మానేశారు.

'ఉన్నవాళ్లు ఇంకొంచెం బాగా బతకడానికి అవకాశం ఇవ్వండి. వాళ్లయితేనే ఆ అవకాశాలను లాభదాయకంగా వాడుకుంటారు. తమతో బాటు సమాజాన్ని కూడ అభివృద్ధి చేస్తారు, అప్పుడు అందరూ బాగుపడతారు. లేనివాళ్లకు అవకాశాలిస్తే అవి వృథా అవుతాయి. వారితోపాటు సమాజం కూడ వెనక్కి పోతుంది'- ఇప్పుడు అందరూ నమ్ముతున్న రాజకీయార్థిక తత్వం ఇదే కదూ? అంతో యింతో ఉన్న వాళ్లందరికీ ఇది నచ్చే తత్వం కూడ (నేను బాగుపడితే సమాజం యావత్తు బాగుపడుతుంది అనే విశ్వాసం ఇచ్చే సంతృప్తికి పోలిక ఏది?). ఈ మాత్రం ఆలోచన యాభైఏళ్ల కింద రాకపోలేదు, నలభై ఏళ్ల కింద రాకపోలేదు, ముప్ఫై ఏళ్ల కింద రాకపోలేదు. అయితే అప్పట్లో ఇది నిజమని నమ్మాలని మనసు ఎంత లాగినా ఇది నిజం కాదని గుర్తించే హేతుబద్ధతకు ఇంకా గౌరవం ఉండేది. ఈ శతాబ్దంలో అది పోయింది. 'స్వంత లాభం కొంత మానుకొని' పొరుగువారికీ సమాజానికీ తోడ్పడమని వందేళ్లనాడు ఒక సనాతన అభ్యుదయవాది అన్నాడు. అతను వెర్రివాడని ఇప్పుడు రుజువయిపోయింది. స్వంత లాభం ఎంత ఎక్కువ చూసుకుంటే అంత ఎక్కువగా సమాజాన్ని ముందుకు నడిపిస్తామని రుజువయిపోయింది. ఎంత హాయి!

'భారత్ వెలిగిపోతుంది' అన్న భారతీయ జనతాపార్టీ నినాదానికి జీవితంలో కొంత భద్రత ఉన్న మధ్యతరగతిలో లభిస్తున్న ఆదరణను చూసి నవ్వాలో కోపగించుకోవాలో పాలుపోవడం లేదు. మధ్యతరగతితోనూ తత్సంబంధమైన వ్యాపార వ్యవహారాలతోనూ ముడిపడివున్న భారత్ మాత్రమే వెలిగిపోతున్నది. సీత బాధలు సీతవన్నట్లు 'అవుట్ సోర్సింగ్'పైన నిషేధం, తూర్పు ఆసియాలో బర్డ్‌ఫ్లూ వంటి సమస్యలు అమెరికా వారికి కూడ లేకపోలేదు గానీ మొత్తం మీద వారు వెలిగి పోతుండడం సత్యమే. 'మూతి మీద మీసం లేని' కుర్రవాళ్లకు ముప్పైవేల జీతం ఇయ్యగల ఆర్థిక రంగాన్ని 'వెలిగి పోతోంది' అనకపోతే ఏమంటాం? అదే వయసు, అదే యోగ్యత ఉన్న అశేష యువతకు నెలకు వెయ్యి రూపాయలు సంపాదించడం ఘనంగా ఉన్నప్పుడు తాము మాత్రం అంత సంపాదించడం పట్ల 'గిల్టీగా ఫీల్ కావడం' అనవసరం అని ఇప్పుడు సమాజం తాను నమ్మి, వారిని కూడ నమ్మించగలగడం నిజమైన 'ఫీల్‌గుడ్' ఫ్యాక్టర్.

ఈ ఫీల్‌గుడ్ వర్గం అభిప్రాయాలే ప్రసార మాధ్యమాల అభిప్రాయాలు కాబట్టి అంతా బాగుందని నోరున్న వాళ్లందరూ నమ్మేయగలుగుతున్నారు. వాళ్ల సంతృప్తే దేశ సంతృప్తి అనే రాజకీయ నీతిని సాధించేసాం కాబట్టి మనమంతా కలిసి ఒక ఫీల్‌గుడ్ ప్రపంచాన్ని నిర్మించేసుకున్నాం. దాని బదులు లేనివారి గొంతు వినిపింపజేసే ప్రయత్నం ఎవరైనా చేస్తే వారిని భరించరాని చాదస్తులుగా పరిగణించడం, వారి ప్రయత్నాన్ని కొట్టి పారేయడం నేర్చేసుకున్నాం. 2020కి టిక్కెట్ తీసుకుని అప్రతిహతంగా పురోగమిస్తున్నాం. వేరే విషయాలలో చాలా సనాతనవాదులుగా కనిపించే సంఘ్‌పరివార్ వారు ఈ ఫీల్‌గుడ్ ప్రపంచానికి విశ్వకర్మలు కావడం వింతగా తోస్తే అది మన తప్పే. వాళ్లు దేశాన్ని మధ్యయుగాల మనుధర్మంవైపు తీసుకుపోవాలని ఏనాడూ అనుకోలేదు. ఆధునిక యుగంలో మనుధర్మాన్ని ప్రతిష్ఠించాలన్నది వారి అజెండా.

ఇది వాజ్‌పేయితో వచ్చిందనుకోవద్దు. గోల్వాల్కర్‌తోనే వచ్చింది. 'ఎవరి కర్మ వారిది, ఎవరి ధర్మం వారిది' అనే హైందవ సామాజిక తత్వాన్ని దేశ సామాజిక విధానాల పునాది సూత్రంగా నిలబెట్టి హైందవ జాతిని శక్తివంతమైన అత్యాధునిక రాజ్యంగా మలచాలన్నది గురూజీ చెప్పిన మాట, అదే అటల్‌జీ బాట. అధికారానికి వచ్చిన బిజెపి ఖాకీ నిక్కర్ల స్థానంలో సఫారీ సూట్లు తీసుకొచ్చిందని మనం అనుకుంటే అది మన వెర్రి తప్ప వేరే ఏమీ కాదు.

'ఈ ఫీల్‌గుడ్ ప్రపంచానికి బయట పెట్టబడినవారు ఏదో ఒక రోజు దానిని ధ్వంసం చేస్తారు, అప్పుడుగానీ అసలు విషయం అర్థం కాదు' అనగలిగే పరిస్థితి

వాస్తవంలో లేదు. ఆనవాయితీగా ఆ మాటలు అంటున్నవాళ్లు లేకపోలేదు. ఏళ్లతరబడి అదే కమిట్‌మెంట్‌తో అవే మాటలు అంటున్నాం అని వారు తమ గురించి తాము మురిసిపోతుండవచ్చును గాక. వాళ్లు కూడ ఒక రకంగా ఒక ఫీల్‌గుడ్ ప్రపంచాన్ని నిర్మించుకొని అందులో బతుకుతున్నారు.

నిజం చెప్పాలంటే భారతీయ జనతా పార్టీ వారి ఫీల్‌గుడ్ ప్రపంచం ఎవరినైతే దాన్నుంచి బయటపెట్టిందో వారు వ్యక్తులుగా ఆ ప్రపంచంలోకి ప్రవేశించే మార్గాన్ని అన్వేషించడంలో నిమగ్నమై బుకింగ్ టిక్కెట్ కోసం వెతుక్కుంటున్నారు. లేదా దాని అనైతికతకు దాని వెలుపల పునస్సృష్టి చేసి తమ లాభం చూసుకుంటున్నారు. మొదటి ప్రయత్నంలో అతికొద్ది మంది మాత్రమే సఫలం కాగలరు. రెండవది అందరినీ దిగజారుస్తుంది.

ఇప్పుడేం చేయాలి అన్న ప్రశ్నకు ఎవరి దగ్గరా జవాబు లేకపోవచ్చును గానీ అబద్ధాన్ని ప్రధాన నుడికారంగా గలిగిన ప్రస్తుత రాజకీయ పరిభాషకు ప్రత్యామ్నాయ భాషను సజీవంగా ఉంచడం ఒక కనీస కర్తవ్యం. ప్రత్యామ్నాయాలు సహితం అబద్ధాన్నే ఆశ్రయించడం అవసరమనీ, అందులో తప్పేమీ లేదనీ, ఆ పని చేయగలగడం గర్వకారణమనీ కూడ మన మిత్రులే భావిస్తున్న తరుణంలో ఇదేమంత సులభం కాదు. అబద్ధాన్ని అబద్ధంతోనే జయించగలం అన్న నిర్ణయానికి వచ్చేసి, తమకు అలవాటయిన సీరియస్‌నెస్‌తో అందులో నిమగ్నమయి పోయిన అభ్యుదయవాదులను ఎంత మందిని మన చుట్టూ చూడడం లేదు? అంతటి సిద్ధాంతం చేయకపోయినా ప్రస్తుతానికి వేరే గత్యంతరం లేదని నమ్మి అదే పని చేస్తున్న వారూ ఉన్నారు. ఇది 'ఫీల్‌గుడ్' ప్రపంచకర్తలకు చాలా ఆనందం కలిగిస్తున్నది.

ఈ స్థితిలో ఏం చేయాలో పాలుబోక ఏదో చేస్తున్నట్టు కనిపించే ప్రగతిశీల కార్యాచరణ మన చుట్టూ చాలానే చూస్తున్నాం. కానీ అది చాలదు. ప్రస్తుతం ఆచరణసాధ్యం అయినా కాకున్నా, దానిని ఆచరణసాధ్యం చేసే మార్గం మన దగ్గర లేకున్నా సత్యాన్ని బలంగా నిలబెట్టే ప్రయత్నం చేయడం అవసరం. అసత్యాన్ని సత్యంతోనే జయించాలన్న రాజకీయ నీతిని ఇరవయ్యవ శతాబ్దంలో అందరికంటే బలంగా ప్రతిపాదించిన గాంధీ అబద్ధంతో చాలాసార్లు చాలా విషయాలలో రాజీపడిన మాట వాస్తవమే. ఆయన సత్యంగా భావించింది ప్రజాతంత్ర దృక్పథానికి పూర్తి సత్యం కాని మాట కూడ వాస్తవమే. అయినప్పటికీ సరయిన, సమగ్రమైన అర్థంలో అదే ఇవాళ్టి కర్తవ్యం. గొంతులేకుండ పోయిన

సత్యానికి గొంతు కల్పించి 'ఫీల్‌గుడ్' అబద్ధం హోరును అధిగమించి దానిని నిలబెట్టాలి. నోరున్న వాళ్లంతా కలిసి తమ స్వప్రయోజనానికి అందమైన పేర్లు పెట్టుకొని అదే అందరి ప్రయోజనమని ప్రచారం చేసుకుంటున్న వైనాన్ని సహేతుకంగా సవివరంగా ఎండగట్టాలి. ఈ పని ఆత్మసంతృప్తి కోసం కాక బలంగా చేయాలి.

**ప్రజాతంత్ర వారపత్రిక**
**22 ఫిబ్రవరి 2004**

# అక్రమ కనెక్షన్ల క్రమబద్ధం మేలు!

'అక్రమ విద్యుత్ కనెక్షన్లు' తొలగించడం మీద చాలా రభస జరుగుతున్నది.

తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీలు చేస్తున్న రభస గురించి పెద్దగా మాట్లాడుకోవడం అనవసరం. పాలనా వ్యవహారాలలో ఔదార్యం ప్రదర్శించే ఏ ప్రయత్నమైనా తలకు మించిన భారాన్ని నెత్తికెత్తుకునే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. ఔదార్యం పట్లనే వ్యతిరేకత ఉన్నవారికి అది సంతోషం కలిగించవచ్చును. 'గొప్పలకు పోదామనుకున్నావు కదూ – బాగా అయింది' అని వారు సంబరపడవచ్చు. అది వారి చవుకబారు రాజకీయనీతిని సూచిస్తుంది తప్ప వేరే ఏమీ కాదు.

వామపక్ష పార్టీలు చేస్తున్న రభసను బాధ్యత లేని వారి 'ప్రివిలేజ్'గా కొట్టి పారేయాలనిపించవచ్చును. కానీ వారు – ముఖ్యంగా సిపిఐ(ఎం) అంటున్న మాటలు కొంచెం ఆగి ఆలకించడం మంచిది. వ్యవసాయానికి మొత్తంగానే కరెంటు ఫ్రీ అనే బదులు కరెంటు వాడకం స్థాయిని, బోర్లు కాక ఇతర నీటి వనరుల అందుబాటును, కమతం పరిమాణం తదితర అంశాలను లెక్కలోకి తీసుకొని హెచ్చుతగ్గుల సబ్సిడీ ఇచ్చివుంటే ఉచితంగా ఉండేదని వారు అంటున్నారు. ఈ రోజు కాదు, కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత కరెంటు విధానాన్ని ప్రకటించిన రోజే అన్నారు. ఆ పని చేసి వుంటే 'అక్రమ' కనెక్షన్లన్నింటినీ క్రమబద్ధం చేసి అదే పద్ధతిలో వాటికి కూడ హెచ్చుతగ్గుల సబ్సిడీ ఇచ్చి ఉండవచ్చు. అప్పుడైనా మొత్తం ఆర్థిక భారం ఇప్పుడున్న దానికంటే ఎక్కువ ఉండేది కాదు.

అదట్లాగుంచి, అక్రమ కరెంటు అనగానే అదేదో చేయరాని దొంగతనమైనట్లు భావించడమెందుకు? కరెంటు 'దొంగిలించిన' రైతు దానిని దాచుకొని బ్లాక్‌లో

అమ్ముకోడు. సమాజానికి హానికరమైనవి ఏవీ చేయడు. ఇంకొంచెం ఎక్కువ పంట పండిస్తాడు, ఇంకొంచెం తరచుగా కడుపునిండా తింటాడు. స్థూల వ్యవసాయ ఉత్పత్తిని మరికాస్త పెంచి దేశ 'అభివృద్ధి'కి తోడ్పడతాడు.

అంటే ఇది మౌలికంగా అభివృద్ధికరమైన చౌర్యం. దానిని నిషేధించే ఆలోచనలు కాక క్రమబద్ధం చేసే ఆలోచనలు చేయడమే ఉచితం. ఆ ప్రయత్నంలో సమస్యలేవీ ఉండవని కాదు, ఉంటాయి. కానీ వాటిని అధిగమించే హేతుబద్ధమైన ప్రయత్నం దానికి జవాబవుతుందే తప్ప సమస్యలున్నాయని తప్పించుకోవడం జవాబు కాదు.

అసలు సమస్య ఎక్కడొస్తుందంటే బడుగువర్గాల జీవితాలు బాగుపడడాన్ని మనం ఇంకా 'అభివృద్ధి' గా అర్థం చేసుకోవడం లేదు. సంక్షేమంగా మాత్రమే అర్థం చేసుకుంటున్నాం. 'అభివృద్ధి' ఆదాయాన్ని తెచ్చిపెడితే 'సంక్షేమం' ఖర్చును పెంచుతుందని చెప్పి దానిని ఒక కంట కనిపెట్టి ఉంచాలనుకుంటాం. చవక బియ్యం, ఉచిత కరెంటు, ఎస్‌సి, బిసి స్కాలర్‌షిప్‌లు, వికలాంగులకు బస్‌పాసులు, ఇవన్నీ ప్రభుత్వానికి ఖర్చు పెంచే సంక్షేమ చర్యలు అనుకుంటాము కాబట్టి వీటికొక సీలింగ్ పెట్టి అంతకంటే ఎక్కువ అడగొద్దనీ ఇవ్వొద్దనీ అంటాం. అదే వెడల్పయిన రోడ్లు, టెలికాం లైన్లు, పర్యాటక కేంద్రాలు – ఇటువంటివయితే 'అభివృద్ధి'కి సంబంధించిన విషయాలనీ, వాటిపైన ఎంత ఖర్చు పెట్టగలిగితే అంత మంచిదనీ అనుకుంటాం.

కానీ నిజానికి 'సంక్షేమం' అనేది ఎంత 'అభివృద్ధో' గ్రహించినట్టయితే ఈ విషయాల గురించి మనం చర్చించే పద్ధతే మారిపోతుంది. ప్రభుత్వ ఖజానాకూ ప్రైవేట్ బ్యాంక్ అకౌంట్లకూ పెట్టుబడులను వేగంగా జమచేసేది మాత్రమే అభివృద్ధి కాదనీ, ప్రజల జీవితాలను బాగుపరిచేదీ అభివృద్ధే అనీ గ్రహించే రోజు ఎప్పుడొస్తుందో.

బలహీనవర్గాలకు స్కాలర్‌షిప్‌లు, చవక బియ్యము, కరెంటు సబ్సిడీలు, ఉచిత వైద్యం, విద్య – ఇవన్నీ యాభైఏళ్లుగా లేకుండినట్టయితే ఈ రోజు పక్కా ఇళ్లలో ఉంటూ పిల్లలను అంతో యింతో చదివించుకుంటూ ఒక మోస్తరు జీవన ప్రమాణం అనుభవిస్తున్న లక్షలాది కుటుంబాలు ఎక్కడుండేవి, ఏ విధంగా ఉండేవి? ఇది 'అభివృద్ధి' కాదనీ ప్రభుత్వానికి ఆర్థిక భారం పెంచే సంక్షేమ వ్యయం మాత్రమేననీ అనుకోగలమా?

నిజమే, ఏ పేరు పెట్టుకున్నా ప్రభుత్వ బడ్జెట్ పరిమితులను మించి సబ్సిడీలుగానీ ఉచిత సేవలుగానీ అందియ్యడం సాధ్యం కాదు. హేతుబద్ధమైన

ఆదాయవ్యయ విధానాల పరిధిని ధిక్కరించి వ్యవహరించడం విజ్ఞత కాదు. ఇదెవ్వరూ కాదనగల విషయం కాదు. అయితే ఏది హేతుబద్ధం, ఎక్కడ ఆగితే సమతుల్యం అనేవి నిర్ణయించే ముందు ఏ ఖర్చును ఏ కళ్లతో చూస్తున్నామో కొంచెం విమర్శనాత్మకంగా గమనించాలి. సింగిల్‌రోడ్డుగా ఉన్నదాన్ని డబుల్‌రోడ్డు చేస్తున్నారంటే ఇటువంటివి ఎంత చేస్తే అంత అభివృద్ధి అనుకుంటాం. ఒక టెక్నాలజీ పార్కు స్థానంలో రెండు నెలకొల్పితే ఆహా అభివృద్ధి ఎంత వచ్చేస్తున్నదనుకుంటాం. కొత్త ఓడరేవులు కట్టినా ఎగుమతి దిగుమతి కేంద్రాలు నెలకొల్పినా ఆటోనగర్‌లు వెలిసినా అదే అనుకుంటాం. కానీ ఒక సోషల్ వెల్ఫేర్ హాస్టల్ పక్కనే రెండవది కడితే ఇట్లాంటివి ఎన్ని కట్టుకుంటూ పోతారు, అడిగేవాడికి బుద్ధి లేకపోయినా ఇచ్చేవాడికి ఉండొద్దా అనుకుంటాం. ఉచిత కరెంటు ఇవ్వడమే తప్పనుకుంటే దొంగ కరెంటు కనెక్షన్లను తొలగించవద్దనే ఈ ఆందోళనలేమిటని విసుక్కుంటాం.

ఈ దృష్టి భేదం గురించి ఆలోచించుకోవడం అవసరం. స్కాలర్‌షిప్పులు, ఉచిత విద్యావైద్యాలు, చవక బియ్యం మొదలయినవి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలోను ప్రజాజీవనం అభివృద్ధికి తోడ్పడగా, మెట్ట ప్రాంతాలలో జీవన ప్రమాణాలను పెంచిన ప్రధాన విషయం చవక కరెంటు. అది లక్షలాది కుటుంబాలకు రెండు పూటలా తిండి పెట్టింది. తిండి వెతుక్కునే ఆరాటం నుండి జీవితాలను ఒకింత ముందుకు తీసుకుపోయింది. దొంగ కరెంటు కనెక్షన్లు అనే వాటిని ఈ అభివృద్ధిని ఇంకొంత మందికి అందిచ్చేవిగా చూసినప్పుడే వాటిని ఏం చేయాలో హేతుబద్ధంగా అర్థం చేసుకోగలుగుతాం.

ఆర్థిక విధానాలను అర్థం చేసుకోవడంలో మామూలుగానే ఉండే ఈ దృష్టి లోపాన్ని చంద్రబాబు పాలన బాగా పెంచింది. పెట్టుబడులను పెంచేది మాత్రమే అభివృద్ధి అనీ, కేవలం బతుకులు బాగు చేసే ఖర్చు అభివృద్ధికి నష్టకరమయిన వ్యయం అనీ అతను దాదాపు పదేళ్ళు మనకు నూరిపోసాడు. దీనిని కూడ అభివృద్ధిగా చూడడం అసాధ్యం చేసాడు. ఒకటిరెండు వాక్యాలనే పదేపదే ఊదరగొట్టినట్టు ప్రచారం చేసే అతని మాటలశైలి మెదళ్ళను మొద్దు బార్చింది. దీని నుండి బయటపడడానికి తెలుగుజాతికి ఎంతకాలం పడుతుందో.

**ప్రజాతంత్ర వారపత్రిక**

**5 సెప్టెంబర్ 2004**

# ప్రకృతిని దానిపాటికి ఉండనిద్దాం

ప్రకృతితో మరీ ఎక్కువ చెలగాటం ఆడడం మనిషి మనుగడకే మంచిది కాదన్న సూక్తి మామూలు సందర్భాలలో చాదస్తంగా తోస్తుంది. అభివృద్ధికీ ఆనందానికీ అడ్డమొచ్చే అనవసరమైన భయంగా అనిపిస్తుంది.

ఇది పర్యావరణ ఉద్యమం నిత్యం ఎదుర్కొనే సమస్యే. ఎప్పుడో ఏదో జరగబోతుందని ఇప్పుడు ఇది చేయొద్దు అది చేయొద్దు అంటుంటారు వీళ్ళు అని వారి గురించి మామూలు జనం విసుక్కుంటారు. పెద్ద డ్యాంలు ఉన్న చోట భూకంప ప్రమాదం ఎక్కువ ఉంటుంది కాబట్టి కట్టొద్దు అని పర్యావరణ ఉద్యమకారులు అంటారు. డ్యాం కట్టిన వెంటనే భూకంపం వచ్చేసేటట్టయితే దానికి ఉదాహరణలూ ఆధారాలూ ఉంటాయి కాబట్టి ఆ హెచ్చరికను జనం గౌరవిస్తారు. కాని వెంటనే రాదు, వచ్చేస్తుందని పర్యావరణవేత్తలూ అనరు. భారీగా నేల మీద నీరు నిలువ ఉంచడం వల్లనో, భూమి లోపలి పొరలపైన ఒత్తిడి పెరగడం వల్లనో ఏమో గాని భూమి పొరల (ప్లేట్స్) కదలికలు పెరుగుతాయని శాస్త్రీయ పరిశోధనలు చెప్తున్నాయని మాత్రం అంటారు. ఇప్పుడు తక్షణం డ్యాం నుండి నీళ్ళు కావలసినవారు ఇటువంటి అభ్యంతరాలకు విసుక్కుంటారు. 'నా జీవిత కాలంలో కచ్చితంగా భూకంపం వస్తుందని నువ్వు చెప్పగలవా?' అంటారు. చెప్పలేనని పర్యావరణవాది ఒప్పుకోక తప్పదు. మరి ఎప్పుడో ఏదో జరగబోతుందని డ్యాం కట్టుకోకుండ కూర్చుంటామా అంటాడు రాబోయే డ్యాం కింద వరిపంట వేసుకోబోయే ఆయకట్టుదారు.

(మూసీనది మీద నందనవనం ప్రాజెక్టు చేపడితే దిగువన ఉన్న రంగారెడ్డి జిల్లా రైతులు నష్టపోతారని హైకోర్టులో వాదించగా, మీ బోటి వాళ్లు ప్రజలకు అండగా ఉండి ఉంటే నిజాం నవాబు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ ప్రాజెక్టులు కట్టి ఉండేవాడే కాదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వేళాకోళంగా అన్నాడు. కట్టి ఉండేవాడు కాదో, అంతకంటే మేలయిన ప్రాజెక్టులు కట్టి

ఉండేవాడో, మేలయిన చోట కట్టి ఉండేవాడో ఇప్పుడెవరు చెప్పగలరు? వేరొక చోట కాక ఇక్కడ కట్టడం వల్ల ఏం కోల్పోయామో ఎవరు చెప్పగలరు?)

ప్రస్తుతం ప్రపంచాన్ని ఏలుతున్న నయా ఉదారవాదం ప్రకృతిని మనిషికి భిన్న రూపాలలో శారీరక మానసిక సౌఖ్యాన్నీ ఉల్లాసాన్నీ గాఢ అనుభూతినీ ఇచ్చే వస్తువుగా చూస్తుంది. ప్రకృతిని ఈ కోణం నుండి 'ప్యాకేజీ' చేసి 'పర్యాటకులు' అని పిలువబడే మనుషులకు అందజేసే సర్వీస్ ఇండస్ట్రీ టూరిజం. అది ప్రకృతిలో దేనినీ వదిలిపెట్టలేదు. అడవులు, కొండలు, గుహలు, జలపాతాలు, సముద్రం, నదులు, ఎడారులు అన్నిటినీ 'ప్యాకేజ్' చేసి రెడీగా ఉంచింది. ఒక మోతాదులో జీవన ప్రమాణం సాగించే పాశ్చాత్యులు ఈ సర్వీస్ వైపు బాగా ఆకర్షితులవుతున్నారు. వారు చేసింది మనం చేయకుండ ఉండలేము కాబట్టి మన మధ్యతరగతి, ధనికవర్గం కూడ 'పర్యాటకులు' అవుతున్నారు. తిండికి లేని పేద దేశాలు తిండిపెట్టే ఉత్పత్తుల పెంపుదల మీద అనవసరంగా దృష్టి పెట్టి వెనకబడి పోకుండా, తమ దేశాలలోని దుర్గమమైన అడవులనూ, భయం గొలిపే ఎడారులనూ, పొంగిపొర్లే నదులనూ, ఎత్తయిన కొండలనూ, సముద్రాలనూ 'ప్యాకేజీ' చేసి విదేశీ మారకద్రవ్యం సంపాదించి దానితో కావలసినవన్నీ దిగుమతి చేసుకొని బతకడం ఉచితం అని నయా ఉదారవాదం చెపుతుంది. చివరి మెట్టుదాకా అన్నీ సజావుగానే సాగినా, దిగుమతి చేసుకోబోయేది ఎగుమతులు చేయగా వచ్చిన సంపద చేతిలో ఉన్నవారి అవసరాలే కాబోతాయి కాబట్టి తిండిలేని వారికి ఈ నయా ఉదారవాద ఆర్థిక విధానం తిండి పెట్టదన్న విషయం సులభంగానే అర్థం కావాలి గానీ, మనిషి గ్రహణ శక్తికి తన ప్రయోజనాలొక పెద్ద పరిమితి కాబట్టి, పేద దేశాల పాలకులు పేదవారు కాబట్టి అది అర్థం కాని విషయంగానే ఉండిపోతుంది.

ఈ దృష్టికి సముద్రం అంటే బీచ్. అంతకు ముందు సముద్రం అంటే చేపలవేట, నౌకాయానం, ఉప్పుకయ్యలు, కవులకు కవితా వస్తువు. ఇప్పుడు సముద్రం అంటే బీచే. అందమైన బీచ్‌లు ఉన్న దేశం సేదదీరగోరే పర్యాటకులను ఆకర్షించి సముద్రాన్ని వ్యాపారం చేసుకోగలదు. అందువల్ల బీచ్‌లు లేని చోట బీచ్‌లు వెలిసాయి. మత్స్యకారులున్న చోట వారిని తొలగించారు. సముద్రపు ఒడ్డు దాకా అడవులున్న చోట వాటిని కొట్టి ఖాళీ చేయించారు. తెలివయిన మూడవ ప్రపంచ దేశాల పాలకులు సముద్రాన్ని బీచ్‌గా మలచి విదేశీ మారక ద్రవ్యం పొంది తరిస్తున్నారు.

సముద్రపు ఒడ్డున ఉండే తడి నేలలలో పెరిగే అడవులను ఇంగ్లీష్‌లో 'మాన్‌గ్రోవ్' అంటారు. ఇవి చాలా దట్టంగా ఉంటాయి. ఈ అడవులలోని

చెట్లవేర్లు నేల కిందే కాక నేలపైన కూడ వుంటాయి. చెట్లకు కాళ్లు ఉన్నట్టు అనిపిస్తుంది. పలు కాళ్లున్న చెట్లతో ఈ అడవులు చక్కగా ఉంటాయి. మొన్నటి సునామీని ఈ మాన్‌గ్రోవ్‌లు మాత్రమే ఎదుర్కొనగలిగాయనీ, తీర ప్రాంత అడవులు బాగా ఉన్న చోట మాత్రమే సునామీ బీభత్సం తక్కువగా ఉందనీ ఇప్పటికి వచ్చిన వార్తలు చెబుతున్నాయి. సునామీలు ఎప్పుడో గాని రావు. బహుశా శతాబ్దానికి ఒకసారి కూడ రావు. అయినప్పటికీ వచ్చినప్పుడు లక్ష ప్రాణాలు తీయగలవు కాబట్టి సముద్రపు ఒడ్డున అడవులను ఉండనీయడం ఉచితం అని అర్థం అవుతుంది.

నిజమే, తీరం దాకా అడవులు పెరగని ప్రాంతాలుంటాయి. పర్యాటక పరిశ్రమ పుట్టకముందే సముద్ర తీరాన జీవనం నిమిత్తం మనుషులు చొరబడడమూ జరిగింది. నిజానికి సముద్ర తీరమొక్కటే కాదు, సమస్త ప్రకృతితోనూ పెట్టుబడిదారీ వ్యవస్థ, దాని వికృత రూపమయిన నయా ఉదారవాదం పుట్టకపూర్వమే మనిషి చెలగాటం ప్రారంభమయింది. చాలా దూరం పోయింది కూడ. ప్రకృతిని ఉన్నదున్నట్టు ఉండనిచ్చివుంటే మానవ నాగరికత ఇంత దూరం వచ్చి ఉండేదే కాదు. అయితే జీవనం పొందడానికీ జీవన అవకాశాలను విస్తృత పరచడానికీ ప్రకృతిని వస్తువుగా వినియోగించుకోవడం వేరు, సుఖమయ జీవితం తప్ప తక్కిన అన్ని ప్రమాణాలకూ లక్ష్యాలను కోల్పోయి ప్రకృతినీ పరిసరాలనూ మనకు సుఖమిచ్చే వస్తువులుగా భావించడం వేరు. నాగరికత ఎక్కడో ఒక చోట గిరిగీసి ఆ రేఖకు ఆవల ప్రకృతి ఉనికితో ఆడుకోరాదని నిర్ణయించుకోవడం అవసరం.

అయినప్పటికీ లక్ష మందికి పైనే చనిపోయి ఉందురేమో. సముద్రాన్ని కేవలం బీచ్‌గా చూసే దృష్టి కోణం మనిషికి అలవడకపోయినట్టయితే కొన్ని వేల ప్రాణాలు మాత్రమే దక్కేవేమో. కావచ్చు. ఇక్కడ సంఖ్య ముఖ్యం కాదు. సునామీ బీభత్సం వేలెత్తి చూపిన గుణపాఠాన్ని గుర్తిస్తున్నామా లేదా అనేది ముఖ్యం. నెల రోజుల కింద 'ఎప్పుడయినా ఉప్పెన రాగలదు, సముద్రాన్ని దాని పాటికి దాన్ని ఉండనివ్వరాదా' అంటే చాదస్తంగా భావించి ఉండేవారు. ఇప్పుడు వెంటనే ఆ మాట అనలేరు కాబట్టి సముద్రాన్ని గురించీ, సమస్త ప్రకృతి గురించీ ఈ నీతిబోధ చేసే అవకాశం, వినే అవకాశం లభించింది.

**ప్రజాతంత్ర వారపత్రిక**

**2 జనవరి 2005**

# అభివృద్ధి పథంలో ఎన్ని ప్రాణాలర్పించుకుంటూ పోతాం?

**ఈ** మధ్య పత్రికలలో ఎక్కడ చూసినా నిర్వాసితుల ఆందోళనల వార్తలే. గంగవరం నిర్వాసితులు, గుండ్లకమ్మ నిర్వాసితులు, ఇక పోలవరం సరేసరి. జాతీయ వార్తలలోనూ నర్మదా నిర్వాసితుల గురించి మేధాపాట్కర్ చేస్తున్న నిరాహారదీక్ష ప్రధానవార్త అయింది.

ఇదేమయినా కొత్త సమస్యా? ఇదివరలో ఈ సమస్య లేకుండెనా? లేకేం, ఉండింది. కానీ రెండు మార్పుల కారణంగా ఇప్పుడు ప్రతిఘటన పెరిగింది. ఒకటి, ఒక ప్రాజెక్టు లేక ఫ్యాక్టరీ 'దేశ అభివృద్ధి' కోసం అనగానే అందరూ నోరు నొక్కేసుకుని నష్టాన్ని భరించే రోజులు పోయాయి. ప్రాజెక్టు వల్ల వచ్చే అభివృద్ధి కొందరికే చెందినా దానిని 'దేశ అభివృద్ధి' అనేటట్టయితే, దాని వల్ల వచ్చే నష్టం కొందరికే అయినా ఆ నష్టాన్ని దేశమే భరించాలి, ఆ కొందరే కాదు అని ఇప్పుడు సమాజం అనుకోగలుగుతున్నది. అంటే ప్రాజెక్టుల వల్ల నివాసం లేక జీవనాధారం కోల్పోయే వాళ్ల పునరావాస భారాన్ని, వారికి తిరిగి ఆ మేరకయినా జీవనాధారం కల్పించే భారాన్ని దేశం – అంటే ప్రభుత్వం తనపైన వేసుకోవాలని అర్థం.

ఈ ఆలోచనలో తప్పేమీలేదు గానీ దీనికి హక్కు రూపం ఇయ్యగల రాజ్యాంగ సూత్రంగానీ చట్టంగానీ స్పష్టమైన ప్రభుత్వ విధానంగానీ దేశంలో లేదు. అసలు భారత రాజ్యాంగంలో పౌరులకు స్పష్టమైన ఆవాస హక్కే లేదు. ఇంక పునరావాస హక్కు ఎక్కడి నుండి వస్తుంది? ప్రతీ మనిషికీ కనీస అవసరాల మేరకొక 'గూడు' కలిగి ఉండే హక్కు ఉన్నట్టయితే ఆ గూడు తొలగించిన వారు మరొక చోట కట్టివ్వాలన్న హక్కు ఉండేది. మొదటిదే ప్రజలకు లేకపోవడం భారత రాజ్యాంగంలోని లజ్జాకరమైన లక్షణాలలో ఒకటి. రెండవది ఎట్లా వస్తుంది?

అయితే రాజ్యాంగాన్ని కొంచెం ఉదారంగా వ్యాఖ్యానించడానికి సుప్రీంకోర్టు సిద్ధంగా ఉండి ఉంటే ఈ హక్కుకు ఆర్టికల్ 19(1)(ఇ) లో చోటు కల్పించి ఉండవచ్చు. దేశపౌరులు దేశంలోని ఏ ప్రాంతంలోనైనా నివాసం ఏర్పరచుకోవచ్చు అని ఆర్టికల్ 19(1)(ఇ) అంటుంది. దాని ప్రత్యక్ష భావం ఏమిటంటే దేశంలో ఒక ప్రాంతానికి చెందిన వారు ఆ ప్రాంతంలోనే కాదు, ఎక్కడకయినా పోయి ఉండవచ్చునని. అంటే దేశ ఏకతను – కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా అనే భావనను – ఇది వ్యక్తం చేస్తుంది. రాజ్యాంగకర్తల ఉద్దేశ్యం అంతే అయి ఉండవచ్చు. అయితే ఎక్కడయినా నివసించవచ్చునంటే ఎక్కడో ఒకచోట నివసించే హక్కు ఉందని అంతర్లీనంగా దాని అర్థం అని వ్యాఖ్యానించి, దానిని జీవించే హక్కుతో జోడించి ఒక 'గూడు' కలిగి ఉండే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని న్యాయస్థానాలు వ్యాఖ్యానించి ఉండవచ్చును. కానీ ఎన్నిసార్లు ఆ వాదన చేసినా సుప్రీంకోర్టు అంతటి 'సాహసం' చేయలేదు.

గూడుకే దిక్కు లేదంటే ఇక జీవనానికీ ఉపాధికీ ఎక్కడిది? కాబట్టి పెరుగుతున్న నిర్వాసితుల హక్కుల చైతన్యం ఉద్యమాల రూపం తీసుకోక తప్పడం లేదు. ఆందోళన స్థాయిని బట్టి, అది ఎన్నికలలో చూపగల ప్రభావాన్ని బట్టి ప్రభుత్వాలు ఆ ఉద్యమాలకు ఒక్కొక్కసారి ఒక్కొక్క రకంగా స్పందిస్తున్నాయి.

రెండవ కారణం, ప్రజలను నిర్వాసితులను చేసే అభివృద్ధి ప్రక్రియ వేగం పుంజుకోవడం. ప్రస్తుతం మనం 10 శాతం వార్షిక అభివృద్ధి రేటును ఏకైక లక్ష్యంగా గల పాలనలో బతుకుతున్నాం. దీనికి పార్టీలతో, కూటములతో నిమిత్తం లేదు. అందరికీ ఈ విషయంలో ఏకాభిప్రాయం ఉంది. ఇది సాధ్యం కావాలంటే భూమి, నీళ్లు, అడవులు వగైరా ప్రాకృతిక వనరులను కార్పొరేట్ ప్రయోజనాలకు, వాటికి అనుబంధమైన అవసరాలకు ఇతోధికంగా కేటాయించాలి. విశాలమైన రోడ్లు, అత్యాధునిక విమానాశ్రయాలు, ఓడరేవులు, సకల ఖనిజాలను వెలికితీసే గనులు – అన్నీ శరవేగంగా వెలుస్తున్నాయి. ప్రజలు కుప్పలుకుప్పలుగా 'నిర్వాసితులు' అవుతున్నారు.

ఒక గూడు, ఉపాధి, జీవనాధారం లేని వాళ్లను పోనియ్యండి – అవి ఉన్నవాళ్లకయినా కనీసం ఆ మేరకైనా వాటిని మరొక చోట, మరొక రూపంలో పొందే హక్కు ఉండదా? స్థిరాస్తుల సేకరణకు ఇచ్చే నష్టపరిహారం ఇందుకు ఎంతమాత్రం సరిపోదనేది అందరి అనుభవం. కాబట్టి అదనంగా పునరావాస హక్కు కావాలి. ఈ కోరికను సుప్రీంకోర్టు దాకా తీసుకుపోయి చట్టపరంగా

కూలంకషంగా వాదించిన సంస్థ 'నర్మదా బచావ్ ఆందోళన్' ఒక్కటే. సుప్రీంకోర్టు పునరావాస హక్కును సూత్రప్రాయంగా సమర్థించి దాని వివరాలను ప్రభుత్వానికి వదిలేసినా చాలా మేలు చేసి ఉండేది. కానీ సుప్రీంకోర్టు ఘోరమైన తీర్పు ఇచ్చింది. పునరావాస హక్కు అనేదేదీ లేదనీ, ప్రాజెక్టులను పునరావాసం పేరిట అడ్డుకోవడం తగదనీ, ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులయిన వారి జీవితాలు బాగుపడ్డాయే తప్ప ఎక్కడా ధ్వంసం కాలేదనీ, ఇంకా ఏమేమో అనింది. అయితే నర్మదా నదీ జలాలను మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌ల మధ్య పంచిన ట్రిబ్యునలే, ఆ నదిపైన ఏ ప్రాజెక్టు నిర్మించినా నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని ఆదేశించింది. కాబట్టి సుప్రీంకోర్టు తీర్పుతో నిమిత్తం లేకుండ వారికి పునరావాస హక్కు దక్కింది.

కానీ ప్రాజెక్టు ముందు కట్టేస్తే ఆ తరువాత పునరావాసం ఇస్తారన్న నమ్మకం లేదు కాబట్టి ముందు అవార్డు ప్రకారం పునరావాసం కల్పించిన తరువాతే ప్రాజెక్టు కట్టాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. కనీసం ఒక్కొక్క దశలోనూ అప్పటిదాకా నిర్వాసితులయిన వారికి నష్ట పరిహారం ఇచ్చిన తరువాతే తరువాతి దశ పనులకు అనుమతి ఇవ్వాలన్న ఆఖరి అభ్యర్థనను కూడ సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దానికి ప్రభుత్వం నెలకొల్పిన కమిటీ ఒకటి ఉంటుంది, ఆ కమిటీ పునరావాస పనులు సక్రమంగానే జరుగుతున్నాయని భావించి అనుమతి ఇస్తే ప్రాజెక్టు పనులు ఒక దశ నుండి మరొక దశకు కొనసాగించవచ్చునని అనింది.

ఈపాటి తంతు కూడ లేకుండా ఆనకట్ట ఎత్తు పెంచుతున్నారన్న ఆరోపణతో ఇప్పుడు మేధాపాట్కర్ ఆమరణ దీక్ష మొదలు పెట్టింది. ప్రభుత్వం ప్రాజెక్టు పనులు ఆపకుండా ఏదో ఒక విధంగా ఆమెకు నచ్చజెప్పాలన్న ప్రయత్నంలో ఉంది గానీ ఆమె నిరక్షరాస్య గ్రామీణ జీవి కాదు, మంత్రిగారు వచ్చి చిరునవ్వుతో పలకరిస్తే నమ్మి నిరాహారదీక్ష మానుకోవడానికి.

జాతీయ మానవ హక్కుల కమీషన్ జోక్యం చేసుకుంటే బాగుండునని ఎవరో తెలియక పత్రికా ప్రకటన ఇచ్చారు. ఆ సంస్థ ఛైర్మన్ జస్టిస్ ఆనంద్‌గారే నర్మదా కేసులో తీర్పు ఇచ్చిన మాజీ ప్రధాన న్యాయమూర్తి. ప్రజలకు పునరావాస హక్కే లేదనీ, ప్రాజెక్టులు ప్రజలకు వరమనీ ప్రకటించిన పెద్దమనిషి ఇప్పుడేమని జోక్యం చేసుకుంటాడు?

మేధాపాట్కర్ ప్రాణానికి హాని రానివ్వరనే ఆశిద్దాం. గంగవరంలో నయితే చీడిపల్లి నూకరాజు చనిపోయాడు. గంగవరం కేవలం నాలుగు ఊళ్ళ సమస్య.

పోలవరం ముంపు గ్రామాలు 276. రిలయెన్స్ కంపెనీ కోసం రంగారెడ్డి జిల్లాలో కందుకూరు మండలమో, ఇంకొక మండలమో ఖాళీ చేయించి ఇచ్చేస్తే హైదరాబాద్ సమీపంలో ఒక మండలం ప్రజలు నిర్వాసితులవుతారు. కాకినాడ దగ్గర స్పెషల్ ఎకనమిక్ జోన్ కోసం దేశంలోనే ఎక్కడా లేనంత పెద్ద భూభాగాన్ని ఖాళీ చేయిస్తున్నారు.

దేశంలో ప్రజలకు ఆవాసహక్కు ఉందా? ఉన్నా లేకున్నా పునరావాస హక్కు ఉందా? ఏదో ఒకరకంగా ప్రకృతి నుండి ఉపాధి పొంది బతుకుతున్న వాళ్లను దేశ అభివృద్ధి కోసం అక్కడి నుండి లేపేస్తే, వేరే ఎక్కడయినా ఆ మేరకయినా ఉపాధి పొందే అవకాశం వారికొక హక్కుగా ఉంటుందా? ఈ ప్రశ్నలన్నిటికీ లేదు, లేదని న్యాయస్థానాలు జవాబు చెప్తున్నాయి. ఒక చట్టాన్ని తీసుకురాకుండా ఈ హక్కులు రావు మరి. దాని గురించి కనీస ఆలోచన చేయకుండా 10 శాతం అభివృద్ధి రేటు ఉన్మాదంలో పడి ఎన్నాళ్లు కొట్టుకుపోతాం? దారి పొడవునా ఎన్ని ప్రాణాలు తర్పణ చేస్తాం?

**ప్రజాతంత్ర వారపత్రిక**
**8 ఏప్రిల్ 2006**

# మధ్యతరగతి మందహాసం.. లక్ష కారు...!

**'ల**క్ష రూపాయల కారు' ఉత్పత్తి చేయాలన్న ఆరాటం ఎందుకు కలిగిందని వివరిస్తూ కార్లు కేవలం పట్టణ ప్రాంత వాసుల వాహనంగా ఉండిపోకుండా పల్లె జనానికి కూడ అందుబాట్లోకి రావడం తన లక్ష్యం అని రతన్ టాటా అన్నారంట.

రాజకీయాలు అందరికీ ఒంటబట్టాయని దీనిని బట్టి అర్థం అవుతుంది. కార్లున్న పల్లెవాసులు లేకపోలేదన్న సత్యం వారికి తెలీదా అన్న ప్రశ్న కొంచెం సేపు పక్కన పెడదాం. పల్లెలో ఒక కాలు, పట్నంలో ఒక కాలు పెట్టి బతికే వర్గం పెద్దదే భారతదేశంలో. వారికి కార్లున్నాయి, అవి పల్లెలలోనూ దర్శనం ఇస్తుంటాయి. 'ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన' ఫలితంగా కార్లు ప్రయాణించగల రోడ్లు పల్లె సీమలలో వెలుస్తున్నాయి కూడ. ఈ రెండు కాళ్ల వర్గం కాక ఒంటికాలి మీద కేవలం పల్లెల్లోనే బతికే వర్గం లక్ష రూపాయలకే ఇచ్చినా కార్లు కొనగలరా అన్న సందేహం ఎవరికైనా రాకమానదు. కేవలం రైతయిన మానవుడు ప్రతీ ఒక్కడూ లక్షల రూపాయల అప్పులలో మునిగి ఉన్నాడు. ఇంకొక లక్ష, లక్షన్నరో అప్పు చేసి టాటావారి చిన్న కారు కొని అర్ధరాత్రి కరెంటు వచ్చిందా లేదా చూడడానికి బోరు బావి కాడికి పోయిరావాలా, నిన్న కొట్టిన మందుకు పురుగు చచ్చిందా లేదా చూడడానికి పత్తిచేని కాడికి పోయి రావాలా?

రతన్ టాటా దృష్టి స్కూటర్లు, మోటర్ సైకిళ్లు నడిపే వాళ్ల మీద ఉందనేది స్పష్టమే. అర్ధ లక్ష పెట్టి ఈ బండ్లు కొనుక్కుంటున్న వాళ్లు లక్షో, లక్షా ముప్పైవేలో పెట్టి టాటా కారు కొంటారని ఆశ. కొనే వాళ్లుంటారు. కారు ఉన్నవాడే మనిషి అన్న వైఖరి మధ్యతరగతిలో చాలా పెరిగింది. 'అవసరం' అంటారా, అది మనం అనుకునే దాన్ని బట్టి ఉంటుంది. కొనేవాళ్లకు ఆత్మ సంతృప్తి, అమ్మేవాడికి లాభం, ఆ పైన అతి చవక కారు తయారు చేసిన ప్రతిష్ఠ వస్తే మనకేం కష్టం అంటారేమో.

విచిత్రం ఏమిటంటే తెలుగు మీడియా కాకున్నా ఇంగ్లీష్ మీడియా ఈ మధ్య 'వాతావరణ మార్పు' గురించి చాలా రాస్తున్నది, చర్చ చేస్తున్నది. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ వంటి 'గ్రీన్ హౌస్' వాయువుల పరిమాణం పెరిగిపోవడం వల్ల సగటు ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయనీ, దీని వల్ల విపరీత పరిణామాలు ఉండగలవనీ అంటున్నారు. ధ్రువ ప్రాంతాలలో మంచు కరిగి పోతున్నదనీ, హిమాలయాలలోనూ అంతేననీ, రాబోయే దశాబ్దాలలో వరదలు, తుఫానులు, ఆపైన నీటి ఎద్దడి, క్షామం రాగలవనీ చెప్తున్నారు. ఇది ఎప్పుడో భవిష్యత్తులో జరగబోయే విషయం కాదనీ, సమీప భవిష్యత్తులో మానవ జాతి చూడబోయే విపత్తు అనీ హెచ్చరిస్తున్నారు. చిన్నప్పుడెప్పుడో యుగాంతంలో ప్రళయాలు వస్తాయన్న పుక్కిటి పురాణం విన్నాం. అది నిజం కాబోతుందని ఇప్పుడు వాతావరణవేత్తలు అంటున్నారు. అది జరగకుండ ఉండాలంటే 'గ్రీన్‌హౌస్' వాయువుల ఉత్పత్తిని వేగంగా తగ్గించాలని చెప్తున్నారు.

ఈ విపత్తుకు ప్రధాన హేతువు పెట్రోలియం ఇంధనాలని కూడ శాస్త్రవేత్తలు ఏకగ్రీవంగా అంటున్నారు. పెట్రోల్, డీజిల్‌ల వినియోగాన్ని వేగంగా తగ్గించడం తప్ప మానవ నాగరికత ఉనికిని కాపాడుకోడానికి వేరే మార్గం లేదని అందరూ అంటున్నారు. ఇంటికి రెండు కార్లుండే పాశ్చాత్య నాగరికత తన రూపురేఖలు మార్చుకొని వీలయిన మేరకు అందరూ బస్సులు, రైళ్ల వంటి పబ్లిక్ రవాణా సదుపాయాలను వాడుకోవడం నేర్చుకోవాలని అంటున్నారు. కొన్ని పాశ్చాత్య దేశాలు ఈ విషయంలో విజ్ఞత ప్రదర్శిస్తుండగా, సమస్యకు ప్రధాన కారణమైన అమెరికా ఇప్పటి దాకా ససేమిరా అంటున్నది. ప్రధానంగా అమెరికాను ఒప్పించడం కోసమే ఇండోనేషియాలోని బాలి ద్వీపంలో ఈ మధ్య ప్రపంచ దేశాల సదస్సు కూడ జరిగింది. అమెరికా తదితర పాశ్చాత్య దేశాలు సమస్య తీవ్రతను అర్థం చేసుకోకపోవడం అన్న సమస్య ఒకపక్క ఉండగా, ఇంధనాలను విపరీతంగా వినియోగించే నమూనాలో వేగంగా అభివృద్ధి సాధించే దిశగా చైనా, ఇండియా పురోగమిస్తుండడం అందరికీ ఆందోళన కలిగిస్తున్నది.

ఈ తరుణంలో 'అందరికీ అందుబాట్లో ఉండే చిన్నకారు' ప్రతిపాదనను ఆహ్వానించడమే విడ్డూరం. రేపు 'టాటా కారు' కొనబోయే వారు అది లేకపోతే స్కూటర్లు, మోటర్ సైకిళ్లు కొనే బాపతే అయి వుండబోతారు కాబట్టి ఇంధనం వాడకం ఆ మేరకు ఎంతలేదన్నా మూడు రెట్లు పెరగబోతుంది. అయినప్పటికీ ఖరీదైన జీవనశైలి పట్ల ఇండియన్ మధ్యతరగతికి ఉండే మోజు ఎంతటిదంటే రతన్ టాటాకు అందరి మెచ్చుకోలూ లభించింది. వాతావరణంపైన వారి చవక

కారు ప్రభావం ఏ విధంగా ఉండబోతుందన్న ప్రశ్న వేసుకోకుండ అందరూ జాగ్రత్త పడ్డారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల గురించి సంపాదకీయాలు రాసి బాలి ద్వీపంలో జరిగిన సమావేశానికి హితోపదేశం ఇచ్చిన పత్రికలు కూడ ఆ సందర్భాన్ని ప్రస్తావించకుండ రతన్ టాటా ప్రయత్నాన్ని అభినందించాయి.

భారత మధ్యతరగతికీ ధనిక వర్గానికీ పట్టుకున్న ఈ 'అభివృద్ధి' కాంక్ష దేశానికి, దేశంలోని బడుగు ప్రజానీకానికీ అనేక రకాలుగా తీవ్రంగా నష్టకరమైనది. ఈ కాంక్షే పాశ్చాత్య బహుళ జాతి పెట్టుబడికీ, రిలయన్స్ జిందాల్ టాటా కుటుంబాలకూ, వారి తాత్విక చింతన అయిన నయా ఉదారవాదానికీ తలుపులు తెరిచింది. ఈ కాంక్షను 'సామ్రాజ్యవాద సంస్కృతి' అంటూ తరచుగా నిందించడం జరుగుతుంటుంది. తప్పును సామ్రాజ్య వాదం మీదికి నెట్టడం వల్ల శత్రువును బయట చూస్తున్నాం. 'సామ్రాజ్యవాదం' అని పిలవబడే ఆధిపత్య శక్తికి భారతదేశపు మధ్యతరగతి, ధనిక వర్గాల మార్కెట్ అత్యంత ఆకర్షణీయమైన దనడంలో సందేహమేమీ లేదు. దీనిని తనవైపు ఆకర్షించుకోవడానికి, అందులో ప్రవేశం దక్కించుకోవడానికి అది అనేక రకాల ఎత్తుగడలు వేస్తున్న సంగతీ నిస్సందేహమే. అయినప్పటికీ ఇక్కడి 'కలవారికి' ఖరీదయిన పాశ్చాత్య జీవనశైలి పట్ల తీవ్రమైన ఆకర్షణ లేకపోతే అవేవీ పారేవి కావు. (ఇది భౌతిక శక్తుల కంటే భావాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే భావవాదం అని మార్క్సిస్టు మిత్రులు ఆందోళన చెందనక్కరలేదు. ఆ మాటలను సరిగ్గా అర్థం చేసుకుంటే ఇది భౌతిక వాదమే.)

ఈ కాంక్ష ఇప్పుడు జరుగుతున్న చాలా చర్చలకు నేపథ్యంగా ఉంది. 9 లేక 10 శాతం వార్షిక వృద్ధి రేటు ఎందుకు కావాలి? నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం కోసం అని బుకాయిస్తారు. కాని ఇప్పుడు వేగంగా వృద్ధి సాధించగల సాంకేతిక ప్రక్రియలు ఉద్యోగాలు కల్పించేవి కావు. కొద్దిమందికి కాంతులీనే జీవన సరళి అందిస్తుందన్న ఆశ అసలు కారణం. దీని కోసం వనరుల కేంద్రీకరణనూ పర్యావరణ విధ్వంసాన్నీ లక్షలాది ప్రజల విస్థాపననూ ఉపేక్షించడమే కాక, వాటి గురించి మాట్లాడేవారి నోళ్లు దబాయించి మూయించే ప్రయత్నం పెద్దఎత్తున జరుగుతున్నది. కమ్యూనిస్టు సిద్ధాంతాలు పాతచింతకాయ పచ్చడి అని 'మూతిమీద మీసంలేని' సంపన్న యువకిశోరాలు ఎందుకంటున్నారు? ఆ సిద్ధాంతాలనూ, వాటి మంచి చెడులనూ అధ్యయనం చేసినందువల్ల కాదు. ఆ సిద్ధాంతాలలోని మంచి లక్షణాలు సంపద కేంద్రీకరణకూ, విలాసవంతమైన జీవన శైలిని ఘనమైనదిగా కీర్తించే ఆలోచనారీతికీ ఆటంకం కాబట్టి. అణు సాంకేతిక పరిజ్ఞానాన్నీ పరికరాలనూ


నిర్విమర్శగా స్వాగతించే పోకడ ఎందుకు పెరిగింది? కాలుష్య కారకమని పేరుపడ్డ థర్మల్ విద్యుత్తుకూ, విధ్వంసకమని పేరుపడ్డ జలవిద్యుత్తుకూ, ఆచరణ సాధ్యం  కాదని అటకెక్కించిన సౌర, వాయు విద్యుత్తుకూ ప్రత్యామ్నాయంగా అణు విద్యుత్తును ఎందుకు ప్రచారంలో పెడుతున్నారు? అది కాలుష్య కారకం కాదా, విధ్వంసకం కాదా అని చాలా పరిశోధన జరిపి ఆ సందేహాలకు ఆధారం లేదని తేల్చినందువల్ల కాదు. అది తక్కువ ఇంధనంతో ఎక్కువ విద్యుత్తును ఉత్పత్తి చేసి వేగవంతమైన వృద్ధి రేటుకు దోహదం చేస్తుందని; పైకి చూడడానికి కాలుష్యంగానీ వాతావరణ విధ్వంసంగానీ కనిపించవు కాబట్టి 'అభివృద్ధిని' ఇబ్బందుల్లేకుండా తెచ్చేస్తుందని. అందుకే, దీర్ఘకాల పరిధిలో చూసినప్పుడు అణువిద్యుత్తు చాలా హానికరమనీ, విధ్వంసకమనీ, ఖర్చుతో కూడుకున్నదనీ చెప్పేవారి నోర్లు దబాయించి నొక్కేసి అణుస్తోత్రం చేస్తున్నారు. వామపక్షాలు భారత అమెరికా అణు ఒప్పందాన్ని చాలా తటపటాయిస్తూనే వ్యతిరేకిస్తున్నప్పటికీ ఆ మాత్రం వ్యతిరేకతను సహితం సహించలేకుండ ఉన్నారు.

పాతరాతి యుగంలోకి పోదామని కాదు. పోనక్కరలేదు. పర్యావరణాన్నీ భావితరాల బాగోగులనూ గౌరవిస్తూ, అందరూ అనుభవించగల పరిమాణంలో భౌతిక నాగరికతను అభివృద్ధి చేసుకుందాం, అక్కడ ఆపేద్దాం. అమెరికా వంటి దేశాల తలసరి వినియోగం ప్రపంచంలో అందరూ పొందాలంటే ఈ నేల, గాలి, నదీనదాలు, సముద్రాలు తట్టుకోలేవు. ప్రతి పాశ్చాత్య దేశానికి చెందిన ధనిక వర్గాలు దాని కోసం ఆరాటపడడంతో పాటు ఆ దేశాల మధ్యతరగతి సహితం పైకి ఎగబాకాలని చూడడం, భారత్, చైనా, బ్రెజిల్ వంటి 'అభివృద్ధి చెందుతున్న' దేశాల ధనిక, మధ్యతరగతులు సైతం అదే లక్ష్యం పెట్టుకోవడం, అమెరికా పాలకులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ప్రజల జీవన ప్రమాణాన్నీ శైలినీ తగ్గించుకునేది లేదని మొండికేయడం, మనవారు 'మాదేముంది – అమెరికాతో పోలిస్తే వందలో ఒకటి కూడ కాదే' అని దాటవేయడం – దీనితో మానవ జాతికి అసాధ్యమయిన స్థితి దాపురించింది. వినియోగం తప్ప వేరే మతం, రాజకీయం, కళ తెలియని వాళ్లు తమ ఆలోచనలు మార్చుకోరు గానీ ఆలోచించగల వాళ్లయినా మాట్లాడకపోతే ఎట్లా?

**ప్రజాతంత్ర వారపత్రిక**

**20 జనవరి 2008**

# 'ఐటి' భావజాలం తొలగిపోయేనా?



ఒక పారిశ్రామిక సంస్థ వ్యవహారాలు సంక్షోభంలో పడితే అందులో పనిచేసే ఉద్యోగులేమయిపోతారో అని మన పాలకులు ఆందోళన చెందడం మొదటిసారి చూస్తున్నాం. అందుకే చాలా ముచ్చటేస్తుంది. రామలింగరాజు తన పాపాన్ని పబ్లిగ్గా కడిగేసుకున్న క్షణం నుంచి 53 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తు ఏమిటి అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు, మీడియా ఏకకంఠంతో ఆదుర్దా వ్యక్తం చేస్తున్నాయి. వీటి మధ్య ఇంతటి ఏకాభిప్రాయం ఈ మధ్య కాలంలో ఎప్పుడూ చూడలేదు.

సింగరేణి బొగ్గుగనుల కంపెనీ తనను తాను సంక్షోభం నుంచి బయటపడవేసుకోవడానికని చెప్పి ఉద్యోగుల సంఖ్యను ఒక దశాబ్దకాలంలో దాదాపు 40 వేలు తగ్గించింది. తగ్గించకుండ సంస్థను సంక్షోభం నుంచి బయటపడేయడం సాధ్యమేనన్న సూచనలేవీ ఆ కంపెనీ యాజమాన్యం పట్టించుకోలేదు. దాని వాటాదారులయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలూ పట్టించుకోలేదు. వేల సంఖ్యలో కార్మికులను వినియోగించిన గుంతకల్ స్పిన్నింగ్ మిల్లు, వరంగల్‌లోని అజంజాహీ బట్టల మిల్లు, హైదరాబాద్‌లోని ఆల్విన్, భెల్, బిడిఎల్, హెచ్ఎంటి, ఐడిపిఎల్, ఇసిఐఎల్, ప్రాగాటూల్స్, హిందుస్తాన్ కేబుల్స్ ఫ్యాక్టరీలు, కర్నూలులోని రాయలసీమ పేపర్ మిల్లు, రామగుండంలోని ఎఫ్‌సిఐ ఎరువుల కర్మాగారం, శ్రీకాకుళంలోని ఆముదాలవలస సహకార చక్కెర మిల్లు, నిజాం షుగర్స్ వారి హిందూపురం, మిర్యాలగూడెం యూనిట్లు, మంగళగిరి, మంచిర్యాల లోని ఎసిపి వారి సిమెంటు కంపెనీలు, గుంతకల్‌లోని రైల్వే స్లీపర్ ఫ్యాక్టరీ, ఆదోని, యెమ్మిగనూర్లలోని స్పిన్నింగ్ మిల్లులు, ఇంకా వెనక్కి పోతే కాగజ్‌నగర్‌లోని సర్‌సిల్క్ ఫ్యాక్టరీ, గాజువాకలోని మేస్ ఎలక్ట్రానిక్స్ సంస్థ, రామగుండం దగ్గరి అంతర్గాం స్పిన్నింగ్ మిల్లు (ఇది పెద్ద జాబితాయే –

ఎవరినయినా ఏమరుపాటున మరచివుంటే క్షమించండి) మూతబడి - లేక ఉత్పత్తిని కేవలం 10 శాతానికి కుదించి - ఆ సంస్థలలో పనిచేసిన కార్మికులందరినీ వీధిపాలు చేసినప్పుడు మాబోటి వాళ్లం కొందరం ఇవ్వాళ పెద్ద మనుషులందరూ అంటున్న మాటలే అన్నాం. ఆయా సంస్థల యాజమాన్యాల వైఫల్యము, దగుల్బాజీతనమే తప్ప మార్కెట్ లోటుగానీ సాంకేతిక సామర్థ్యం లోటుగానీ లేదనీ ప్రభుత్వమైనా మరొక యాజమాన్యమైనా సంస్థను చేతిలోకి తీసుకొని పునరుద్ధరించే ప్రయత్నం చేస్తే వేలాది కార్మిక కుటుంబాలకు తిండిపెట్టిన వారవుతారనీ అన్నాం. వివరంగా పుస్తకాలు ప్రచురించాం. ఆ అభిప్రాయం ఒకటి రెండు సంస్థల విషయంలో అవాస్తవికం అయి ఉండవచ్చునేమోగానీ చాలావరకు వాస్తవికమైనదే. కానీ ఆ రోజు విన్నవారు లేరు. ఎంతవరకు వాస్తవమో ఎంతవరకు కాదో వివేచించి జవాబు చెప్పిన వారూ లేరు. ఇది తెలుగుదేశం హయాంలోనూ జరిగింది, కాంగ్రెస్ హయాంలోనూ జరిగింది అని గుర్తుచేయడం ఉచితంగా ఉంటుంది.

వాస్తవమా అవాస్తవమా అన్నది అసందర్భమైన ప్రశ్న. యాజమాన్యం ఘనకార్యాల వల్ల మునుగుతున్న సంస్థను కాపాడాలా లేదా అన్నదానికి ప్రమాణం వాస్తవికతా పరిశీలన కాదు. ఆనాడు మూతపడ్డ సంస్థలు 'అభివృద్ధి' ముద్దుబిడ్డలు కావు. ఇండియాను 'వెలిగిస్తున్న' పారిశ్రామికరంగాలకు చెందినవి కావు. కాకపోగా ఇండియా వెలగకుండ ఉండిపోవడానికి ఆ పారిశ్రామిక ప్రయోగాలే కారణం అన్న భావజాలం బలంగా వేళ్లూని ఉండింది. నిజానికి వాటి మూసివేతకు లాభనష్టాలు, యోగ్యత అయోగ్యతల కంటే ఈ భావజాలమే ప్రధాన కారణం. ఎక్కువమంది కార్మికులను వినియోగించే శ్రమ ప్రధానమైన (లేబర్ ఇంటెన్సివ్) పరిశ్రమలు, ముడిసరుకు ఉత్పత్తిదారులను భాగస్వాములను చేసే సహకారరంగ పరిశ్రమలు, లాభసాటి అయిన ఉత్పత్తి రంగంలోకి అనవసరంగా తలదూర్చిన ప్రభుత్వరంగ సంస్థలు, స్థానిక ముడిసరుకును ప్రయోగాత్మకంగా వినియోగించడం ద్వారా ప్రాంతీయ సమతుల్యాన్ని పెంపొందించే ప్రయత్నం చేసిన సంస్థలు, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ఉద్దేశ్యపూర్వకంగా నెలకొల్పిన సంస్థలు, ఇవన్నీ వామపక్ష పిడివాదానికి తార్కాణాలనీ, వీటిలో సంక్షోభం పొడచూపిన క్షణం మూసివేయాలనీ, అప్పుడే 'వెలుగొందే' ఇండియా మొలకెత్తుతుందని భావించి వాటిని ఒక్కొక్కటిగా మూసేశారు, మూతపడనిచ్చారు.

ఈ వెలుగులో 'నాలెడ్జ్ ఇండస్ట్రీ'ది కేంద్రస్థానం అన్నారు. నాలెడ్జ్ లేని ఇండస్ట్రీ ఎక్కడుండిందో, జ్ఞానం తనంతట తాను (ఒక వినియోగ వస్తువుకు

దారితీయకుండ) పరిశ్రమ ఎట్లా అవుతుందో వివరించే ప్రయత్నం చేయకుండ 'నాలెడ్జ్ ఇండస్ట్రీ' గురించి ఊదరగొట్టారు. దాని నిర్వాహకులయిన రామలింగరాజులూ నారాయణమూర్తులూ నవీనయుగ వైతాళికులన్నారు. వాళ్లసలు మానవమాత్రులే కారన్నారు. వాళ్లు ఉత్పత్తి చేసేది శుద్ధ జ్ఞానమనే అనుకున్నా, వారు దానితో వ్యాపారం చేస్తున్నారు కదా, వ్యాపారం అన్నాక తప్పుడు లెక్కలూ దాచిపెట్టే ఖాతాలూ ఉండకపోవు కదా అన్న సందేహం వచ్చినవారు తమంతటతామే సిగ్గుతో కుంచించుకు పోయేంతగా వారిని ఆకాశానికెత్తేశారు. ఈ 'జ్ఞాన పరిశ్రమ'లో శ్రమించేవారు ఇనప పనిముట్లతో పనిచేసే మొరటు మనుషులు కాకపోవడం, మల్లెపువ్వుల వంటి పిల్లలు కావటం ఈ ఇమేజ్‌ను పెంచింది.

ఈ మల్లెపూవులు వాడిపోతాయేమోనని ఇప్పుడందరికీ ఒకటే ఆదుర్దా. అవేం వాడిపోవు. నెలకు 50 వేల జీతం నుంచి 10 వేలకు దిగివచ్చి నాలుగు రోజులు భువిమీద సంచరించడం మాత్రమే జరుగుతుంది. ఏదో ఒక ఉపాధి వారికి ఎప్పటికీ దొరకకుండ పోదు. ఎవ్వరూ ఇవ్వకపోతే స్వంత సంస్థలు పెట్టుకునే అవకాశమూ లేకపోలేదు. ఈ తాత్కాలిక సంక్షోభం వారి మానసిక ఆరోగ్యానికీ సమాజం మానసిక ఆరోగ్యానికీ కూడ మంచిదే. అందుకు రామలింగరాజుకు కృతజ్ఞులం.

కానీ నిజానికి వారి పేరు మీద వ్యక్తమవుతున్న ఆందోళనంతా వారి గురించేనా అన్న సందేహమూ వస్తున్నది. 'సత్యం' సిబ్బంది వేరే ఏ సాఫ్ట్‌వేర్ సంస్థలోనయినా ఉద్యోగాల కోసం ప్రయత్నం చేస్తే వారికెవ్వరూ ఉద్యోగాలు ఇయ్యవద్దని – అంటే వారు ఆ సంస్థను అంటిపెట్టుకొని ఉండి దాని పునరుద్ధరణకు దారి సుగమం చేయాలని – సాఫ్ట్‌వేర్ సంస్థల జాతీయ కూటమి (నాస్కాం) ఇతర ఐటి రంగ సంస్థలకు సందేశం పంపినట్టు వచ్చిన వార్తలను వారు నిర్ద్వంద్వంగా ఖండించలేదు. పైగా, ఇతర ఐటి సంస్థలు ఆ నిర్ణయం తీసుకుంటే మంచిదే కదా అని నాస్కాం పెద్దలు కొంటెగా సమర్థించుకోవడమూ జరిగింది.

ఐటి రంగంలో ఒక ఉన్నతస్థాయి ఆర్థిక వ్యవస్థగా భారత్ పొందిన గుర్తింపునూ తద్వారా ఆ మార్కెట్‌లో లభించిన చోటునూ పోగొట్టుకోకూడదని మనవారి పట్టుదల. అది 'సత్యం' సంస్థనూ అందులోని ఉపాధినీ కాపాడడానికి కావలసిన ప్రోద్బలం ఇస్తున్నది. కాపాడవద్దని ఎవరూ అనరు గానీ దానికోసం

ఏయే విషయాలలో రాజీపడబోతారో ఎవరి చేతిలో ఏం పెట్టబోతారో చూడవలసివుంది. 'ఎట్లాగైనా కాపాడాలి' అన్న ఆరాటం అక్రమాలకు కవచం కాగలదు. కాగా ఇప్పటికైనా ఐటి రంగాన్ని ఆవరించిన కృత్రిమ భావజాలం శాశ్వతంగా తొలగిపోతుందని ఆశిద్దాం. అదొక పరిశ్రమ. కొన్ని వనరులు తీసుకుంటుంది. కొన్ని ఉత్పత్తులు ఇస్తుంది. కొంత ఉపాధి కల్పిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో అన్ని పరిశ్రమలూ వ్యాపారమే కాబట్టి అదొక వ్యాపారం కూడ. దానిని సమాజ సేవగానో కేవలం వైజ్ఞానిక కృషిగానో భ్రమించి ఇక్కడ కూడ కుంభకోణాలా అని ఆశ్చర్యపోనక్కరలేదు. ఎక్కడ వ్యాపారముంటే అక్కడ కుంభకోణాలుంటాయి. అంతకంటే ముఖ్యంగా ఈ ఐటి పరిశ్రమ ఏ ఉత్పత్తులు ఇస్తుంది, ఎవరికి ఉత్పత్తులు ఇస్తుంది, ఎంత ఉపాధి కల్పిస్తుంది, సమాజం నుంచి ఎన్ని వనరులు కోరుకుంటుంది అని చూడడం అవసరం. ఖరీదయిన ఐటి రంగం కల్పించిన ఖరీదయిన జీవన విధానం ఆర్థిక వ్యవస్థనే కాదు, మధ్యతరగతి ఎకానమీని కూడ ఎంతగా వక్రీకరించిందో చూడడం అవసరం. ఐటి రంగానికి ధారాదత్తం చేసిన భూములు ఎవరికి భూములు లేకుండ చేశాయో, వారికి ఇచ్చిన ప్రాముఖ్యం ఏ ప్రాధాన్యతలను కత్తిరించి వేసిందో ఆలోచించడం అవసరం. ఉపాధి కోసం ఎదురుచూస్తున్న కోట్లాది యువకులకు ఏ రకంగానూ సంబంధంలేని ఈ రంగాన్ని ఆకాశం నుంచి నేలమీదకు దించి దాని పరిమితికి తగిన స్థానంలో దానిని ఉంచడం అవసరం.

**ఆంధ్రజ్యోతి దినపత్రిక**
**14 జనవరి 2009**

# ప్రజాస్వామ్యానికి 'తాయిలాల' తెగులు

ఎన్నికల కోసం పార్టీలు ఇస్తున్న హామీలు చూసిన ప్రజలకు ఈపాటికి ఒక ఆలోచన వచ్చి ఉండాలి. వీళ్లలో ఏ ఒక్కరిని గెలిపించినా ఉచిత వసతులు కొన్ని మాత్రమే వస్తాయి. ఒకరిని గెలిపిస్తే కలర్ టివి, పనిచేయకుండా నెల జీతం వస్తాయి. ఒకరిని గెలిపిస్తే మొబైల్ ఫోను, చవకగా ల్యాప్‌టాప్ వస్తాయి. ఒకరిని గెలిపిస్తే వంద రూపాయలకే కనీస అవసరాలు తీరుతాయి. ఒకరిని మాత్రమే గెలిపించి మిగిలినవన్నీ పోగొట్టుకోవడం ఎందుకు? అందరినీ గెలిపించే మార్గం ఏదీ లేదా? కాని ఎన్నికల సంస్కర్తలేమో 'ఈ అభ్యర్థులెవరూ నాకు వద్దు' అని వోటు కాగితం మీద సూచించే ఏర్పాటు ఉండాలని ప్రతిపాదిస్తున్నారు. అది ప్రజాస్వామ్యాన్ని పెంపొందిస్తుందని భావిస్తున్నారు. వాళ్లవి పాతబడ్డ ఆలోచనలు. ప్రజాస్వామ్యం ఎవరికి కావాలి - కలర్ టీవీలు, బారణాకు రెండు కిలోల బియ్యం, మొబైల్ ఫోన్‌లు, ఉచిత వేతనం వగైరాలు వచ్చేటట్టయితే. కాబట్టి వోటర్లకు ఇయ్యవలసింది 'ఈ అభ్యర్థులందరూ నాకు కావాలి' అని బ్యాలెట్ పేపర్‌పైన సూచించే ఏర్పాటు.

మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలప్పుడు యూరవ్‌లోని కొన్ని ప్రజాస్వామ్యాలలో అన్ని పార్టీలూ కలిసి 'జాతీయ ప్రభుత్వాలు' ఏర్పాటు చేసిన సందర్భాలున్నాయి. అధికారం కోసం పార్టీలు పోటీపడడం యుద్ధ సమయంలో మంచిది కాదన్న భావన నుండి ఇది పుట్టింది. అయితే యుద్ధమొచ్చే దాకా ఆగడం ఎందుకు? ప్రజల శ్రేయస్సు కోసం అదే పని ఇప్పుడే ఎందుకు చేయకూడదు? తెలుగు జాతీయ ప్రభుత్వం ఏర్పాటుచేసి సంవత్సరన్నర పాటు రాజశేఖరరెడ్డి లేక డి.శ్రీనివాస్, సంవత్సరన్నర పాటు చంద్రబాబు లేక కేసిఆర్, ఇంకో సంవత్సరన్నరపాటు చిరంజీవి లేక అతని కుటుంబ సభ్యులలో ఒకరు

ముఖ్యమంత్రులుగా ఉండి, మిగిలిన ఆరునెలలు రాష్ట్రపతి పాలన పెట్టుకొని ఈ అయిదేళ్ళలో వచ్చే సివిల్ కాంట్రాక్టులను అందరూ సమంగా పంచుకోవాలని (అసలు గొడవ అదే కాబట్టి) అంగీకరిస్తే ప్రజలు చాలా సౌఖ్యాలు పొందరా?

అయితే, ఆలోచనాపరులయిన ప్రజలకు ఒక సందేహం వచ్చే ఉంటుంది. వీళ్లిస్తున్న హామీలకు పైసలు ఎక్కడ నుండి వస్తాయి.? చిన్న పైసలు కాదు, వేల కోట్లు కావాలి. చంద్రబాబు ఇస్తున్న హామీలకు రాష్ట్ర బడ్జెట్ చాలదు, దేశ బడ్జెట్ కావాలని రోశయ్య ఎద్దేవా చేశారు. అది వారి పార్టీకీ వర్తిస్తుంది. వారి అభిమాన నాయకులు అపారమైన కరెంటు అనంతంగా ఉచితంగా దొరకబోతుందన్నట్లు తెలంగాణలోనూ, రాయలసీమలోనూ ఎడాపెడా కట్టేస్తున్న భారీ ఎత్తిపోతల ప్రాజెక్టులన్నీ పూర్తయి ఆ కరెంటు ఖర్చు ప్రభుత్వం భరించి రైతులకిచ్చే రోజు వచ్చినప్పుడు ఈ రాష్ట్ర బడ్జెట్ వారికీ చాలదు.

అయితే ఇది నవ్వుకునే విషయం కాదు. ఎన్నికల ప్రచారంలో మనం వింటున్న ఉచిత హామీలన్నీ వారు ఇవ్వగలరు. అయితే దానికి దేనిని తాకట్టు పెడతారన్నది ఆందోళన చెందవలసిన విషయం. చాలా ఏళ్ల కింద మా మిత్రుడొకడు విజయవాడలో సూర్యారావుపేట మునిసిపల్ కౌన్సిలర్ పదవికి పోటీ చేస్తూ 'ఈ వార్డులో దోమలు లేకుండ చేస్తాను' అంటూ కరపత్రం వేసి పంచినప్పుడు ఒక్క వార్డులో దోమలు లేకుండ ఎట్లా చేస్తారని అతనిని అందరూ ఆటపట్టించారు. ఇవి అటువంటి అసాధ్యమైన హామీలు కావు. వీటి వెనుక ఒక విధానపరమైన ఆలోచన ఉంది. అది అన్ని పార్టీలకూ సామాన్యమైనది. అత్యంత దుర్మార్గమైనది.

రాష్ట్రంలోకి కార్పొరేట్ కంపెనీల పెట్టుబడులను భారీగా ఆహ్వానించాలి. పెట్టుబడులు పెట్టడానికి ప్రజల జీవిత వనరులయిన భూమి, నీరు, అడవులు, గాలి వారికి అప్పగించాలి. వనరులకు దూరమయి బతుకుతెరువు కోల్పోయిన ప్రజలకు ఇక్కడా అక్కడా పునరావాస కాలనీలు కట్టిచ్చి వారి కర్మకు వారిని వదిలేయాలి. ఈ క్రమంలో రాష్ట్రంలోకి వచ్చే పెట్టుబడులలో నాయకులు వారి వారి పద్ధతులలో వాటా పొందాలి. అదే సమయంలో ఈ వనరుల అప్పగింత నుండి ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో ప్రజల నోళ్లు మూయించే ఉచిత వసతులు వారి ముఖాన కొట్టాలి. అయితే ఆ ఉచితాలు ధనవంతుల వ్యాపారాలకు ఎక్కడా అడ్డం రాకూడదు.

ప్రజలకు నిజంగా ఉచితంగా కావలసింది విద్య, వైద్యం. ఆ రెండూ మాత్రం ఏ పార్టీ హామీల జాబితాలోను లేవు. ఎందుకంటే అవి రెండూ ఇప్పుడు రాష్ట్రంలో

పెద్ద వ్యాపారాలు, అన్ని పార్టీల ప్రముఖులకూ (సిపిఐ, సిపిఎంలతో సహా) ఈ వ్యాపారాలలో పెద్ద వాటా ఉంది.

వేరే ఏవీ ప్రజలకు ఉచితంగా ఇయ్యవద్దనీ, ఇస్తే ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుందనీ వాదించడం లేదు. మానవీయమైన జీవన ప్రమాణం మనుషులందరి హక్కు అనీ సమాన అభివృద్ధి అవకాశాలు అందరి హక్కు అనీ భావించేటప్పుడు అవి కొరవడిన మేరకు ప్రభుత్వం సబ్సిడీలు ఇవ్వడం అవసరం. కానీ ఆ జీవన ప్రమాణం అందుబాట్లో ఉండడానికి మొదటి అవసరం జీవనానికి అవసరమయిన వనరులు ప్రజలకు అందుబాట్లో ఉండడం. భూమి, నీరు తదితర ప్రకృతి వనరులు నాగరికత తొలినాటి నుండి ప్రజలకు జీవనాన్ని ఇచ్చాయి. వాటిని ప్రజలకోసం బాగుచేయడం ద్వారా ఆ జీవనాన్ని మెరుగుపరచడం ప్రజాస్వామికమైన అభివృద్ధి విధానం అవుతుంది. పరిశ్రమల కోసం, పారిశ్రామిక అవసరాల కోసం వాటిని తీసుకోవలసి వస్తే అది పరిమితంగానే జరగాలి. ఎక్కడికక్కడ దానివల్ల జీవనాన్ని కోల్పోయిన వారికి కేవలం నివాస కాలనీలే కాదు, జీవన పునరావాసం సమగ్రంగా కల్పించాలి. ఇటువంటి అభివృద్ధి నమూనానే పాటించినా ఎప్పటికప్పుడు ప్రజలకు అందే జీవన ప్రమాణంలో హెచ్చుతగ్గులుంటాయి. కాబట్టి చవక బియ్యం, చవక కరెంటు తదితరాల ఆవశ్యకత ఉంటుంది. అంతేకానీ జీవన వనరులన్నీ పెట్టుబడికి ధారాదత్తం చేసి నాయకులూ వారి పుత్రపౌత్ర గణం దాని గొడుగు కింద చేరి కోట్లు దండుకొని ప్రభుత్వానికి ఈ క్రమంలో వచ్చే క్రయ ఆదాయం నుండి, పన్నుల నుండి ప్రజలకు ఇదీ అదీ ఉచితంగా ఇచ్చి నోరు మూయించడం దుర్మార్గమైన ఆలోచన. ప్రతీరోజూ రోడ్ షోలలో ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్న ఈ పార్టీలన్నిటి ఉమ్మడి ఆలోచనా ఇదే.

ప్రజలకీ విషయాలు చూచాయగానయినా అర్థం కాకపోలేదు గానీ ఈ విమర్శను ప్రజాహిత రాజకీయాలలో భాగం చేయగలిగినట్టి రాజకీయ శక్తి ఏదీ రాష్ట్రంలో లేకుండ పోయింది. కమ్యూనిస్టు పార్టీలకు ఈ విషయం సులభంగానే అర్థం కావాలి గానీ వారి రాజకీయ అజెండా తమకున్న పిడికెడు సీట్లను కాపాడుకునే ఎత్తుగడల చుట్టూ తిరుగుతున్నది తప్ప వేరే దేనికీ అందులో ప్రాధాన్యం లేదు. పోనీ ఈ అజెండా ఎన్నికల సమయానికి పరిమితమైనదా అంటే కాదు. ఈ ఎన్నికలయిపోతే పంచాయితీ ఎన్నికలుంటాయి. మునిసిపాలిటీ ఎన్నికలుంటాయి. ఎక్కడికక్కడ 'ప్రాతినిధ్యాన్ని' కాపాడుకోవడానికి పాలకపార్టీలలో

ఒకరిని దుర్మార్గులుగా, ఒకరిని ప్రజానుకూలురుగా చూపించి సర్దుబాట్లు చేసుకునే ఆరాటంలో సూత్రబద్ధమైన రాజకీయాలకు చోటు కరువయ్యింది. షో కావాలంటే ఎర్రచొక్కాలు వేసుకుని టీవీ కెమెరాల ముందు అరగంట సేపు భూపోరాటాలు చేస్తే సరిపోతుందనే స్థాయికి వచ్చాయి వామపక్ష రాజకీయాలు.

**ప్రజాతంత్ర వారపత్రిక**
**22 మార్చి 2009**

# అదే పాలన, అదే విధ్వంసం

**ఓ**టర్ల విజ్ఞతను ప్రశ్నించకూడదనేది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని ఒక ముఖ్యమైన మర్యాద. 'ప్రజల తీర్పును శిరసావహిస్తున్నాను' అని ఓడిపోయిన అభ్యర్థులు అంటుంటారు. శిరసావహించక వాళ్లు చేయగలిగింది లేదుగానీ, 'నన్ను ఓడించి ప్రజలు తప్పు చేశారు' అనడం కొంచెం వికారంగా ఉండే మాటా వాస్తవమే. అయితే ఈ మర్యాదకు అంతకంటే అర్థమూ లేదు. వోటర్లుగా ప్రజలు తీసుకున్న నిర్ణయం రైతులుగానో కార్మికులుగానో విద్యార్థుల తల్లిదండ్రులుగానో మరొక అవతారంలోనో వారి శ్రేయస్సుకు నష్టకరమయితే ఆ మాట అనకుండ ఉండవలసిన అవసరం లేదు.

దేశానికి ప్రస్తుతం అస్థిరమైన పరిపాలన అవసరం కాగా కాంగ్రెస్ పార్టీకి స్థిరమైన అధికారం ఇచ్చి ప్రజలు పొరపాటు చేశారు. విశ్లేషకులంతా సుస్థిర ప్రభుత్వం కావాలంటుంటే నేను ఇట్లా అంటున్నానేమని ఆశ్చర్యపోవద్దు. పత్రికలు చదివి పత్రికలలో రాసేవారి అభిప్రాయాలను ప్రామాణికంగా తీసుకోవడం కంటే పొరపాటు లేదు. ఇవాళ సుస్థిర పరిపాలన అంటే గ్లోబలైజేషన్ తప్ప వేరే ఏమీ కాదు. స్థిరమైన అధికారం కాంగ్రెస్ పార్టీకే కాదు, ఎవరికిచ్చినా వారు చేయబోయేది ఇదే. అదనంగా వేరే మంచిపనులో చెడ్డపనులో చేస్తే చేయవచ్చు. బిజెపికి ఇస్తే తెలంగాణ ఇయ్యవచ్చు, ఇంకొన్ని చోట్ల ముస్లింలనో క్రిస్టియన్లనో చంపవచ్చు. థర్డ్ ఫ్రంట్‌కో ఫోర్త్ ఫ్రంట్‌కో ఇస్తే దళిత మహిళను ప్రధాని చేయవచ్చు. వేరే కొన్ని మంచి పనులేవయినా కూడ చేయవచ్చు. కానీ స్థిరమైన అధికారం ఎవరికిచ్చినా ప్రాథమికంగా చేసేది వేగవంతమైన అభివృద్ధి పేరిట ప్రపంచీకరణ. అంతకంటె అవగాహన ఎవరికీ లేదు. ఉన్నా స్వతంత్రత లేదు. స్వతంత్రత లేదంటే అర్థం ప్రపంచబ్యాంకో ప్రపంచ వాణిజ్య సంస్థో నెత్తిమీద కూర్చొని చేయిస్తాయని కాదు. నయా ఉదారవాదం కంటికి వికారంగా కనిపించే

పద్ధతులలో పని చేయదు. దాదాపు రెండు దశాబ్దాల కాలంలో ఒక ఆర్థిక విధాన చట్రాన్ని సకల దేశాల పాలకుల సహాయంతో ప్రపంచం మీద బిగించడం జరిగింది. దానిని తిరస్కరించే ఆలోచన ఎవరి దగ్గరా లేదు, సైద్ధాంతికంగా ఆ ఆలోచన ఉండవలసిన వామపక్ష పార్టీలకు అందుకు కావలసిన రాజకీయ ఆచరణ ఏ కోశానా లేదు.

కేంద్రంలో అస్థిరమైన కూటములు అధికారంలో ఉండడమొక్కటే మనల్ని కొంతమేరకయినా బతికించింది. ఇప్పుడు ఆ స్థితి పోవడం దురదృష్టకరం. పాశ్చాత్య దేశాలను కుదిపేస్తున్న ఆర్థిక మాంద్యం ప్రభావం మన మీద మరీ ఎక్కువ పడకపోవడానికి భారత ఆర్థిక వ్యవస్థ స్వతహాగా బలంగా ఉండడం కారణమనీ మన పాలకుల విజ్ఞత కారణమనీ మనకు చెప్తున్నారు గానీ అదేదీ కాదు. మన్మోహన్‌సింగ్, చిదంబరం బాపతు ఆర్థికవేత్తల విజ్ఞతకు స్వేచ్ఛ ఉండి ఉంటే దేశ ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో 'డీ రెగ్యులేషన్' ఇంకా చాలా దూరం పోయి ఉండేది. సంక్షోభం యావత్తు దిగుమతి అయివుండేది. వారికి దేశీయంగా ఆ స్వేచ్ఛ సంపూర్ణంగా లేకపోవడమే మనల్ని ఈ మేరకు కాపాడింది. ఇప్పుడా స్వేచ్ఛ లభించిందని మొన్నటి సోమవారం నాడు సెన్సెక్స్ ప్రకటించింది. దీని ఫలితాన్ని రాబోయే అయిదేళ్లలో అనుభవించబోతాం.

రాష్ట్రంలో రాజశేఖరరెడ్డికి స్వంతగా అధికారం ఇవ్వడమూ పెద్ద పొరపాటే. అతని పరిపాలనను 'అవినీతి'తో సమానం చేసి ఇతర విషయాలు చూడని చంద్రబాబు, రాజకీయ సమీకరణలలో భాగంగా సీట్లే కాదు, అవగాహన కూడ పంచుకోవాలని నమ్మే స్థితికి వచ్చిన వామపక్షాలు... అతని పాలనపైన పెట్టగల విమర్శను బలహీనం చేశారు. 'అవినీతి ఎట్లాగూ ఉండేదే, అభివృద్ధి చేస్తున్నాడు కదా' అనే అతి తెలివి సమాధానానికి వారి విమర్శ తావు ఇచ్చింది. అతను చేస్తున్న అభివృద్ధే విధ్వంసం అనే విమర్శ వినబడకుండ పోయింది. అసలే మనకు రాజకీయ సంవాదము అంటే రొద, చర్చ అంటే రచ్చ. దీనికి అవగాహనా లోపమూ తోడయి రాజశేఖరరెడ్డి పాలనను ఎందుకు వ్యతిరేకించాలన్న ప్రశ్నకు సరయిన సమాధానం ప్రజలకు వినిపించకుండానే ఎన్నికలు జరిగిపోయాయి.

ఆ విధ్వంసం జీవితాల విధ్వంసమే కాదు, విలువల విధ్వంసం కూడ. మొదటిదాని గురించి ఎంత ఆందోళన చెందుతామో రెండవ దాని గురించి కూడ అంతే చెందాలి గానీ 'విలువల విధ్వంసం రాజకీయాలలో కొత్తా, ఎవరు ధ్వంసం చేయలేదు' అన్న మరొక అతి తెలివి జవాబు దగ్గరే అదీ ఆగిపోయింది. రాజకీయ స్వార్థం, అవకాశవాదం చేసే విలువల విధ్వంసం వేరు, ఫాక్షనిస్టు చేసే విధ్వంసం

వేరు. కేవలం రాశిలోనే కాదు, గుణంలోనూ వేరు. నీ ప్రయోజనమే చూసుకుంటున్నావు నువ్వు అంటే ఫాక్షనిస్టు సిగ్గుపడడు, గర్వపడతాడు. అదేకదా చేయవలసింది అనుకుంటాడు. ఆ భావం రాజశేఖరరెడ్డి ముఖంలో తెలుగు ప్రజలు ఎన్నిసార్లు చూడలేదు? అధికార కార్యక్రమంలో నీ కొడుకును పక్కనెందుకు కూర్చోబెట్టుకున్నావు అని అడిగినా, రాష్ట్రంలో వివిధ జిల్లాలలో కొత్త విశ్వవిద్యాలయాలు ప్రకటించి నీ జిల్లాలోని యోగి వేమన విశ్వవిద్యాలయానికి మాత్రమే హుటాహుటిన నిధులు విడుదల చేయడం ఏం న్యాయం అని అడిగినా, పులివెందుల వైపుగా పోయేదయితే చాలు అది మేకలు తిరిగే రోడ్డయినా నాలుగు లేన్ల రహదారి నిర్మించడమేమిటని అడిగినా, కృష్ణా నదిపైన ఉన్న ఎనిమిది మిగులు జలాల ప్రాజెక్టులలోకీ నీ జిల్లాకు నీళ్లిచ్చే వాటి కోసమే ప్రత్యేకమైన నీటి భద్రత కల్పించుకోవడం ఏ రకంగా సబబని అడిగినా... అదే తిరస్కారం, అవే హావభావాలు.

అయిదేళ్ళు దీనిని అనుభవించాము. ఇంకొక అయిదేళ్ళు కూడ అనుభవించినట్టయితే ఆ తరువాత వచ్చే ముఖ్యమంత్రికి అనుసరించడానికి ఇవి తప్ప వేరే పాలనా ప్రమాణాలేవీ ఉండవు. ఇదే సహజమని భావించే స్థితికి రాష్ట్ర రాజకీయాలు చేరుకోగలవు. ఇది వినాశకరం. విలువలు, ప్రమాణాలు, ప్రజాస్వామ్యానికి ప్రాణం వంటివి. అవి నాశనం అయితే మిగిలేది డొల్లే. ఎన్నికలు, ఇతర ప్రజాస్వామ్య వ్యవస్థలు ఉన్నట్టే ఉంటాయిగానీ మిగిలేది ముఠాల పాలనే. దానినుంచి ఈ రాష్ట్రం కోలుకోవడానికి చాలాకాలం పడుతుంది. 'వోటర్లు' అనే వారికి సమిష్టిగా ఒక బుద్ధిని ఆపాదించేటట్టయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి స్వంతంగా అధికారం కట్టబెట్టి రాష్ట్రం నుంచి అత్యధిక సంఖ్యలో పార్లమెంటుకు సభ్యులను పంపటమే కాక, ఇక్కడి కాంగ్రెస్‌లో ఇతర ప్రముఖులు చాలామందిని ఓడగొట్టడం ద్వారా రాజశేఖరరెడ్డి బలాన్ని విపరీతంగా పెంచడంలో వోటర్లు బుద్ధిహీనతను ప్రదర్శించారని (క్షమాపణ కోరుతూ) అనవలసి ఉంటుంది.

తెలుగుదేశం పార్టీకి కూడ దాని పట్ల అభ్యంతరం లేని కారణంగా, వామపక్షాలకు స్వంత అజెండా లేని కారణంగా భౌతిక విధ్వంసానికి సంబంధించిన చర్చ ప్రధాన రాజకీయ సంవాదం నుంచి పక్కకు పోవడమే కాక దానికి వెలుపల కూడ దురదృష్టవశాత్తు విభిన్నంగా చీలి సాగుతున్నది. కోస్తాంధ్రలో ఇది అభివృద్ధేనేమోనన్న సందేహం, రాయలసీమలో మంచయినా చెడయినా 'మనవాడు' చేస్తున్నాడు కాబట్టి మాట్లాడకూడదేమోనన్న తటపటాయింపు, తెలంగాణలో ఇది ఆ ప్రాంతంపైన దాడి అన్న అవగాహన –

ఈ చర్చకూ, దానినుంచి పుట్టవలసిన వ్యతిరేకతకూ స్పష్టత లేకుండ చేస్తున్నాయి. ఇందులో మానవాళి మనుగడపైన కార్పొరేట్ ప్రయోజనాలు చేస్తున్న దాడే తప్ప నిజమయిన ఏ అర్థంలోనూ అభివృద్ధి లేదు, ఇది చేసేవాడు అంబానీకో జిందాల్‌కో రతన్ టాటాకో 'మనవాడు' అయి ఉండవచ్చును గానీ మనకెవరికీ మనవాడు కాదు. మనిషి పట్లనే తప్ప ఇందులో ఏ ప్రాంతం పట్లా, ఏ సమాజం పట్లా ప్రత్యేకమైన వివక్షా లేదు.

ఎన్నికల కారణంగా ఈ విధ్వంసానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. కాంగ్రెస్ గెలిచినా, తెలుగుదేశం కూటమి గెలిచినా, పూర్తి అధికారం రాకుండ ఏ ప్రజారాజ్యం మీదనో, స్వతంత్రుల మీదనో ఆధారపడిన అస్థిర ప్రభుత్వం నెలకొని వుంటే ఈ బ్రేక్ కొంతమేరకు కొనసాగే అవకాశం ఉండేదేమో. ఇప్పుడది లేదు. ఎన్నికలకు ముందు శ్రీకాకుళం రహదార్లలో తిరుగుతూ కోస్టల్ కారిడార్ అనేదేదీ లేదనీ, కేవలం రోడ్ల వెడల్పు కార్యక్రమం మాత్రమే తీసుకున్నామనీ రాజశేఖరరెడ్డి ఒక అబద్ధపు ప్రకటన చేశాడు. నిజానికి అప్పటికే గుంటూరు, ప్రకాశం జిల్లాల 'వాన్‌పిక్' ప్రాజెక్టు ప్రాంతంలో 'పారిశ్రామిక కారిడార్' కోసం అని స్పష్టంగా రాస్తూ భూసేకరణ నోటిఫికేషన్లు జారీచేసి ఉన్నారు. జీవో నెంబర్ 373 ద్వారా విశాఖపట్నం కేంద్రంగా ఒక స్పెషల్ డెవలప్‌మెంట్ అథారిటీని నెలకొల్పి 110 గ్రామాలను అభివృద్ధి కోసం దానికి అప్పగించి ఉన్నారు. అయినా ఎన్నికల కోసం ఆ అబద్ధం అవసరం అయింది కాబట్టి, అవసరమయిన అబద్ధాలు ఆడడానికి ఏ నియమాలూ అడ్డం రాని మనిషి కాబట్టి ఆ అబద్ధం ఆడడం జరిగింది. ఇప్పుడింక ఇదంతా మీ అభివృద్ధి కోసమేనన్న ఒకే ఒక్క అబద్ధం తప్ప వేరే ఏవీ అవసరం ఉండవు. ఆగిన విధ్వంసమంతా మళ్లీ మొదలవుతుంది.

కాకినాడ నుంచి ఆదిలాబాద్ జిల్లా బొగ్గు బావుల ప్రాంతం దాకా తమ ఉద్యమ బలంతో దీనిని ఇప్పటిదాకా నిలువరించిన ప్రజలు ఉన్నారు. కనీసం వారు సాధించినదయినా వెనక్కి పోకుండ ఉండాలంటే చీలికలయిన విమర్శనూ నిరసననూ ఒక తాటిమీదకు తెచ్చి నిరంతరాయంగా ప్రతిఘటించడం అవసరం. ప్రతిపక్షాలు ఈ పని చేస్తాయన్న నమ్మకం ఎట్లాగూ లేదు. ప్రజా ఉద్యమాలూ చేయకపోతే భవిష్యత్తు భయంకరంగా ఉండగలదు.

**ఆంధ్రజ్యోతి దినపత్రిక**

**3 జూన్ 2009**

# అభివృద్ధి విధ్వంసం

కొన్ని మాటలకు అర్థాలు ఎంతగా మారిపోతాయంటే దానికి వేరే అర్థం ఉండింది ఒకప్పుడు అని మనమే మర్చిపోతాం. పది పదిహేను ఏళ్ళుగా సరళీకరణ అన్నమాట ఒకటి వాడుతున్నాం. మామూలుగా తెలుగు భాషలో సరళం అంటే మంచిమాట. సులభంగా ఉంది, నేరుగా ఉంది, తిన్నగా ఉంది, సులువుగా ఉంది అనే అర్థం వస్తుంది. అట్లే వాడే వాళ్ళం అందరం చిన్నప్పుడు. ఇప్పటికీ వాడతాం కొన్ని సందర్భాలలో. కానీ సరళీకరణ అనేది ఒక భయపెట్టే మాట అయిపోయింది ఇప్పుడు.

ఏమిటీ సరళీకరణ? పెట్టుబడిదారీ కంపెనీలకు కంపెనీలు పెట్టుకోవడానికి, వ్యాపారాలు చెయ్యడానికి ఉన్న నిబంధనలను సరళం చేశారు. దీనివల్ల వాళ్ళు కంపెనీలు సులభంగా పెట్టుకోవచ్చు. అనుమతులు సులభంగా వస్తాయి. దిగుమతులు సులభంగా చేసుకోవచ్చు. కాలుష్య నియంత్రణ బోర్డు, కార్మికశాఖ అధికారులు అందరూ వాళ్ళకు సులభంగా అన్ని పర్మిషన్లూ ఇస్తారు. ఇలా వాళ్ళకు అన్నిటినీ సరళం చేయడాన్నే సరళీకరణ అన్నారు కాబట్టి మనకు అది కఠినంగా తయారయ్యింది. అందువల్ల సరళీకరణ చెడ్డమాట అయ్యింది.

ఇప్పుడు అభివృద్ధి కూడ అట్లాంటి మాటే అయిపోయింది. మేము స్కూల్లో, కాలేజీలో ఉన్నప్పుడు అభివృద్ధి కావాలని ఆందోళన చేశాం. విశాఖపట్నంలో ఉక్కు ఫ్యాక్టరీ కావాలి అని ఆందోళన చేశాం. నేనప్పుడు తిరుపతిలో చదువుకునేవాడిని. విశాఖపట్నం ఎక్కడుందో నాకు తెలుసనుకోండిగానీ, వేరే నా మిత్రులెవ్వరికీ తెలియదు – 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అని గోడల మీద రాసేవాళ్ళం. అభివృద్ధి అంటే మనకు మామూలుగా ఒక దృశ్యం, ఒక చిత్రం ఉంటుంది. ఏమిటా చిత్రమంటే రోడ్లులేని గ్రామాలకు రోడ్డు వస్తుంది. బస్సులేని ఊరికి బస్సు

వస్తుంది. స్కూల్ లేని ఊరుకు స్కూల్ వస్తుంది. ఆసుపత్రి లేని ఊరికి ఆసుపత్రి వస్తుంది. ఒక ఫ్యాక్టరీ వస్తే ఒక వందమందికి ఉద్యోగాలు వస్తాయి. వెనకబడిన ప్రాంతాలలో, వ్యవసాయం అంతగా గిట్టుబాటు కానటువంటి ప్రాంతాలలో ఒక ఫ్యాక్టరీలో పని చేసుకొనే అవకాశాలు లభిస్తాయంటే ఆశ కదా! అభివృద్ధి అంటే ఈ చిత్రం ఉండేది కాబట్టి అభివృద్ధి కావాలనే వాళ్ళం. అప్పుడు మేము మూర్ఖులమా? అని అనుమానం వస్తోంది. లేదా చిన్నప్పుడు మాకు కావాలని, ఇప్పుడు మీకు వస్తుంటే వద్దంటున్నామా – అది కూడ ఆలోచించుకోవాలి.

సమస్య ఎక్కడొచ్చిందంటే దేన్ని అభివృద్ధి అంటున్నామో దాని అర్థం మారింది. అందువల్ల అది ఇవ్వాళ ఒక భయపెట్టే మాటయ్యింది. గ్రామాలకు రోడ్లు కావాలి, స్కూళ్ళు కావాలి, బస్సులు కావాలి అనేది ఇప్పటికీ అభివృద్ధే. వాటికి అవి అక్కరలేదని ప్రభుత్వం కూడ ఏమీ చెప్పదు. అయితే ఇటువంటి సదుపాయాలను ప్రభుత్వమే ఒక పనిగా పెట్టుకొని కల్పించుకొంటూ పోతే ఉన్న డబ్బంతా దానికే అయిపోతుంది కదా. దాని బదులు ప్రభుత్వం తన దగ్గర ఉన్న నిధులను, తన దగ్గరున్న జాతి సంపదను పెట్టుబడిదారులకు పెట్టుబడులు భారీగా పెట్టడానికి అవసరమైన వసతులు, సదుపాయాలు కల్పించడానికి ఖర్చుపెడితే, వాళ్ళొచ్చి పెట్టుబడులు పెడితే, దానితో సంపద పెరిగితే, ఆ పెరిగిన సంపద నుంచి ప్రజానీకానికి ఫలితాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వస్తాయి కదా. ఇది సరయిన అభివృద్ధి పంథా అనేది ఇవ్వాళ ప్రభుత్వం మాట్లాడుతున్న మాట. అక్కడ మనకు తేడా వస్తోంది.

మన దేశానికి ప్రణాళిక సంఘం ఒకటుంది. ప్లానింగ్ కమిషన్ అంటారు. 11వ ప్లానింగ్ కమిషన్ రిపోర్టు మొన్న వచ్చింది. అయిదేళ్ళకోసారి ప్రణాళిక సంఘం ఒక నివేదిక తయారుచేస్తుంది. దేశాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలి అని వాళ్ళు కొన్ని రాస్తారు. దాంట్లో భాగంగా అభివృద్ధి, ప్రగతి – వీటికి నిర్వచనం, సూచికలు రాస్తారు. సూచిక అంటే ఏమిటి? అయిదేళ్ల కింద అయిపోయిన 8వ పంచవర్ష ప్రణాళికకు, ఆ తర్వాత అయిపోయిన 9వ పంచవర్ష ప్రణాళికకు మధ్య ఏ విధమైన మార్పులు వచ్చాయి? ఏమైనా అభివృద్ధి జరిగిందా? ప్రగతి వచ్చిందా? వీటికి కొలబద్దలు కావాలి గదా, ఆ కొలబద్దలే సూచికలు. అప్పట్లో ఏమేమి సూచికలుండేవి? ఉదాహరణకు దారిద్ర్య రేఖకు దిగువన ఉండేవాళ్ళ సంఖ్య ఎంత తగ్గింది? అదొక సూచిక. ఎంత అభివృద్ధి వచ్చిందనడానికి అదొక కొలబద్ద, ఒక కొలమానం.

ప్రసూతి సమయంలో సరయిన వైద్య సదుపాయం లేక, సరయిన ఆసుపత్రి లేక ఎంతమంది ఆడవాళ్ళు కాన్పుల్లో చనిపోతున్నారు? ఆ సంఖ్య ఏమయినా తగ్గిందా? ప్రతి వెయ్యి కాన్పులకు చనిపోయే ఆడవాళ్ళ సంఖ్య ఒకప్పుడు 60 ఉంటే ఇప్పుడు 40కి తగ్గిందా, లేదా వందకు పెరిగిందా? అదొక సూచిక. బాల్యం గడవకముందే చనిపోయే పిల్లలు – ఇన్ఫెంట్ మోర్టాలిటీ అంటారు ఇంగ్లీషులో – అదేమన్నా తగ్గిందా? లేక పెరిగిందా? అక్షరాస్యత, స్కూలుకు హాజరవుతున్న పిల్లల సంఖ్య ఇత్యాది సూచికలన్నీ రాసుకొని వాటితోపాటు ఇంకో సూచిక కూడ పెట్టేవారు. అదేమిటంటే మొత్తంగా ఆర్థిక వృద్ధిరేటు ఎంత ఉంది అని? అంటే మొత్తంగా దేశంలో జరిగే ఉత్పత్తి – ప్రైవేటు రంగం, ప్రభుత్వ రంగం, వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, హోటళ్ళు అన్నీ కలుపుకొని జరిగే ఉత్పత్తి ఉంటుంది గదా, ఆ స్థూల జాతీయ ఉత్పత్తి – జి.డి.పి అంటారు ఇంగ్లీషులో – అది ఎంత పెరిగింది అని. అది కూడ ఒక సూచికగా ఉండేది.

ఇప్పుడు ప్రపంచ బ్యాంకు ఏం చెప్పిందంటే, మీరు ఇన్ని సూచికలు పెట్టుకొని, ఇన్ని కొలమానాలు పెట్టుకొని, దీనికి 15 కోట్లు, దానికి 30 కోట్లు, దీనికి 40 కోట్లు ఇట్లా ఖర్చుపెట్టుకుంటూ వస్తే దేశం అభివృద్ధి కాదు. అభివృద్ధి కావడమంటే ప్రపంచ బ్యాంకు చిత్రమేమిటి? ఇండియా అమెరికా లాగుండాలి, ఇంగ్లాండు లాగుండాలి, ఫ్రాన్స్ లాగుండాలి. అట్లా మీ దేశం కావాలంటే మీరు పది పన్నెండు సూచికలు పెట్టుకొని – ప్రసూతి మరణాలు తగ్గించడానికి ఈ 500 కోట్లు ఖర్చు పెడుతూ బాల్య మరణాలు తగ్గించడానికి ఈ 700 కోట్లు ఖర్చు పెడుతూ, అక్షరాస్యత పెంచడానికి మరో వెయ్యి కోట్లు ఖర్చు పెట్టుకుంటూ పోతే మీకు ఫలితం రాదు. మీరు ఏం చేస్తారంటే పెట్టే ఖర్చంతా కూడ మన ముఖేష్ అంబానీగారు లేకపోతే అనీల్ అంబానీగారు లేకపోతే జిందాల్‌గారు, మిట్టల్‌గారు, లేకపోతే వాళ్ళ అమెరికా మిత్రులు... వీళ్ళంతా ఉన్నారు కదా భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి – వాళ్ళకు వసతులు చాలా కావాలి. వాళ్ళకు అద్భుతమైన రోడ్లు కావాలి. అద్భుతమైన విమానాశ్రయాలు కావాలి. విశాలమైన భూభాగం కావాలి. ఇట్లాంటి గతుకు రోడ్లుండే ఊర్లు వాళ్ళకు వద్దు. వాళ్ళకు అంతర్జాతీయ ప్రమాణాలు గల టౌన్‌షిప్పులు కావాలి, అంతర్జాతీయ ప్రమాణాలు గల నగరాలు కావాలి. నేలమీద రైళ్ళు పోతే చాలదు. మా హైదరాబాదులో త్వరలో గాల్లో ప్రయాణించే రైలు వస్తుందట. అంతర్జాతీయ ప్రమాణాలు గల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నెలకొల్పాలంటే 24 గంటలు కరెంట్ కావాలి. అడిగినంత నీళ్లు కావాలి. పక్కనే ఓడరేవు కావాలి. ప్రతి జిల్లాకు ఒక విమానాశ్రయం కావాలి.

వీటిమీద ఖర్చు పెట్టండి మీరు. అనవసరంగా వేరే వాటిమీద పెట్టొద్దు. వీటిమీద ఖర్చు పెడితే పెద్ద పెద్ద పెట్టుబడిదారీ కంపెనీలు – స్వదేశీయమూ, విదేశీయమూ – వచ్చి పెట్టుబడులు పెడతాయి.

అలాగే మన దేశంలో కార్మిక చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయట. ఏం కఠినంగా ఉన్నాయో? కార్మిక నాయకులు ఎవరూ మాట్లాడనే మాట్లాడక పోయినా వాళ్ళు అనుకుంటున్నారు కఠినంగా ఉన్నాయి ఇక్కడ అని. ఉద్యోగం నుంచి తీసేయాలంటే కష్టం, రిట్రెంచ్ చేయాలంటే కష్టం, లే ఆఫ్ చేయాలంటే కష్టం మీ దేశంలో. అవన్నీ సరళీకరించండి. సరళీకరణ అంటే అర్థం ఇదీ. అందుకే మనకు అది చెడ్డమాట అయిపోయింది. పనుంటే పని ఇస్తాడు లేకపోతే ఇంటికి పంపించేస్తాడు. హైర్ అండ్ ఫైర్ అంటారు ఇంగ్లీషులో. చాలా ప్రాసతో కూడిన పదబంధం. అటువంటి కార్మిక సంబంధాలుండాలి వాళ్ళకు. డబ్బు మౌలిక సదుపాయాల మీద ఖర్చుపెడితే పెట్టుబడులు భారీగా వస్తాయి. ఉత్పత్తి బ్రహ్మాండంగా పెరుగుతుంది. వృద్ధిరేటు బ్రహ్మాండంగా ఉంటుంది. సంపద బాగా పెరుగుతుంది. అది ఎప్పుడో ఒకప్పుడు కిందికి పోకుండా పోదు గదా. పైన పెంచుకొంటూ పోతే ఎప్పుడో ఒకప్పుడు కిందికి జాలువారి కింద ఉన్న పదిమందికి అందకుండా పోదు. ఆ రకంగా పేద ప్రజానీకానికి కూడ ఏదో ఒక రోజు తిండి దొరుకుతుంది. పనులు దొరుకుతాయి. ఈలోగా అనవసరంగా మీరు సంక్షేమం అని, బహుముఖమైన అభివృద్ధి అని, విశాలమైన ప్రాతిపదిక అని ఖర్చులు పెట్టుకోవద్దు అని ప్రపంచ బ్యాంకు చెప్పింది. మనవాళ్ళకు అది బాగుంది. మనవాళ్లు అంటే అర్థం ఏందంటే కేంద్ర కేబినెట్, రాష్ట్ర కేబినెట్‌లో ఉండే వాళ్ళ వాళ్ళని. అయితే ఈ కంపెనీలకు ప్రత్యక్షంగా ఏజెంట్లు, కాకపోతే వాళ్ళకు కాంట్రాక్టర్లు, ఢిల్లీలో ఉండే ఏజెంట్లు, హైదరాబాదులో ఉండే కాంట్రాక్టర్లు, దళారులు. అందువల్ల వాళ్ళు ఇవ్వాళ అభివృద్ధి అని దేనిని భావిస్తున్నారంటే గ్రామానికి రోడ్డు వేయడమో, బస్సులు వేయడమో, స్కూలో, ఆసుపత్రి కట్టడమో కాదు – ఈ కంపెనీలకు మౌలిక సదుపాయాలు కల్పించడం మీద ఖర్చు పెట్టడాన్ని అభివృద్ధి అంటున్నారు. అందుకు మనకు కడుపు మండుతుంది. అందుకే అభివృద్ధి అంటే కోపం వస్తుంది ఇవ్వాళ.

వారు చెప్పే వాదనేమిటి? మనకు యు.కొత్తపల్లి, తొండంగి మండలాల సెజ్ విషయంలో వాళ్లేం చెప్పారు? మీకు ఉద్యోగాలు వస్తాయి, మీకు ఉపాధి లభిస్తుంది అని కదా! ఈ మాటను వాళ్లు పనికట్టుకొని ఎందుకు చెబుతున్నారంటే

గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యంగా చిన్న రైతులు, వ్యవసాయ కూలి కుటుంబాల వాళ్ళకు వ్యవసాయాన్ని వదిలిపెట్టి ఈ పనిచేసుకుంటే హాయిగా బతకగలుగుతాం అని ఒక ఆశ ఉంటుంది తప్పనిసరిగా. బాగా భూమెక్కువ ఉంటే వేరే సంగతి గానీ లేకపోతే వ్యవసాయం చాలా సమస్యాత్మకమైన విషయం. ఏ రోజు పంట పండేదీ తెలియదు, పండక పోయేదీ తెలియదు. ధర పలికేదీ తెలియదు, పలకనిది తెలియదు, వర్షం వచ్చేది తెలియదు, రానిది తెలియదు. నెల నెలా జీతం వచ్చే ఉద్యోగం – అందునా చాలామంది ఉద్యోగులు పనేమీ చేయరు. రైతులు కూడ చూస్తూ ఉంటారు కదా! కాబట్టి ఉద్యోగముంటే హాయిగా బ్రతకవచ్చుగదా అనేది వారికి ఉంటుంది. దానిని దుర్మార్గంగా వాడుకొని రాజశేఖరరెడ్డి ఏమంటున్నాడంటే – లక్షలకు దిగడు ఆయన – 25 లక్షల ఉద్యోగాలు, 30 లక్షల ఉద్యోగాలు వస్తాయని చెబుతున్నాడు. అక్కడే మనబోటి వాళ్ళు విశ్లేషణ చేసి అడగాల్సిన ప్రశ్న ఏమిటంటే, ఆంధ్రప్రదేశ్‌లో ఇవ్వాళ్టికి 58 సెజ్‌లు ఆమోదం పొందాయి. దేశంలో మనం నెంబర్ 2. మహారాష్ట్ర నెంబర్ 1. మన వెనక తమిళనాడు, మిగిలిన వాళ్ళు పోటీ పడుతూ పైకి పైకి వస్తున్నారు. ఈ 58 సెజ్‌లలో 50 లక్షల ఉద్యోగాలు వస్తాయని రాజశేఖరరెడ్డి గారు మాట్లాడుతున్నారు. కాని ఈ 58 సెజ్‌లలో 37 సెజ్‌లు ఐ.టి రంగానికి చెందినవి. ఐ.టి అంటే ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఉద్యోగాలు పదుల సంఖ్యలో తప్ప వందల సంఖ్యలో కూడ రావు. ఇక వేల సంఖ్య, లక్ష సంఖ్య మర్చిపోండి.

ప్రత్యక్షంగా అబద్ధాలు చెపుతున్నారు వీళ్లు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, దేశవ్యాప్తంగా చాలాసార్లు చైనాతో పోలుస్తూ చెపుతారు. ఆ పోలిక మంచి చెడుల గురించి ఇంకొకసారి ఎప్పుడైనా మాట్లాడుకుందాం గానీ, చైనాలో అంతా అద్భుతంగా ఉందని నేనేమీ అనడం లేదు. కానీ చైనా సెజ్‌లలో ఎక్కువ భాగం మాన్యుఫ్యాక్చరింగ్‌వి. అంటే ఉత్పత్తులను ఎక్కువ చేసేటటువంటి సెజ్‌లవి. ఉద్యోగాలు ఎక్కువ వచ్చే అవకాశముందక్కడ. అయినా చాలా సమస్యలున్నాయి. సెజ్‌లలో కనీస వేతనాలు దక్కడం లేదు. ఆత్మహత్యలు జరుగుతున్నాయని కూడ చాలా విమర్శలు వస్తున్నాయి. అది పక్కన బెట్టి మన సెజ్‌లలో మాన్యుఫాక్చరింగ్ సెజ్‌లు చాలా తక్కువ. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ, నాలెడ్జ్ ఇండస్ట్రీ, సర్వీసు ఇండస్ట్రీ – వీటికి సంబంధించిన సెజ్‌లే భారతదేశంలో ఎక్కువ. ఇవి ఉద్యోగాలు చాలా తక్కువ కల్పిస్తాయి. ఆ వచ్చే కొన్ని ఉద్యోగాలు కూడ బాగా చదువుకొని

డిగ్రీలున్నటువంటి పట్టణ ప్రాంతాల అగ్రకులాల ధనవంతుల పిల్లలకు మాత్రమే దక్కుతాయి తప్ప, వేరే ప్రజానీకానికి, ఎవరైతే భూములు కోల్పోతారో వాళ్ళకు దక్కే ప్రసక్తే లేదు.

రెండవది, హక్కుల ఉద్యమంలో పనిచేసేటప్పుడు మేము పదే పదే చెప్పేదేమంటే ప్రభుత్వం మాట్లాడేదంతా అబద్ధమని కొట్టి పారేయ్యొద్దు. కానీ ఏమి దాచిపెట్టారో చూద్దాం. ప్రభుత్వం కొన్ని వాస్తవాలు చెబుతుంది, కొన్ని పాక్షిక వాస్తవాలు చెబుతుంది. కొన్ని వక్రీకరణలు చెపుతుంది. చాలా దాచిపెడుతుంది. దాచిపెట్టే వాటి గురించి మనం ప్రశ్నలు వేయడం నేర్చుకుంటే అన్ని విషయాలు బయటకు వస్తాయి. క్రమంగా బయటకు వస్తాయి. మన ఆలోచన పరిపూర్ణం అవుతుంది.

ఎప్పుడైనా ప్రభుత్వం పదివేల ఎకరాలు తీసుకుంటున్నాము, ఇక్కడొక సెజ్ వస్తుంది, ఫలానా పరిశ్రమ వస్తుంది, 25 వేల ఉద్యోగాలు వస్తాయిక్కడ అన్నప్పుడు - ఇప్పుడు ఆ పదివేల ఎకరాలలో ఎంతమంది పనిచేసుకొని బ్రతుకుతున్నారు? ఆ సంఖ్య ఎందుకు చెప్పదు ప్రభుత్వం? ఆ 10 వేల ఎకరాలు వ్యవసాయానికో, పశువుల మేతకో, చేపలు పట్టుకోడానికో, బట్టలుతుక్కోడానికో, రకరకాల వాటికి ఉపయోగపడుతూనే ఉంటుంది కదా. 25 వేల ఉద్యోగాలు కల్పిస్తున్నానని చెపుతున్నవాడివి ఎన్ని వేల ఉద్యోగాలు పోగొడుతున్నావో చూసుకోవద్దా? ఉద్యోగమంటే జీతం వచ్చే ఉద్యోగాలే కానక్కరలేదు.

కాని ఒక సెజ్‌నో, ఫ్యాక్టరీనో పెడుతున్నప్పుడు ఎన్ని వేల మంది ఉపాధి పోగొడుతున్నామన్న సంఖ్య ఎప్పుడన్నా ప్రభుత్వం ఇవ్వగా చూశారండీ? వాళ్ళు ఎట్లా మాట్లాడతారంటే తాము సెజ్‌కి ఇస్తున్నటువంటి, పరిశ్రమకి ఇస్తున్నటువంటి భూమి శూన్యంలో ఉన్నట్లు, ఇప్పుడు అక్కడ ఏమీ లేనట్టు, పంట పండనట్టు, పని దొరకనట్టు, ఖాళీగా ఉన్నట్టు మాట్లాడతారు. వాస్తవానికట్లా ఖాళీగా ఉన్న జాగా భారతదేశంలో ఎక్కడా లేదు. థార్ ఎడారిలో కూడ లేదు. ఒంటెలను తోలుకుని తిరిగే ఒక మనిషయినా ఉంటాడు థార్ ఎడారిలో. భారతదేశంలో భూమి అవసరం ఎంత ఉందంటే ఎక్కడ ఏ కొంచెం ఫలమున్నా దానిని తీసుకొని బ్రతికేవాళ్ళు ఈ దేశంలో చాలామంది ఉన్నారు. అటువంటి దేశం మనది. మనం మొట్టమొదట అడగవలసింది, పోగొడుతున్నవాటి సంఖ్య చెప్పు, నువ్వు ఇస్తానని చెబుతున్న సంఖ్యలో వాస్తవంగా ఎంతిస్తుందీ, ఎన్ని అబద్ధాలు చెబుతున్నదీ మేము చెపుతాం. ఇవ్వాళ కాకినాడ, యు.కొత్తపల్లి,

తొండంగిలోని ఈ 10 వేల ఎకరాల సెజ్ గురించి వాళ్ళు ఏమని చెపుతున్నారు? 50 వేల ఉద్యోగాలు వస్తాయని ఇవ్వాళ ఆ కాకినాడ సెజ్ లిమిటెడ్ తమ ఇంటర్నల్ డాక్యుమెంట్‌లో రాసుకున్నారు. 16 గ్రామాల భూములు తీసుకొని 50 వేల ఉద్యోగాలు కల్పిస్తారట. ఒకవేళ కల్పించినా కూడ ఆ 50 వేలూ స్థానికులకేమీ రావు గదండీ. దాంట్లో ఒక వెయ్యి వస్తాయో, రెండువేలు వస్తాయో, మూడువేలు వస్తాయో! అది పక్కన పెట్టండి. ఆ 16 గ్రామాలు ఇవ్వాళ 50 వేల మందికి తిండి పెట్టడం లేదా? ఎందుకు పెట్టవు? 50 వేల మందికి నువ్వు పని కల్పిస్తున్నానని చెప్పి ఆ 50 వేలలో 40 వేల మంది బయటి వాళ్లనే తెచ్చి పెడతావా? ఒకవేళ పదివేల మంది స్థానికులకు ఉద్యోగాలు వచ్చినా ఏమి మిగిలినట్టు? 40 వేల మంది నిరుద్యోగులైనట్టు లెక్క. అంతేగదా. అంటే ఏమి జరుగుతుంది ఇవ్వాళ? వాళ్ళు అభివృద్ధి పేరుమీద ఉపాధి కల్పించడం లేదు. ఉన్న ఉపాధి పీకేస్తున్నారు. దాన్ని దాచిపెడుతూ అబద్ధాలు మాట్లాడుతున్నారు. ఆ అబద్ధాలు బయటికి తీసి, వాస్తవాలను వెలికితీసి చెప్పడమనేది హక్కుల సంఘాలు, ఇతర సంఘాలు, ఉద్యమాలు, రాజకీయ ఉద్యమాల ముఖ్యమైన కర్తవ్యాలలో ఒకటి. అబద్ధాలను, అవాస్తవాలను వెలికి తీసి ప్రజల ముందు చర్చకు పెట్టడం చాలా అవసరం.

రెండవది, ప్రభుత్వం 10 వేల ఎకరాలు ఇచ్చేస్తుందనుకోండి ఒక కంపెనీకి. కాగితంలో ఏమి చూపిస్తుంది? జిరాయితీ భూములను మాత్రమే చూపిస్తుంది. ఇది మాత్రమే ప్రజానీకానికి తిండి పెట్టే భూమయినట్టు జిరాయితీ భూమి కాని ప్రభుత్వ భూమినంతా ఎవరికీ చెప్పకుండానే ఇచ్చేస్తుంది. మా భూమి మేము ఇచ్చేశాం అంటుంది. అనంతపురం జిల్లాలో లేపాక్షి నాలెడ్జ్ సెజ్ అని ఒకటి వస్తోంది. 11,500 ఎకరాల భూమి. ఇది అంతా గవర్నమెంటు భూమి కింద లెక్క. అంటే ఆ 11,500 ఎకరాలు ఇప్పటిదాకా ఖాళీగా పడున్నాయా? అంతటా వ్యవసాయం జరుగుతోంది. ఎవరు వ్యవసాయం చేసుకుంటున్నారు? ప్రభుత్వమే అసైన్‌మెంట్, డిఫారమ్ పట్టాలిచ్చిన పేద ప్రజానీకం చేసుకుంటున్నారు. గవర్నమెంట్ ఏం చెపుతోంది – నా భూమిని నేను ఇచ్చేస్తున్నాను కాబట్టి నేనా లెక్కలు చూపించనక్కరలేదు, అక్కడ ఎంతమంది ఉపాధి పొందుతున్నారో, ఎంతమందికి ఉపాధి పోతుందో అవేమీ తను చెప్పనక్కరలేదు అనుకుంటోంది. ఏం మాట్లాడుతుంది – నాలెడ్జ్ సెజ్ వస్తుంది, ఉద్యోగం వస్తుంది అని చెబుతుంది. ఏం ఉద్యోగం అని చెబుతుంది? ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలోగానీ, బయోటెక్నాలజీలో గాని అతికొద్ది మంది పట్టణ ప్రాంత అగ్రకులాలకు చెందినటువంటి ధనవంతుల

పిల్లలకు మాత్రమే ఉద్యోగాలు వస్తాయి. వేరే వాళ్ళకు రావు. పోయేది మాత్రం 11,500 ఎకరాలలో అసైన్‌మెంట్ పట్టాలతో వ్యవసాయం చేసుకుంటున్న టువంటి కొన్ని వేల మంది పేద ప్రజానీకం బ్రతుకులు. అది బంజరు భూమయినా సరే పశువులు మేపుకునే వాళ్ళుంటారు కదా! వాళ్ళ ఉపాధి ఏం కావాలి? మీ దగ్గర తగ్గిపోయింది కాని, తెలంగాణ రాయలసీమ ప్రాంతాలలో ఇప్పటికి తాటిచెట్ల నుంచి, ఈతచెట్ల నుంచి కల్లు తీసుకునే చాలా పెద్ద పెద్ద కులాలే ఉన్నాయి. అదొక పెద్ద ఉపాధి. ఆ ప్రాంతాలలో కుంటలుగాని చెరువులుగాని ఉంటే అక్కడ చేపలు పట్టుకునేవాళ్ళు, బట్టలుతుక్కునేవాళ్లు ఎందరో ఉంటారు. ఈ కుల వృత్తులన్నీ కూడ మన హైందవ సమాజంలో అట్టడుగు కులాలవాళ్ళే చేస్తారు. వాళ్ళ జీవనం మొత్తం దెబ్బతింటుందనేది ఎక్కడా చెప్పకుండ ప్రభుత్వం దీనిని అభివృద్ధి అని మాట్లాడుతుంది. మనం అందుకనే – అసలు అభివృద్ధి గురించి మీ అవగాహన ఏమిటి? మీ నమూనా ఏమిటి? అనే ప్రాథమిక ప్రశ్న వేస్తాం. ప్రత్యక్షంగా ప్రభుత్వం రకరకాల రూపాలలో ప్రజానీకం జీవితాలు బాగు చేయాల్సిన అవసరమేమీ లేదు. కానీ పెట్టుబడిదారీ కంపెనీలు పెట్టుబడులు పెట్టటానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే సరిపోతుందనే ఆలోచన, దాన్నించే ప్రజానీకానికి అభివృద్ధి వస్తుందనే ఆలోచన దుర్మార్గమైన ఆలోచన. అది మన విమర్శలో ఒక ముఖ్యమయిన భాగం.

రెండవది, ప్రత్యక్షంగా జీవనం కోల్పోవటం మాత్రమే కాకుండా, ముఖ్యంగా తీర ప్రాంతంలో మత్స్యకారులకు రాగల ప్రమాదం చాలా భయంకరంగా ఉండబోతోంది. మొత్తం కోస్తా ప్రాంతం అంతా కూడ పరిశ్రమలు రాబోతున్నాయి. అందులో థర్మల్ ప్లాంటులు చాలా ఎక్కువగా వస్తాయి – నెల్లూరు నుంచి శ్రీకాకుళం దాకా. వాటిని ఇక్కడ ఎందుకు పెడుతున్నారు? థర్మల్ ప్లాంట్ పెట్టడానికి బొగ్గేమి దొరకదు ఇక్కడ. మన రాష్ట్రంలో బొగ్గు తెలంగాణలో మాత్రమే ఉంది. అది సరిపోకపోతే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుంచి తేవాలి. అవి నెల్లూరుకు గాని, శ్రీకాకుళానికి గాని చాలా దూరంలో ఉన్నాయి. మరి ఇక్కడెందుకు పెడుతున్నారు? ఒకటే ఒకటి చూస్తున్నారు. థర్మల్ ప్లాంట్‌కు నీళ్లు కావాలి. ఇక్కడ సముద్రం ఉంది. ఆ నీళ్ళున్నాయి. ఈ నీళ్లు దూరప్రాంతానికి తీసుకుపోవాల్సివస్తే ఖర్చెక్కువ. కాబట్టి దగ్గర్లో నీళ్లుంటే ఖర్చు తక్కువవుతుంది అనే ఏకైక కారణంతో ఇస్తున్నారు. అన్నీ ప్రైవేటు కంపెనీలే. వీటివల్ల వచ్చేటటువంటి కాలుష్యం చాలా భయంకరంగా ఉండబోతుంది.

మధ్యప్రదేశ్‌లో 12 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్తును ఉత్పత్తి చేసే ప్రాంతం ఒకటుంది. చాలా కంపెనీలు ఉన్నాయి అక్కడ. అక్కడ ఎంత ప్రమాదకరమయిన కాలుష్యం వచ్చిందో ఒకసారి చూస్తే శ్రీకాకుళం జిల్లా, నెల్లూరు జిల్లాలలో ఏం జరుగబోతుందీ అర్థమవుతుంది. అంతే విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉండబోతున్న ఈ ప్రాంతమంతా భవిష్యత్తులో ఎటువంటి కాలుష్యాన్ని భరించవలసి వస్తుందో! ఆ కాలుష్యానికి ప్రధాన బాధితులు మత్స్యకారులు కాబోతారు. ఎందుకంటే మన కాలుష్య నియంత్రణ మండలి వారికి పర్మిషన్లు ఏ విధంగా ఇస్తుందంటే నువ్వు బయటికి వదిలిపెట్టేటటువంటి వ్యర్థ పదార్థాలను శుద్ధి చేసి సముద్రంలోకి వదిలేయ్ అని చెప్పి ఇస్తుంది. శుద్ధి ఎంత చేస్తాడు? సమగ్రంగా చేస్తాడా? థర్మల్ ప్లాంటయినా కొంత చేస్తుంది. కాని థర్మల్ ప్లాంట్‌లతోపాటు, కోస్టల్ కారిడార్‌లో భాగంగా ఈ ప్రాంతంలో రసాయన పరిశ్రమలు, మందుల పరిశ్రమలు రానున్నాయి. రసాయన పరిశ్రమల, మందుల పరిశ్రమల కాలుష్యం మేము హైదరాబాదులో చూస్తున్నాం. డ్రగ్ ఇండస్ట్రీలో హైదరాబాద్ దేశంలోనే నెంబర్ వన్. పటాన్‌చెరు ప్రాంతం మీకు తెలుసు, చాలామంది వస్తుంటారు హైదరాబాద్‌కు. కూకట్‌పల్లికి దగ్గరే ఉంటుంది. ఆ కాలుష్యం మూసీనదిని ఎంత ధ్వంసం చేసిందో, ఆ ప్రాంతంలో చెరువులు ఎట్లా ధ్వంసం అయ్యాయో మేము చూస్తూనే ఉన్నాం. హక్కుల సంఘాలుగా 30 ఏళ్ళుగా ఆ ప్రాంతాలకు పోతూనే ఉన్నాం. ఫిర్యాదులు చేస్తూనే ఉన్నాం. కేసులు వేస్తూనే ఉన్నాం. అయినా కాలుష్యం వస్తూనే ఉంది. ఎందుకంటే నిపుణులే చెపుతారు రసాయన కాలుష్యం, ఫార్మాస్యూటికల్ కాలుష్యం ఎంత శుద్ధి చేసినా పదిశాతం మిగిలిపోతుందని. రేపు వీళ్ళు కాలుష్యాన్ని తూముల్లోకి నెట్టి సముద్రంలోకి వదిలేస్తూ ఉంటే రాబోయే రోజులలో ఈ సముద్రంలో చేపలు దొరుకుతాయా? జల జీవాల పునరుత్పత్తి జరుగుతుందా? క్రమంగా అన్నీ చచ్చిపోతాయి. ట్రాలర్లు వేసుకొని, మెషిన్ బోట్లు వేసుకొని దూరంపోయే వాడికే చేపలు దొరకొచ్చు. కాని దగ్గర్లో చేపలు పట్టేటటువంటి ఈ ప్రాంత మత్స్యకారులెవరికి కూడ జీవనం మిగలదు. అంటే ప్రత్యక్షంగా ఉపాధి కోల్పోడమే కాక కాలుష్యం ద్వారా, పర్యావరణ విధ్వంసం ద్వారా కూడ కోల్పోతారు.

ప్రకృతి అనేది ప్రజానీకానికి జీవనాధారం. సహజ వనరుల దోపిడీ గురించి మాట్లాడుతున్నాం అంటే మా గ్యాసు తీసుకుపోతున్నాడు, మా నీళ్ళు తీసుకుపోతున్నాడనే కాదు – ప్రకృతి మీద ఆధారపడి బతికే హక్కును కూడ తీసుకుపోతున్నాడని. అది సారవంతమైన నేల రూపంలో కావచ్చు, చేపలు

పట్టుకునే నీళ్ళ రూపంలో కావచ్చు, ఆరోగ్యాన్ని కాపాడే గాలి రూపంలో కావచ్చు. అనేక రకాల జీవనానికి అవసరమయిన సంపదనిచ్చే అడవుల రూపంలో కావచ్చు. గాలిగానీ, నీళ్లుగానీ, నేలగానీ, చెట్లుగానీ – ఇవి కేవలం ప్రకృతి కాదు, ప్రజానీకానికి జీవనాధారం కూడ. ప్రభుత్వం దృష్టిలో రెండే రెండు కేటగిరీలున్నాయి. పట్టాలుంటే జిరాయితీ భూమి, నష్టపరిహారం ఇస్తాము. మిగిలింది వ్యవసాయానికి పనికిరాని వృథా భూమి. అది మాదే కాబట్టి ఎవరికీ ఏమీ ఇవ్వనక్కర్లేదు. కాని వాస్తవానికి అదంతా కూడ జీవనానికి ఆధారమైన నేలే. ఆ స్పృహ ఎక్కడా ఉండదు వాళ్ళకు. తెలియక కాదు, లెక్కలేదు. దాన్ని దాచిపెట్టేసి మీకు పట్టా ఉందా, అయితే నష్టపరిహారం ఇస్తాం తీసేసుకో, వెళ్ళిపో ఇక్కడనుంచి అంటారు. ఎక్కడికి పోతాడు అతను? ఎంతమంది ఎక్కడికి పోతారు? ఎంతమంది ఆ డబ్బు తీసుకొని వ్యాపారాలు చేసుకొని బాగుపడగలుగుతారు? ఎంతమంది ఆ డబ్బు తీసుకొని మళ్ళీ భూములు కొనుక్కొని వ్యవసాయం చేయగలుగుతారు?

ఒక గ్రామంలో ఇద్దరు రైతుల దగ్గర భూమి తీసుకొని తలో రెండు లక్షలిస్తే వాళ్ళు ఇంకొక గ్రామంలో కొనుక్కోగలరు. 10 వేల ఎకరాల భూములు తీసేసుకొని డబ్బులిస్తే చుట్టుపక్కల భూముల ధరలంతా కూడ పదిరెట్లు పెరిగిపోతాయి. తెలిసిన వాస్తవాలే ఇవన్నీ కూడ. జరుగుతున్న వాస్తవాలే. గవర్నమెంట్ ఏం మాట్లాడుతుంది ఇవ్వాళ? చట్టం ప్రకారం రావలసిన దానికంటే రెండు రెట్లు ఎక్కువ ఇస్తున్నాం కదా అంటుంది. ఇస్తున్నారు కొన్నిచోట్ల, ఇవ్వడం లేదని గాదు. ఇంక హాయిగా బతుకుపో అంటారు. నువ్వు హాయిగా అనే లోపలే ధరలు నాలుగు రెట్లు పెరిగిపోయుంటాయి. ఎందుకంటే ఒకరికి ఇవ్వడం లేదు నువ్వు. ఎంత మందికి ఇస్తున్నావు? 10 వేల ఎకరాలకు ఇస్తున్నావు. 10 వేల ఎకరాల రైతులు డబ్బు తీసుకొని బయట కొనుక్కుందామని పోతే భూముల ధరలు ఊరుకుంటాయండి? రేట్లు బాగా పెరిగిపోతాయి. కాబట్టి అందరి అనుభవమేమిటంటే భూసేకరణలో భూములు కోల్పోయిన వాళ్ళకు ఎక్కువ నష్టపరిహారం లభించినా కూడ తక్కువ భూమే కొనుక్కోగలుగుతున్నారు. సమానంగా కాదు గదా సగం కూడ కొనుక్కోలేకపోతున్నారు. ఇక మిగిలిన ప్రజానీకం – భూములు లేని వాళ్ళు, చాకలివాళ్ళు, మంగలివాళ్ళు, వ్యవసాయ కూలి చేసుకునేవాళ్ళు, ఏమైపోతారు వాళ్ళంతా? వాళ్ళను బికారులుగా మార్చి, విశాల ప్రజానీకానికి జీవనాధారమైన ప్రకృతిని పెట్టుబడికి ఒక వనరుగా చూడటం అనేది దుర్మార్గమైన ఆలోచన. అదే పెద్ద దోపిడి.

ఒక ప్రాంతం వనరులు తీసుకోబోతున్నారు లేదా ఇంకొక ప్రాంతం వనరులు తీసుకోబోతున్నారు అనేది కాదిక్కడ. As such ప్రకృతి అనేదే ప్రజానీకానికి జీవనాధారం. ప్రజానీకానికి జీవనాధారమయిన ప్రకృతిని పెట్టుబడికి వనరుగా చూపించి, పెట్టుబడికి అప్పగించేసి, డబ్బులిస్తున్నాం గదా, కాలనీ గట్టిస్తాం గదా, మీరక్కడ బతకండి అని తరిమేస్తానంటే, అదే దోపిడి. ఇంక వేరే దోపిడి గురించి మాట్లాడవలసిన అవసరం లేదు. మరి అభివృద్ధి ఎప్పుడు వస్తుంది? ఎలా వస్తుంది? ఎక్కడ వస్తుంది? అంటే ఇవన్నీ అర్థంలేని మాటలు. అమెరికాలో జరగలేదా? ఇంగ్లాండులో జరగలేదా? అంటే ఆ దేశాలు ఈ మోడల్‌లో వృద్ధి చెందగలిగాయి అంటే వాటికి వలసలుండేవి. ఆ వలసలను దోచుకుని, వలస దేశాల వనరులను దోచుకొని దాన్ని సప్లిమెంట్ చేసుకొని తమ దేశాలను అభివృద్ధి చేసుకోగలిగారు. అది ఇప్పుడు ఏ దేశానికీ సాధ్యం కాదు. ఈ నమూనాలో అభివృద్ధి చెంది అందరి జీవితాలు బాగు చేయడం ఇవ్వాళ ఎవరికీ సాధ్యమయ్యే విషయం కాదు.

ఇవ్వాళ మనకు వలసలు వద్దు. కావాలనుకున్నా అవి లేవు. భారతదేశం లాంటి దేశాలలో ప్రజల దైనందిన జీవితాన్ని, జీవన ప్రమాణాలను ప్రత్యక్షంగా పెంచే అభివృద్ధే అభివృద్ధి తప్ప, వేరే నమూనా అభివృద్ధి అనేది సాధ్యం కాదు. దానికి అనుబంధంగా పరిశ్రమలు పెట్టు. ఎవ్వరూ వద్దనడం లేదు. ఒకే ఒక గీటురాయి పెట్టుకో. నువ్వు ఒక అభివృద్ధి కార్యక్రమం చేపట్టడం వలన ఎవ్వరి జీవనమైనా దెబ్బతింటే తిరిగి అంతే జీవనాన్ని పొందేలా వాళ్ళకు పునరావాసం కల్పించగలవా, కల్పించలేవా? ఇవ్వాల్టికీ భారతదేశంలో ఆ రకమైనటువంటి చట్టం లేదు. ఇవ్వాల్టికీ భారతదేశంలో అభివృద్ధి కోసం ఎవరైనా భూములు కోల్పోతే, ఎవరైనా జీవనం కోల్పోతే తిరిగి అంతే భూమి లేక అంతే జీవనం వాళ్ళు పొందాలి అని చెప్పే చట్టం లేదు. ఏముంది? మార్కెట్ రేటు ప్రకారం ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుంది. ఏం చేసుకొంటావో చేసుకో అనే మాటబిరుసుతనం ఉంది. పార్లమెంట్‌లో మూడు సంవత్సరాలుగా రెండు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మూడేళ్ళుగా ఎప్పుడు చర్చ వచ్చినా ప్రధానమంత్రి గారు ఏం మాట్లాడతారు – కొత్త భూసేకరణ చట్టం చేస్తున్నాము, కొత్త పునరావాస చట్టం చేస్తున్నాము, భయపడొద్దు మీరు అంటాడు. చెయ్యడు దాన్ని. ఈ మూడేళ్ళలో లక్షలాది ప్రజానీకాన్ని నిర్వాసితులు చేసేటటువంటి భూసేకరణ మాత్రం జరిగిపోతూనే ఉంటుంది. పోనీ ఆ చట్టాలేమన్నా బాగున్నాయా? మా బులెటిన్‌లో దాని మీద విశ్లేషణ రాశాము. ఆ చట్టాలు ఇవ్వాళ ఉన్న చట్టాలకంటే మెరుగే గానీ,

మళ్ళీ అంతే జీవన ప్రమాణాన్ని కల్పించే చట్టాలు కావు అవి. రేపు ఆ బిల్లులు చట్టాలయినా అభివృద్ధికోసం జీవనం కోల్పోయిన వాళ్ళకు అంతే జీవనాన్ని తిరిగి కల్పిస్తాం అనే శాసనపరమైన భరోసా, హామీ వాళ్లకు లేదు. ఇది సాగడానికి వీలు లేదు.

పదిహేనేళ్ళ కింద ఒక పరిశోధకుడు చాలా వివరంగా పరిశోధించి ఒక మాట చెప్పాడు. అందరూ చాలా సిగ్గుతో తలవంచుకోవాల్సిన మాట. ఈ అరవై సంవత్సరాల భారతదేశ ప్రగతిలో భూసేకరణ వల్ల భూములు కోల్పోయి నిర్వాసితులైన ప్రజానీకంలో 40 శాతం మంది ఆదివాసులు అని చెప్పాడు. దేశ జనాభాలో ఆదివాసులు ఎంతమందో తెలుసా? కానీ ప్రాజెక్టుల కోసం, పరిశ్రమల కోసం జీవనాన్ని కోల్పోయి నిర్వాసితులు అయిన వాళ్ళలో వెయ్యికి నాలుగువందల మంది ఆదివాసులు. అయినా ఈ దేశం అభివృద్ధి చెందిన దేశమని అంటున్నారు. అంటే ఆదివాసుల జీవితాలను నాశనం చేసి వాళ్ళను బికారులు చేసి దేశం ఈ స్థాయికి వచ్చిందంటే ఎంత లజ్జాకరమయిన పరిస్థితి ఇది! ఆ రోజు వాళ్ళకి మాట్లాడ్డానికి నోరు లేదు, వాళ్ళ తరఫున మాట్లాడే ఉద్యమాలు లేవు. ఇప్పుడైనా మేల్కొందాం. అభివృద్ధి అనేది ప్రత్యక్షంగా ప్రజల జీవన ప్రమాణాలు పెంచేదే కావాలి తప్ప నీ మనసులో సిద్ధాంతం ఒకటి పెట్టుకొని, పెట్టుబడుదారులకు వసతులు కల్పించుకొంటూ పోతే – దానివల్ల అభివృద్ధి వస్తుందనేది వట్టి అబద్ధం. ఏ మేరకైనా ఎవరినైనా నువ్వు విస్థాపితులను చెయ్యవలసి వస్తే, నిర్వాసితులను చెయ్యవలసి వస్తే ఆ ప్రజానీకం ఒక సమాజంగా మళ్ళీ మరొకచోట ఇవ్వాళున్న జీవన ప్రమాణానికి ఒక్క రూపాయి కూడ తగ్గకుండా బ్రతికేటటువంటి పునరావాసం నువ్వు కల్పించగలిగితేనే చెయ్యి, లేకపోతే చెయ్యడానికి వీలు లేదు అనేది ఒక డిమాండ్‌గా ముందుకు రావలసిన అవసరం ఉంది. ఇవ్వాళ మనం మాట్లాడుతున్నటువంటి జీవన వనరుల దోపిడి ప్రధానంగా ఇదే.

మనం హక్కులుగా మాట్లాడుతున్నవి, జనం నుంచి హక్కులుగా ముందుకొస్తున్నవి – వీటిని ఎట్లా వక్రీకరించి కుదించి చట్టాలు చేస్తున్నారో కూడ తెలుసుకోండి. పైకి ఇచ్చినట్టే అనిపిస్తుంది హక్కు. రెండే ఉదాహరణలు చెప్పి నేను ముగిస్తా. ఇవ్వాళ ప్రభుత్వం ఆహార భద్రత చట్టం ఒకటి చేస్తోంది. ఒక రకంగా మంచిదే. ఇవ్వాల్టిదాకా చవక బియ్యం పాలసీలు ఉండేవి. ఆంధ్రప్రదేశ్‌లో రెండు రూపాయలకు కిలో బియ్యం పాలసీ ఉంది తెల్లకార్డు ఉన్నవాళ్ళకు. తమిళనాడులో మూడు రూపాయలు, పంజాబ్‌లో ఒక రూపాయికి కిలో బియ్యం, గోధుమలు

ఇలా ఏవో ఉన్నాయి. తప్పుకాదు కానీ, ఇవ్వాళ్టిదాకా ఈ చవక బియ్యం విధానం ఒక పాలసీగా ఉంది. పాలసీగా ఉంటే ఏమవుతుంది అంటే ఇవ్వాళ ఉండొచ్చు రేపు తీసేయ్యవచ్చు. చట్టంగా ఉంటే అది హక్కుగా ఉంటుంది. కాబట్టి అది చట్టం చేయడాన్ని మనం ఆహ్వానిస్తాం. తప్పేమీ లేదు దాంట్లో. కానీ కేంద్ర ప్రభుత్వం ఏమని చట్టం చేస్తున్నది? దారిద్ర్యరేఖకు దిగువన ఉండే ప్రతి కుటుంబానికి కిలో మూడు రూపాయలకి 25 కేజీలు – అది బియ్యమైతే బియ్యం, గోధుమలైతే గోధుమలు – సరఫరా చేస్తాం దేశవ్యాప్తంగా అని అంటున్నారు. 20 ఇవ్వాలా, 30 ఇవ్వాలా, 35 ఇవ్వాలా అనేది పక్కన బెట్టండి. దారిద్ర్యరేఖ నిర్వచనాన్ని కేంద్ర ప్రభుత్వం ఏ రకంగా చేస్తూ ఉంది అనంటే కొద్దిమంది మాత్రమే దరిద్రులు దేశంలో ఉండేట్టు, వాళ్ళకి మాత్రమే అవి అందేటట్టు దానిని నిర్వచించాలని ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడ మళ్ళీ ప్రపంచ బ్యాంకు ఆదేశాలు పనిచేస్తాయి. ప్రపంచ బ్యాంకు పదే పదే ఏం చెప్పుకుంటూ వచ్చిందంటే, 1990లలో వాళ్ళు ఇండియన్ ఎకానమీలో తలదూర్చినప్పటినుంచి ఏం చెపుతున్నారంటే – అప్పటిదాకా మనకున్న ఆలోచనలేమిటి. మొత్తంగా దేశంలో రకరకాల వెనకబాటుతనం ఉంది. రకరకాల పేదరికం ఉంది. క్రమంగా ఈ పేదరికాన్ని, వెనకబాటుతనాన్ని తగ్గించుకుంటూ అందరిని సమానం చేసుకోవాలి – రిజర్వేషన్లైనా, చవక బియ్యమైనా, రేషన్ షాపులైనా ఇవన్నీ దానికోసమే అన్న ఆలోచన మనకుంది. కాని ప్రపంచ బ్యాంకు ఆలోచన రీతి ఏమిటి? వాళ్ళు చెప్పిందేమిటి మన వాళ్ళకు అంటే, ఇంతకు ముందే చెప్పాం – ఇట్లా చేసుకుంటూపోతే వనరులు వృథా అవుతాయి. నీ వనరులు దేనికోసం ప్రధానంగా ఉండాలి? పెట్టుబడిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రధానంగా ఉండాలి. సంక్షేమానికి కొంచెం మాత్రమే ఖర్చు బెట్టాలి.

సంక్షేమానికి కొంచెం మాత్రమే పెట్టాలంటే మీరేమి చేయాలి? టార్గెటెడ్ వాళ్ళకు మాత్రమే మీరు సదుపాయాలు కల్పించాలి. అంటే మొత్తంగా వెనకబడిన వాళ్ళకు కొంచెం కొంచెం ఇచ్చుకుంటూపోదాం, అందరూ క్రమంగా పైకి వస్తారు, మొత్తంగా వెనకబాటుతనాన్ని తగ్గించుకుంటూ పోదామని ఖర్చు పెట్టవద్దు మీరు. ఎవరిమీద మీరు ఖర్చుపెట్టాలంటే ఇవ్వాళ నువ్వు అన్నం పెట్టకపోతే రేపు చచ్చిపోతాడే వాడికి మాత్రం అన్నం పెట్టు. ఇవ్వాళ నువ్వు ఆసుపత్రికి తీసుకొని పోకపోతే రేపు చచ్చిపోతాడే వాడికి మాత్రమే ఆసుపత్రి సేవలు అందియ్యి. అంటే పూర్తిగా బికారులు అయిన వాళ్ళకు మాత్రమే పరిమితం కావాలి నువ్వు ఇచ్చేటటువంటి సదుపాయాలు. ఆపైన నీ డబ్బంతా కూడ పెట్టుబడిదారులకు

హైవేలు, విమానాశ్రయాలు ఇవన్నీ కల్పించడానికి ఖర్చు పెట్టాలి. అంటే మౌలిక సదుపాయాల కోసమే ఖర్చు పెట్టాలి. ఈ పాలసీలో భాగంగా వాళ్ళు ఏం జేస్తున్నారు అంటే ఒక పక్కనేమో చట్టం చేస్తున్నాం ఆహార భద్రతకు అని చెపుతూ, ఇంకొక పక్కేమో పేదవాళ్ళ నిర్వచనాన్ని మార్చేస్తున్నారు. రెండు పూటలా అమ్మా, నాయినా, పిల్లలూ ఇంత అన్నం తినడానికి సరిపోయే ఆదాయం లేనివాళ్ళు కూడ వాళ్ల కొత్త నిర్వచనంలోకి రావడం లేదు. అంతకంటే ఇంకా తక్కువ ఉంటేనే వాళ్ల దృష్టిలో పేదవాళ్ళు. మనుషులెవరైనా రెండు పూటలా అన్నం తినగలగాలి, పిల్లలను స్కూలుకు పంపించగలగాలి, ఉండటానికో నివాసం కలిగి ఉండాలి, కనీసమైన, శుభ్రమైన జీవితం గడపాలి. అలా గడపలేని వారందరికీ ప్రభుత్వం ఆసరా ఉండాలంటే కొంత అర్థముంది దాంట్లో. కాని వీళ్లైనంత కుదించాలనే ఆలోచన చేయడమేమిటి? ఈ వైఖరి మీద ఇవ్వాళ చాలా విమర్శ అవసరం. ఒక్కొక్క హక్కు, హక్కుగా మనమడిగేది, డిమాండ్ చేసేది కల్పిస్తున్నారు కాని దానిని ఎట్లా వక్రీకరిస్తారో, కుదిస్తారో అర్థం చేసుకోకపోతే, ఆలోచించకపోతే చాలా నష్టపోతాం.

విద్యా హక్కును చట్టం చేశారు. మంచిదే కాని రాజ్యాంగం ఏమి చెప్పింది? పద్నాలుగేళ్ళ వయస్సు వరకు పిల్లలందరికి నిర్బంధంగా చదువు కల్పించమంటే దాని ఉద్దేశమేమిటి? ప్రభుత్వం తన బాధ్యతగా ఆ పని చేయాలని. ఇవ్వాళేం చేశారు? మేము చదువుకున్న రోజులలో, ఇక్కడ పెద్దవాళ్ళందరూ చదువుకున్న రోజులలో ఊర్లో ఒకే స్కూలు ఉండేది. హైదరాబాదు, విశాఖపట్నం లాంటి సిటీలను మినహాయిస్తే గవర్నమెంట్ స్కూళ్ళే ఉండేవి. అందరం ఆ స్కూల్‌కే పోయేవాళ్ళం. ఊర్లో కోటీశ్వరుడో, లక్షాధికారో ఉంటే వాళ్ళు కార్లో వచ్చేది, మేము సైకిల్‌మీద పోయేవాళ్ళం. అంతే తేడా తప్ప, అందరం ఒకే స్కూలుకు పోయేవాళ్ళం. ఒకే పంతులు దగ్గర, ఒకే సిలబస్ చదువుకుని ఒకే పరీక్షలు రాసేవాళ్ళం. ఇవ్వాళ స్కూళ్ళు ఏమయ్యాయి? రకరకాల స్కూళ్ళు. మీ కులాన్ని బట్టి, మీ డబ్బును బట్టి, మీ హోదాను బట్టి మీరు స్కూలు ఎంచుకోవచ్చు. అట్టడుగు వర్గ ప్రజానీకం అంటే ఎస్సీలు, ఎస్టీలు, బాగా వెనకబడినటువంటి బి.సి కులాలు మాత్రమే ఇవ్వాళ ప్రభుత్వ స్కూళ్ళకు పోతూ ఉన్నారు. దీనిని బాగు చెయ్యకుండా నువ్వు విద్యా హక్కు కల్పిస్తానంటే ఏమన్నా అర్థం ఉందా దానికి?

పదే పదే డిమాండ్ చేస్తున్నాయి విద్యా హక్కుల సంఘాలు – కామన్ స్కూల్ సిస్టం రావాలి ఇండియాలో అని. అమెరికాలో ఉంది అది. అంత ధనవంతుల దేశం, కోటీశ్వరుల దేశం అయినా అమెరికాలో అందరూ ఒకే స్కూల్‌కి పోతారు.


ఆయా ప్రాంతాలలో ఉండే నైబర్‌హుడ్ స్కూలుకే పోతారు. ఒకే సిలబస్ చదువుతారు. ఒకే టీచరు చదువు చెపుతారు. ఒకే పరీక్షలు రాస్తారు. అన్నిట్లో అమెరికా మనకు నమూనా. కాని దీనికి మాత్రం వద్దు. ఇక్కడ మనమేం అడుగుతున్నాం? ఒకే ప్రభుత్వ స్కూళ్లు పెట్టు. తెలుగులో చెప్పు, తమిళంలో చెప్పు, మరాఠీలో చెప్పు, స్థానిక భాషలో చెప్పు. కాని అదే సిలబస్. అదే టీచర్లు, అదే స్కూల్‌లో అందరూ చదువుకోవాలి. అప్పుడు నువ్వు అందరికీ చదువనేది తప్పనిసరి చేస్తే అర్థముందిగానీ, విద్యావ్యవస్థను మొత్తంగా ఈ రకంగా వర్గీకరించేసి, కులాన్ని బట్టి, డబ్బును బట్టి, హోదాను బట్టి ఎంచుకోవచ్చు నువ్వు అని చెప్పేసి, ఆ తర్వాత ఈ చట్టం చేస్తే అర్థమేమిటి? చాలా హక్కులు కల్పిస్తున్నట్టే అనిపిస్తుంది పేపర్లో వార్తలు చదివితే. కాని వాళ్ళు ఈ హక్కులన్నింటినీ కూడ వక్రీకరించి, కుదించి, తలక్రిందులు చేసి అమలు చేస్తున్నారనేది అర్థం చేసుకోవాలి. అభివృద్ధికి నిర్వచనం మా దృష్టిలో ఏమిటీ అనంటే ప్రతి మనిషికీ, ఇవ్వాళ్టి భారతదేశంలో ఉండేటటువంటి అభివృద్ధి స్థాయిలో ఎంత నిండుగా బతికే అవకాశం ఉంటుందో, ఎంత నిండుగా ఎదిగే అవకాశం ఉంటుందో అది ప్రతి ఒక్కరికి సమానంగా దక్కాలి. కులమని గాదు, ఆడా మగా అని గాదు, పట్టణవాసులు, గ్రామీణవాసులు అని గాదు, ఆదివాసులు, ఇంకొకరు అని గాదు – అందరికీ సమానంగా దక్కాలి. అటువంటి అభివృద్ధి మనకు కావాలి. దానికి భిన్నంగా ప్రజానీకానికి కనీస జీవనం కల్పిస్తున్న ప్రకృతి వనరులను మొత్తం తీసుకొని పెట్టుబడిదారీ కంపెనీల లాభాల వేటకు అప్పగించేసి మీ చావు మీరు చావండి, బికారులుగండి అనే అభివృద్ధి పంథాను అనుసరిస్తున్నారు. దాన్ని అందరం గట్టిగా వ్యతిరేకిద్దాం. హక్కులు కల్పిస్తున్నామని చెపుతూ ఏ రకంగా వాటిని వాళ్లు కుదించి, వక్రీకరించి, తలక్రిందులు చేస్తున్నారో దాన్ని గుర్తించి, విశ్లేషించి వ్యతిరేకిద్దాం. ప్రజల కనీస జీవన ప్రమాణాలను, సమాన అభివృద్ధి హక్కును కాపాడుకుందామని, ఈ ప్రయత్నంలో అన్ని ఉద్యమాలూ కలిసిరావాలని కోరుతూ నేను సెలవు తీసుకుంటున్నాను.

**'అభివృద్ధి–సహజ వనరుల దోపిడి'పై అమలాపురంలో జరిగిన మానవహక్కుల వేదిక బహిరంగసభలో చేసిన ప్రసంగం**

**23 ఆగస్టు 2009**

('రాజ్యం–సంక్షేమం' పుస్తకంలో వచ్చిన ఈ వ్యాసాన్ని కొద్దిగా సంక్షిప్తం చేశాం.)

# సహజవాయువుపైన మొదటి హక్కు స్థానికులకేనా?



**గో**దావరి జిల్లాల వాళ్లొక వింత ఉద్యమం చేపట్టారు. కోనసీమ తీరాన లభిస్తున్న సహజవాయువు తమ సంపద అనీ, దానిని తమ అవసరాలు తీర్చడానికే ప్రధానంగా వినియోగించాలనీ ఆందోళన చేస్తున్నారు. దానితో పాటు రాష్ట్ర అవసరాలూ తీర్చాలని, రాష్ట్ర వాటా కోరుతానని ముఖ్యమంత్రి అంటున్నాడు. అక్కడి సహజ వాయువును వెలికి తీసి వ్యాపార లాభం పొందే కాంట్రాక్టు రిలయన్స్ కంపెనీకి ఎందుకిచ్చారు అన్న న్యాయమైన అభ్యంతరం ఈ డిమాండుతో కలగలిసి పోవడం వల్ల ఇది చాలామందికి న్యాయమైన డిమాండుగా కనిపిస్తున్నట్టుంది. 'మా సంపదను రిలయన్స్ వాడు తీసుకుపోయి అమ్ముకుంటున్నాడు. అంబానీ సోదరులు అది తమ ఇంటి ఆస్తి అయినట్టు కొట్టుకుంటున్నారు. ప్రభుత్వం వారితో లాలూచీ పడి వారికి ఈ అవకాశం ఇచ్చింది' అన్నది ఎవరికయినా ఆకర్షణీయంగా తోచే వాదనే. అందులో సగం న్యాయమైనదనీ, సగం సందేహాస్పదమైనదనీ అర్థం చేసుకోవడానికి కొంత వివేచన అవసరం.

అసలు సహజవాయువును వెలికి తీసి ప్రాసెస్ చేసి మార్కెట్‌లోకి తీసుకొచ్చే ప్రాజెక్టును రిలయన్స్‌కు ఎందుకిచ్చారు? పెట్రోలియం, సహజవాయువుల నిక్షేపాలను అన్వేషించడంతో మొదలుపెట్టి వాటి వెలికితీత, శుద్ధి, మార్కెటింగ్‌లలో దశాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న ప్రభుత్వరంగ సంస్థ ఓఎన్‌జిసి ఉండగా ప్రైవేట్ రంగ సంస్థకు ఎందుకిచ్చారు? ఓఎన్‌జిసిని ఆసియా, ఆఫ్రికాలోని ఇతర దేశాలు సహితం తమ దగ్గరున్న పెట్రోలియం, సహజ వాయువులను వెతికి వెలికి తీయమని అడుగుతుండగా ఇండియాకు మాత్రం

రిలయన్స్ కావలసి వచ్చిందా? అంబానీ సోదరులకు రాజకీయ వర్గాలలో ఏజెంట్లు పుష్కలంగా ఉండడం తప్ప దీనికి వేరే ఏమయినా కారణం ఉందా?

పైగా వెలికి తీసిన సహజవాయువు ధరను నిర్ణయించే వ్యవస్థను కూడ అంబానీకి అనుకూలంగా రూపొందించారు. రాజకీయాలకు అతీతంగా పని చేసే నిపుణుల కమిషన్ ధర నిర్ణయించాలనీ, పెట్రోలియం నియంత్రణ చట్టం కింద అటువంటి కమిషన్‌ను ఈ అవసరార్థం నియమించాలనీ బలంగా ముందుకొచ్చిన డిమాండును కాదని ప్రభుత్వం కేంద్ర క్యాబినెట్‌లోని ఒక మంత్రుల బృందానికి సహజవాయువు ధర నిర్ణయించే బాధ్యత అప్పగించింది. రాజకీయ నాయకులను కొనుక్కోవడం అలవోక విద్య అయిన అంబానీకి ఇది చాలా అనుకూలమయింది. అది చాలక, వెలికి తీసిన సహజవాయువును కేంద్ర ప్రభుత్వం సరఫరా చేయమన్న వారికి సరఫరా చేసిన తరువాత ఆ పైన మిగిలిన దానిని అమ్ముకునే హక్కు (ప్రభుత్వం నిర్ణయించే ధరకే అయినప్పటికీ) రిలయన్స్‌కు ఇచ్చినట్టున్నారు. అంత విలువయిన సహజ వనరు మార్కెటింగ్‌ను ప్రభుత్వం చేతిలో ఉంచుకోకుండ ప్రైవేట్ కంపెనీకి దానిపైన పెత్తనం ఎందుకిచ్చారు?

ఈ న్యాయమైన అభ్యంతరాన్ని 'మా సహజ వనరులు మాకే' అన్న సందేహాస్పదమైన డిమాండుతో కలగలపడం ఆవేశంలో న్యాయంగానే తోచవచ్చును గానీ కొంచెం ఆగి వివేచించడం అవసరం. 'సహజ వనరులపైన స్థానికులకే అధికారం', లేక మొదటి వాటా ఉండాలన్న డిమాండు ఆదివాసీ ప్రాంతాలకు తప్ప ఇతర ప్రాంతాలకూ సందర్భాలకూ వర్తిస్తుందా? ఆదివాసీ సమాజాల ప్రత్యేకత ఏమిటంటే వారి పరిసరాలలోని సహజ వనరులు వారికి కేవలం ఆర్థిక అవసరాలకూ భౌతిక ప్రగతికీ మాత్రమే ఆధారం కాదు. వారి సంస్కృతి, జీవన విధానం, సామాజిక కట్టుబాట్లు అన్నీ వారి పర్యావరణంతోనే ముడిపడి ఉంటాయి. ఆదివాసీ సమాజం ఉనికికే ఆ పర్యావరణం మూలం. కోనసీమకు కె.జి బేసిన్ సహజవాయువు అటువంటిది కాదు.

ఒక్కొక్కసారి వనరులు పుష్కలంగా ఉండి కూడ అభివృద్ధి ఫలాలు అందని ప్రాంతాల నుండి 'మా వనరులు మాకే' అన్న ఆవేశపూరితమైన నినాదం వస్తుంటుంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం అస్సాం నుండి ఈ వాదన విన్నాం. పెట్రోలియం నిక్షేపాలను అస్సాం నుండి తీసుకుపోయి ఇతర ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారనీ అస్సాం వెనుకబడి ఉండిపోయిందనీ అస్సామీయులకు న్యాయమైన అభ్యంతరం ఉంది. పారిశ్రామిక ప్రగతికి మూల సంపద అయిన పెట్రోలియం మా దగ్గర ఉండి కూడ మేమెందుకు పారిశ్రామికంగా అభివృద్ధి చెందలేదు అన్నది న్యాయమైన ప్రశ్న. అది ఆవేశంలో

‘మా పెట్రోలియం వనరు మాదే’ అనే రాజకీయ డిమాండు రూపం తీసుకున్నప్పుడు ఎంతవరకు సమంజసం అని ఆలోచించవలసి ఉంటుంది. తెలంగాణ విషయంలోనూ ఈ రెండు రకాల అభిప్రాయాలు కలగలిసి పోయి నినాదం రూపం తీసుకోవడం చూస్తున్నాం. తెలంగాణలో బొగ్గు, నీళ్లు, అడవులు విస్తారంగా ఉన్నప్పటికీ వాటి ఫలితమైన అభివృద్ధిలో సమాన వాటా తెలంగాణ పొందలేదు. తెలంగాణతో పోలిస్తే సహజ వనరులు ఏమంత లేని సర్కారు జిల్లాలు ఎక్కువ అభివృద్ధి చెందాయి, రాష్ట్రంలోని సహజ వనరుల ఫలాన్ని ఎక్కువ పొందాయి. దీనికి ప్రాంతీయ వివక్ష, పెత్తనం కారణం అన్నది న్యాయమైన అభియోగం, వివేచనకు నిలబడే అభియోగం. దాని నుండి సహజంగా పుట్టే ఆవేశంలో ‘మా వనరులు మాకే’ అన్న నినాదం, ‘సహజ వనరుల పైన స్థానికులకే హక్కు’ అన్న సూత్రీకరణ ముందుకొస్తున్నాయి. ఈ ఆవేశాన్ని అర్థం చేసుకోవచ్చును గానీ ఆ సూత్రీకరణతో ఇబ్బందులున్నాయి. సహజ వనరులు దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ ఒకే మోతాదులో ఉండవు. ఒక చోట ఎక్కువ, ఒక చోట తక్కువ ఉంటాయి. ఉండడానికీ లేకపోవడానికీ స్థానికులు చేసినదీ చేయనిదీ ఏదీ కారణం కాదు. అది ప్రకృతి సిద్ధం. వనరులు దేశంలో ఎక్కడున్నా వాటి ఫలం దేశమంతటికీ సమానంగా దక్కాలన్నదొక్కటే ప్రజాతంత్ర సూత్రం. (దేశాల సార్వభౌమత్వం, రాజకీయ సరిహద్దులు లేకపోయినట్టయితే ఇది ప్రపంచానికంతా వర్తిస్తుంది). అంతే తప్ప అన్ని వనరులపైన హక్కు (లేక మొదటి హక్కు) స్థానికులకే అనేటట్టయితే ఏ వనరులు లేని ప్రాంతాలకు ఎప్పుడూ రెండవ హక్కే మిగులుతుంది. వారు రెండవ శ్రేణి పౌరులుగానే ఉండిపోతారు. ఇది సమానతా సూత్రానికే విరుద్ధం. అయితే సహజ వనరుల ఫలాన్ని అందరికీ సమానంగా అందియ్యాలన్న ప్రయత్నానికి భౌతిక, సాంకేతిక సాధ్యాసాధ్యాల అవరోధం కొంత మేరకు ఉంటుంది. కాబట్టి వనరులు ఎక్కువ ఉండే ప్రాంతాలు ఎంత వద్దన్నా కొంత ఎక్కువ వాటా పొందుతాయి. ఉదాహరణకు భూసారాన్ని తరలించడం సాధ్యం కాదు కాబట్టి సారవంతమైన భూములున్న ప్రాంతాలు కొంత ఎక్కువగానే అభివృద్ధి ఫలాలు పొందుతాయి. వేరే ప్రాంతాలకు ఇతర వనరులు ఎక్కువ అందియ్యాలన్న ప్రయత్నం చేసినా పూర్తిగా ఫలించకపోవచ్చు. అయినప్పటికీ దేశంలోని సహజ వనరుల ఫలాలపైన దేశ ప్రజలందరికీ సమాన హక్కు ఉండాలన్నదొక్కటే సమానతా విలువకు ఆమోదనీయం కాగలదు.

**ప్రజాతంత్ర వారపత్రిక**

**6 సెప్టెంబర్ 2009**

# సర్దార్ సరోవర్ ప్రాజెక్టు: సుప్రీంకోర్టు కళ్లకు 'అభివృద్ధి' గంతలు

నర్మదా బచావ్ ఆందోళన్ (ఎన్‌బిఎ) కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల ఆ కేసులోని బాధితులకు జరిగిన అన్యాయం ఒకెత్తయితే, ప్రభుత్వ 'అభివృద్ధి' పథకాలపైన న్యాయవ్యవస్థకు ఉండే పర్యవేక్షణ అధికారాన్ని చాలా సంకుచితంగా వ్యాఖ్యానించడం ద్వారా ఆ వ్యవస్థ ప్రజలకు ఇవ్వగల రక్షణను బాగా కుదించి వేయడం మరొక ఎత్తు. ఇదే వరవడిని సుప్రీంకోర్టు కొనసాగించేటట్టయితే సగటు రాజకీయనాయకుల పట్ల ప్రజలకు ఏమాత్రం గౌరవం ఉందో అంతకంటే ఎక్కువ కోర్టుల పట్ల ఉండబోదు. ఉండవలసిన అవసరమూ లేదు.

ఆ కేసుకు సంబంధించిన వివరాలివి.

నర్మదా నది దేశ పడమటి తీరంలో ప్రవహించే నదులన్నిటిలోనికీ పెద్దది. మధ్యభారతంలోని ఎత్తయిన కొండలలో పుట్టి ఎక్కువ భాగం మధ్యప్రదేశ్‌లోనూ, కొంత ఆ రాష్ట్రానికీ, మహారాష్ట్రకూ ఉన్న సరిహద్దుమీదుగానూ, కొంత మహారాష్ట్రకూ గుజరాత్‌కూ ఉన్న సరిహద్దుమీదుగానూ, కొంత గుజరాత్ రాష్ట్ర మైదాన ప్రాంతంలోనూ ప్రవహించి భరూచ్ నగరం సమీపంలో అరేబియన్ సముద్రంలో కలుస్తుంది.

దాదాపు 96 శాతం వృథాగా సముద్రంలోకి పోతున్న ఈ నది నీటిని సాగుకోసం వినియోగించుకోవడం వ్యవసాయ అభివృద్ధికి చాలా ఉపయోగపడుతుందన్న ఆలోచన స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజులలోనే ప్రభుత్వాలకు వచ్చింది. అయితే వేరే ఏ నది విషయంలోనూ జరగనిదీ, నర్మద విషయంలో మొదటి నుండి జరుగుతున్నదీ ఏమిటంటే మొత్తంగా నది పై భాగం

నుండి కింది భాగం వరకు అనేక ప్రాజెక్టుల రూపకల్పనకు ఒకేసారి ముసాయిదాలు తయారు చేయడం. ఉదాహరణకు ప్రస్తుతం ప్రతిపాదనలో ఉన్నది 30 పెద్ద డ్యాంలు, 135 మధ్యతరహా డ్యాంలు, 3000 చిన్నతరహా డ్యాంలు. ఇందులో ఎక్కువభాగం మధ్యప్రదేశ్‌లోనూ, కొన్ని గుజరాత్‌లోనూ కట్టాలని ప్రతిపాదన. కోర్టుకెక్కిన సర్దార్ సరోవర్ ఈ 30 పెద్ద డ్యాంలలో అన్నిటికన్నా దిగువన ఉంటుంది. అదొక్కటి గుజరాత్‌లో ఉంటుంది. మిగిలిన 29 పెద్ద డ్యాంలూ దానికి ఎగువన మధ్యప్రదేశ్‌లో కట్టనున్నారు. కాబట్టి సర్దార్ సరోవర్ గురించి సుప్రీంకోర్టు వ్యక్తపరచిన అభిప్రాయాలు రాబోయే ఆ 29 పెద్ద ప్రాజెక్టులకూ వర్తిస్తాయి. అయితే ఈ అభిప్రాయం వ్యక్తం చేసే క్రమంలో సుప్రీంకోర్టు చాలా సూత్రీకరణలు చేసింది కాబట్టి అవి నర్మదా నది మీద మన పాలకులు తలపెట్టిన భారీ ప్రణాళికను దాటి ఇతర అన్ని అభివృద్ధి పథకాలకూ వర్తిస్తాయి. ఈ అభిప్రాయాల సారాంశాన్ని రెండు వాక్యాలలో చెప్పుకోవచ్చు. ప్రభుత్వం మీద కోర్టులకు అపనమ్మకం ఉండవలసిన అవసరం లేదు. ఆధారాలు చూపించినా ఉండనవసరం లేదు. అన్యాయం జరగకుండా చూడడానికి తగు జాగ్రత్తలు రూపొందించినట్టు ప్రభుత్వం చూపిస్తే చాలు, కోర్టులింక జోక్యం చేసుకోనక్కరలేదు. ఆ జాగ్రత్తలు పని చేస్తాయని కోర్టులు విశ్వసిస్తాయి.

నర్మదా నీటిని వృథా పోనీయకుండా వాడుకోవాలన్న సంకల్పం మూడు రాష్ట్రాలలోనూ తొలి నుండి ఉన్నప్పటికీ ఒకరి ప్రయత్నం పట్ల మరొకరికి సందేహాలు ఉన్నాయి. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలు చేపట్టజూస్తున్న ప్రాజెక్టులు తాను చేపట్ట తలపెట్టిన ప్రాజెక్టుకు నీళ్లు లేకుండా చేస్తాయని గుజరాత్ ప్రభుత్వం లేవదీసిన వివాదం ఫలితంగా నర్మదా జలవివాదాల ట్రిబ్యునల్‌ను కేంద్ర ప్రభుత్వం 1968లో ఏర్పాటు చేసింది. ట్రిబ్యునల్ తన తీర్పు 1978లో ఇచ్చింది. ఆ తీర్పును మించి ఇప్పుడు చెప్పేది ఏమీ లేదనీ, అందులో లేని హక్కులడిగితే ఇచ్చేది లేదనీ ఇప్పుడు సుప్రీంకోర్టు అంటున్నది. సుప్రీంకోర్టు ఈ కేసులో చేసిన అన్ని సూత్రీకరణలలోకీ హాస్యాస్పదమైనది ఇది. దేశంలోని అన్ని కోర్టులపైన, అన్ని ట్రిబ్యునల్స్‌పైన పర్యవేక్షక అధికారం రాజ్యాంగమే ఆర్టికల్ 136లో సుప్రీంకోర్టుకు ఇచ్చింది. అటువంటప్పుడు 'నర్మదా ట్రిబ్యునల్ అవార్డులో లేనిదేదీ మమ్మల్ని అడగొద్దు. దానికి అందరూ (సుప్రీంకోర్టుతో సహా) కట్టుబడి ఉండాలి' అనడంలో అర్థం లేదు.

నర్మదా జలవివాదాల ట్రిబ్యునల్ అవార్డును అనుసరించి గుజరాత్ ప్రభుత్వం సర్దార్ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకుంది. మొదట్లో ఈ ప్రాజెక్టు వలన

7000 కుటుంబాలు నిర్వాసితులవుతారని అంచనా వేశారు. ప్రాజెక్టు నిర్మించే ప్రయత్నం 1978లోనే మొదలయినప్పటికీ ముంపుకు గురయ్యే ప్రాంతం దట్టమైన అడవి కావడం వల్ల పర్యావరణ సంబంధమైన అనుమతి కేంద్రప్రభుత్వం నుండి 1987 దాకా గుజరాత్‌కు లభించలేదు.

ఆ నేపథ్యంలో 1986లో నర్మదా బచావ్ ఆందోళన్ (ఎన్‌బిఏ) ఏర్పడింది. పునరావాసం నుండి పర్యావరణం దాకా అనేక విషయాలలో వారు అభ్యంతరాలు లేవదీసి ప్రాజెక్టును పునఃపరిశీలించాలని కోరారు. గుజరాత్ ప్రభుత్వం అప్పటికే (1985లో) ఈ ప్రాజెక్టుకు ప్రపంచబ్యాంకు సహాయం మంజూరు చేయించుకుంది. అయితే ప్రాజెక్ట్ గురించి గుజరాత్ ప్రభుత్వం చెప్పినదేదీ విశ్వసనీయం కాదని ఎన్‌బిఏ ఆందోళన చేయడం వల్లనే కాబోలు ప్రపంచబ్యాంకు ప్రాజెక్టును తిరిగి పరిశీలించి నివేదిక సమర్పించమని మోర్స్ కమిటీ అనే స్వతంత్ర కమిటీని నియమించింది. పునరావాసం, పర్యావరణాలకు సంబంధించిన అంశాలపైన ఈ కమిటీ దృష్టి కేంద్రీకరించి 10 నెలల పాటు ఒక్క సర్దార్ సరోవర్‌నే కాక మొత్తంగా గుజరాత్ రాష్ట్రం నర్మదా నదిపైన తలపెట్టిన అన్ని ప్రాజెక్టులనూ అధ్యయనం చేసింది. ప్రపంచబ్యాంకు నుండి గుజరాత్ ప్రభుత్వం దాకా అందరి దగ్గరున్న పత్రాలూ మోర్స్ కమిటీ చూడగలిగింది. ఈ విషయంలో నిపుణులైన చాలామంది దేశవిదేశాలకు చెందిన వైజ్ఞానికులు ఆ కమిటీకి సహాయం చేశారు.

## మోర్స్ కమిటీ చెప్పిందేమిటి? కోర్టు అనిందేమిటి?

1992 జూన్ నెలలో మోర్స్ కమిటీ తన నివేదికను ప్రపంచబ్యాంకుకు సమర్పించింది. 'ఈ ప్రాజెక్టులకు ప్రాతిపదిక అయిన అతి ముఖ్యమైన అభిప్రాయాలిప్పుడు ప్రశ్నార్థకంగా కనిపిస్తున్నాయి. అందులో కొన్ని పూర్తిగా నిరాధారమైనవి. పర్యవసానాల గురించి సమగ్రమైన అవగాహన లేకుండా సాంఘిక దుష్పరిణామాల కంటే, పర్యావరణ సంబంధమైన దుష్ఫలితాల కంటే ప్రాజెక్టు ఇచ్చే సత్ఫలితాలే ఎక్కువన్న నిర్ధారణకు వచ్చేశారు. ఆ కారణంగా సత్ఫలితాలనెక్కువ చేసి చూపించడం, సాంఘిక దుష్పరిణామాలనూ పర్యావరణ సంబంధమైన దుష్పరిణామాలనూ తక్కువ చేసి చూపించడం జరుగుతున్నది'.

'ఈ ప్రాజెక్టులు లోపభూయిష్టమైనవని మేము భావిస్తున్నాం. వీటివల్ల నిర్వాసితులు కాబోయే వారందరి పునరావాసం ప్రస్తుత పరిస్థితులలో అసాధ్యమని నమ్ముతున్నాం. ఈ ప్రాజెక్టులు పర్యావరణంపైన వేయగల ప్రభావాన్ని సరిగ్గా

లెక్కలోకి తీసుకోలేదనీ, వాటికి తగిన రీతిలో జవాబు చెప్పలేదనీ అనుకుంటున్నాం'.

'సర్దార్ సరోవర్ చరిత్ర పర్యావరణ సంబంధమైన విషయాలను నిర్లక్ష్యం చేసిన చరిత్రే. ప్రాజెక్టు ప్రభావాన్ని గురించి సమగ్రమైన ప్రకటన లేదు. పర్యావరణ సంబంధమైన సమస్యల స్వభావం, వాటి పరిమాణం అంచనాకు అందడం లేదు'.

'మానవ అవసరాల కంటే, పర్యావరణ ప్రయోజనాల కంటే ఆర్థిక ఒత్తిడులూ సాంకేతిక నియమాలూ ప్రధానమయ్యాయనేది స్పష్టమే. సాంఘిక, పర్యావరణ సంబంధమైన విషయాలను తృణీకరించిన తీరు ఈ రోజు సమర్థనీయంగా కనిపించదు'.

ఇవీ, మోర్స్ కమిటీ నర్మదా ప్రాజెక్టుల గురించి వ్యక్తం చేసిన స్పష్టమైన అభిప్రాయాలు. ఎన్‌బిఏ 1994లో సుప్రీంకోర్టులో కేసు వేసినప్పుడు ఈ రిపోర్టును కూడ కోర్టు ముందుంచింది. అయితే చివరికి తీర్పు ఇచ్చేటప్పుడు సుప్రీంకోర్టు మోర్స్ రిపోర్టు గురించి ఏమనిందంటే 'దీనిని గుజరాత్ ప్రభుత్వమూ తిరస్కరించింది, ప్రపంచబ్యాంకు కూడ తిరస్కరించింది' కాబట్టి కోర్టు పట్టించుకోనక్కరలేదని. ప్రభుత్వం అభిప్రాయాలను (ప్రపంచబ్యాంకు అభిప్రాయాలనూ! ప్రామాణికంగా తీసుకునేటట్టయితే ఇంక దేశంలో కోర్టులెందుకు?

1986లో ఏర్పడిన నాటి నుండి ఎన్‌బిఏ సర్దార్ సరోవర్ ప్రాజెక్టు గురించి ప్రశ్నలు లేవదీస్తూ అనేక రూపాలలో ఆందోళన చేసింది. మోర్స్ కమిటీతో పూర్తిగా సహకరించింది. ఆ నివేదికను ప్రపంచబ్యాంకు, మన పాలకులూ కూడ తిరస్కరించడం, డ్యాం నిర్మాణం కొనసాగించడం చూసి ప్రాజెక్టును పునః పరిశీలించాలన్న ఒత్తిడి గుజరాత్ ప్రభుత్వంపైన పెంచింది. 1993లో గుజరాత్ ప్రభుత్వం ఎన్‌బిఏ అభ్యంతరాలను పరిశీలించి తనకు నివేదిక సమర్పించమని ఒక అయిదుగురు సభ్యుల కమిటీని వేసింది.

ఈ క్రమంలోనే ఎన్‌బిఏ సుప్రీంకోర్టులో 1994లో ప్రజా ప్రయోజనాల కేసు వేసింది. సుప్రీంకోర్టు సర్దార్ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణంపైన స్టే ఇచ్చింది. ఆ తరువాత కేసును తీరికగా విని చివరికి 2000 సంవత్సరం అక్టోబర్ 18వ తేదీన పిటిషనర్‌ను కించపరిచే వ్యాఖ్యలు చేస్తూ కేసు కొట్టేసింది.

'ఈ పిటిషనర్ డ్యాంలను వ్యతిరేకించే సంస్థ. 1986లోనే, పర్యావరణ సంబంధమైన అనుమతి ఈ ప్రాజెక్టుకు లభించకముందే ఈ సంస్థ ఉనికిలోకి వచ్చింది. అప్పటి నుండి డ్యాంను వ్యతిరేకించడానికి రకరకాల మార్గాలు అనుసరించింది. వీరి ఒత్తిడి ఫలితంగానే అయిదుగురు సభ్యుల కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. అయినప్పటికీ పునరావాసం పూర్తయ్యేదాకా డ్యాం నిర్మాణాన్ని ఆపాలన్న కాంక్ష తీరలేదు కాబట్టి కోర్టుకొచ్చారు'.

ఇంత చులకనగా కాకుండా వేరొకరకంగా వ్యాఖ్యానించుకుంటే ఇదే విషయాన్ని ఇంకొక రీతిగా చెప్పుకోవచ్చు. సర్దార్ సరోవర్ ప్రాజెక్టు వల్ల ప్రయోజనం కన్నా నష్టమే ఎక్కువని గ్రహించిన ఎన్‌బిఏ మొదట బహిరంగ విమర్శ ద్వారా, ఆందోళన ద్వారా గుజరాత్ ప్రభుత్వం నిర్ణయాన్ని, ప్రపంచబ్యాంకు మద్దతును ప్రభావితం చేయాలని ప్రయత్నం చేసింది. ప్రపంచబ్యాంకు మోర్స్ కమిటీని నియమించగా, ఎన్‌బిఏ ఆ కమిటీతో పూర్తిగా సహకరించింది. ఆ కమిటీ ఎన్‌బిఏతో అంగీకరించినా ప్రపంచబ్యాంకు, గుజరాత్ ప్రభుత్వమూ ఆ నిపుణుల నివేదికను తిరస్కరించాయి. అయినప్పటికీ ఎన్‌బిఏ తన ఆందోళనను కొనసాగించి గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం పునఃపరిశీలన కోసం అయిదుగురు సభ్యుల కమిటీని నియమించేటట్టు ఒత్తిడి పెట్టగలిగింది. ఒక పక్క ఆ కమిటీని నియమించిన ప్రభుత్వం మరో పక్క డ్యాం నిర్మాణాన్ని కొనసాగించేసరికి ఇంక విధిలేక ఎన్‌బిఏ 1994లో కోర్టుకొచ్చింది.

మామూలుగానయితే ఇదే సరైన పద్ధతి అని న్యాయమూర్తులు మెచ్చుకుంటారు. 'ప్రత్యామ్నాయ ప్రయత్నాలన్నీ చేయకుండా నేరుగా కోర్టుకెందుకు వచ్చారు?' అని ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోగానే కోర్టుకెక్కిన వారిని మందలిస్తుంటారు. కానీ ఆ పని చేసిన ఎన్‌బిఏను 'అట్లా ఆపుదామని చూశావు, ఇట్లా ఆపుదామని చూశావు, ఏదీ సాధ్యం కాకపోయేసరికి ఆఖరి ఎత్తుగడగా కోర్టుకు వచ్చావా?' అని అడుగుతున్నది సుప్రీంకోర్టు. మరైతే ప్రజలు ఏం చేయాలి? వెంటనే రాకూడదు, ఆలస్యంగా రాకూడదు అంటే అసలే కోర్టుకు రావద్దనే కదా అర్థం?

సర్దార్ సరోవర్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం 1987లోనే పర్యావరణ సంబంధమైన అనుమతి ఇచ్చేసిందనీ, ఆ తరువాత గుజరాత్ ప్రభుత్వం డ్యాం నిర్మాణం చేపట్టడం సక్రమమేననీ, అటువంటప్పుడు 1994లో ఎన్‌బిఏ కోర్టుకొచ్చి ప్రాజెక్టును ఆపమనడం బాధ్యతారహితమైన ఆలస్యమనీ, అందువల్ల పర్యావరణ

సంబంధమైన అభ్యంతరాలేవయితే ఎన్‌బిఏ లేవదీసిందో వాటికి జవాబు చెప్పనవసరం లేదనీ సుప్రీంకోర్టు అనింది. లక్షలాది మంది జీవితాలకు సంబంధించిన విషయంలో ఏడేళ్ల ఆలస్యం క్షమించరానిదేం కాదని దీనికి జవాబు చెప్పవచ్చు. ఆ ఏడేళ్లూ ఇతర రూపాలలో ఎన్‌బిఏ గుజరాత్ ప్రభుత్వంతో సంవాదం పెట్టుకుంటూనే ఉంది. కాబట్టి ఆ ఆలస్యంలో ఎన్‌బిఏ నిర్లక్ష్యమేమీ లేదని చెప్పవచ్చు. అయితే జస్టిస్ భరూచా ఇంకా కచ్చితమైన జవాబు చెప్పారు. ఈయన చీఫ్ జస్టిస్ ఆనంద్‌తోనూ జస్టిస్ కిర్పాల్‌తోనూ విభేదించి ఎన్‌బిఏతో చాలావరకు ఏకీభవిస్తూ 'అసమ్మతి తీర్పు' ఇచ్చాడు. ఆయన ఏమంటాడంటే 1987లో కేంద్రం ఇచ్చిన పర్యావరణ సంబంధమైన అనుమతి సక్రమంగా ఇచ్చినది కాదు కాబట్టి దానిని ఆధారం చేసుకుని గుజరాత్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు నిర్మాణం కూడ సక్రమం కాదు. అందువల్ల ఏడేళ్ల తరువాత దానిని ఆపమని కోర్టుకు రావడంలో తప్పేమీ లేదన్నాడు.

## పర్యావరణ అనుమతి విధంబెట్టిదన...

పర్యావరణ సంబంధమైన అనుమతి కేంద్రప్రభుత్వం ఇచ్చిన క్రమాన్ని తెలుసుకుంటే భరూచా గారి అభిప్రాయం ఎంత న్యాయమైనదో అర్థమవుతుంది. అంతకంటే ముందు 'పర్యావరణ సంబంధమైన అభ్యంతరాలు' అంటే ఏమిటో వివరించడం అవసరం. ఏవో అరుదయిన వృక్షజాతులో జంతుజాతులో అదృశ్యమయిపోతాయనో, ఇక్ష్వాకుల నాటి గుళ్లు మునిగిపోతాయనో గొడవ చేసి మనుషులకు మంచినీళ్లు లేకుండా చేస్తారని పర్యావరణ ఉద్యమకారులపైన ఇతరత్రా ప్రజానుకూలభావాలు కలవారికి కూడ కొంచెం అనుమానం ఉండడం కద్దు. ఆ రకంగా ఆలోచించే పర్యావరణ ఉద్యమకారులు లేకపోలేదు గానీ నిజమైన అర్థంలో పర్యావరణ సమస్యలు ప్రజల సమస్యలే. ఒక ప్రాజెక్టు ఫలితంగా చుట్టూ ఉన్న నేల, నీరు, గాలి, జీవరాశులు దెబ్బతింటే వాటి మీద ఆధారపడి జీవించే ప్రజల జీవనం, ఆరోగ్యం దెబ్బతింటాయి. జీవరాశులకు జరిగే నష్టం (అరుదయిన జీవజాతులు అదృశ్యమయిపోవడం, వగైరా) కూడ నష్టమేగానీ పర్యావరణ సమస్య అంటే అది మాత్రమే కాదు.

సర్దార్ సరోవర్‌కు సంబంధించిన పర్యావరణ సమస్యలు చాలానే ఉన్నాయి. నర్మదా నదిపైన మూడు రాష్ట్రాలూ తలపెట్టిన ప్రాజెక్టులన్నీ కట్టినట్టయితే వాటిలో ఆఖరిదైన సర్దార్ సరోవర్‌కు దిగువ నర్మదలో వరద బాగా తగ్గిపోతుంది. నదీముఖం దగ్గర హిల్సా అనే చేప ప్రస్తుతం బాగా దొరుకుతుంది. ఆ చేపను

వేటాడి బతుకుతెరువు సంపాదించుకుంటున్న జాలర్ల కుటుంబాలు గుజరాత్ ప్రభుత్వం అంచనా ప్రకారమే 4644 ఉన్నాయి. (10వేల కుటుంబాలని ఎన్‌బిఎ అంచనా.) వీరి బతుకుతెరువు రాబోయే రోజులలో తీవ్రంగా దెబ్బతింటుంది. అంతేకాదు, నదీముఖం దగ్గర ప్రవాహం తగ్గిపోయినట్టయితే సముద్రపు నీరు ప్రవాహానికి ఎదురుగా నదీముఖంలోకి ప్రవేశిస్తుంది. ఒడ్డున ఉన్న గ్రామాలకు తాగునీటి సమస్య ఏర్పడుతుంది. భరూచ్ పట్టణంతో సహా మొత్తం 210 గ్రామాలు ఈ సమస్యను ఎదుర్కొంటాయని మోర్స్ కమిటీ అంచనా వేసింది.

అందువల్ల ఈ 'పర్యావరణ' సమస్య వేల కుటుంబాల సమస్యనేది అర్థం అవుతుంది. అయితే దీనికి సుప్రీంకోర్టు ఏమంటుందంటే ఈ నష్టం అంచనా వేసింది మోర్స్ కమిటీ. ఆ కమిటీ నివేదికను ప్రపంచబ్యాంకు తిరస్కరించింది, గుజరాత్ రాష్ట్రప్రభుత్వమూ తిరస్కరించింది. కాబట్టి దాని మీద ఆధారపడడానికి వీలు లేదు. రెండు, ఈ నష్టం ఇంక 30 ఏళ్ళకు గానీ జరగదు. నర్మదా నదిపైన మూడు రాష్ట్రాలూ తలపెట్టిన అన్ని డ్యాంలూ కట్టిన తరువాత గానీ ఆ నష్టం జరగదు. 'అది కనుచూపుమేరలో జరగబోయే విషయం కాదు కాబట్టి పిటిషనర్ ఆందోళన నిరాధారమైనది' అని సుప్రీంకోర్టు అనింది.

దీనిని వ్యాఖ్యానించకుండా ఉంటేనే మర్యాదగా ఉంటుందేమో.

రిజర్వాయర్‌లో అడవి చాలా మునుగుతుంది. అటవీ భూభాగం తరిగిపోవడం వాతావరణానికి చాలా నష్టకరం కాబట్టి వర్షాభావం రూపంలోనూ, మితిమీరిన ఉష్ణోగ్రత రూపంలోనూ, కరువు రూపంలోనూ అది మనుషుల జీవితాలపైన తీవ్ర దుష్ప్రభావం చూపిస్తుంది కాబట్టి ఏ మేరకు అడవి మునుగుతుందో ఆ మేరకు కొత్తగా అడవి పెంచాలన్న నియమం పర్యావరణ సంబంధమయిన అనుమతికి ఒక తప్పనిసరి షరతు. గుజరాత్ ప్రభుత్వం ఆ షరతును అమలు చేస్తున్నట్టు చెప్పింది గానీ కొత్తగా అడవులు పెంచుతున్న భూములు సారహీనమైనవి కాబట్టి అది షరతును అమలు చేసినట్టు కాదని ఎన్‌బిఎ వాదించింది. దానికి సుప్రీంకోర్టు ఏమంటుందంటే 'కొత్తగా అడవులు పెంచుతున్నది సారహీనమైన నేలలో అయినంత మాత్రాన ఆ అడవులు ఏపుగా ఉండవని భావించవలసిన అవసరమేమీ లేదు'. బండనేలలో చవుడు నేలలో కూడ వనాలూ తోటలూ ఏపుగా పెరుగుతాయనే కొత్త జీవశాస్త్రానికి ఈ తీర్పు నాందిగా భావించాలేమో.

ప్రతీ రిజర్వాయర్‌కూ ఒక 'కాచ్‌మెంట్' ఉంటుంది. అది వర్షపు నీటిని ఆ రిజర్వాయర్‌లోకి చేరవేసే పరిసరప్రాంతం. అక్కడ కురిసిన వాననీళ్లు

రిజర్వాయర్లోకి ప్రవహించే క్రమంలో అక్కడ నేల మీద ఉన్న మట్టి కూడ రిజర్వాయర్‌లోకి చేరి రిజర్వాయర్ గర్భంలోని నేలమట్టం పెరుగుతుంది. దీనినే పూడిక అంటాం. ప్రాజెక్టులకు సంబంధించిన ముఖ్యమైన పర్యావరణ సమస్యలలో ఇదొకటి. ఈ పూడిక ఫలితంగా రిజర్వాయర్ నిలవ ఉంచాలని ఆశించినంత నీరు నిలవ ఉండదు. అందువల్ల రిజర్వాయర్ అందియ్యాలని ఆశించినంతగా సాగునీరు అందియ్యదు. రెండు లక్షల ఎకరాల ఆయకట్టు పూడిక ఫలితంగా ఆ నాలుగయిదేళ్లలో ఒక లక్ష ఎకరాలకు పడిపోతే మిగిలిన సగం ఆయకట్టు రైతులకు నోటికాడికొచ్చిన కూడు గుంజుకున్నట్టవుతుంది. అందువల్ల ఈ 'పర్యావరణ' సమస్య తీవ్రమైన మానవ సమస్యే. దీనిని పూర్తిగా నివారించడం సాధ్యంకాదు గానీ కాచ్‌మెంట్‌లోని మట్టి సులభంగా కొట్టుకొని పోకుండా ఉండడానికి తగిన చర్యలు తీసుకుంటే బాగా తగ్గించవచ్చు. పెద్దఎత్తున కాచ్‌మెంట్‌లో మొక్కలు పెంచడం ఈ చర్యలలో ఒకటి.

రిజర్వాయర్ పూడిక ప్రాజెక్టు ఒక చివర ఉండే సమస్యకాగా, పొలాలలోకి ప్రవహించే ప్రాజెక్టు నీళ్లు బయటికి వెళ్లిపోయే వ్యవస్థ సరిగ్గా ఏర్పడకపోతే వచ్చే మురుగు నీటి సమస్య ఇంకొక చివర ఉండే పర్యావరణ సమస్య. సమర్థమైన డ్రైనేజ్ వ్యవస్థను ప్రాజెక్టులో భాగంగా రూపొందించకపోతే ఈ సమస్య తీవ్రపరిణామాలకు దారితీస్తుంది.

పంటకాలవలు ప్రవహించే ప్రాంతంలో భూగర్భజలాలు ఉప్పునీటిగా మారడం (లవణీకరణ - సెలైనేజేషన్) మరొక ముఖ్యమైన పర్యావరణ సమస్య. ఇది ఆ ప్రాంత నివాసులకొక ముఖ్యమైన సమస్య అని వివరించి చెప్పనవసరం లేదు. మనుషుల జీవితంపైన, జీవనం పైన ప్రత్యక్ష ప్రభావం వేసే ఈ పర్యావరణ సమస్యలేకాక, వేరే సమస్యలు కూడ ఉన్నాయి. వేరే ఎక్కడా లేని వృక్షజాతులు, అరుదైన జంతుజాతులు, హరప్పా నాగరికతకు చెందిన అవశేషాలు, ఆదివాసీ పుణ్యస్థలాలు, దేవాలయాలు అనేకం ఈ ముంపు ప్రాంతంలో ఉన్నాయి. పర్యావరణ విధ్వంసమంటే వీటి విధ్వంసం మాత్రమే కాదుగానీ వీటి ప్రాముఖ్యతను తృణీకరించడం కూడ భావ్యం కాదు.

పర్యావరణ సమస్యలంటే ఏమిటో, వాటి అర్థమేమిటో చూసిన తరువాత 1987లో ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పర్యావరణ సంబంధమైన అనుమతి చెల్లదని జస్టిస్ భరూచా తన 'అసమ్మతి తీర్పు'లో ఎందుకన్నారో చూద్దాం.

1985కు ముందే పర్యావరణ సంబంధమైన అనుమతి లభించివుంటే ఏమయ్యేదో గానీ అది జరగలేదు. 1985 జనవరిలో కేంద్రప్రభుత్వ పర్యావరణం, అటవీ మంత్రిత్వశాఖ పర్యావరణ అనుమతికి సంబంధించి గైడ్‌లైన్స్ జారీ చేసింది. ఆ తరువాత ఆ మార్గదర్శక సూత్రాలకు లోబడి మాత్రమే పర్యావరణ అనుమతిని ఇయ్యవలసి ఉంటుంది. అయితే ఆ పని చేయవలసింది పర్యావరణ మంత్రిత్వశాఖ కాగా, ఆ శాఖ తన అభిప్రాయాలను ఎప్పటికప్పుడు ఒక నోట్ రూపంలో ప్రధానమంత్రి ముందు పెట్టి నిర్ణయం తీసుకునే బాధ్యతను ప్రధాని మీదకు నెట్టేసింది.

1986 అక్టోబర్ నెలలో పర్యావరణ మంత్రిత్వశాఖ తన మొదటి నోట్‌ను ప్రధానికి సమర్పించింది. వీలయినంత త్వరగా అనుమతి ఇచ్చే పని ముగించాలని తాము ప్రయత్నిస్తున్నామనీ అయితే 'రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన సమాచారం అసమగ్రంగా, అసంతృప్తికరంగా ఉంది' అనింది. జీవరాశుల విషయంలో 'వాటి సంఖ్యకు సంబంధించిన సమాచారం లేదు' అనింది. కాచ్‌మెంట్‌లో భూసార సంరక్షణ చేపట్టే కర్తవ్యానికి సంబంధించి 'ఎంత భూభాగం అత్యవసరంగా ఈ కర్తవ్యం చేపట్టవలసిన హీనస్థితిలో ఉందో తెలీద'నీ అనింది. వన్యమృగాల జనాభాల లెక్కలు తీయడం కోసం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాతోనూ వాటి పునరావాసం కోసం వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌తోనూ చర్చలు జరుపుతున్నాయనింది. ఆ సంస్థలు తమ తమ సర్వేలు పూర్తి చేయడానికి రెండేళ్లు పడుతుందనింది. వృక్షసంపదకు సంబంధించిన సర్వేను బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా 1985 డిసెంబర్‌లో మొదలుపెట్టిందనీ అది పూర్తి కావడానికి కూడ రెండుమూడేళ్లు పడుతుందనింది.

సారాంశంలో, 'కొన్ని పథకాలు రూపొందించడం జరిగింది, కొన్ని విషయాలపై అధ్యయనం మొదలయింది, కొంత కార్యాచరణ ప్రారంభమయింది. అయితే పైన చెప్పిన విషయాలు దృష్టిలో పెట్టుకుంటే ఇంకా జరగవలసింది చాలా ఉందని అర్థం అవుతుంది. నిజానికి పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ అభిప్రాయంలో ఇప్పటికి జరిగింది కొంచెమే. చాలా విషయాలు ఇప్పటికింకా ప్రాథమిక దశలో ఉన్నాయి' అని తేల్చి చెప్పింది.

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే పర్యావరణ సంబంధమైన చర్యలు ఇంతటి ప్రాథమిక దశలో ఉన్నప్పుడు పర్యావరణ సంబంధమైన అనుమతి ఇచ్చేది లేదని చెప్పవలసిందిపోయి, 'ప్రభుత్వం ముందు రెండు ప్రత్యామ్నాయాలున్నాయి' అని పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ అనింది. అన్ని అధ్యయనాలు, జనాభా లెక్కలు,

సర్వేలు పూర్తి చేసి కాచ్‌మెంట్ ఏరియా ట్రీట్‌మెంట్‌కు, పునరటవీకరణకు, నిర్వాసితుల పునరావాసానికి, జీవజాతుల తరలింపుకు సంబంధించి వివరమైన ప్రణాళికలు రూపొందించి, వాటి అమలుకు సంబంధించిన బాధ్యతలు స్పష్టంగా కేటాయించిన తరువాతే పర్యావరణ అనుమతి ఇవ్వడం ఒక ప్రత్యామ్నాయం. ఇట్లాగయితే అనుమతిని కనీసం మూడు సంవత్సరాలు వాయిదా వేయవలసి ఉంటుంది.

రెండవది, ఏమేం చేయాలనే విషయంలో తగు ఆదేశాలిచ్చి, షరతులు విధించి దానిని పర్యవేక్షించే వ్యవస్థను నెలకొల్పి అనుమతి ఇప్పుడే ఇచ్చేయడం.

ఈ రెండు ప్రత్యామ్నాయాలను సూచించి ఊరుకోకుండా, 'అనుమతిని మూడేళ్ళు వాయిదా వేయడాన్ని వ్యతిరేకించే వాదనకే తర్కబలం ఉంది' అనింది.

అప్పటి నుండి ఒక సంవత్సరం పాటు పర్యావరణం, అటవీ సంరక్షణ, నీటి వనరుల శాఖలు సర్దార్ సరోవర్ ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ పార్శ్వాన్ని గురించి ఎప్పుడు మాట్లాడినా, ఇంకా పనేమీ జరగలేదనీ, ఎంతలేదన్నా రెండు మూడేళ్లు పడుతుందనీ, అయితే ప్రాజెక్టును ఇంకా ఆలస్యం చేయడం ఉచితం కాదు కాబట్టి అన్ని పనులూ చేసేదాకా అనుమతి ఆపడం కంటే అనుమతి ఇచ్చేసి ప్రాజెక్టు నిర్మాణమూ పర్యావరణ పరిరక్షణా సమాంతరంగా పూర్తి చేయమని షరతు పెట్టడం మంచిదని అంటూ వచ్చాయి. చేయకపోతే ఇచ్చిన అనుమతిని వెనక్కి తీసుకోవడం గానీ కట్టిన ప్రాజెక్టును కూల్చేయడం గానీ జరిగే పని కాదు కాబట్టి ఈ 'షరతు' అనే దానికి అర్థమేమీ లేదు. అనుమతి ఇచ్చేసి, పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని ఆశ పెట్టుకోవడమే ఈ 'ప్రత్యామ్నాయానికి' అర్థం.

చివరికి ఈ ప్రత్యామ్నాయమే గెలిచింది. పరిస్థితిలో ఏ మార్పూ లేకుండానే 1987 జూన్ 24న ప్రధానమంత్రి ఈ ప్రాజెక్టుకు పర్యావరణ సంబంధమైన అనుమతి ఇచ్చేసారు.

'ఈ అనుమతి చట్టం కళ్లల్లో అనుమతే కాదు' అని జస్టిస్ భరూచా నిక్కచ్చిగా అన్నారు. ప్రాజెక్టుకు పర్యావరణంపైన ఉండగల ప్రభావం గురించి సమాచారం సమగ్రంగా సేకరించి దానిని మదింపు వేసి ఉండాలి. అయినప్పటికీ ప్రాజెక్టును చేపట్టవచ్చునన్న నిర్ణయానికి వచ్చి ఉండాలి. పర్యావరణ పరిరక్షణకు చేపట్టే చర్యలను రూపొందించి వాటి ఖర్చును అంచనా వేసి ఉండాలి. ఇవన్నీ జరిగిన తరువాత ఇచ్చిన అనుమతే అనుమతిగానీ ప్రాథమిక సమాచారం సహితం ఇంకా సేకరించని స్థితిలో ఇచ్చిన అనుమతి అనుమతే కాదని ఆయన అన్నారు.

మెజారిటీ జడ్జిలిద్దరు మాత్రం అనేక ప్రభుత్వశాఖల అధికారులు తమ నైపుణ్యాన్నంతా వెచ్చించి అనుమతి ఇవ్వడం సబబేనని నిర్ణయించారు కాబట్టి ఈ అనుమతి అనాలోచితంగా ఇచ్చినట్టు భావించలేమన్నారు. నిజానికి వారి తీర్పులో చాలా చోట్ల ఉన్నతస్థాయి అధికారుల హోదాలను (చీఫ్ ఇంజనీర్, ప్రిన్సిపల్ అడ్వైజర్ వగైరాలు) చాలా మురిపెంగా ప్రస్తావించి అంతటివారు పర్యవేక్షిస్తుండగా ఇంక సమస్య ఏముంది అనే పద్ధతిలో సంతృప్తి వ్యక్తం చేయడం కనిపిస్తుంది. ఒక మున్సిఫ్ మేజిస్ట్రేటు కోర్టులో సాక్ష్యం ఇయ్యడానికి వచ్చిన రాష్ట్ర చీఫ్ సెక్రెటరీని చూసి మేజిస్ట్రేటు కొంచెం తబ్బిబ్బయి తన వివేచనాశక్తిని పక్కన పెడితే అర్థం చేసుకోవచ్చునేమోగానీ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ అదే వైఖరి ప్రదర్శిస్తే ఏమనుకోవాలి? నిర్ణయం తీసుకున్నవారి హోదా ముఖ్యం కాదు, వారు ఆ నిర్ణయానికి అవసరమైన  సమాచారాన్నంతా లెక్కలోకి తీసుకున్నారా లేదా, ఆ సమాచారాన్ని అర్థం చేసుకోవడంలో కనీస హేతుబద్ధత ప్రదర్శించారా లేదా అన్నది న్యాయస్థానాలు చూడవలసిన విషయం అని సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఇంకా నేర్పించవలసిన అవసరం ఉన్నట్టుంది.

1978లో నర్మదా జలవివాదాల ట్రిబ్యునల్ ఇచ్చిన అవార్డులో లేని హక్కేదీ ఎవరూ అడగడానికి వీలులేదు, ప్రభుత్వమూ ప్రపంచబ్యాంకూ తిరస్కరించిన నిపుణుల అభిప్రాయాలకు విలువ లేదు, పెద్దపెద్ద హోదాలున్న అధికారుల పర్యవేక్షణకు పర్యావరణ పరిరక్షణను వదిలేసి ఏ సమాచారమూ లేకుండానే 1987లో ప్రాజెక్టుకు ప్రధానమంత్రి ఇచ్చిన పర్యావరణ సంబంధమైన అనుమతి సక్రమమైనదే, దానిని ఇన్నేళ్ల తరువాత తిరగదోడడానికి వీలు లేదు అన్న చీఫ్ జస్టిస్ ఆనంద్, జస్టిస్ కిర్పాల్‌ల అభిప్రాయాలు చూశాం.

## నిర్వాసితులకు న్యాయం చేసినా బాగుండేది

ఇంక వాళ్లు నిర్వాసితుల పునరావాసాన్ని గురించి ఏమన్నారో చూద్దాం. నిజానికి, నిర్వాసితుల పునరావాసం 1978 నాటి ట్రిబ్యునల్ అవార్డుకు లోబడి జరిగిందా లేదా అన్న ఒక్క విషయాన్ని చూడడానికి మాత్రమే ఈ కేసు విచారణ చేపట్టామనీ లేకపోతే ఈ కేసులో వినడానికేమీ లేదనీ వారు అన్నారు. ఆ ఒక్క పనయినా సరిగ్గా చేసి ఉంటే ఇతర విషయాలలో జడ్జిలిద్దరినీ క్షమించి ఉండవచ్చునేమోగానీ ఆ పని కూడ సరిగ్గా చేయలేదు.

నిజానికి ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని చెప్పే చట్టమేదీ భారతదేశంలో లేదు. స్థిరాస్తులకు నష్టపరిహారం మాత్రమే చట్టంలో ఉంది.

అదృష్టం కొద్దీ నిర్వాసితులందరికీ పునరావాసం కల్పించాలని నర్మదా జలవివాదాల ట్రిబ్యునలే తన 1978 నాటి అవార్డులో చెప్పింది కాబట్టి సరిపోయిందిగానీ లేకపోతే సుప్రీంకోర్టు పునరావాసం గురించి చర్చ చేసేదే కాదేమో. నిర్వాసితుల పునరావాసం సరిగ్గా జరిగిందా లేదా అన్న విషయం పట్ల మాకు ఆదుర్దా ఉంది కాబట్టి అందుకోసం ఈ కేసు విచారిస్తున్నామని జడ్జీలు అన్నప్పటికీ అది ట్రిబ్యునల్ చలవే తప్ప వారిది కాదు.

ప్రాజెక్టు నిర్మాణంలో ఒక్కొక్క దశలోనూ అప్పటివరకు నిర్వాసితులయిన వారికి పునరావాసం సంపూర్ణంగా కల్పించిన తరువాతే ఆ తరువాతి దశకు పోవాలని ఆదేశించమని ఎన్‌బిఏ సుప్రీంకోర్టును కోరింది. లేకపోయినట్టయితే ప్రాజెక్టు పూర్తయ్యాక కూడ పునరావాసం కాగితాల మీదనే ఉండిపోయే ప్రమాదం ఉంటుంది. జస్టిస్ భరూచా తన అసమ్మతి తీర్పులో అటువంటి కచ్చితమైన ఆదేశం ఇచ్చారు. డ్యాం ఎత్తు మరొక అయిదు మీటర్లు పెంచితే ఎవరెవరు నిర్వాసితులవుతారో వారందరి పునరావాసం సంతృప్తిగా జరిగిందని మూడు రాష్ట్రాల ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలు (జిఆర్ఏ) ధృవీకరించిన తరువాతే ఆ అయిదు మీటర్లు పెంచడానికి అనుమతి ఇవ్వాలి. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రతీ అయిదు మీటర్ల పెంపుదలకూ ఈ విధంగా అనుమతి తీసుకోవాలి. (ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పర్యావరణ సంబంధమైన అనుమతే చెల్లదని జస్టిస్ భరూచా అన్నారని చూశాం. అందువల్ల ఆయన ప్రాజెక్టు నిర్మాణమే ఆపేసి తిరిగి పర్యావరణ సంబంధమైన అనుమతి ఇచ్చేదీ లేనిదీ సక్రమంగా పరిశీలించమన్నాడు. ఒకవేళ అనుమతి ఇచ్చినట్టయితే పునరావాసానికి సంబంధించి పై నియమం పాటించమన్నాడు).

జస్టిస్ భరూచా ప్రస్తావించిన ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం (జిఆర్ఏ) ప్రభుత్వ యంత్రాంగం కాదు. అది ప్రభుత్వ సహాయ పునరావాస యంత్రాంగంపైన ప్రజలు చేసే ఫిర్యాదులను పరిష్కరించడానికి సుప్రీంకోర్టు ఒక మధ్యంతర ఉత్తర్వు ద్వారా నెలకొల్పిన యంత్రాంగం. మూడు రాష్ట్రాలలోనూ ముగ్గురు రిటైర్డు హైకోర్టు/సుప్రీంకోర్టు జడ్జిల ఆధ్వర్యంలో ఈ జిఆర్ఏలు అప్పటికే ఏర్పడి ఉన్నాయి.

మెజారిటీ జడ్జిలు మాత్రం ఒక్కొక్క దశలోనూ పునరావాసం పూర్తయితేనే తరువాత దశల నిర్మాణం చేపట్టవచ్చునన్న ఆదేశానికి కచ్చితమైన రూపం ఇవ్వలేదు, ఆదేశం ఇచ్చిన మేరకు దాని అమలు పర్యవేక్షణ ప్రభుత్వ యంత్రాంగం చేతిలోనే పెట్టడం తప్పునుకోనూ లేదు. ప్రాజెక్టు నిర్మాణం, పునరావాసం

సమాంతరంగా సాగాలన్నారు. పునరావాసం జరిగిందని ప్రభుత్వ అధికారులతో కూడిన సహాయ పునరావాస ఉపసంఘం ఎప్పటికప్పుడు ధృవీకరించినట్టయితేనే ప్రాజెక్టు నిర్మాణం, కొనసాగించాలన్నారు. ఈ ఉపసంఘం సుప్రీంకోర్టు అప్పటికే నెలకొల్పిన జిఆర్ఏలను సంప్రదించాలన్నారు.

సహాయ పునరావాస ఉపసంఘం తన ధృవీకరణను ఏ ప్రాతిపదికపైన ఇవ్వాలో ఇందులో చెప్పలేదు. అంతా ప్రభుత్వ అధికారులే కాబట్టి, పునరావాసానికి కావాల్సిన భూమి సేకరించడానికి ప్రభుత్వం కేవలం నోటీసు జారీ చేసినా అదే చాలునని చెప్పి పునరావాసం జరుగుతున్నట్టు ధృవీకరణ ఇచ్చేయొచ్చు. సుప్రీంకోర్టు నియమించిన స్వతంత్రమైన జిఆర్ఏకి ఇందులో నిర్ణాయకపాత్ర ఇచ్చి ఉంటే కొంత మెరుగ్గా ఉండేదేమో. కానీ వారిని 'సంప్రదించాలని' మాత్రమే అన్నారు. వారి సమ్మతి తీసుకోవాలని అనలేదు.

నిర్వాసితులకు పునరావాసం దొరుకుతుందా లేదా అన్న విషయాల్ని ఈ విధంగా సంశయంలో పెట్టడమే కాకుండా, పునరావాసం స్వభావాన్ని కొంచెం ఉదారంగా వ్యాఖ్యానించమంటే కూడ సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. ఒక గూడెంకు చెందిన నిర్వాసితులకు ఒకే చోట పునరావాసం కల్పించాలని అడిగితే 'నర్మదా జలవివాదాల ట్రిబ్యునల్ అవార్డులో ఈ విధంగా చెప్పలేదు కాబట్టి ఆ విధంగా కల్పించాలని మేము ఆదేశించలేం' అన్నారు. ఒకే చోట పునరావాసం కల్పించాలని అడగడానికొక సహేతుకమైన కారణం ఉంది. ఆదివాసులు తమకంటే ఆర్థికంగా రాజకీయంగా బలవంతులయిన 'నాగరికుల'తో తలపడవలసి వచ్చినప్పుడు, ఆ దాడిని ఎదుర్కోవడానికి ఆదివాసీ తెగ సంబంధాలు కల్పించే కట్టడి, ఐకమత్యం, సమిష్టిబలం చాలా ఉపయోగపడతాయనేది తెలిసిన విషయమే. వారి సమాజాన్ని ముక్కలు చెక్కలు చేసి 'నాగరిక' సమాజంలో పడేస్తే వారు తట్టుకోవడం కష్టం.

రిజర్వాయర్ వల్ల నిర్వాసితులయ్యేవారి లాగే కాలవల కోసం భూములు సేకరించడం వల్ల నిర్వాసితులయ్యేవారు కూడ రేపు ఉండబోతారు. వారికి కూడ వీరికిచ్చినట్టే పునరావాసం ఇవ్వాలనీ కేవలం స్థిరాస్తులున్నవారికిచ్చే నష్టపరిహారంతో సరిపెట్టకూడదనీ ఎన్‌బిఏ వాదించింది. కానీ సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. దీనికి రెండు కారణాలు చెప్పింది. రెండూ విచిత్రమైనవే.

కాలవ కింద కొంత భూమి పోయినా మిగిలిన భూమికి కాలవ నీళ్లు వస్తాయి కాబట్టి వారు కూడ ప్రాజెక్టు లబ్ధిదారుల కోవలోకి వస్తారనీ, అందువల్ల వారిని రిజర్వాయర్ నిర్వాసితులతో సమానంగా చూడకూడదనేది ఒక కారణం. కాలవ

కింద భూములు కోల్పోయే ప్రతీ ఒక్కరికీ ఇంకా భూమి మిగిలి ఉంటుందనిగానీ, ఆ భూమికి కాలవ నీళ్లు వస్తాయనిగానీ కోర్టుకు ఎవరు చెప్పారో! అటువంటి సమాచారమేదీ తన ముందు లేకుండానే సుప్రీంకోర్టు ఈ నిర్ణయానికి వచ్చేసింది.

రెండవ కారణాన్ని ఇప్పటికే చూసి ఉన్నాం. నర్మదా జలవివాదాల ట్రిబ్యునల్ రిజర్వాయర్ నిర్వాసితులకు పునరావాసం ఇమ్మనిందే తప్ప కాలవల కింద భూములు కోల్పోయిన వాళ్లకు కూడ ఇమ్మని చెప్పలేదు. ట్రిబ్యునల్ తీర్పుకు సుప్రీంకోర్టుతో సహా అందరూ కట్టుబడి ఉండక తప్పదు కాబట్టి ఈ అభ్యర్థనకు కోర్టు అంగీకరించజాలదు.

ఇది కేవలం తప్పుడు అభిప్రాయమే కాదు, హాస్యాస్పదమైనదని కూడ మొదట్లోనే అన్నాం. దేశంలోని ప్రతి కోర్టుపైనా, ప్రతి ట్రిబ్యునల్‌పైనా సుప్రీంకోర్టుకు అజమాయిషీ ఉంది. ఆ అధికారాన్ని సుప్రీంకోర్టుకు ఇచ్చే ఆర్టికల్ 136 రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని సుప్రీంకోర్టే అనింది. ఏ కోర్టు లేక ట్రిబ్యునల్ తీర్పులో సుప్రీంకోర్టు ఏ మేరకు జోక్యం చేసుకుంటుందనే విషయంలో తేడాలు ఉంటే ఉండవచ్చునుగాక. అయితే నర్మదా జలవివాదాల ట్రిబ్యునల్ నిర్వాసితులలో ఒక వర్గానికిచ్చిన హక్కును ఇంకొక వర్గానికి ఇయ్యనప్పుడు 'మేము కూడ ఏమీ చేయలేం' అని సుప్రీంకోర్టు అనడానికి వీలు లేదు. అటువంటి వివక్ష ఆర్టికల్ 14కు విరుద్ధమని ప్రకటించి తక్కినవారికి కూడ అదే హక్కును సుప్రీంకోర్టు కల్పించాలి.

న్యాయశాస్త్రంలో ఇంతటి ప్రాథమిక పాఠాలు మాబోటి వారి చేత చెప్పించుకునే అవసరం చీఫ్ జస్టిస్ ఆనంద్ వంటి న్యాయశాస్త్రకోవిదులకు ఉందని మేము అనుకోవడం లేదు. అందువల్ల ఇక్కడున్నది న్యాయశాస్త్ర సంబంధమైన అజ్ఞానం కాదనీ, న్యాయశాస్త్రంతో నిమిత్తం లేని భావాల ప్రేరణ ఇక్కడ పని చేస్తున్నదనీ అనుకోవలసి ఉంటుంది. దీని మూలం గ్లోబలైజేషన్ పట్ల మన దేశంలోని 'శిష్ట' వర్గాలలో ఉన్న ఆకర్షణ. 'అభివృద్ధి' అని దేనినయితే గ్లోబలైజేషన్ పేర్కొంటుందో అదిప్పుడందరికీ కావాలి. వేగంగా కావాలి. దానికి సిద్ధాంతాలు, ఆదర్శాలు, 'సెంటిమెంట్లు' ఏవీ అడ్డం రాకూడదు. రాజ్యాంగం కూడ అడ్డం రాకూడదు. అడ్డమొస్తే దానిని తప్పించుకోవడానికి అడ్డదార్లు వెతుక్కుంటారు. ఈ తీర్పు దానికొక నిదర్శనం.

## పెద్ద డ్యాంలకు స్తోత్రపాఠం

'అభివృద్ధి' పట్ల ఉన్న ఉత్సాహంతో సుప్రీంకోర్టు పెద్ద డ్యాంలను పొగుడుతూ ఈ తీర్పులో పొందుపరిచిన స్తోత్రపాఠం అందరినీ ఆశ్చర్యపరిచింది. అప్పుడెప్పుడో

జవహర్‌లాల్ నెహ్రూ ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలు అన్నాడని విన్నాం. అప్పట్లో అందరి అభిప్రాయమూ అదే కాబట్టి ఆయనను తప్పు పట్టలేకపోవచ్చు. కానీ గడచిన నలభై సంవత్సరాలలో ఆ రకమైన అభిప్రాయాల మీద చాలా చర్చ జరిగింది. పెద్ద డ్యాంల వల్ల అనుకున్నంత ప్రయోజనం లేదనీ, అనుకోని నష్టాలు చాలా ఉన్నాయనీ ఇప్పుడందరూ గుర్తిస్తున్నారు. డ్యాంలు ఇంక కట్టనే వద్దనే వాళ్లు కొందరే ఉండవచ్చునుగానీ, మంచినీ చెడునూ సమగ్రంగా అంచనా వేసుకొని తగిన రీతిలో ప్రాజెక్టుల రూపకల్పన చేయాలన్న గుర్తింపు మాత్రం సార్వజనీనంగానే వచ్చింది. ఈ నలభై ఏళ్ల సంవాదం సాధారణ దినపత్రికల పాఠకులకు సహితం ఎంతో కొంత తెలుసు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు మాత్రమే అదేమీ తెలియనట్టుంది. కనీసం చీఫ్ జస్టిస్ ఆనంద్, జస్టిస్ కిర్పాల్‌లకు తెలియదన్నది స్పష్టమే. వారు తమ అజ్ఞానాన్ని బయటపెట్టుకుంటూ 'ఆధునిక దేవాలయాల' పరిభాషను మరొకసారి గుర్తుచేశారు.

ఎన్‌బిఏకీ వారి తరపు న్యాయవాదులకూ కోపం తెప్పించిన విషయమేమిటంటే, వాదన జరుగుతున్న సమయంలో పెద్ద ప్రాజెక్టులు, వాటి వల్ల జరిగే నష్టాలు, పర్యావరణ పునరావాస సమస్యల గురించి వారు ఎప్పుడు మాట్లాడే ప్రయత్నం చేసినా జడ్జిలు వారి నోరుమూయించేశారని. 'అవన్నీ వద్దు, ఈ కేసు గురించి మాట్లాడు' అన్నారు వారితో. చివరికి తీర్పులో మాత్రం పెద్ద డ్యాంలను వెనకేసుకొస్తూ చాలా రాశారు.

'భారతదేశంలో అనేక నదీజలాల ప్రాజెక్టులను చేపట్టడం జరిగింది. ఒక డ్యాం నిర్మాణం వల్ల పర్యావరణానికి హాని జరిగిన ఒక్క ఉదంతం కూడ పిటిషనర్ మా దృష్టికి తేలేదు. వాస్తవమేమిటంటే, పర్యావరణం నిజానికి మెరుగుపడింది' అన్నారు జడ్జిలు. హాని ఎక్కువ జరిగిన ఉదంతాల గురించి మాట్లాడనివ్వలేదు కాబట్టి పిటిషనర్ ఒక్కటి కూడ ఉదహరించలేదు. కాగా పర్యావరణం నిజానికి మెరుగుపడిందన్న విషయం కోర్టు దృష్టికి ఎవరు తీసుకొచ్చారు? ఎవరూ తీసుకురాలేదు. అది జడ్జిల అభిప్రాయమే. అభిప్రాయం కూడ కాదు, అది వాళ్లు నమ్మదలచుకున్న విషయం.

పెరియార్ డ్యాం వల్ల తమిళనాడులోని మధురై జిల్లాలో క్షామాలు మటుమాయం కాలేదా? అన్నారు. కర్ణాటకలోని కృష్ణరాజసాగర్ డ్యాం వల్ల వన్యమృగాలు తిరిగే చిట్టడివిగా ఉన్న మాండ్య జిల్లా సస్యశ్యామలంగా మారలేదా? అన్నారు. లేదని ఎవరూ అనలేదు, అనరు. ఎటొచ్చీ దీనికి అయిన ఖర్చెంత అనేది ప్రశ్న. పర్యావరణానికి, తత్ఫలితంగా మనుషుల జీవితాలకు జరిగిన హానిని

ఖర్చులో లెక్కపెట్టవద్దా అనేది ప్రశ్న. నిర్వాసితులైన ప్రజలు కోల్పోయిన జీవనాన్నీ ఆదాయాన్నీ ఖర్చులో లెక్కపెట్టవద్దా అన్నది ప్రశ్న. అవన్నీ ఖర్చులో భాగంగా లెక్కగట్టేటట్టయితే అవే నదీ జలాలను అంతకంటే తక్కువ ఖర్చుతో వినియోగించుకునే ప్రత్యామ్నాయాలను అన్వేషించడం సామాజికంగా తక్కువ నష్టకరమవుతుంది కదా అనేది ప్రశ్న. పెద్ద డ్యాంలను విమర్శించేవాళ్లు వాటి వల్ల నీళ్లు రావనీ పంటలు పండవనీ అనడం లేదు. వాటి అసలైన ఖర్చుకూ పైకి లెక్క పెట్టే ఖర్చుకూ చాలా తేడా ఉందనీ, అసలయిన ఖర్చు లెక్కలోకి తీసుకుంటే అవేమంత ప్రయోజనకరమైనవి కావనీ, అదే నది నీటిని వేరే రూపాలలో సాగుకోసం వాడుకోవడం ఎక్కువ ప్రయోజనకరమనీ అంటున్నారు.

ఈ అభిప్రాయం సత్యమా కాదా అన్న విషయం ఈ కేసులో చర్చకు రాలేదు. జడ్జిలు అనుమతించలేదు కాబట్టి రాలేదు. కానీ వారు మాత్రం ఈ అభిప్రాయం మీద తీర్పు చేప్పేశారు. ఒక్క పర్యావరణం గురించే కాదు, మొత్తంగా 'అభివృద్ధి' అనే ప్రక్రియ గురించి సుప్రీంకోర్టు ఒక కచ్చితమైన అభిప్రాయాన్ని ఏ చర్చా తన ఎదుట జరగకుండానే ప్రకటించేసింది. ఆదివాసులు, వెనకబడిన ప్రాంతాల ప్రజలు శాస్త్రసాంకేతిక జ్ఞానం వల్ల ప్రయోజనం పొందకుండా ఉండిపోవడం అన్యాయమనింది. వాళ్ల కృషి వల్లగానీ పరిస్థితుల ఒత్తిడి వల్లగానీ వేరే ఎక్కడయినా పచ్చని జీవితాన్ని వెతుక్కోవడం మంచిది కాదా? అనింది. పరిస్థితుల ఒత్తిడి వల్ల నిర్వాసితులయిన వారికి వేరే ఎక్కడయినా పచ్చని జీవితం దొరుకుతుందన్న భరోసా మన సమాజంలో ఎంత ఉంది అన్న ప్రశ్న జడ్జిలు వేసుకోలేదు, వాదిగానీ ప్రతివాదిగానీ కేసు విచారణలో దానిని చర్చించలేదు.

ఏ అభివృద్ధీ రాని గ్రామాల కంటే భాక్రానంగల్, నాగార్జునసాగర్, తెహ్రీ డ్యాంలు, భిలాయి, టాటానగర్ స్టీల్‌ప్లాంట్ల సమీపంలోని గ్రామాలలో నివసిస్తున్న ప్రజల జీవితాలు మెరుగ్గా ఉన్నాయని కూడ జడ్జిలు ప్రకటించారు. దీనికీ ఏ ఆధారమూ లేదు. ఊరికే వాళ్లకు తోచిన ప్రాజెక్టుల పేర్లు టకటకా ఏకరువు పెట్టారు తప్ప వీటి గురించి ఏ పరిశోధనా వారి ముందు లేదు. నిర్దిష్టంగా పరిశోధన జరిపితే ప్రతీ అభివృద్ధి కేంద్రంలోనూ జీవితాలు బాగుపడిన వారూ కనిపిస్తారు, నాశనమైనవారూ కనిపిస్తారు. ఏ వృత్తులవారు, ఏ కులాల వారు, ఏ రకమైన సామాజిక ఆర్థిక జీవితరంగానికి చెందిన వారు ప్రయోజనం పొందారు, ఎవరు నష్టపోయారు అని విశ్లేషించుకుంటే అభివృద్ధికి ఉండే సామాజిక పర్యవసానాలు స్పష్టంగా అర్థం అవుతాయి. అభివృద్ధి వల్ల అంతా నష్టమే జరుగుతుందని ఎవరో అంటున్నట్టు ఊహించుకొని అంతా మేలే జరుగుతుందని

ఏ సమాచారమూ ఏ పరిశోధనా లేకుండా దబాయించాలని చూశారు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు. ఒక పదవతరగతి విద్యార్థి అభివృద్ధి అనే టాపిక్ మీద ఈ రకమైన వ్యాసం రాస్తే బి గ్రేడ్ రావడం కూడ కష్టం.

## పర్యవేక్షక సంస్థకు సైతం అంగీకరించలేదు

చివరిగా ఒక విషయం చూసి ముగిద్దాం. పర్యావరణం, పునరావాసాలకు సంబంధించిన కచ్చితమైన ప్రమాణాలు నిర్దేశించి, ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన ఒక్కొక్క దశలోనూ ఆ ప్రమాణాన్ని పరిపూర్తి చేసిన తరువాతే తరువాతి దశకు అనుమతి లభించేటట్టు ఆదేశించమని ఎన్‌బిఏ సుప్రీంకోర్టును కోరిందనీ, 'అసమ్మతి తీర్పు' ఇచ్చిన జస్టిస్ భరూచా దీనికి అంగీకరించారుగానీ మెజారిటీ జడ్జిలు ఒప్పుకోలేదనీ చూశాం. పోనీ కనీసం ప్రాజెక్టు నిర్వహణను మొత్తంగా పర్యవేక్షించి హామీలు అమలయ్యేటట్టు చూడడానికి ఒక స్వతంత్ర పర్యవేక్షక వ్యవస్థను నియమించమని ఎన్‌బిఏ అడిగింది. నిజానికి దీని వలన పెద్దగా ప్రయోజనం ఉండదు. ఎందుకంటే ఒకవేళ హామీలు అమలు చేయకపోయినా ప్రాజెక్టును ఆపే అధికారం గానీ నిర్బంధంగా అమలు చేయించే అధికారం గానీ అటువంటి పర్యవేక్షక వ్యవస్థకు ఉండదు.

అయితే దీనికి కూడ మెజారిటీ జడ్జీలు అంగీకరించలేదు. దానికి వారు చెప్పిన కారణాన్ని ఉటంకించడం అవసరం. 'సమాజంలో చాలామందికి మేలు చేసే జాతీయ ప్రాముఖ్యంగల ప్రాజెక్టు గురించి కేంద్రప్రభుత్వం గానీ రాష్ట్రప్రభుత్వం గానీ అత్యున్నత స్థాయిలో ఎటువంటి తొందరపాటు లేకుండా సమాలోచన జరిపినట్టయితేను, అందులోనూ ప్లానింగ్ కమిషన్ దానిని మదింపు వేసి దానికి ఆమోదం తెలిపినట్టయితేను కోర్టులు దానిని పర్యవేక్షించడం గానీ స్వతంత్ర పర్యవేక్షక వ్యవస్థను నెలకొల్పడం గానీ అనవసరం. ప్రజాస్వామ్యంలో ప్రజల మేలు కోసం ఏ ప్రాజెక్టు చేపట్టాలో నిర్ణయించే అధికారం ఎన్నికయిన ప్రభుత్వానిది. ప్రాజెక్టులోగానీ ప్రాజెక్టు నిర్వహణలోగానీ కచ్చితంగా చట్టాన్ని అతిక్రమించే విషయమేదైనా ఉంటేనే కోర్టులు జోక్యం చేసుకుంటాయి' అన్నారు.

విధాన నిర్ణయాలు ప్రభుత్వం బదులు న్యాయస్థానాలు చేయాలని ఎవరూ అనరుగానీ ప్రభుత్వం చేసిన విధాన నిర్ణయాలపైన న్యాయస్థానాలకు ఉండే పర్యవేక్షక అధికారం ఇంతేనా? 'ఉన్నత స్థాయి' అధికారులు తీరికగా నిర్ణయం చేస్తే సరిపోతుందా? ప్లానింగ్ కమిషన్ వంటి 'ఉన్నత స్థాయి' సంస్థ ఆమోదిస్తే సరిపోతుందా? ఆమోదం ఏ విధంగా తెలిపారన్నది కాక ఎవరు తెలిపారన్నది

ప్రమాణం అవుతుందా? ఆ నిర్ణయానికి సంబంధించిన సమాచారమంతటినీ లెక్కలోకి తీసుకున్నారా, అసందర్భమైన కారణాలేమైనా నిర్ణయాన్ని ప్రభావితం చేశాయా, నిర్ణయం తీసుకోవడంలో అహేతుకంగా వ్యవహరించారా అని చూసే అధికారం కోర్టులకుందని నిన్నమొన్నటి దాకా ఇదే సుప్రీంకోర్టు అనేక తీర్పులలో అనింది. ఇప్పుడు ఆ అభిప్రాయాన్ని తిరగదోడినట్టనుకోవాలా?

బహుశా 'అభివృద్ధి'కి కోర్టులు అడ్డం రాకుండా ఉండాలంటే ఈ సవరణ అవసరమని ఈ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులిద్దరూ భావించి ఉండవచ్చు. సుప్రీంకోర్టు, హైకోర్టులలోని న్యాయమూర్తులలో చాలామంది ఈ రకమైన అభిప్రాయం వైపే మొగ్గుచూపుతున్నారని భావించడానికి ఆధారాలు కనిపిస్తున్నాయి. అందుకే ఈ తీర్పు ప్రాముఖ్యం న్యాయసిద్ధాంతానికి పరిమితమైనది కాదనుకుంటున్నాం. అది దేశ రాజకీయాలకూ రాజకీయ ఆర్థిక భవితవ్యానికీ కూడ సంబంధించిన విషయం.

**మానవ హక్కుల వేదిక బులెటిన్-3లో వ్యాసంగా వచ్చింది**
**మార్చి 2001**

ఐదేళ్ల తర్వాత మేధా పాట్కర్ నిరాహార దీక్ష సందర్భంగా సర్దార్ సరోవర్ ప్రాజెక్టుపై 'నర్మదా ఆందోళనను సుప్రీంకోర్టు పరిష్కరించగలదా?' అనే శీర్షికతో బాలగోపాల్ ఒక కరపత్రం రాశారు. అందులోనూ ఈ తీర్పును పునఃసమీక్షించవలసిందిగా డిమాండ్ చేశారు. విషయం పునరావృతమవుతుందన్న ఉద్దేశంతో దాన్ని ఇందులో చేర్చడం లేదు.

# అభివృద్ధే అయితే అబద్ధాలేల?

**కో**స్టల్ కారిడార్ గురించి రాష్ట్ర ప్రభుత్వం, దాని తరఫున వకాల్తా పుచ్చుకున్న వారు పదే పదే అబద్ధాలెందుకు చెప్తున్నారో అర్థం కాదు. తాము చేస్తున్నది ఘనకార్యం అని నమ్మేటప్పుడు నిజాయితీగా ఒప్పుకొని సమర్థించుకునే ప్రయత్నం చేయడం ఉచితంగా ఉండదా? మనిషికైనా ప్రభుత్వానికైనా ఆత్మవిశ్వాసమే అందం. చేస్తున్నది, చేయడానికి పూనుకున్నది చేయడం లేదనీ, అంతా ఎవరో పుట్టిస్తున్న తప్పుడు ప్రచారమనీ దబాయించడం ఆత్మ గౌరవం ఉన్నవారెవరూ చేయదగ్గ పని కాదు. నిజానికి కాంగ్రెస్ వారికి అర్థం కావడం లేదేమోగానీ, గుట్టు మొత్తం చెప్పేసి మీలో ఎవరు విభేదిస్తున్నారో ముందుకు రండి అని సవాలు చేస్తే ఇవాళ ధర్నాలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీలన్నిటికీ ఇబ్బందే. కోస్టల్ కారిడార్ అనే నిర్దిష్టమైన పథకాన్ని వ్యతిరేకించడం ఎన్నికల సీజన్‌లో ఉచితం అని వారు భావించి ఉండవచ్చును గానీ, దాని వెనక ఉన్న మౌలికమైన అభివృద్ధి విధాన దృక్పథంతో ఇవాళ దేశాన్ని ఏలుతున్న, ఏల జూసే ఏ పార్టీకీ అభిప్రాయభేదం లేదు. భారతదేశపు సామాజిక, ఆర్థిక పరిస్థితులలో ఏ రకమైన అభివృద్ధి విధానం ఉచితంగా ఉంటుందన్న చర్చను కాంగ్రెస్-ప్రతిపక్షాల కొట్లాటగా అధికారం కోసం తగవులాడుకుంటున్న సకల రాజకీయ పక్షాలూ చిత్రించడంలో సఫలం అయ్యాయి. దీనికి మీడియా సహకారం పుష్కలంగా ఉంది. సామాజిక జ్ఞానం యావత్తూ మీడియాలో దర్శనమిచ్చే రాజకీయ పక్షాల సంవాదం నుంచి పొందే స్థితికి నెట్టి సగటు పౌరులను అందరూ కలిసి తీవ్ర బుద్ధి మాంద్యంలో ఉంచారు.

కోస్టల్ కారిడార్‌కు పునాది అయిన ఆలోచనారీతి ప్రపంచ బ్యాంకు దాదాపు దశాబ్దం కింద మనబోటి సమాజాలకు ఉచితం అని సూచించిన విధాన దృక్పథంలోనే ఉంది. అభివృద్ధి అనేది వేగంగా జరగాలంటే వ్యవసాయ ప్రధాన

సమాజాలుగా ఉన్నవి పారిశ్రామీకరణను భారీగా చేపట్టాలి. అది కూడ ఎగుమతి ప్రధానమైనదిగా ఉండాలి. దానికోసం పెట్టుబడులను పెట్టాలి. ఉత్పత్తిలో, వర్తకంలో పెట్టుబడి ప్రైవేట్ రంగంలోనే ఉండాలి గానీ దానికి అవసరమైన పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకూ ఉచిత స్థానం ఉండాలి. గతంలో ఈ మౌలిక వసతులను (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పొందుపరచడంపైన ప్రత్యేక దృష్టి ఉండేది కాదు. ఇప్పుడదే ఒక పెద్ద కార్యక్రమంగా చేపట్టాలి. అప్పుడే పెట్టుబడులు భారీగా సమకూరుతాయి. ఈ విధానంలో ప్రైవేట్ పెట్టుబడుల కోసం భిన్నదేశాలూ రాష్ట్రాలూ పోటీపడబోతాయి కాబట్టి వారికి అనుకూలమైన రాయితీలు దండిగా కల్పించాలి. సకల భౌతిక, ఆర్థిక వనరుల వినియోగానికీ కేటాయింపుకూ ఈ దృష్టే ప్రాతిపదిక కావాలి. సెజ్‌లూ పారిశ్రామిక కారిడార్‌లూ ఈ విధాననీతిలో భాగంగా పుట్టినవే.

రాజకీయ పార్టీలన్నిటికీ ఈ విధాన నీతి నచ్చడానికి కేవలం ఇందులోని విజ్ఞత కారణం కాదు. అన్ని ప్రత్యామ్నాయ అభివృద్ధి పంథాల కంటే ఇది ఆయా సమాజాలలో నిర్ణాయక స్థానాలలో ఉన్నవారికి ఆస్తులు పోగేసుకోవడానికి ఎక్కువ అవకాశం ఇస్తుంది. రాజకీయాలను ఆస్తుల సంపాదనకొక సాధనంగా మలచడంలో అందరికీ మార్గదర్శకులయిన కాంగ్రెస్ వారు ఈ విధాన నీతిని ఆకలిగా అమలు చేస్తుండడంలో ఆశ్చర్యపోవలసిందేమీ లేదు గానీ పాలక స్థాయిని చేరుకున్న ఏ పార్టీకి దీనితో మౌలిక విభేదం లేదు. మీడియా అత్యంత అనుకూలంగా ఉండడం వల్ల చంద్రబాబు కప్పదాట్లు సునాయాసంగా సాగిపోతున్నాయి గానీ ప్రపంచ బ్యాంకు సలహాలను మొట్టమొదట ఆచరించడం మొదలుపెట్టింది అతని ప్రభుత్వమే. అది తప్పని అతనిప్పటికీ అనలేదు, అనబోడు.

రాజకీయ పార్టీల వైఖరులు అటుంచి, ఈ విధాననీతిలోని విజ్ఞత ఎంత? జీవావరణానికీ, పర్యావరణానికీ దీనివల్ల కలగగల హానిని కూడ కొంచెం సేపు పక్కన పెడితే, రెండు సందర్భాలలో మాత్రమే ఇది తెలివైన ఆలోచన కాగలదు. పారిశ్రామీకరణ కోసం ఎవరి జీవికకూ ఆధారం కాని ప్రకృతి వనరులను – ప్రత్యేకించి భూమిని – కేటాయించే అవకాశం ఉన్నా, లేక ఆ కేటాయింపు వల్ల జీవనం కోల్పోయే వారికి అదే పారిశ్రామీకరణలో మెరుగయిన, మరింత భద్రమైన జీవనం కల్పించే అవకాశం ఉన్నా ఇది ఆచరణ యోగ్యమైన విధానమే అయి ఉండవచ్చు. మన దగ్గర ఈ రెండు పరిస్థితులూ లేవు. 'ఊరికే పడి ఉన్న' ప్రకృతి వనరులు మన దగ్గర లేవు. ప్రకృతిలో ప్రతీ అంగుళం నుంచి జీవనం

పొందేవారెవరో ఒకరు ఉన్నారు. ఒకరంటే ఒకరిద్దరు కాదు, ఒక ప్రజాసమూహం, ప్రత్యేకించి ఒక అణగారిన కులం, ఒక నోరులేని ఆదివాసీ తెగ. రెండవది, ఇప్పుడు మనం ఆహ్వానిస్తున్న పెట్టుబడి విస్తారంగా పనులు కల్పించేది కాదు. ప్రత్యక్షంగానే కాదు, పరోక్షంగా సహితం అది కల్పించే ఉపాధి స్వల్పమే, అందులోనూ ఆధునిక సాంకేతిక ప్రక్రియలలో నేర్పున్న వారికే.

పాశ్చాత్య దేశాలలో ఈ అభివృద్ధి సాధ్యం కాలేదా, ఆ దేశాలు ఇప్పుడు ప్రజలందరికీ సాపేక్షంగా ఉన్నతమైన జీవన ప్రమాణాలు అందివ్వడం లేదా అంటారేమో. పాశ్చాత్య దేశాల అధికారిక చరిత్రలో పారిశ్రామీకరణ సుందరమైన విప్లవంగానే దర్శనమిస్తుందిగానీ అప్పటి సామాజిక సంవాదాన్ని చూస్తే అదెంత హింసాత్మకంగా సాగిందో తెలుస్తుంది. ఆయా దేశాలలోనే కాదు, వాటి వలసలలోను అది చాలా హింసకు కారణమయింది. హక్కుల గురించి అవగాహన లేని రోజులలో జరిగిపోయిన చరిత్రను పునరావృతం చేయనక్కరలేదు. అంతేకాక అప్పటికీ ఇప్పటికీ పైన పేర్కొన్న రెండు విషయాలలో ఒక దాంట్లో తేడా ఉంది. అప్పటి పారిశ్రామీకరణ ఉపాధి ప్రధానమైనది. ఇప్పటిలాగ యంత్ర ప్రధానమైనది కాదు.

కాగా జీవావరణాన్ని, పర్యావరణాన్ని కూడ లెక్కలోకి తీసుకున్నట్టయితే ఆ అభివృద్ధి పంథా అసలే వద్దనవలసి వస్తుంది. పిడికెడు దేశాలు ప్రపంచంలోని సకల ఇంధన వనరులనూ గుప్పిట్లో పెట్టుకొని విపరీతమైన తలసరి ఇంధనం వాడకాన్ని ప్రమాణంగా గల ఆ అభివృద్ధి నమూనాను ఆచరించాయి. అది ఇక మీదట సాధ్యం కాదు. ఇప్పటికే అది మానవ మనుగడను వినాశనం అంచుకు తెచ్చిందని పర్యావరణవేత్తలు సోదాహరణంగా చెప్తున్నారు. కాబట్టి ఆ నమూనానే తిరస్కరించి ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించవలసిన అవసరం ఉంది. ఈ చర్చ వల్ల, అది సూచించగల ప్రత్యామ్నాయాల వల్ల దమ్మిడీ ఆదాయం రాదు కాబట్టి రాజకీయ నాయకులకు అందులో ఆసక్తి ఉండదు. అలవాటయిపోయిన బాటను విడిచిపెట్టి కొత్త ఆలోచనలు చేయడం పాలనా యంత్రాంగానికి ఎప్పుడూ ఇష్టం ఉండదు కాబట్టి బ్యూరోక్రసీకి అసలే ఆసక్తి ఉండదు. ఈ చర్చ నువ్వా నేనా అన్నట్టు వాడిగా వేడిగా సాగదు కాబట్టి మీడియాకూ ఆసక్తి ఉండదు. కాబట్టి వీరెవ్వరితో నిమిత్తం లేకుండ సమాజమే ఈ చర్చను చేపట్టాలి.

కోస్టల్ కారిడార్ గురించి పాలకుల దబాయింపుకు తిరిగి వద్దాం. కోస్టల్ కారిడార్ అంటే విశాలమైన రోడ్లు మాత్రమేననీ అందులో భూములను మింగే పరిశ్రమలూ కాలుష్యం కలిగించే పరిశ్రమలూ ఉన్నాయని ప్రతిపక్షాలు

అనవసరంగా ప్రజలను రెచ్చగొడుతున్నాయని ఒకసారి, కోస్టల్ కారిడార్ పేరిట రోడ్ల కోసమే తప్ప వేరే దేనికోసమూ ప్రభుత్వం భూసేకరణ చేయలేదని ఒకసారి ముఖ్యమంత్రే స్వయంగా అన్నారు. ఇది అవాస్తవం. రద్దుచేశామని చెప్తున్న జీవో34లో కోస్టల్ కారిడార్‌లో ఏమున్నాయో స్పష్టంగా ప్రభుత్వమే చెప్పింది. కోస్టల్ కారిడార్ అనే ప్రాజెక్టులో 'రోడ్లు, రైల్వే లైన్లు, ఓడరేవులు, విమానయానం, నీటి సరఫరా, పెట్రోలియం సహజవాయువుల సరఫరా, విద్యుత్ సరఫరా' వంటి మౌలిక పారిశ్రామిక వసతులు. 'పారిశ్రామీకరణ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, టూరిజం, క్రీడలు, ఐ.టి సంస్థలు, టౌన్‌షిప్‌లు, విద్యా సముదాయాలు, వైద్య సముదాయాలు మొదలైనవి ఉంటాయని జీవో 34 చెపుతోంది. జీవో 34 రద్దయింది కదా అంటారేమో, కోస్టల్ కారిడార్ అనే ప్రణాళికను ప్రకటించిన తాఖీదు కాదు. అట్లాగయితే దాని రద్దుతో ఇదీ రద్దయ్యేది. జీవో 34 కోస్టల్ కారిడార్ అనే పాలనాంశాన్ని 'మౌలిక వసతులు, పరిశ్రమల' శాఖకు కేటాయిస్తూ, దాన్ని అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టే బాధ్యతను ఇన్‌కాప్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) అనే సంస్థకు అప్పగించే జీవో ఈ సంస్థ ప్రైవేట్ – ప్రభుత్వ భాగస్వామ్యం (పి.పి.పి) అనే విధాన విశేషానికొక ఉదాహరణ. దాని సలహా మండలిలో అంతర్జాతీయ స్థాయి సలహాదారులు 50 మంది ఉన్నారట. భారీ సలహాలు తీసుకొని ఇన్‌కాప్ కోస్టల్ కారిడార్ కోసం మౌలిక వసతులను పిపిపి పద్ధతిలో ఎంపిక చేస్తుంది. వాటికోసం ప్రణాళిక తయారు చేస్తుంది. కోస్టల్ కారిడార్‌ను రూపొందించడంలో తన పాత్రేమిటో కూడ వివిధ ప్రభుత్వ శాఖలను సంప్రదించి నిర్ణయిస్తుంది. ఈ అధికారాలు ఇన్‌కాప్‌కు ఇచ్చే తాఖీదు జీవో 34. ఇది రద్దయితే ఇన్‌కాప్‌కు కట్టబెట్టిన ఈ అధికారాలు రద్దయ్యాయి తప్ప వేరే ఏమీ కాలేదు. రేపెప్పుడయినా అవే అధికారాలు లేక బాధ్యతలు వేరొక సంస్థకు అప్పగించవచ్చు. ఉదాహరణకు విశాఖపట్నం – కాకినాడల మధ్య పెట్రోలియం ఆధారిత పరిశ్రమలు, రసాయన పరిశ్రమలు గల పారిశ్రామిక ప్రాంతాన్ని (పి.సి.పి.ఐ.ఆర్) రూపొందించే విషయంలో ఈ బాధ్యతలను పోలిన బాధ్యతలు నిర్వర్తించడానికి ఒక స్పెషల్ డెవలప్‌మెంట్ అథారిటీని జీవో 373 ద్వారా నెలకొల్పారు. ఆ అథారిటీకి ఈ బాధ్యతలన్నీ సులభంగా అప్పగించవచ్చును.

ఇప్పటిదాకా జరిగిన భూసేకరణ కేవలం రోడ్లకోసమేననేది కూడ అబద్ధం. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో కోస్టల్ కారిడార్‌లో భాగమైన వాన్‌పిక్ కోసం భూసేకరణ చాలా వరకు పూర్తి చేశారు. ఇందులో రోడ్లేకాక రెండు ఓడరేవులూ,

ఒక థర్మల్ ప్లాంటు, ఒక నౌకానిర్మాణ కేంద్రం ఉన్నాయి. నెల్లూరు జిల్లాలో, కృష్ణా జిల్లాలో, శ్రీకాకుళం జిల్లాలో కూడ ఈ తీరప్రాంత పారిశ్రామీకరణలో భాగంగా థర్మల్ కేంద్రాల కోసం భూసేకరణ చేపట్టారు. పూర్తిచేశారు. అన్ని కోస్తా జిల్లాలలోనూ ఓడరేవుల కోసం భూసేకరణ చేస్తున్నారు.

తాము నమ్ముతున్న అభివృద్ధి విధానం ఏమిటో పాలకులు నిర్మొహమాటంగా చెప్పేస్తే తాము ఏమి నమ్మేదీ ప్రజలు నిర్ణయించుకోగలరు. తమ విశ్వాసాల మీద తమకే నమ్మకం లేని ఈ దోబూచులాట ఎందుకు?

**ఆంధ్రజ్యోతి దినపత్రిక**
**19 నవంబర్ 2008**

# కోస్ట్‌ను కబళిస్తున్న 'కారిడార్'

కలకత్తా నుండి పోర్బందర్ దాకా దేశ తీరం వెంబడి ఒక విశాల భూభాగంలో భారీగా పారిశ్రామీకరణ చేపట్టడం కోసం రోడ్లు, రైల్వేలైన్లు, విమానాశ్రయాలు, ఓడరేవులు, నీటి సరఫరా, పెట్రోల్ మరియు గ్యాస్ సరఫరా, కరెంటు సరఫరా, టౌన్‌షిప్పులు మొదలయిన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి ఐటి, టూరిజం, వినోదం, వ్యవసాయాధారిత పరిశ్రమలు, పెట్రో కెమికల్స్, మందుల పరిశ్రమలు వగైరాలను ఆహ్వానించే ఉద్దేశ్యంతో ప్రతిపాదించిన ఆలోచన 'తీరప్రాంత పారిశ్రామిక కారిడార్' లేక 'కోస్టల్ కారిడార్' అనేది.


ప్రభుత్వ ప్రైవేటు రంగాల సమ్మేళనమైన (పిపిపి) ఈ ప్రాజెక్టు రూపకల్పన ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతానికి సంబంధించినంత వరకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఇన్‌కాప్) అనే సంస్థ చేతిలో పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం 11 ఫిబ్రవరి 2008న జీవో నెం. 34 జారీ చేసింది. ఈ ఇన్‌కాప్ చిన్న సంస్థ కాదు. ఇందులో 50 మంది 'అంతర్జాతీయ' ప్రతిష్టగల నిపుణులున్నారంట. అయితే అత్యంత విధ్వంసకరమైన కోస్టల్ కారిడార్ ప్రతిపాదన పట్ల తీరప్రాంత ప్రజలలో ఒక పక్క వ్యతిరేకత చాలా పెరగడం, మరొక పక్క ఎన్నికలు సమీపించడం గమనించిన కాంగ్రెస్ ఈ జీవోను తెలివిగా రద్దుచేసి ఇంక ఆందోళన చెందనక్కరలేదన్న అభిప్రాయం కలిగించే ప్రయత్నం చేసింది. కానీ జీవో 34 రద్దుతో ఇన్‌కాప్‌కు ఇచ్చిన కాంట్రాక్టు రద్దయింది తప్ప కోస్టల్ కారిడార్ అన్న ప్రతిపాదన రద్దు కాలేదు.

రాష్ట్రంలో అధికారానికొచ్చిన కొత్త ప్రభుత్వం కొత్త అబద్ధాలు చెప్పి దీనిని కొనసాగిస్తుందనడంలో ఎటువంటి సందేహానికీ ఆస్కారం లేదు కాబట్టి కోస్టల్ కారిడార్ ఇప్పటికే అమలు అవుతూ ఉందని మొదట గ్రహించడం అవసరం.

కోస్టల్ కారిడార్ అనేది ఒక ప్రాజెక్టు కాదు. అది ప్రాజెక్టుల సమాహారం. అందులోని ప్రధాన భాగాలు సెజ్‌లు, కొత్త విమానాశ్రయాలు, ఓడరేవులు, హైవేలు, విద్యుదుత్పత్తి కేంద్రాలు. ఇవన్నీ తయారుచేసి పరిశ్రమలను ఆహ్వానించి వచ్చినకొద్దీ భూములు ఖాళీ చేయించుకుంటూ పోవడమే కోస్టల్ కారిడార్ రూపకల్పన వ్యూహం. ఇప్పటికి విశాఖపట్నం జిల్లాలో రెండు సెజ్‌లు (రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలలో), తూర్పు గోదావరి జిల్లాలో ప్రజల తీవ్ర ప్రతిఘటన నడుమ ఒక సెజ్ (యు.కొత్తపల్లి, తొండంగి మండలాలలో), చిత్తూరు జిల్లాలో ఉన్నప్పటికీ వాస్తవానికి కోస్టల్ కారిడార్‌లో భాగమయిన ఒక సెజ్ (సత్యవేడు, వరదయ్యపాలెం మండలాలలో) భూసేకరణ ప్రక్రియ ముగించుకొని డెవలపర్ చేతిలోకి వెళ్ళాయి, లేక వెళ్లడానికి తయారుగా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లాలో గంగవరం పోర్టు, నెల్లూరు జిల్లాలో కృష్ణపట్నం పోర్టు తయారయ్యాయి. తూర్పు గోదావరి జిల్లా గాడిమొగ దగ్గర రిలయన్స్ వారి సహజవాయువు కేంద్రం ఉత్పత్తి మొదలు పెట్టింది. నెల్లూరు జిల్లా కృష్ణపట్నం దగ్గర మొత్తం 5600 మెగావాట్ల సామర్థ్యం ఉన్న థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం చాలా దూరం పోయింది. విశాఖపట్నం జిల్లా నక్కపల్లి మండలంలో మందుల ఫ్యాక్టరీలు ఇప్పటికే నెలకొన్నాయి. ఇచ్ఛాపురం నుండి తడ దాకా నాలుగు రోడ్ల హైవే పూర్తయిపోయి గోల్డెన్ క్వాడ్రాంగల్‌లో భాగంగా ఎనిమిది రోడ్ల హైవేగా రూపాంతరం చెందడానికి సిద్ధంగా ఉంది. కారిడార్ కోసం భూసేకరణకు గుంటూరు జిల్లాలో ప్రతిఘటన ఉంది కాబట్టి దానిని తాత్కాలికంగా వాయిదా వేసి ప్రతిఘటన లేకుండా చేసుకున్న ప్రకాశం జిల్లాలోనూ, నెల్లూరులోనూ ముగించేస్తున్నారు. ప్రతీ అంగుళం పంటపొలాలు, చేపల చెరువులు ఉన్న తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలలో మాత్రం ఏమీ చేయకుండ ప్రస్తుతానికి జాగ్రత్త పడుతున్నారు.

## తీరం వెంబడి ఊర్లు ఖాళీ

మన రాష్ట్రంలో కోస్టల్ కారిడార్ వైశాల్యం 1575 చదరపు కిలోమీటర్లు ఉంటుందని అంచనా. అంత భూభాగంలో 'తీరం వెంబడి' క్రమంగా పొలాలు, ఊర్లు ఖాళీ అయిపోతాయి. ఎగుమతి మార్కెట్‌తో ముడిపడిన ఉత్పత్తులు చేసే పరిశ్రమలు నెలకొంటాయి. వాటివల్ల వచ్చే ఉద్యోగాలు చాలా తక్కువ, అందులోనూ స్థానిక గ్రామీణులు చేయగల ఉద్యోగాలు మరీ తక్కువ. కాలుష్యం మాత్రం భారీగా ఉంటుంది. మందుల పరిశ్రమలు, పెట్రోకెమికల్స్, రసాయన పరిశ్రమలు, థర్మల్ కేంద్రాలు విపరీతంగా కాలుష్యం కలిగిస్తాయి. ఆ కాలుష్యాన్ని 'ట్రీట్' చేసి సముద్రగర్భంలోకి వదిలిపెట్టడానికి కాలుష్య నియంత్రణ మండలి




కోస్టల్ కారిడార్ చిత్రపటం

అనుమతి ఇస్తున్నది. కేంద్ర పర్యావరణశాఖ కూడ ఆమోదం తెలియజేస్తున్నది. అయితే రసాయన కాలుష్యాన్ని ఎంత 'ట్రీట్' చేసినా నూటికి నూరుశాతం శుభ్రం కాదనేది అందరూ ఎరిగిన సత్యం. కాబట్టి సముద్ర జల కాలుష్యం క్రమంగా పెరుగుతుంది.

మన రాష్ట్రంలో అమలవుతున్న కోస్టల్ కారిడార్ ప్రాజెక్టును మూడుగా విడగొట్టవచ్చు. ఒకటి–విశాఖపట్నం నుండి కాకినాడ దాకా 603 చ.కి.మీల వైశాల్యంలో నెలకొల్పజూస్తున్న పెట్రోకెమికల్స్, పెట్రోలియం ఉత్పత్తుల ప్రాంతం (పి.సి.పి.ఐ.ఆర్). 603 చ.కి.మీలంటే దాదాపు 1.50 లక్షల ఎకరాలు. రెండవది– గుంటూరు, ప్రకాశం జిల్లాలలో 28 వేల ఎకరాలలో నెలకొల్పుతున్న వాన్‌పిక్ (వాడరేవు నిజాంపట్నం పోర్టు పారిశ్రామిక కారిడార్). మూడవది– నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో నెలకొంటున్న సెజ్‌లు, రేవులు, థర్మల్ కేంద్రాల ప్రాంతం. శ్రీకాకుళం జిల్లా ఉత్తర భాగాన నెలకొంటున్న రెండు థర్మల్ విద్యుత్ కేంద్రాలను నాలుగవదిగా భావించవచ్చునేమో.

## పి.సి.పి.ఐ.ఆర్

హైదరాబాద్, విశాఖపట్నం లాంటి నగరాలకు పట్టణాభివృద్ధి సంస్థలు (హుడా, వుడా వగైరా) ఉన్న సంగతి మనకు తెలుసు. వాటి ఆధ్వర్యంలో ఆ

నగరాల మాస్టర్ ప్లాన్‌లు తయారవుతాయి. ఏ నిర్మాణమైనా ఏ అభివృద్ధి ప్రక్రియ అయినా దానికి లోబడి జరగవలసి ఉంటుంది. ఈ పట్టణాభివృద్ధి సంస్థలను ఆం.ప్ర. పట్టణ (అభివృద్ధి) చట్టం, 1975 కింద నెలకొల్పారు. విశాఖపట్నం–కాకినాడ పి.సి.పి.ఐ.ఆర్ ప్రాంతానికి కూడ అదే చట్టం కింద అదే నమూనాలో ప్రత్యేక అభివృద్ధి సంస్థ (ఎస్.డి.ఏ)ని నెలకొల్పుతూ రాష్ట్ర ప్రభుత్వం 2008 మే నెల 24 నాడు జీవో నెం. 373 జారీ చేసింది. ఈ ఎస్.డి.ఎ.కి ఆ పారిశ్రామిక కారిడార్‌లోని 110 గ్రామాలపైన అధికారం ఉంటుంది. ఈ 110 గ్రామాలు విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ, పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, ఎస్. రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాలలోను, తూర్పు గోదావరి జిల్లా యు.కొత్తపల్లి, తొండంగి, కాకినాడ రూరల్ మండలాలలోను ఉన్నాయి. ఇప్పటికే ఆమోదం పొందిన మూడు సెజ్‌లు (రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలలో రెండు, యు.కొత్తపల్లి–తొండంగి మండలాలలో ఒకటి) ఈ భూభాగంలో ఉన్నాయి. సెజ్ హోదా పొందిన పరవాడ మండలంలోని రాంకి ఫార్మా, నక్కపల్లి మండలంలోని హెటరో డ్రగ్స్ కూడ ఇక్కడే ఉన్నాయి. సింహాచలంలోని ఎన్‌టిపిసివారి థర్మల్ పవర్ ప్లాంటు సామర్థ్యాన్ని 2000 మెగావాట్లకు పెంచి, ఇంకొక 7 గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పే ఆలోచన కూడ చేస్తున్నారు. గంగవరం పోర్టు, నిర్మాణంలో ఉన్న కాకినాడ డీప్‌వాటర్ పోర్టు ఇక్కడే ఉన్నాయి. ఇవికాక ముత్యాలమ్మపాలెం దగ్గరొకటి, రేవుపోలవరం దగ్గరొకటి, పూడిమడక దగ్గరొకటి, యు.కొత్తపల్లి – తొండంగి మండలాలలోని సెజ్‌కు అనుబంధంగా మరొకటి–మొత్తం నాలుగు పోర్టులు రాబోతున్నాయి. అయితే ఉత్తరాంధ్రలో రాబోయే రేవులివే కావు. విశాఖపట్నంకు ఉత్తరాన భీమునిపట్నం, కళింగపట్నం, భావనపాడు, ముక్కాంలు కూడ జాబితాలో ఉన్నాయి. ఈ మౌలిక సదుపాయాలు ఒనగూడిన తరువాత ఈ ప్రాంతమంతటా రసాయన, పెట్రో కెమికల్ పరిశ్రమలు, ఎరువుల కర్మాగారాలు, ఉక్కు ఫ్యాక్టరీలు, సిరామిక్స్ ఫ్యాక్టరీలు వస్తాయని పాలకుల ఆలోచన.

ఈ 603 చ.కి.మీలలో 110 గ్రామాలున్నాయి. వేల ఎకరాల కొబ్బరి తోటలు, జీడిమామిడి తోటలు, సరుగుడు తోటలు, వరిచేలు ఉన్న చాలా అందమైన గ్రామాలివి. స్వంత భూములున్న రైతులతోపాటు అసైన్‌మెంట్ పట్టాలున్నవారు, అవి కూడ లేకుండ ప్రభుత్వ భూములు చేసుకొంటున్నవారు, మత్స్యకారులు కడుపునిండా తింటూ బతుకుతున్న గ్రామాలివి. అవేమవుతాయి? ఇప్పటికింకా ఆ గ్రామాలను ఖాళీ చేయించలేదు. అవి అక్కడే ఉన్నాయి. కానీ ఎస్‌డిఎ పాలనలోకి వచ్చాయి. ఎస్‌డిఎ అనుమతి లేకుండ ఎవరూ ఏ నిర్మాణాలూ చేపట్టడానికి

## పేరుకు ఫార్మా సెజ్జేగాని...

విశాఖపట్నం జిల్లా నక్కపల్లి మండలంలోని నల్లమట్టిపాలెం పంచాయితీలో ఫార్మా సెజ్ ఏర్పడింది. ప్రస్తుతం అక్కడున్నది హెటెరో డ్రగ్స్ వారి మందుల కంపెనీ. ఆ కంపెనీ నుండి వెలువడే కాలుష్యం దొండపాక, రాజయ్యపేటల మధ్య ('శుద్ధి' అయిన తరువాత) సముద్రంలో కలుస్తుంది. ఆ తీరం వెంబడి ఈ రెండే కాక బోయపాడు, చిన్నతీనార్ల, పెద్దతీనార్ల, అమలాపురం, ధోనిలక్ష్మీపురం, బంగారయ్యపేట అనే (మొత్తం 8) మత్స్యకారుల గ్రామాలున్నాయి. వీటన్నిటి జనాభా కలిపి 40 వేలుంటుంది. ఇక్కడ ఫార్మా సెజ్ ఏర్పడి రసాయన కాలుష్యం ('శుద్ధి' చేసిన తరువాతే అయినప్పటికీ) సముద్రంలో కలవడం అక్కడి వారికి నష్టకరమయినప్పటికీ హెటెరో డ్రగ్స్ గురించి ఏర్పాటు చేసిన పర్యావరణ బహిరంగ విచారణ వారితో ఏమీ నిమిత్తం లేకుండ సాగింది. పర్యావరణ నివేదికను వాళ్లు చూడలేదు. విచారణ చాలా దూరాన నర్సీపట్నంలో జరిగింది. దానికి ప్రధానంగా ఫ్యాక్టరీ నెలకొంటున్న నల్లమట్టిపాలెం గ్రామ ప్రజలే హాజరయ్యారు.

రేపు జరగబోయే నష్టాన్ని గురించి విని ఈ గ్రామ మత్స్యకారులు ఆందోళన చేస్తున్నారు. వారిలో కొంతమందికి సముద్రంలో 10 కి.మీల దూరం పోయి వేట చేసే మోటార్ బోట్లున్నాయి గానీ ఎక్కువ భాగం సంప్రదాయకమైన తెప్పలమీదే ఆధారపడతారు. అటువంటివి 3000 దాకా ఉన్నాయి. వీరు హెటెరో డ్రగ్స్ కాలుష్య బాధితులు మాత్రమే కాదు. ఉత్తరాంధ్ర కారిడార్‌లోని వ్యర్థపదార్థాల ఔట్‌లెట్లలో ఒకటి నక్కపల్లి మండల తీర ప్రాంతంలో ఏర్పడనుంది. అది సంవత్సరానికి $1^1/2$ నుండి 2 లక్షల టన్నుల వ్యర్థాన్ని 'ట్రీట్' చేసి సముద్రంలోకి వదులుతుంది. దాని ఫలితం ఈ 40 వేల మత్స్యకార జనాభా మీద ఏ విధంగా ఉండగలదని ఆలోచించినవారు లేరు.

వీలులేదు. అంతే కాదు భూములు అమ్ముకోవడానికీ కొనుక్కోవడానికీ కూడ వీలులేదని ఎస్‌డిఏ 23 జూన్ 2008 నాడు పత్రికలకిచ్చిన ప్రకటనలో ఆదేశించింది. (అటువంటి ఆదేశం ఇచ్చే అధికారం వారికి ఉందో లేదో తెలీదు గానీ ఇచ్చేసారు). రాబోయే రోజులలో వీటిలో కొన్ని గ్రామాలను పి.సి.పి.ఐ.ఆర్ కబళిస్తుంది. కొన్ని గ్రామాలు తమ తోటలను, పంట భూములను పి.సి.పి.ఐ.ఆర్‌కు కోల్పోతాయి. చుట్టూ రసాయనిక, పెట్రో కెమికల్, ఫార్మాసూటికల్ పరిశ్రమలను, థర్మల్ పవర్ ప్రాజెక్టులను పెట్టుకొని వాటి కాలుష్యాన్ని భరిస్తూ బతకబోతాయి. బతకడం సాధ్యం కాకపోతే స్వచ్ఛందంగానే ఖాళీ అయిపోతాయి. కొంచెం భూమి ఉన్న వారికి కూడ మంచి ఆదాయం ఇస్తున్న

సరుగుడు తోటలు, కొబ్బరి తోటలు, జీడిమామిడి తోటలు, వరిపొలాలు వట్టిపోతాయి.

రైతులతోబాటు, రైతు కూలీలతోబాటు, మత్స్యకారులు చాలా నష్టపోతారు. ఒక్క విశాఖపట్నం–కాకినాడ పి.సి.పి.ఐ.ఆర్ వల్లనే కాదు, మొత్తంగా మన రాష్ట్ర తూర్పుతీరం వెంబడి నెలకొంటున్న కోస్టల్ కారిడార్ వల్ల ప్రధానంగా నష్టపోయేది మత్స్యకారులు. తీరప్రాంత 'అభివృద్ధి' వల్ల పెరిగే సముద్ర కాలుష్యం, కల్లోలం జలజీవాల పునరుత్పత్తిని దెబ్బతీస్తుంది. ఆ తీరం వెంబడి ఉన్న పల్లెలో మత్స్యకారులు 80 లక్షల మంది నివసిస్తున్నారు. వారు సముద్రంలోనూ సముద్రంలో కలిసే నదులు, ఏర్లలోనూ చేపలవేట చేసుకొని బతుకుతారు. ఇప్పుడు తీరప్రాంతంలో తీవ్ర కాలుష్యకారకాలయిన పరిశ్రమలు, ఓడరేవులు రానున్నాయి. పరిశ్రమలన్నిటికీ కాలుష్యాన్ని 'ట్రీట్' చేసి సముద్రంలోకి వదిలిపెట్టే అనుమతి కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ ఇస్తున్నాయని పైన చెప్పాము. విశాఖపట్నం దగ్గర, నక్కపల్లి దగ్గర, కాకినాడ దగ్గర నాలుగుచోట్ల కాలుష్య శుద్ధి కేంద్రాలు నెలకొంటాయి. ఒక్కొక్కదానికి సంవత్సరానికి 1$^{1}/_{2}$ నుండి 2 లక్షల టన్నుల వ్యర్థాన్ని శుద్ధి చేసే సామర్థ్యం ఉంటుంది. 'ట్రీట్' చేసిన తరువాత ఆ కాలుష్యం సముద్రంలోకి వదలబడుతుంది. 'ట్రీట్' చేయడం అంటే పూర్తిగా శుద్ధిచేయడం కాదు. రసాయన వ్యర్థపదార్థాలను ఎంత శుద్ధి చేసినా పూర్తిగా శుభ్రం కావన్న విషయం కూడ పైన చెప్పాము. సముద్రంలో దూరంపోయి చేపల వేట చేసే పెద్దసైజు మరబోట్ల మీద దీని దుష్ప్రభావం అంతగా ఉండకపోవచ్చునుగానీ తీరం సమీపంలో వేట చేసే సంప్రదాయ మత్స్యకారులపైన బలంగా ఉంటుంది. ఓడరేవుల దగ్గర కూడ వేట అనేక కారణాలుగా కష్టం అవుతుంది. పెద్ద ఓడల రాకపోకలవల్ల సముద్రంలో పెట్రోల్/డీజిల్ కాలుష్యం పెరుగుతుంది. వేగంగా కదిలే పెద్ద ఓడలు మత్స్యకారుల పడవలకూ వలలకూ ప్రమాదకరం కూడ.

పి.సి.పి.ఐ.ఆర్‌కు నీళ్లెక్కడి నుండి వస్తాయన్నది కూడ పెద్ద ప్రశ్నే. అధికారిక పత్రాలలో ధవళేశ్వరం బ్యారేజికి చెందిన సామర్లకోట కాలవనూ, ఏలేరు ఎడమ కాలువనూ, పోలవరం ఎడమ కాలవనూ నీటి వనరులుగా చూపిస్తున్నారు. గోదావరి నుండి నేరుగా పైప్‌లైన్ వేస్తామని కూడ అంటున్నారు. వీటిలో మొదటి రెండూ తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాలలకు సాగునీరు, తాగునీరు ఇస్తున్న ప్రాజెక్టులు. పోలవరం ఎడమ కాలవ ఆ రెండు జిల్లాలలోని గ్రామాలకూ, పట్టణాలకూ (ప్రత్యేకించి విశాఖ నగరానికి) తాగునీరివ్వడానికి ఉద్దేశించ

బడిందని ప్రభుత్వం ప్రకటిస్తూ వచ్చింది. ఇప్పుడు ఈ మూడింటి నీటి వనరులలో సింహభాగం పి.సి.పి.ఐ.ఆర్‌కు ఇచ్చేటట్టయితే ఆ రెండు జిల్లాలవారి సాగునీటి, తాగునీటి అవసరాల గతేమిటి?

## వాన్‌పిక్

వాన్‌పిక్ అనేది వాడపల్లి నిజాంపట్నం పోర్టు ఇండస్ట్రియల్ కారిడార్‌కు ఇంగ్లీషు భాషలో పెట్టిన ముద్దుపేరు. పి.సి.పి.ఐ.ఆర్ గోదావరి డెల్టా అవతలి చివరిదాకా వచ్చి ఆగిపోతుంది. గోదావరి, కృష్ణా డెల్టాలను ప్రస్తుతానికి వదిలిపెట్టి కృష్ణా డెల్టా దక్షిణ కొసనుండి ఇది మొదలవుతుంది. (ప్రస్తుతానికి అని ఎందుకంటున్నామంటే డెల్టాను కూడ వదిలిపెట్టేదేమీ ఉండదు. ప్రతిఘటన ఎక్కువ రావచ్చునన్న ఆలోచనతో తాత్కాలికంగా అక్కడ ప్రాజెక్టు రూపకల్పన చేయడం లేదంతే).

వాన్‌పిక్ విస్తీర్ణం 28 వేల ఎకరాలు. గుంటూరు జిల్లాలో నిజాంపట్నం, బాపట్ల, పిట్టలవానిపాలెం, కర్లపాలెం మండలాలు, ప్రకాశం జిల్లాలో వేటపాలెం, చిన్నగంజాం, కొత్తపట్నం, ఒంగోలు మండలాల తీరప్రాంతంలో ఇది నెలకొంటుంది. ఇందులో వాడపల్లి దగ్గరొకటి, నిజాంపట్నం దగ్గరొకటి రెండు ఓడరేవులు, నిజాంపట్నం మండలం డిండి దగ్గర పెద్ద థర్మల్ ప్లాంటు ఉంటాయని తెలుస్తున్నది. ప్రకాశం జిల్లా మోటుపల్లి దగ్గర నౌకా నిర్మాణ కేంద్రం రాబోతుందని, కొత్తపట్నం మండలంలో విమానాశ్రయం కట్టబోతున్నారని, వివిధ రసాయన పరిశ్రమలు, ఎరువుల పరిశ్రమలు రాబోతాయని వింటున్నాం. ఉప్పుగుండూరు దగ్గర థర్మల్ ప్లాంట్ వస్తుందన్న వదంతి సహితం ఉంది. వాన్‌పిక్ అనేది పోర్టు ఆధారిత పారిశ్రామిక కారిడార్ కాబట్టి ఏ పరిశ్రమలొచ్చినా ఎగుమతులపైన ప్రధానంగా దృష్టిపెట్టేవిగా ఉండబోతాయి. అంటే వాటి సాంకేతిక స్థాయి హెచ్చుగా ఉంటుంది. ఆ స్థాయి చదువు ఈ గ్రామాలలో ఎవరికీ లేదు కాబట్టి వాన్‌పిక్‌లో వీళ్లకు ఉద్యోగాలు రావడం కల్ల.

పి.సి.పి.ఐ.ఆర్‌కూ వాన్‌పిక్‌కూ ఒక ముఖ్యమైన తేడా ఏమిటంటే వాన్‌పిక్‌ను రూపొందించేది ఒక ప్రైవేట్ సంస్థ. దీని పేరు వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్. పి.సి.పి.ఐ.ఆర్‌ను ప్రభుత్వం చేతిలోనే ఉంచుకొని వాన్‌పిక్‌ను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వెనక ఉన్న రహస్యాన్ని క్లుప్తంగా చెప్పాలంటే ఆ కంపెనీకి చెందిన ముఖ్యులు వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డికి చాలా 'కావలసిన' వారయిన నిమ్మగడ్డ ప్రసాద్, చిల్లా రవిరెడ్డి, కొండా వెంకటేశ్వరరెడ్డి అనే త్రయం. గుంటూరు జిల్లాలో

వాన్‌పిక్ ప్రాజెక్టుకు నిమ్మగడ్డ ప్రసాద్ గారి మాట్రిక్స్ సంస్థే యజమాని అని ప్రజలు భావిస్తున్నారు. నిజానికి అది వాన్‌పిక్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వాటాదారు మాత్రమే.

వారికి కావలసిన 28 వేల ఎకరాలలో ప్రభుత్వ భూమి చాలా ఉంది. దాని అప్పగింత ప్రభుత్వం చూసుకుంటుంది. ప్రైవేట్ భూమిని వాన్‌పిక్ రైతుల నుండి స్వయంగా కొనుక్కుంటున్నది. 9944.25 ఎకరాల అసైన్డ్ భూమిని మాత్రం ప్రభుత్వం లబ్ధిదారుల నుండి తీసుకొని వాన్‌పిక్‌కు అప్పగించే ప్రయత్నం చేసింది. ఆ భూమి తప్ప వేరే జీవనాధారం లేని లబ్ధిదారులు గట్టిగా ప్రతిఘటించారు. ఇసుక నేలలో చెరువులు తవ్వి ఆ నీళ్లతో కూరగాయలు పండించుకొని బతికేవారే ఎక్కువ. చేపల వేట చేసుకునే మత్స్యకారులూ ఉన్నారు. ప్రకాశం జిల్లాలోని బాధిత గ్రామాలైన కఠారివారిపాలెం, పుల్లరిపాలెం, రుద్రమాంబాపురం, పల్లెపాలెం, జీడిచెట్లపాలెం, మోటుపల్లిలలో మత్స్యకారులు పెద్దసంఖ్యలో ఉన్నారు. గుంటూరు జిల్లాలోని బాధిత గ్రామాలలో నిజాంపట్నం ప్రధానంగా మత్స్యకారుల గ్రామం. బాపట్ల మండలంలోని రామచంద్రపురం, విజయలక్ష్మిపురం కూడ అంతే. అయితే ప్రకాశం జిల్లా అధికార యంత్రాంగం పోలీసులను దించి నిషేధాజ్ఞలు ప్రకటించి భూసేకరణ ప్రక్రియను నడిపించే ప్రయత్నం చేయగా గుంటూరులో ఏ కారణంగానో ఆ ప్రయత్నం అంతగా జరగలేదు. థర్మల్ ప్లాంట్ రావలసిన డిండి గ్రామ పంచాయితీలోకయితే అధికారులు అడుగుపెట్టడానికి సహితం సాహసించడం లేదు. అయితే వెనక్కిపోయే ఉద్దేశం ప్రభుత్వానికి ఉన్న దాఖలాలు లేవు కాబట్టి 'సరయిన' సమయం చూసి మొదలు పెడతారేమో.

ప్రభుత్వం వాన్‌పిక్‌కు అప్పగిస్తున్న భూమిలో బాపట్ల, కర్లపాలెం మండలాలలోని మడ అడవులు కూడ ఉన్నాయి. అటవీశాఖ అధికార్లే కాదు, కర్లపాలెం తాసీల్దారు సహితం ఇది ధృవీకరించాడు. అవి క్షీణించిపోతున్నాయని గుర్తించిన అటవీశాఖ మూడేళ్ల క్రితం వాటి పునరుద్ధరణ ప్రయత్నాన్ని మొదలుపెట్టింది. అక్కడ ఉన్న రొయ్యల చెరువు, గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఫండ్ సహాయంతో కొన్ని లక్షలు ఖర్చుపెట్టారు. ఒక పక్క అది జరుగుతుండగా ఆ భూమి యావత్తూ ఇప్పుడు వాన్‌పిక్‌లో భాగం అయిపోతున్నది. దీని ఔచిత్యం గురించి స్థానిక అటవీశాఖ అధికారిని (గుంటూరు సర్కిల్ ఫారెస్ట్ కన్సర్వేటర్) ప్రశ్నించగా, 'వాళ్లు పార్లమెంటును తవ్వేసి పరిశ్రమలకిచ్చేసినా అడిగేవారెవరు?' అంటూ తలపట్టుకుంటాడు.

బడుగు వర్గాల నుండి ఎదిగిన రాజకీయ నాయకులు తమ వారికి అండగా నిలబడితే ఎంత శక్తివంతమైన పాత్ర నిర్వహించగలరో, పాలకులకు ఏజెంట్లుగా మారితే అంత నష్టం కలిగించగలరనడానికి పొన్నూరు ఎంఎల్ఏ, రాజశేఖరరెడ్డి క్యాబినెట్‌లో మౌలిక సదుపాయాల శాఖ మంత్రి అయిన మోపిదేవి వెంకటరమణారావును ఉదాహరణగా చెప్పుకోవచ్చు. గతంలో ఆయన గుంటూరు, ప్రకాశం తీరప్రాంతాలలో మత్స్యకారుల జీవనానికి నష్టకరమైన పరిశ్రమలు ఏవి ప్రతిపాదనకొచ్చినా తన కులం వారయిన మత్స్యకారులను సమీకరించి శక్తివంతంగా ఎదుర్కొన్నాడు. బహుశా అందుకేనేమో వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఆయనను కేబినెట్‌లోకి తీసుకొని మౌలిక సదుపాయాల శాఖ ఇచ్చాడు. ఆయనే ఇప్పుడు వాన్‌పిక్ విషయంలో నిజాంపట్నం మత్స్యకారుల నిరసనను చల్లార్చడానికి రాజశేఖరరెడ్డి ప్రభుత్వానికి బాగా ఉపయోగపడ్డాడు. 'మంత్రి మా వాడు కాబట్టి మాకు అన్యాయం చేయడు' అన్న భరోసాతో నిజాంపట్నం మత్స్యకారులు మౌనంగా ఉండిపోయారు.

## నెల్లూరు

నెల్లూరు జిల్లా అతి పెద్ద థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారనుంది. కృష్ణపట్నంలో రిలయన్స్‌వారి కోస్టల్ ఆంధ్ర పవర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల సామర్థ్యంగల అల్ట్రా మెగా థర్మల్ ప్లాంట్ ఒకటి, జెన్‌కో యాజమాన్యంలో 1600 మెగావాట్ల సూపర్ థర్మల్ ప్లాంట్ ఒకటి వస్తున్నాయి. దీనిని కూడ త్వరలో 4000 మెగావాట్లకు పెంచనున్నారు. ఇవికాక నవయుగ, సింహపురి ఎనర్జీ, మీనాక్షి, కీనేటి సంస్థల ఆధ్వర్యంలో ఇంకొక 4160 మెగావాట్ల సామర్థ్యంగల 4 ప్లాంట్లు రానున్నాయని వినికిడి. ఇవన్నీ పూర్తయితే నెల్లూరులో 12,000 మెగావాట్లకు పైగా విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దేశంలో ఇంకొక్క చోట మాత్రమే అంతటి విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉంది. జార్ఖండ్‌లోని సింగ్రౌలి. సింగ్రౌలి పరిసరాలలోని కాలుష్యం ఇప్పటికే అనుభవంలోకి వచ్చింది కాబట్టి నెల్లూరు పరిస్థితి ఎంత భయంకరంగా ఉండబోతుందో ఊహించగలం. బొగ్గు మండితే వచ్చే కాలుష్యంలో ప్రధానమైనది బూడిద. దానితోపాటు భారలోహాలు (పాదరసం, నికెల్, కాడ్మియం, క్రోమియం వగైరా) ఉంటాయి. గంధకం (సల్ఫర్) మరొక ప్రధాన కాలుష్యకారకం. అది మండినప్పుడు సల్ఫర్ డై ఆక్సైడ్‌గా మారి గాలిలో కలుస్తుంది. మన దేశంలో దొరికే బొగ్గులో బూడిదపాలు ఎక్కువ ఉంటుందని చెప్పి కోస్టల్ కారిడార్‌లో భాగంగా నెలకొల్పుతున్న థర్మల్

ప్రాజెక్టులలో వాడే బొగ్గును ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నారు. అయితే దిగుమతి చేసుకునే బొగ్గులో బూడిద తక్కువ ఉన్నా గంధకం, భారలోహాలు ఎక్కువే ఉంటాయి. పైగా భారలోహాలు కాన్సర్ కారకాలు.

4000 మెగావాట్ల రిలయన్స్ వారి థర్మల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతి పత్రాన్ని చూస్తే ఏ కాలుష్యం ఎంత ఉంటుందో అర్థం అవుతుంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గు మొత్తం దిగుమతి చేసుకొంటారు. అది సంవత్సరానికి 1.4 కోట్ల టన్నులు మించకూడదని అనుమతి పత్రం అంటుంది. అందులోని బూడిదపాలు 15 శాతం దాకా ఉండవచ్చు. అంటే సంవత్సరానికి 21 లక్షల టన్నుల బూడిద బయటికొస్తుంది. ఇందులో కొంత పొగగొట్టం ద్వారా గాలిలోకి పోతుంది. దీనిని ఫ్లైఆష్ అంటారు. దానినంతా సేకరించి పూర్తిస్థాయిలో ప్రత్యామ్నాయ అవసరాల కోసం వినియోగించాలనీ, 9 ఏళ్లలోగా పూర్తి వినియోగాన్ని సాధించాలనీ అనుమతి పత్రం అంటుంది. ఈ వినియోగం ఏమిటంటే బూడిదతో ఇటుకలు తయారు చేయడం. కోరిక బాగానే ఉన్నప్పటికీ ఒకేసారి దేశమంతా ఇంత భారీగా థర్మల్ విద్యుత్ కేంద్రాలు నెలకొల్పుతున్నప్పుడు (మన రాష్ట్రంలోనే నెల్లూరులో 6, గుంటూరులో 1, శ్రీకాకుళంలో 2) ఆ ఫ్లైఆష్‌నంతా ఇటుకల పరిశ్రమ తీసుకోగలదని నమ్మకం ఏమిటి? కాగా, మిగిలిన బూడిద నేలమీద చేరుతుంది. దానిని నీళ్లతో కలిపి బురదచేసి బూడిద చెరువుల (ఆష్‌పాండ్స్)లో వేస్తారు. ఈ వ్యర్థం నిరంతరాయంగా వస్తూనే ఉంటుంది కాబట్టి బూడిద చెరువుల సంఖ్య, విస్తీర్ణం పెరుగుతూనే ఉంటాయి. ఈ బూడిదతోబాటు క్యాన్సర్ కారకాలయిన భారలోహాలు కూడ చెరువులలో నిక్షిప్తం అవుతాయి. అవి భూగర్భ జలాలలో కలవకుండా ఉండడానికి బూడిద చెరువులకు పక్కన, దిగువన సిమెంట్ లైనింగ్ ఇవ్వాలని అనుమతి పత్రం అంటుంది. ఆచరణలో ఇది సక్రమంగా జరగదనీ, భారలోహాల కాలుష్యం నుండి భూగర్భజలాలు తప్పించుకోజాలవనీ సింగ్రౌలి అనుభవం తెలుపుతుంది.

దిగుమతి అయ్యే బొగ్గులో 0.8 శాతం దాకా గంధకం ఉండవచ్చునని అనుమతి పత్రం అంటుంది. అంటే సంవత్సరంలో వినియోగించే 1.4 కోట్ల టన్నుల బొగ్గులో 1.12 లక్షల టన్నుల గంధకం ఉంటుంది. అది కాలిన తరువాత ఆమ్ల స్వభావంగల సల్ఫర్ డై ఆక్సైడ్ రూపం తీసుకుంటుంది. ఈ వాయువు పరిమితిని మించి గాలిలో కలవకుండ చూసుకోవాలని అనుమతి పత్రం అంటుంది. మళ్లీ సింగ్రౌలి అనుభవం ఏం చెప్తుందంటే అదేం జరగదని. అప్పుడేమవుతుందంటే చుట్టుపక్కల ఆమ్లవర్షం అడపాదడపా కురుస్తుంది. అది పంటలకు, భూసారానికి వినాశనకరం.

నీళ్లు రోజుకు 8.64 లక్షల ఘనపు మీటర్లు కావలసి ఉంటుంది. వాటిని సముద్రం నుండి తీసుకుంటారు. అందులో 5.77 లక్షల ఘనపు మీటర్లు తిరిగి సముద్రంలోకే పోతాయి కాని మిగిలిన 2.87 లక్షల ఘనపు మీటర్ల నీటిని 'డీసాలినేషన్' ప్లాంట్‌లో ట్రీట్ చేసి ప్రాజెక్టు ఉద్యోగులకు అవసరమయిన మంచినీటిగా వాడుకుంటారు. ఇందులో కొంత మురుగునీటి రూపంలో తిరిగి సముద్రంలోకి పోవచ్చు. మొత్తానికి అల్ట్రా మెగా థర్మల్ ప్లాంటువల్ల కృష్ణపట్నం తీరం దగ్గర సముద్రం నిరంతరాయంగా కల్లోలానికి గురవుతూ ఉంటుంది. థర్మల్ ప్లాంట్‌లలో వాడిన తరువాత వెనక్కి వచ్చే నీటి ఉష్ణోగ్రత 5 నుండి 10 డిగ్రీలు ఎక్కువ ఉంటుంది. దానికితోడు అక్కడే కృష్ణపట్నం పోర్టు కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో పెద్ద ఓడరేవు రాబోతున్నది. ఇదంతా కలిసి చేపలు తదితర జలజీవాల పునరుత్పత్తిని బాగా దెబ్బతీస్తాయి. అంటే ఇవి మత్స్యకారుల బతుకును తీవ్రంగా దెబ్బతీస్తాయి. నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో 123 మత్స్యకారుల గ్రామాలున్నాయి. ఈ గ్రామాల ఉనికే ఇప్పుడు ప్రశ్నార్థకం అయింది. ఆ మత్స్యకారుల విద్యాస్థాయి స్వల్పం కాబట్టి వాళ్ల జీవనాన్ని మూసేస్తున్న ఈ 'అభివృద్ధి' వారికి కొత్తగా ఉద్యోగాలు, ఉపాధి ఇవ్వడం కల్ల.

గుంటూరు, ప్రకాశం జిల్లాలలాగే నెల్లూరులో కూడ తీరప్రాంత 'అభివృద్ధి' అసైన్డ్ భూమిమీద బతుకుతున్న పేదల జీవనాన్ని కొల్లగొడుతోంది. కృష్ణపట్నం పోర్టు కోసం ఇచ్చిన 2500 ఎకరాలు కాక, మరొక 11000 ఎకరాలు 'పారిశ్రామిక పార్కు' పేరిట అదే కంపెనీకి (కె.పి.సి.ఎల్) అప్పగించారు. ఇందులో అసైన్డ్ భూమేకాక, అదే పేదలు కనీసం అసైన్‌మెంట్ కూడ లేకుండ సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములూ ఉన్నాయి. సరుగుడు చెట్లు, జీడిమామిడి చెట్లు వేసుకొని వేలాది కుటుంబాలు జీవనం పొందుతున్నాయి. ఈ పారిశ్రామిక పార్కు కాక టెక్స్‌టైల్ పార్కు పేరిట దాదాపు మరొక 6000 ఎకరాల భూమి 'అభివృద్ధి' కోసం కేటాయించబడింది. ప్రజల జీవనాధారం అయిన భూమిని పరిశ్రమల కోసం స్వాధీనం చేసుకుంటున్న జిల్లాల జాబితాలో ఇప్పుడు నెల్లూరు కూడ విశాఖపట్నం, రంగారెడ్డి జిల్లాల సరసన చేరింది. కృష్ణపట్నం పోర్టు నిర్మాణం చేస్తున్న కెపిసిఎల్ అంటే రాష్ట్ర ప్రభుత్వానికి గల ప్రేమకు కారణమేమిటోగాని వారి 'అవసరాలకు' నెల్లూరు నుండి వాన్‌పిక్ సరిహద్దు దాకా తీరప్రాంతమంతా 'రిజర్వు' చేయబడింది.

### సిఆర్‌జడ్ ఆటంకం కాలేదా?

కోస్టల్ కారిడార్ అనగానే పర్యావరణ పరిజ్ఞానం ఉన్న వారెవరికైనా తీరప్రాంత పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్దేశించిన సిఆర్‌జడ్ (కోస్టల్ రెగ్యులేటరీ

జోన్) నియమాలు అడ్డం రావా అన్న సందేహం వస్తుంది. ఇప్పటిదాకా కోస్టల్ కారిడార్‌లో భాగంగా ఇచ్చిన అన్ని అనుమతులలోనూ కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్‌జడ్) నియమాలను అతిక్రమించకూడదు అని రాస్తున్నారు గానీ అతిక్రమణ జరిగిందా లేదా అని చూస్తున్నవారెవరూ కనబడడం లేదు.

తెలుగులో ఆటు, పోటు అనేదాన్ని ఇంగ్లీషులో లోటైడ్, హైటైడ్ అంటారు. ఆటుపోట్ల సమయంలో తీరంమీద సముద్రపు నీటి మట్టాన్ని లోటైడ్ లైన్, హైటైడ్ లైన్ (ఎల్‌టిఎల్, హెచ్‌టిఎల్) అంటారు. హెచ్‌టిఎల్‌కు అరకిలోమీటరు ఇవతలి దాకా ఉన్న ప్రాంతాన్ని (అంటే సముద్రం పోటెత్తినప్పుడు ఎంత దూరం నేలమీదికొస్తుందో అక్కడినుండి అరకిలోమీటరు ఇవతల ఉన్న ప్రాంతాన్ని) కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్‌జడ్) అంటారు. సిఆర్‌జడ్‌లో సముద్రతీరం మీద ప్రత్యక్షంగా ఆధారపడిన పరిశ్రమలకు తప్ప వేరే దేనికీ అనుమతి ఇవ్వడానికి వీలు లేదు. ఓడ రేవులకు ఇయ్యవచ్చు. థర్మల్ ప్లాంట్‌లకు సంబంధించి ముడి సరుకు తెచ్చుకోవడానికి, సముద్రపు నీటిని అవసరమైన మేరకు తీసుకోవడానికి మాత్రం అనుమతి ఇయ్యవచ్చు. అయితే ఆ అనుమతి కూడ సిఆర్‌జడ్‌లోని 'పర్యావరణరీత్యా సున్నితమైన' ప్రాంతాలలో, జలజీవుల పునరుత్పత్తి కేంద్రాలకు దగ్గరున్న ప్రాంతాలలో, మడ అడవులున్న ప్రాంతాలలో, వన్యప్రాణి సంరక్షక కేంద్రాలలో, జీవవైవిధ్యం బాగా ఉన్న ప్రాంతాలలో, సహజసౌందర్యం లేక చారిత్రక ప్రాముఖ్యం ఉన్న ప్రాంతాలలో, సముద్ర నీటి మట్టం పెరిగినప్పుడు ముంపుకు గురికాగల ప్రాంతాలలో ఇవ్వకూడదు. (ఎల్‌టిఎల్‌కు, హెచ్‌టిఎల్‌కు మధ్యనున్న ప్రాంతంలో కూడ ఇవ్వకూడదు. ఈ రెండింటినీ కలిపి సిఆర్‌జడ్–I అంటారు).

గుంటూరు, ప్రకాశం జిల్లాలలో వాన్‌పిక్‌కు కేటాయిస్తున్న ప్రాంతంలో ఈ కోవకు చెందిన తీరప్రాంత భూమి చాలా ఉంది. పి.సి.పి.ఐ.ఆర్ భూసేకరణ – సెజ్‌లున్న ప్రాంతాలలో తప్ప – ఇంకా వేగం పుంజుకోలేదుగానీ అది జరిగినప్పుడు అక్కడ కూడ ఈ పరిస్థితి కనిపించబోతుంది.

కోస్టల్ కారిడార్‌ను ప్రజలు, ప్రజా ఉద్యమాలు వ్యతిరేకించడానికి సిఆర్‌జడ్ నియమాల అతిక్రమణ ఒక్కటే కారణం కాకపోయినా ఆ అతిక్రమణ ఉన్న చోట చట్టరీత్యా వ్యతిరేకించే అవకాశం ఉంది కాబట్టి ఆ అంశాన్ని కూడ ఎత్తి చూపడం జరుగుతున్నది. మన రాష్ట్రంలో ఈ ప్రయత్నం ఒక ప్రాజెక్టు విషయంలో విజయవంతమయింది. ఇంకొక ప్రాజెక్టు విషయంలో అయినట్టే అయి చేయి జారిపోయిన దాఖలాలు కనిపిస్తున్నాయి.

## పోలాటితిప్ప

మొదటిది కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలంలోని పోలాటితిప్ప వద్ద థర్మల్ పవర్‌టెక్ కార్పొరేషన్ లిమిటెడ్ వారికి 1980 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ నెలకొల్పడానికి 1200 ఎకరాల భూమిని కేటాయించిన ఉదంతం. ఆ భూమిలో మడ అడవులు, మట్టిదిబ్బలు ఉన్నాయి. మడ అడవులున్న సంగతి స్పష్టంగానే కనిపిస్తున్నప్పటికీ కంపెనీవారి అభ్యర్థన మేరకు మచిలీపట్నం ఆర్‌డివోగారు పోలాటితిప్పలోని సర్వే నెం. 53/బిలో వున్న ఆ 1200 ఎకరాలు ఇచ్చేయవచ్చునని ప్రభుత్వానికి రాసారు. 2008 మే నెల 7వ తేదీన ఆ భూమిని ముందస్తుగా (అంటే చట్టపరమయిన లావాదేవీలేవీ పూర్తి కాకుండానే) కంపెనీ చేతిలో పెట్టమని ప్రభుత్వం బందరు తాసీల్దారును ఆదేశించింది. ఆయన 8వ తేదీనే వారికి అప్పగించేసారు. కొనుగోలు ఒప్పందం జూన్ 24న జరిగింది. ఇంకా కాలుష్య నివారణ మండలి నుండి క్లియరెన్స్, కేంద్ర ప్రభుత్వం నుండి పర్యావరణ అనుమతి లభించవలసి ఉంది.

మరి వాటికి మడ అడవులు అడ్డంకి కాదా? అందుకే ఒక రాత్రికి రాత్రే ఆ భూమిలోని మడ అడవులు మొత్తం నరికివేయబడ్డాయి. ఈ సంగతి తెలిసిన ఒక పర్యావరణ సంస్థ (ఫోరం ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్) హైకోర్టులో కేసు వేసింది. వాళ్లు థర్మల్ పవర్‌టెక్ కార్పొరేషన్ గురించి, వారికిచ్చిన 1200 ఎకరాల గురించి ప్రస్తావించలేదు. కేవలం పోలాటితిప్ప సర్వే నెం. 53/బిలో ఉన్న మడ అడవుల నరికివేత గురించి కోర్టుకు ఫిర్యాదు చేసారు. కోర్టుకు నివేదిక ఇవ్వక తప్పని ప్రభుత్వం కృష్ణా జిల్లా కలెక్టర్ నుండి నివేదిక కోరగా వారు మచిలీపట్నం ఆర్‌డివో నుండి నివేదిక కోరారు. ఆర్‌డివో ఆ ప్రాంతాన్ని పరిశీలించి, 150 ఎకరాల మేరకు మడ చెట్లను అప్పటికి (15 ఆగస్ట్ 2008 నాటికి) 10-15 రోజులు ముందు ఎవరో కొట్టేసిన మాట సత్యమేననీ, ఆ 150 ఎకరాలు థర్మల్ పవర్‌టెక్ కార్పొరేషన్‌కు ఇచ్చిన 1200 ఎకరాలలో ఉన్నమాట వాస్తవమేననీ, అయితే ఈ ఘాతుకానికి ఒడిగట్టిందెవరో తెలియదనీ అన్నాడు. పోలాటితిప్ప గ్రామంలోని సర్వే నెం. 53లో 685.49 ఎకరాలు సిఆర్‌జడ్-1లో ఉన్న మాట కూడ నిజమేననీ, అయితే అదే సర్వే నెంబర్‌లో మరొక 2689 ఎకరాల భూమి ఉందనీ, ఇది సిఆర్‌జడ్-3లో (కొన్ని షరతులతో థర్మల్ ప్లాంట్లకు ముడిసరుకులు, సముద్రం నీళ్లు తెచ్చుకునే మేరకు అనుమతులు ఇవ్వగల ప్రాంతం) ఉందనీ, థర్మల్ ప్లాంట్‌కు ఇచ్చిన 1200 ఎకరాల మొత్తం కూడ ఈ భాగంలోనే ఉందనీ అన్నాడు. కొట్టేసిన 150 ఎకరాల మడ అడవి ఆ 1200 ఎకరాలలో ఉందని

ఆయనే అంటాడు. మడ అడవులను సిఆర్‌జడ్-I గా చట్టమే నిర్వచించింది. అయినప్పటికీ ఆ 1200 ఎకరాలు సిఆర్‌జడ్-IIIలో ఉందని మళ్లీ ఆయనే అంటాడు. ఆయన నివేదికను స్వీకరించిన కలెక్టర్‌గారు సహితం అదే అభిప్రాయాన్ని ప్రభుత్వానికి నివేదించారు. పోలాటితిప్ప థర్మల్ ప్లాంటు బహిరంగ విచారణలో పర్యావరణవాదులు, హక్కుల సంఘాలు ఆ భూమి సిఆర్‌జడ్-Iలో ఉందనీ, అనుమతులు ఇచ్చి ఉండకూడదనీ వాదించగా కృష్ణాజిల్లా కలెక్టర్ మాత్రం అది సిఆర్‌జడ్-3లో ఉందని అన్నారు. కానీ నిజం త్వరలోనే బయటపడింది. సిఆర్‌జడ్ నియమాల కింద ఆంధ్రప్రదేశ్ కోసం తయారు చేసిన తీరప్రాంత నిర్వహణ ప్రణాళిక (కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్లాన్)లో పోలాటితిప్ప గ్రామాన్ని పేరుపెట్టి ప్రస్తావించి ఆ ఊరిలోని మడ అడవులే కాక మట్టిదిబ్బలు, బంజరు భూములు యావత్తూ సిఆర్‌జడ్-Iగా వర్గీకరించబడినట్లు ఉంది. ఆపైన బుకాయించడం ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. దాంతో పోలాటితిప్పలో థర్మల్ పవర్‌టెక్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు ఇచ్చిన అనుమతిని రద్దు చేసింది. పర్యావరణవాదులు, ప్రజాసంఘాలు అప్రమత్తంగా ఉండి అడుగడుగునా వెంటాడకపోయి ఉంటే వారికి 'జ్ఞానోదయం' అయివుండేదన్న భరోసా లేదు.

ఇంతకూ రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రభుత్వ అధికారులను ఒక అక్రమానికి పాల్పడే దిశగా అంతదూరం నెట్టిన ఈ థర్మల్ పవర్‌టెక్ ఎవరిదనుకున్నారు? కాంగ్రెస్ నాయకుడు, పోషకుడు అయిన టి. సుబ్బిరామిరెడ్డిగారి కుటుంబ సభ్యులది.

## కాకరాపల్లి

రెండవది శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కాకరాపల్లి దగ్గర ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ నెలకొల్పుతున్న 2640 మెగావాట్ల థర్మల్ ప్లాంటు. ఈ థర్మల్ ప్లాంటు కోసం కేటాయించిన 2450 ఎకరాల చుట్టూ పచ్చని పొలాలున్నాయి. సంవత్సరం పొడవునా నీళ్లు నిలువ ఉండే విశాలమైన భూభాగం ఉంది. దీని వైశాల్యం 20 చ.కి.మీలు. దీనిని నౌపడా స్వాంప్స్ అంటారు. ఈ నీటిలో మత్స్యకారులు వేట చేసుకుంటారు. చుట్టుపక్కల పొలాలున్న రైతులు ఈ నీటికుంట నుండి సాగునీరు పొందుతున్నారు. రెండవవైపు కొద్ది దూరంలో తేలినీలాపురం గ్రామంలో పక్షుల అభయారణ్యం ఉంది. సుదూర దేశాల నుండి పక్షులు ఇక్కడికొచ్చి గుడ్లు పొదుగుతాయి. అక్కడ 2640 మెగావాట్ల సామర్థ్యంగల థర్మల్ ప్లాంటు, దానికి కొద్దిదూరంలో సోంపేట మండలంలో నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఆధ్వర్యంలో దాదాపు అంతే సామర్థ్యం గల మరొక థర్మల్ ప్లాంటు రాబోతున్నాయి.

కేంద్ర పర్యావరణ శాఖ నిపుణులు మొదట ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీవారి ప్రతిపాదనకు అనుకూలంగా లేరు. వర్షా కాలంలో అనేక వాగులు, గెడ్డలు నౌపడా స్వాంప్స్‌లోకి ప్రవహిస్తాయి. భారీ థర్మల్ ప్లాంట్ వస్తే ఇది దెబ్బతింటుంది. చేపలు, రొయ్యలు వగైరాల వేటకూ, సాగునీటికీ వనరుగా ఉన్న నౌపడా స్వాంప్స్ దీనివల్ల క్రమంగా ఎండిపోయే ప్రమాదం ఉంది. ఆపైన కాలుష్యం ప్రభావం ఉండనే ఉంది. బూడిద చుట్టూ ఉన్న పొలాలపైన వచ్చి పడినా నీటి వనరులపైన వచ్చిపడినా తీవ్ర నష్టమే. భారలోహాలు భూగర్భ జలాలలోకి ఇంకినట్టయితే అవి తిరిగి నౌపడా స్వాంప్స్‌లో ఇంకా మిగిలి ఉన్న నీటిని కలుషితం చేయగలవు. బూడిద, పొగల ప్రభావం తేలినీలాపురం పక్షుల అభయారణ్యంపైన కూడ ఉంటుంది. అందువల్ల 2008 డిసెంబర్ 15, 16 తేదీలలో జరిగిన సమావేశంలో కేంద్ర పర్యావరణ శాఖ నిపుణులు (పూర్తిపేరు కావాలంటే, థర్మల్ విద్యుత్తు మరియు బొగ్గు గనుల పర్యావరణ దుష్ప్రభావ అంచనా కొరకు నియమించబడ్డ నిపుణుల కమిటీ) నౌపడా స్వాంప్స్ నుండి ప్రాజెక్టును దూరం జరిపితే తప్ప పర్యావరణ అనుమతి రికమెండ్ చేయలేం అన్నారు. దానికి జవాబుగా ఆ కంపెనీ, తమకు రాష్ట్రప్రభుత్వం కేటాయించిన 2450 ఎకరాల భూమిలో దక్షిణాన ఉన్న 455 ఎకరాలు వదులుకొని తక్కిన 1995 ఎకరాలలోనే ప్లాంటు నిర్మాణం చేపడతానని, అన్ని నిర్మాణాలు ఆ 1995 ఎకరాలకే పరిమితం అవుతాయనీ హామీ యిచ్చి అనుమతి అడిగింది. (కేటాయించిన భూమిలో దాదాపు 20 శాతాన్ని వదులుకొని అదే ప్రాజెక్టును కొనసాగించడం సాధ్యమయినట్టయితే తొలుత ఎక్కువ భూమి ఎందుకు కోరినట్టు, వీరు ఎందుకు ఇచ్చినట్టు!)

ఫిబ్రవరి 10, 11 తేదీలలో ఈ ప్రతిపాదన పరిశీలించిన నిపుణుల కమిటీ కంపెనీకి కొన్ని షరతులతో అనుమతి ఇచ్చేసింది. మార్చి 12, 13 తేదీలలో నిపుణుల కమిటీ మళ్లీ సమావేశమై అవే షరతులను కొన్ని సవరణలతో పునరుద్ఘాటించింది. ఈ షరతుల సారాంశమేమిటంటే, కంపెనీ ఒక పర్యావరణ పరిరక్షణ కమిటీనీ, ఒక సలహాదార్ల కమిటీనీ తన ఖర్చుతో నెలకొల్పుకోవాలి. మొదటిదానిలో ఒక పర్యావరణవేత్త, ఒక పక్షుల శాస్త్రవేత్త, ఒక జల జీవశాస్త్రవేత్త ఉండాలి. వీరు నిరంతరాయంగా తేలినీలాపురం అభయారణ్యాన్నీ, నౌపడా స్వాంప్స్ అని పిలవబడే తీరప్రాంత నీటివనరునూ పరిశీలిస్తూ ఉండాలి. ఈ ముగ్గురు నిపుణులకు సలహాదార్లుగా ఏర్పడే రెండవ కమిటీలో బొంబాయి నేచురల్ హిస్టరీ సొసైటీకి చెందిన ఒక ప్రతినిధి, సలీం అలీ సెంటర్ ఫర్ ఆర్నియాలజీ నుండి ఒకరు, కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ నుండి

ఒకరు, రాష్ట్ర ప్రభుత్వ అటవీశాఖ నుండి ఒకరు ఉంటారు. ఈ అయిదుగురు నిపుణుల సలహాలతో ఆ ముగ్గురు నిపుణులు కంపెనీకి పర్యావరణ పరిరక్షణ గురించి సలహాలు ఇస్తుండాలి. ఈ సలహా వ్యవస్థ ఖర్చులకోసం కంపెనీ సాలీనా 50 లక్షల రూపాయల కేటాయించాలి. వారి సలహాలను కంపెనీ పాటించకపోతే ఏమవుతుందని మాత్రం నిపుణుల కమిటీ చెప్పలేదు.

రాష్ట్ర ప్రభుత్వానికి కూడ నిపుణుల కమిటీ ఒక సూచన చేసింది. నౌపడా స్వాంప్స్‌లోకి వచ్చి చేరుతున్న వరదనీటికి థర్మల్ ప్లాంటు అడ్డం రాకుండ ఉండేందుకు ఈ ప్రాంతపు సహజ డ్రైనేజి వ్యవస్థను సంస్కరించాలన్నారు. కానీ ఈ నిపుణుల ముందు హాజరయిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధి వైఖరే అతి విచిత్రమైనది. ఇక్కడ తూర్పు కనుమలకూ తీరానికీ మధ్య ఎడం తక్కువగా ఉండడం వల్ల వర్షాకాలంలో నీరంతా ఆ సన్నటి భూభాగంలో వరదలాగా ప్రవహిస్తున్నదన్నాడు. శాస్త్రీయమైన డ్రైనేజి వ్యవస్థ లేకపోవడం వల్ల తగ్గు భూములలో నీరంతా నిలువ ఉండి నౌపడా స్వాంప్స్ ఏర్పడ్డాయన్నాడు. సరయిన డ్రైనేజి వ్యవస్థను రూపొందించి నీటినంతా సముద్రంలోకి లాగేస్తే ఏ సమస్యా ఉండదన్నాడు. అంటే ఇసుక బస్తాలు తెచ్చి నౌపడా స్వాంప్స్‌ను పూడ్చేస్తే ఏ గొడవా ఉండదని అతని భావం కావచ్చు.

**మానవహక్కుల వేదిక పదవ బులెటిన్‌లో రిపోర్టుగా వచ్చింది**
**జూన్ 2009**

# చర్చలకు కూర్చునే ముందు... భూమి సమస్యను అధ్యయనం చేయండి

**శాం**తి, స్వావలంబన, భూమి సమస్య అనే డిమాండ్లతో పీపుల్స్‌వార్ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కూర్చోబోతున్నదని వినికిడి.

స్వావలంబన అంటే ప్రపంచబ్యాంకు ఆదేశాలకు అతీతంగా రాష్ట్ర పాలన సాగాలని కాబోలు. అదంత సులభం కాదు. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఈ విషయంలో పీపుల్స్‌వార్‌కు ఏ హామీ ఇవ్వబోదు, ఇవ్వడం సాధ్యమని కూడ భావించబోదు. మన దేశాన్ని ఏలేవారు ప్రపంచబ్యాంకు ఆదేశాలకు కట్టుబడి ఉండడమే కాదు, ఆ 'బంధాన్ని' తెంపుకునే స్వేచ్ఛను సహితం వారికే సమర్పించేసారు. పీపుల్స్‌వార్ నాయకత్వం ఈ అంశాన్ని చర్చల అజెండాలో చేర్చడమే మన రాష్ట్ర పాలకులకొక అధిక ప్రసంగంగా అనిపిస్తుండవచ్చు. 'అంతర్జాతీయ సంస్థలు' అని పిలవబడే మూడు సంస్థలతో – ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థలతో – మన పాలకులు చాలా లోతుగా రాజీపడి ఉన్నారు.

శాంతి సంగతి మళ్లీ మాట్లాడుకోవచ్చును గానీ, భూమి సమస్యను పీపుల్స్‌వార్ నాయకత్వం సీరియస్‌గా చర్చలలో భాగం చేసి ప్రభుత్వం నుండి ఏదైనా రాబట్టదలచుకున్నట్లయితే దీని వివిధ కోణాలను వివరంగా అధ్యయనం చేయడం మంచిది. భూముల పంపకం ఆస్తి హక్కుతో ముడిపడి ఉంది. ఆస్తి హక్కును చట్టం ద్వారా తప్ప ఇతరత్రా తొలగించడాన్ని భారత రాజ్యాంగం ఒప్పుకోదు. ప్రభుత్వం రాజ్యాంగేతర శక్తులతో చర్చలు జరపవచ్చునుగానీ రాజ్యాంగం ప్రకారమే పరిపాలన జరపాలి. ఇది అర్థం చేసుకోకపోతే చర్చలు నిష్ఫలం అవుతాయి.

'దున్నే వానిదే భూమి' అనే నినాదం భూమి సమస్యను చర్చించడానికి పెద్దగా పనికి రాకపోవచ్చు. వ్యవసాయం అంటే ఏమిటో తెలియని బ్రాహ్మణ అగ్రహారీకులూ జమీందార్లూ రైతుల చేత వందలాది ఎకరాల భూములను కౌలుకు సాగు చేయించుకున్న రోజులలో పుట్టిన నినాదమది. ఇప్పటికీ మన దేశ వ్యవసాయ రంగం ఏదో ఒక అర్థంలో 'అర్థ భూస్వామ్య వ్యవస్థ' అయి ఉండవచ్చునేమోగానీ ఆనాటి పోలికలిప్పుడు చాలా తక్కువ. వ్యవసాయం మీద ఆధారపడే పేదలందరికీ (అందరికీ కాకపోతే వీలయినంత మందికి) భూమి దక్కాలన్నది ఇవ్వాళ్టి నినాదం కాగలదు.

అయితే చట్టాలతో నిమిత్తం లేకుండ ఎర్రజెండాలు నాటే పద్ధతిలో దీనిని సాధించుకోవడం ఏవో మారుమూల గ్రామాలలో జరగగలదేమోగానీ రాష్ట్రమంతటినీ ప్రాతిపదికగా తీసుకొని జరిపే చర్చలకది మార్గదర్శకం కాజాలదు. చట్టాల మీద దృష్టి పెట్టి ఏ చట్టం కింద ఇంకా ఎంత భూమి పేదల పరం కాగలదు, ఆ చట్టాల కింద మరింత భూమి సేకరించడానికి చట్టంలో గానీ కోర్టు తీర్పులలో గానీ ఉన్న ఆటంకాలేమిటి, కొత్త చట్టాలు చేయడానికున్న అవకాశం ఏమిటి అనే విషయాలు కొంచెం అధ్యయనం చేయకుండ చర్చలకు కూర్చుంటే ప్రయోజనం ఉండదు. ప్రభుత్వం చట్టాలనూ కోర్టు తీర్పులనూ అడ్డం పెట్టి ఏమీ చేయలేననగలదు. లేదా చట్టరీత్యా చెల్లుబాటు కాని హామీలు ఇచ్చేసి, రేపు వాటి అమలును కోర్టులు ఆపేస్తే చేతులెత్తేయగలదు.

సీలింగ్ భూముల జాబితాలోకి రాగల ప్రతీ ఎకరం భూమి మీదా ఇప్పటికే పలు దఫాల వ్యాజ్యాలు నడిచి ఉన్నాయి. భూస్వాములకు అనుకూలంగా కోర్టులిచ్చిన తీర్పులను ప్రభుత్వం సవాలు చేయకుండ ఉండిపోయి కాలాతీతం కానిచ్చిన కేసులను ఏం చేయాలి? తప్పుడు ఆస్తి పంపకాలు, తప్పుడు అమ్మకాలు చూపించి కాపాడుకున్న భూమిపైన ఇన్నేళ్ల తరువాత పునర్విచారణ జరుపుతామంటే కోర్టులు ఒప్పుకుంటాయా? నిజమే, అన్ని రకాలుగా 'సీలింగ్ మిగులు'గా గుర్తించబడి ఇంకా పేదలకు పంచకుండ ఉండిపోయిన భూమి, లోపాయికారీగా ఇప్పటికీ తొలినాటి భూస్వాములే చేసుకుంటున్న భూమి లేకపోలేదు. దానినంతా వెంటనే పేదలకు పంచమని అడగడం సాధ్యమే, ప్రభుత్వం అంగీకరించడమూ సాధ్యమే. అయితే ఇటువంటి భూమి చెప్పుకోదగ్గ పరిమాణంలో – అన్ని జిల్లాలలో కాకున్నా కొన్ని జిల్లాలలో – ఉండవచ్చును గానీ 'భూమి సమస్య' పరిమాణంతో పోల్చినప్పుడు శతాంశం కూడ కాదు.

దేవాదాయ భూముల సమస్య ఈ మధ్య బాగా చర్చలో ఉంది. దేవాదాయ చట్టంలోని సెక్షన్ 82 చెల్లుతుందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తరువాత రాష్ట్రంలోని దేవాలయ భూములను స్వంతం చేసుకున్న కౌలుదారులందరి హక్కులూ రద్దయిపోయాయి. వారిలోని పేదవారికి భూములను చవకగా పొందే హక్కు సెక్షన్ 82లోనే ఉంది. మిగిలిన భూమి – దాదాపు 2 లక్షల ఎకరాలు – ఇప్పుడు దేవాదాయ శాఖ చేతిలో ఉంది. దీనిని భూమి లేని పేదలకు పంచాలి, లేదా చవకగా ఇవ్వాలి అని అడిగే అవకాశం వుంది. కానీ దీనికి రెండు ఆటంకాలున్నాయి. దేవాలయాల పోషణకు తగిన ఏర్పాటు చేయకుండ దేవాలయ భూములను పేదలకు పంచడాన్ని కోర్టులు ఆమోదించడం లేదు. భూస్వాములు, పూజారులు పదే పదే కోర్టుకెక్కి అటువంటి ప్రతీ ప్రయత్నం మీదా 'స్టే' తెచ్చుకుంటున్నారు. ప్రజావసరాల కోసం దేవాలయ భూములను సహితం సేకరించవచ్చునని సుప్రీంకోర్టు 1950లలోనే స్పష్టం చేసింది గానీ, అందుకు మారుగా ఆ గుడికి వేరే ఆదాయ మార్గం చూపించి తీరాలన్న ఆదేశం అప్పటి నుండి ఇప్పటిదాకా ఒక గుదిబండగా కూర్చొని ఉంది. దీనిని ఎదుర్కోవడం అంత సులభం కాదు.

రెండవది, హక్కులు కోల్పోయిన పాతకౌలుదార్ల నుండి రాగల ఒత్తిడి. పేరుకు కౌలు ఒకరిదే అయి వుంటుంది గానీ ఆ భూమిని వంశపారంపర్యంగా పంచుకోవడం వల్ల వాస్తవంగా దానిని కౌలుకు చేస్తున్నవారు చిన్నరైతులే అయి ఉండవచ్చు. తమకు కూడ సెక్షన్ 82 ప్రకారం పేద కౌలుదార్ల హోదాలో ఆ భూమిని చవకగా కొనుక్కునే హక్కు ఇవ్వాలని వారు అడుగుతున్నారు. ఇది ఎంతవరకు సమంజసమోగానీ సిపిఐ, సిపిఐ(ఎం) లు దీనిని సమర్థిస్తున్నాయి. వారి ఆధ్వర్యంలో నడిచే దేవాలయ భూముల కౌలుదార్ల ఉద్యమాల ముఖ్య డిమాండ్లలో ఇదొకటి. ఈ డిమాండును కూడ అంగీకరించినట్టయితే పేదలకు పంచడానికి దేవాదాయ భూములు ఎక్కువ మిగలక పోవచ్చును.

ఏజెన్సీ భూములకు వర్తించే 'వన్ ఆఫ్ సెవెంటీ' రెగ్యులేషన్ అమలు గురించి కూడ పీపుల్స్‌వార్ నాయకత్వం ప్రభుత్వంతో చర్చించబోతున్నట్లు చెపుతున్నారు. నిజానికి ఆ రెగ్యులేషన్ కింద జరగవలసిన విచారణలన్నీ ఇప్పటికే 'జరిగిపోయాయి'. అయితే అన్నీ కూడ ఆదివాసులకు ఏ అవగాహన లేని రోజులలో జరిగిపోయాయి. వారిలో కొంచెం చదువుకున్న నేటి తరం ముందుకొచ్చి ఈ విచారణలను తిరస్కరించి మళ్ళీ విచారణ జరపాలని డిమాండ్ చేయడం వల్లనే పశ్చిమ గోదావరి జిల్లాలో గిరిజన – గిరిజనేతర ఘర్షణలు పెద్ద

ఎత్తున చెలరేగాయి. పునర్విచారణ జరగవచ్చునా లేదా అన్న విషయంలో హైకోర్టు గందరగోళమైన తీర్పు ఇచ్చి ఉంది. దానిని అడ్డుపెట్టుకుని గిరిజనేతరులు భూముల ఆక్రమణను కొనసాగిస్తూనే ఉన్నారు. లోతయిన చట్టసవరణలు లేకుండ 'వన్ ఆఫ్ సెవెంటీ' విషయంలో న్యాయం జరగడం అసాధ్యం. దానికవసరమైన చట్ట సవరణలు కోర్టులలో నిలబడేటట్టు చేయాలి. ప్రభుత్వం ఏదో హామీ యిచ్చి ఏమీ చేయలేక కోర్టులను తప్పుబట్టి తప్పించుకునే ప్రమాదం ఉంది.

కాబట్టి ఏ కోణంలో చూసినా 'భూమి సమస్య' అనేది చాలా సంక్లిష్టమైన వాస్తవాలతోను, చట్టాలతోను, కోర్టు తీర్పులతోనూ ముడిపడి ఉంది. ఎర్రజెండాలు పాతడం ద్వారా భూమి సమస్యను పరిష్కరించడం మాత్రమే అధిక భాగం పీపుల్స్‌వార్ కేడర్‌కూ నాయకత్వానికీ తెలుసును. అదే అవగాహనతో చర్చలకు కూర్చుంటే ఫలితమేమీ దక్కకపోగా ప్రభుత్వం ఒట్టి హామీలిచ్చి తప్పించుకునే ప్రమాదం ఉంది.

**ప్రజాతంత్ర వారపత్రిక**
**3 అక్టోబర్ 2004**

# ప్రజాభూమి కమిషన్
# ఆవశ్యకత, కర్తవ్యాలు

**1990** దశకంలో తెరమరుగయిపోయిన భూమి సమస్య మళ్లీ స్టేజిపైకి వచ్చింది. మావోయిస్టుల వల్ల జరిగిన ముఖ్యమైన మేలు ఇది. 'ఎప్పుడో పంచేసాము - 50 లక్షల ఎకరాలు. ఇంకా మిగిలి ఉండేది 38 వేలే'ననింది ప్రభుత్వం. మీరు పంచకపోతే మేము పంచుతామని మావోయిస్టులు సాగుభూములపైన జెండాలు పాతడం ప్రారంభించారు. 'వారే పంచితే మేమెందుకు?' అని ప్రభుత్వం వారు వారిని ఆగమన్నారు. 26 జనవరి 2005 నాటికి 1 లక్ష ఎకరాలు పంచుతామన్నారు. ఆ రోజున 1.55 లక్షల ఎకరాలకు పట్టాలిచ్చారు కూడ. మరొక లక్ష ఎకరాలు ఏప్రిల్‌లోగా గానీ, 15 ఆగస్టు నాటికి గానీ పంచుతామన్నారు. అనుకున్న దానికన్నా ఎక్కువ భూమి ఎక్కడి నుండి పుట్టుకు వస్తోంది?

ప్రతీ ఎంఆర్‌వోకూ తెలిసిన విషయం ఏమిటంటే మొన్నటి 26 జనవరి నాడు పట్టాలు ఇచ్చిన భూమి ఎన్నో ఏండ్లుగా పేదల అనుభవంలో ఉండి అధికారులకు అడిగినంత లంచం ఇవ్వలేకపోవడం వల్ల పట్టాలు రాకుండా ఉండిపోయినదే. కొంత భూమి ఎవరి ఆక్రమణలోనూ లేని నాసిరకం భూమి, బంజరు భూమి. రేపు 15 ఆగస్టు నాటికి పంచుతామంటున్నది కూడ ఈ రకమైన భూమేనా?

పేదలకు పంచడానికి అసలు భూమి ఎంత ఉన్నది? ఎన్ని రకాలున్నదీ మొదట ఒకసారి చెప్పుకొని వాటి గురించి ఏం చేయవచ్చో తరువాత చెప్పుకుందాం. నిజానికి ఈ విషయంలో మొదట జరగవలసింది సమగ్రమైన, నిర్దుష్టమైన సమాచారం ప్రజల ముందు ఉంచడం. ఎంత భూమి ఉందో, దానిని పంచడంలో

గల సమస్యలేమిటో ప్రభుత్వానికి మాత్రమే తెలిసిన రహస్య సమాచారంగా ఉండిపోయినంత కాలం ఈ సమస్య పరిష్కారం కాదు. అందులో రహస్యమేమీ లేదు, ఉండనవసరం లేదు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 19 ప్రకారం ప్రజలందరికీ అభిప్రాయాలు, విశ్వాసాలు కలిగి ఉండే స్వేచ్ఛ, వాటిని వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉన్నాయి. ఇవి ప్రాథమిక హక్కులు. కానీ ప్రజల జీవితానికి సంబంధించిన సమాచారాన్ని రహస్యంగా ఉంచేసి మీకు అభిప్రాయ స్వేచ్ఛ ఉందంటే అర్థం లేదు. సమాచార హక్కు లేని అభిప్రాయ స్వేచ్ఛ ఒక మిథ్య.

1958లోనే బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్ కింద జారీచేసిన జీవోలు 1406, 1407లలో భూమిలేని పేదలు గ్రామ కరణం దగ్గరికొచ్చి భూమికోసం అర్జీ పెట్టుకుంటామని, సాగుభూమి ఎంత ఉన్నదీ, ఎక్కడున్నదీ తెలపమని అడిగితే, గ్రామంలో పంచడానికి అవకాశమున్న సాగు భూమి వివరాలు కరణం వారికి వారం రోజులలోగా ఇవ్వాలనీ, దానికి ఏ ఫీజూ వసూలు చేయకూడదనీ, అర్జీదారు నిరక్షరాస్యుడయితే కరణమే వారికి అర్జీ రాసిపెట్టాలనీ ఉంది. ఏ మైకంలో ఉండి ఈ తాఖీదులు జారీ చేశారో గానీ వాటిని ఏ కరణమూ ఎన్నడూ అమలుచేసిన పాపాన పోలేదు.

ఆనాటికీ ఈనాటికీ సమాచార హక్కు గురించి అవగాహన పెరిగింది కాబట్టి ఈ రోజు జరగవలసింది ఆ జీవోల అమలు మాత్రమే కాదు. ప్రతీ పంచాయతీ ఆఫీసు ఆవరణలోనూ ఆ పంచాయతీ పరిధిలోని రెవెన్యూ గ్రామాల చిత్రపటం వేసి అందులో వివిధ రంగులతోనూ, గుర్తులతోనూ వివిధ రకాల భూములను సూచించాలి. సీలింగ్ చట్టాల కింద సేకరించిన భూమి, బంజరు భూమి, గ్రామకంఠం, వాగు లేక చెరువు పోరంబోకులు సర్వే నంబర్లతో సహా చూపించాలి. ఇప్పటికే పేదలకు పట్టాలిచ్చిన భూములను చూపించాలి. వీటికి సంబంధించిన రికార్డు కాపీలు కావాలని ప్రజలెవరైనా కోరితే ఫీజు లేకుండా వారికి అందియ్యాలి.

ఇక పేదల చేతిలో పెట్టగల భూములు ఎన్ని రకాలున్నాయో చూద్దాం.

1. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే (2004 సెప్టెంబర్ 30 నాటికి) 48 లక్షల ఎకరాలు పేదలకు పంచినట్లు రికార్డులు చెప్తున్నాయి. ఇందులో రెండు రకాలుంటాయి. ఒకటి ప్రభుత్వ భూమి. రెండు భూస్వాముల నుండి సీలింగ్ చట్టాల ద్వారా, భూదాన్ ద్వారా స్వాధీనం చేసుకున్న భూమి. సీలింగ్ చట్టాల కింద స్వాధీనం చేసుకొని పేదలకు పంచినది 5.82 లక్షల ఎకరాలు. భూదాన్ కింద 2.42

లక్షల ఎకరాలు స్వాధీనమయ్యాయి గానీ 50 సంవత్సరాల కాలంలో పంచింది 1.10 లక్షల ఎకరాలే. కాబట్టి పేదలకు పంచిన 48 లక్షల ఎకరాలలో అత్యధిక భాగం (41.08 లక్షల ఎకరాలు) బంజరు భూమే.

ఈ భూమిలో సగం కూడ పంచిన పేదల చేతిలో లేదనేది వివిధ సర్వేలలో తేలిన విషయం. దీనికి ఒక కారణం ప్రభుత్వం పట్టాకాగితాలు ఇచ్చి భూమి చూపించకపోవడం, భూమిని లబ్ధిదారుకు అప్పగించకపోవడం. ఇటువంటిది ఎక్కువ ఉండదులెమ్మని అమాయకంగా అనుకోవద్దు. కొన్ని జిల్లాలలో ఒక్కొక్క మండలంలోనే ఇటువంటి బూటకపు భూమి పంపిణీ వేల ఎకరాల పరిమాణంలో ఉంది. రెండవ కారణం, బంజరు భూమి పంచేసి దానిని సాగుయోగ్యం చేయడానికి అవసరమయిన వసతి గానీ, పెట్టుబడి గానీ అందియ్యక పోవడం వల్ల పేదలు గత్యంతరం లేక దానిని అమ్ముకోవడం. మూడవ కారణం బలవంతుల దురాక్రమణ, దౌర్జన్యం.

ఏ కారణంగా నయితేనేం, ప్రభుత్వమే పంచి ఇచ్చిన 48 లక్షల ఎకరాలలో 20 లక్షలకు పైగా అన్యాక్రాంతం అయివుంది. దానిని తిరిగి ఆ పేదలకు ఇప్పించగలిగితే అదే పదివేలు. సీలింగ్ చట్టాల కింద ఇంక అదనంగా దక్కగల భూమి (కోర్టు లిటిగేషన్‌లో చిక్కుకొని 'స్టే' అయి ఉన్నది తప్ప) లేదు. ఆ లిటిగేషన్‌ను త్వరగా తెమిల్చితే ఆ భూమి (కేసులో ప్రభుత్వం గెలిస్తే) పేదలకు పంచవచ్చు. అది మినహా ఇంక పేదలకు కొత్తగా ఇవ్వగల భూమి బంజరు భూమే. అందులో ఏ కొంచెం సారవంతమైన భూమయినా, ఇప్పటికే పంచడమో ఎవరో ఒకరు కబ్జా చేసుకోవడమో జరిగిపోయి ఉంటుంది కాబట్టి కొత్తగా పేదలకు ఇవ్వగల బంజరు భూమి కూడ తక్కువే. నీటి పారుదల వసతిని బాగా పెంచితే మాత్రమే చెప్పుకోదగ్గ మోతాదులో కొత్తగా ప్రభుత్వ భూమి పంపిణీ చేయడం సాధ్యం అవుతుంది.

2. ఒకప్పుడు రాజులు, నవాబులు, బ్రిటిష్ పాలకులు కల్పించిన వివిధ 'ఎస్టేట్' భూములున్నాయి. జమీందారీ భూములు, ఇనాంలు, మొఖాసా, మహల్, ముతా భూములు మొదలైనవి ఈ కోవకు చెందినవి. ఇవన్నీ స్వాతంత్ర్యం తరువాత రద్దయినాయి. అయితే వాటిని రద్దు చేసిన తరువాత ప్రభుత్వం ఆ భూముల్ని మొత్తంగా స్వాధీనం చేసుకోలేదు. అవి ఎస్టేట్ భూములుగా ఉన్న కాలంలో వాటిని సాగు చేస్తుండిన వారికి, వారి నుండి కొనుక్కున్నవారికి, ఒకనాటి జమీందారు, ఇనాందారు వగైరాల వారసులకు, వారి నుండి పట్టా పొందిన వారికి అప్పగించింది. దీనికోసం సెటిల్‌మెంట్ ఆఫీసర్లను

నియమించింది, ఆపైన అప్పీల్ వేసుకోవడానికి ఒక డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్స్‌ను, రెండవ అప్పీలుకు ఒక కమిషన్‌ను నియమించింది.

ఈ సెటిల్‌మెంట్ పట్టాలలో జరిగినంత మోసం వేరే ఏ విషయంలోనూ జరిగి ఉండదు. జమీందారీలలోనూ, ఇతర ఎస్టేట్‌లలోనూ సరయిన భూమి సంబంధమైన రికార్డులు ఉండేవి కావు. కాబట్టి ఏదో ఒక కాగితం ముక్క చూపించి ఎకరాలకెకరాలు సెటిల్‌మెంట్ పట్టాలు తీసేసుకున్నారు. ఎన్ని లక్షల ఎకరాలు ఈ విధంగా అనర్హుల పాలయిందో చెప్పడం చాలా కష్టం. ఈ పట్టాలపైన సమీక్ష జరిపించి రద్దుచేయవలసిన వాటిని రద్దు చేయగలిగితే చాలా భూమే పేదలకు పంచడానికి లభించగలదు.

3. దేవాలయాలు, మసీదులు, చర్చిల పోషణార్థం అప్పుడెప్పుడో రాజులు, దాతలు ఇచ్చిన భూములున్నాయి. ఆ సంస్థలు ఆ భూములను స్వయంగా కూలీలను పెట్టి సాగు చేయించవు. రైతులకు లీజుకిస్తాయి. ఇది విపరీతమైన దురాక్రమణకు దారితీసింది. ఆ భూములను భూమి లేని పేదలకు తక్కువ కౌలుకు లీజుకిచ్చినట్టయితే పేదలకు భూమీ దక్కుతుంది, ధార్మిక సంస్థలకు ఇప్పుడొస్తున్న దానికంటె ఎక్కువ ఆదాయమూ వస్తుంది. రాష్ట్రంలో దేవాలయ భూములు 3.72 లక్షల ఎకరాలున్నాయి. వక్ఫ్ (ముస్లిం ధార్మిక సంస్థల) భూములు 1.45 లక్షల ఎకరాలున్నాయి. క్రైస్తవ భూముల లెక్క తెలీదు. ముస్లిం, క్రైస్తవ ధార్మిక ఆస్తులకు సంబంధించి ప్రభుత్వం జోక్యానికి రాజ్యాంగం ఎక్కువ అవకాశం ఇవ్వదు కానీ వాటి నిర్వాహకులకు నచ్చజెప్పి ఒప్పించే ప్రయత్నం ప్రభుత్వం చేయవచ్చు. హైందవ ధార్మిక ఆస్తులకు సంబంధించి చట్టపరంగానే చర్యలు తీసుకోవచ్చు.

4. రాష్ట్రంలో అటవీ భూమి 1.53 కోట్ల ఎకరాలుంది. ఇది మొత్తం భూభాగంలో 23 శాతం. ఇందులో 4 నుంచి 5 లక్షల ఎకరాల వరకు పోడు లేక ఇతర సాగు రూపాలలో ప్రధానంగా నక్సలైట్ పార్టీల మద్దతుతో ఆదివాసీ పేదలు సాగుచేసుకుంటున్నట్లు ప్రభుత్వం అంటున్నది. నిజానికి ఆ 4 లేక 5 లక్షల ఎకరాలే కాదు, కాగితం మీద ఉన్న 1.53 కోట్ల ఎకరాల అడవిలో చాలా మొత్తం ఇప్పటికే అడవి కాకుండా పోయింది. వన సంరక్షణ సమితుల పేరిట ఆ భూములలో తిరిగి అడవి పెంచాలన్న ప్రయత్నం అరకొరగా జరుగుతున్నది. దాని బదులు భూమిని పేదలకు పంచగలిగితే వారికి చాలా భూమి దక్కుతుంది. కానీ వృక్షఛాయ (Cover) దేశ భూభాగంలో 33 శాతం ఉండాలన్న 'అంతర్జాతీయ' నియమాన్ని భారత్ అంగీకరించింది కాబట్టి,

ఇప్పటికే కేవలం 23 శాతం అడవి ఉన్న రాష్ట్రం ఆ అడవిలో సాగుకు పట్టాలు ఇవ్వజాలదని అంటున్నారు. కానీ దీర్ఘకాలం అడవిలో సాగు చేసుకుంటున్న ఆదివాసులకైనా పట్టా కల్పించే అవకాశం ఉంది. 1980 అక్టోబర్ 24కు ముందు నుండి రిజర్వ్ అడవిలో భూమి అనుభవిస్తున్న ఆదివాసులకు పట్టా పొందే అవకాశం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వ అటవీశాఖ 18 సెప్టెంబర్ 1990 నాడు సర్క్యులర్ నెం. 13-1/90/ఎఫ్‌పి(1) జారీ చేసింది. దీనిని సవరిస్తూ, 31 డిసెంబర్ 1993 నుండి అడవి భూమిని అనుభవిస్తున్న ఆదివాసులకు పట్టా కల్పించే అవకాశాన్ని ఇచ్చే తాఖీదు నెం. 2-1/2003-ఎఫ్‌సి (పిటి)ని కేంద్ర అటవీశాఖ 2004 ఫిబ్రవరి 5న జారీ చేసింది. ఈ సర్క్యులర్లను చిత్తశుద్ధితో అమలు చేసినట్టయితే అడవులలో వ్యవసాయం చేసుకొంటున్న ఆదివాసులకు చెప్పుకోదగ్గ మోతాదులో భూమి దక్కగలదు.

5. ఏజెన్సీలోని పట్టా భూములు అయిదవ కోవకు చెందినవి. ఎల్‌టిఆర్ చట్టం కింద విచారణలు సరిగ్గా జరిపితే ఈ పట్టా భూములలో గిరిజనేతరుల చేతిలో ఉన్నవి పెద్ద మొత్తంలోనే గిరిజనులకు దక్కేవి. కానీ ఈ చట్టం కింద విచారణలు నూటికి 95 శాతం ఇప్పటికే జరిగిపోయియి. సగంపైగా భూమి గిరిజనేతరులకే ఖాయం చేయబడింది. దీనికి ప్రధాన కారణాలు రెండు. ఈ విచారణలు ఎక్కువ భాగం ఆదివాసులెవ్వరికీ తెలియకుండ ప్రభుత్వానికీ గిరిజనేతరునికీ మధ్య వ్యవహారంగా జరిగాయి. ఆదివాసులెవ్వరూ ఫిర్యాదు చేయకున్నా ప్రభుత్వమే గిరిజనేతరుని పైన కేసు పెట్టి విచారణ జరిపే 'సుమోమోటు' ప్రక్రియకు ఎల్‌టిఆర్ చట్టం అవకాశం ఇస్తుంది. అది దేనికి ఉపయోగపడిందంటే ఆదివాసులకేమీ తెలియకుండ విచారణల తంతు ముగించేయడానికి. రెండవ కారణం, నిన్న మొన్నటిదాకా ఆదివాసులలో విద్యావంతులు లేకపోవడం. అందువల్ల వారి ఎరుకలో జరిగిన విచారణలలో కూడ వారు సమర్థంగా పాల్గొనలేకపోయారు. ఈ కేసులను తిరగదోడడం, లేదా ఆలస్యంగానయినా సరే అప్పీల్ వేయడం సాధ్యమైతేనే ఎల్‌టిఆర్ కింద ఆదివాసులకు కొత్తగా భూములు దక్కగలవు.

ఇన్ని కోణాలున్న భూముల పంపిణీ సమస్య పరిష్కారం ముందుకు పోవాలంటే ప్రభుత్వానికి మాత్రమే అందుబాట్లో ఉండే సమాచారం మొట్టమొదట ప్రజలతో పంచుకోవాలని పైన చెప్పాము. సమాచార హక్కులో భాగంగా దీనిని డిమాండ్ చేస్తున్నాం.

అయితే అది చాలదు. సమాచార హక్కులో భాగంగా ఈ వివరాలను రాబట్టుకోవడం ఒకెత్తయితే దీనిని ఆధారం చేసుకొని పల్లెలు తిరిగి వాస్తవాలు సేకరించడం చాలా కీలకమైన కర్తవ్యం. చట్టాలు, ప్రభుత్వ రికార్డులు ఏం చెప్పినా ప్రతీ జిల్లాలో వాస్తవంగా కొందరు వందల ఎకరాలు అనుభవిస్తున్నారు. పాత జమీందార్లు, జాగీర్దార్లు అత్యధిక భాగం కాలగర్భంలో కలిసిపోయారు. భూములు అమ్ముకొని పట్టణాలకూ, విదేశాలకూ వెళ్లిపోయారు. ఇప్పుడు నయా బడా భూస్వామ్య వర్గమొకటి ఆవిర్భవించింది. వంద ఎకరాలకు పైబడి భూములు, ముఖ్యంగా తోటలు, వారి అధీనంలో ఉన్నాయి. వీరే స్వయంగా గానీ, వీరి శిష్యవర్గం గానీ, బంధువర్గం గానీ రాజకీయ నాయకులయి ఉంటారు. సివిల్ కాంట్రాక్టర్లు, మద్యం వ్యాపారులు అయివుంటారు. వీరి వద్ద జీపులు, ట్రాక్టర్లు, ప్రొక్లెయిన్లు, టిప్పర్లు ఉంటాయి. అన్నిటినీ మించి వీరి హుకుం అమలు చేసేందుకు రౌడీ మూకలుంటాయి. ప్రాంతాన్ని బట్టి బాంబులు, తుపాకులు ఉంటాయి. ప్రజా ఉద్యమాలు బలంగా లేని అన్నిచోట్లా ఇదే పరిస్థితి. వీరి వివరాలు కూడ సేకరించవలసి ఉంది. భూమి సమస్య పరిష్కారం ముందుకు పోవడానికి ఈ సమాచారమూ అవసరమే.

ఇలాంటి వివరాలన్నీ బయటకు రావాలంటే ఒక భూమి కమిషను వేయాలని మావోయిస్టులు ప్రభుత్వంతో జరిపిన చర్చలలో పట్టుబట్టారు. ఆ కమిషన్‌లో కేవలం ప్రభుత్వ అధికారులే కాక ప్రజా ఉద్యమాలకు సన్నిహితంగా ఉండి భూమి సమస్య గురించి అవగాహన కలిగిన వారు కూడ ఉండాలని వారు అన్నారు. కాని ప్రభుత్వం కేవలం తన వారితో ఒక భూమి కమిటీని వేసింది. ఈ స్థితిలో ప్రజా సంఘాల కార్యకర్తలు, ప్రజాతంత్రవాదులు ప్రజలలో తిరిగి ప్రభుత్వ రికార్డుల సహాయంతో వాస్తవ పరిస్థితులను బయటకు తేవడం అవసరం. ఆ అవగాహనతోనే ప్రజల తరఫున ప్రజా ఉద్యమాల చొరవతో ఒక భూమి కమిషన్ ఏర్పడింది. పేద ప్రజలకు పంచగల భూముల వివరాలన్నీ బయటకు తీయాలంటే అది ఏ ఒక్క ప్రజాసంఘం వల్లా అయ్యే పని కాదు. ఎందువల్లనంటే రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రజా సంఘాలకు, పార్టీలకు కొన్ని కొన్ని ప్రాంతాలలో, జిల్లాలలో మాత్రమే ఉనికి ఉంది. అందరూ కలిసి మండలాల వారీగా వారి వారి ఉనికిని బట్టి పని విభజన చేసుకొని అధికార రికార్డుల సహకారంతో సర్వే చేయాల్సి ఉంది. రాష్ట్రంలోని (హైదరాబాద్ మినహాయించి) 22 జిల్లాలలో సగటున ప్రతి జిల్లాలో 50 మండలాలున్నాయి. ఒక్కొక్క

మండలంలో 15 నుంచి 20 గ్రామాలున్నాయి. అయినా అన్ని సంఘాలూ కలిస్తే ఇదేం పెద్ద పని కాదు. రెండు లేక మూడు నెలలలో ఒక మండలంలో వివరాలు సేకరించవచ్చు. ఆపైన ఆ వివరాలు క్రోడీకరించి జిల్లా నివేదికలు, వాటి ఆధారంగా రాష్ట్ర నివేదిక తయారు చేయవచ్చును. ఒకటి లేక ఒకటిన్నర సంవత్సర కాలంలో ఈ పని పూర్తిచేస్తే ఈ సమాచారాన్ని ఒక పక్క ప్రభుత్వానికి అందజేస్తూ మరొక పక్క ప్రజాసంఘాలన్నీ కలిసి ఒక ఉద్యమంగా గ్రామీణ పేదలకు ఈ భూముల్ని స్వాధీన పరచే కార్యక్రమం చేపట్టవచ్చు.

స్వాధీన పరచడానికి నిర్దిష్టంగా ఏమి చేయాలన్నది ఒక్కొక్క రకమైన భూమి విషయంలో ఒక్కొక్క రకంగా ఉంటుంది. ఎవరికి ఇష్టమున్నా లేకున్నా ప్రస్తుత పరిస్థితులలో ఈ విషయంలో చట్టం ప్రకారం పోక తప్పదు. భూమి వంటి స్థిరాస్తులను చట్టం ప్రకారం తప్ప ఇతరత్రా స్వాధీనం చేసుకోవడాన్ని గానీ, వారి నుండి మరొకరికి బదలాయించడాన్ని గానీ రాజ్యాంగం ఒప్పుకోదు. కాబట్టి ఒక్కొక్క రకమైన భూమికి సంబంధించి చట్టం ఏమంటుందో తెలుసుకోక తప్పదు.

1. ప్రభుత్వ బంజర్లు, సీలింగ్ భూములు, భూదాన్ భూములలో పేదలకు పట్టాలు ఇచ్చి ఇంకా స్వాధీనం చేయని భూములు ప్రతీ జిల్లాలోనూ ఉన్నాయని చెప్పాము. వీటి వివరాలు సేకరించిన తరువాత ఉద్యమం రూపంలో ఆ లబ్ధిదారులకు భూమి స్వాధీనం చేయమని ప్రభుత్వం పైన ఒత్తిడి తేవాలి. భూమి సమస్య విషయంలో తాను సహితం చిత్తశుద్ధితో ఉన్నానని ప్రభుత్వం అంటున్నది కాబట్టి వివరాలు వెలికితీసి ముఖం ముందు పెడితే కాదనడం ప్రభుత్వానికి కష్టం.

   పేదలకు గతంలో స్వాధీనపరచి, వారికి తెలిసో తెలియకో అన్యాక్రాంతం అయిన భూమిది వేరే సంగతి. ఒకసారి వేరొకరి చేతిలోకి పోయిన తరువాత అది అన్యాయం అనుకున్నా దానిని తిరిగి లబ్ధిదారులకు ఇప్పించాలంటే చట్టం ప్రకారం పోక తప్పదు. అదృష్టం కొద్దీ దీనికి గట్టి చట్టం ఉంది. దానిని '9/77 చట్టం' అని క్లుప్తంగా అంటారు. ఈ చట్టం కింద, అసైన్ చేయబడ్డ భూమి అన్యాక్రాంతం అయిందన్న ఫిర్యాదు ఎవరైనా చేయవచ్చు. ఫిర్యాదు స్వీకరించి విచారణ జరిపి లబ్ధిదారుకు దానిని తిరిగి ఇప్పించే అధికారం ఎంఆర్‌వోకు ఉంది. ఎంఆర్‌వో చేపట్టే విచారణలో జిల్లా కోర్టు సహితం జోక్యం చేసుకోవడానికి వీలులేదు. (హైకోర్టు చేసుకోగలదు - తరచుగా చేసుకుంటూ

ఉంటుంది. భూమి పరిష్కారానికి హైకోర్టు అడ్డం పడుతున్న వైనాన్ని చివర చెప్పుకుందాం).

కాబట్టి అన్యాక్రాంతమైన భూముల వివరాలు సేకరించగానే ఆయా ప్రజా సంఘాలు మండల రెవెన్యూ అధికారి దగ్గర ఫిర్యాదు చేసి సాక్ష్యాలు చూపించి వ్యాజ్యం నడపవలసి ఉంటుంది. తరచుగా, ఎంఆర్‌వోలు ఫిర్యాదుల పైన విచారణ చేపట్టకుండా జాప్యం చేస్తుంటారు. కాబట్టి చట్టం ప్రకారం ఫిర్యాదు చేసిన తరువాత కూడ ఎంఆర్‌వో పైన ఒత్తిడి పెట్టడానికి ఆందోళన చేయవలసి ఉంటుంది.

2. సెటిల్‌మెంట్ పట్టాల విషయంలో జరిగిన అక్రమాల గురించి చూచాయగా చెప్పాము. రేపు చేపట్టబోయే విషయ సేకరణలో ఈ అక్రమం స్పష్టంగానే కనిపించినా గతంలో ఇచ్చిన పట్టాపైన అప్పీల్ చేయడం ద్వారా తప్ప ఇంకొక రకంగా దానిని రద్దు చేయడం సాధ్యం కాదు. అప్పీల్ చేయడానికి ప్రభుత్వం సహకారం అవసరం అవుతుంది. ఏ అప్పీల్‌కయినా చట్టంలో కాలపరిమితి ఉంటుంది. కాలాతీతం అయిన అప్పీల్‌ను సైతం స్వీకరించే అవకాశం చట్టంలో లేకపోలేదు గానీ అది ఆ అప్పిలేట్ అధికారి విచక్షణ మీద ఆధారపడి ఉంటుంది. ఇక్కడ కూడ ప్రభుత్వం సహకారం అవసరం. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రత్యేకమైన చట్ట సవరణ చేసి అయినా అనుమానాస్పదం అని తేలిన అన్ని సెటిల్‌మెంట్ పట్టాలపైన అప్పీల్ లేక రివిజన్ దాఖలయ్యేటట్టు, న్యాయబద్ధంగా విచారణ జరిగేటట్టు చూడాలి. దీనికి ప్రభుత్వం పైన ప్రజా సంఘాలు నిర్దిష్టమైన సమాచారంతో ఒత్తిడి పెట్టాలి.

3. ధార్మిక సంస్థల భూముల విషయానికొస్తే, మైనారిటీ మత సంస్థల భూములను భూమిలేని పేదలకు చవకగా కౌలుకిమ్మని వాటి నిర్వాహకులకు ప్రభుత్వమైనా, ప్రజా సంఘాలైనా నచ్చజెప్పాలే తప్ప చట్టపరమైన చర్యలు తీసుకోవడం సాధ్యం కాకపోవచ్చు. (భూమి సేకరణ చట్టం కింద నష్టపరిహారం ఇచ్చి స్వాధీనం చేసుకోవచ్చును గానీ దానికయ్యే ఖర్చు ఒక మోతాదు మించి ప్రభుత్వం పెట్టుకోలేకపోవచ్చు). హైందవ దేవాదాయ భూముల విషయం వేరే. వాటి విషయంలో చట్టపరమైన జోక్యానికి అవకాశం ఉంది. ఈ భూములను కౌలుకు తీసుకున్నవారు వాటిని సొంతం చేసుకొని అటు దేవాలయానికి గానీ, ఇటు సమాజానికి గానీ అక్కరకు రాకుండా చేసిన వైనాన్ని గమనించి రాష్ట్ర ప్రభుత్వం 1987లో దేవాదాయ ధర్మాదాయ చట్టాన్ని సవరించి అన్ని కౌళ్లూ

రద్దు చేసేసింది. కౌలుదార్లలో భూమిలేని పేదలయిన వారికి మాత్రమే వారి సాగులో ఉన్న భూమిని 75 శాతం మార్కెట్ రేటుకు కొనుక్కునే హక్కు కల్పించింది. సెక్షన్ 82 ద్వారా ప్రవేశపెట్టిన ఈ సవరణను ఏ రకంగానూ సమర్థనీయం కాని తీర్పుతో మన రాష్ట్ర హైకోర్టు రాజ్యాంగ విరుద్ధమని కొట్టేయగా, దానిపైన సుప్రీంకోర్టులో అప్పీల్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం కూడ ఒక దశాబ్దం పైగా ఆ అప్పీల్ సంగతి పట్టించుకోలేదు. చివరికి 2001లో సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును తప్పుపట్టి సెక్షన్ 82కు ప్రాణం పోసింది. దీనితో 3.72 లక్షల ఎకరాల దేవాలయ భూములు ప్రభుత్వం చేతిలోకి వచ్చాయి. అందులో భూమిలేని పేదలయిన కౌలుదార్లకు వారి సాగులో ఉన్న భూమి 75 శాతం మార్కెట్ రేటుకు అమ్మవలసి ఉండగా, తక్కిన భూమి (ఎంత లేదన్నా రెండున్నర లక్షల ఎకరాలుంటుంది) ప్రభుత్వం చేతిలో ఉంది. ఒక్కొక్క గుడి యాజమాన్యమూ ఆ భూమిని మళ్లీ అధిక కౌలుకు వేలం పాడే ప్రయత్నం చేస్తున్నది. కొన్నిచోట్ల చేసేసారు కూడ. కొన్ని చోట్ల మాత్రం భూమి లేని పేదలు, వారి సంఘాలు వేలంపాటను ప్రతిఘటించి ఆపారు. అన్ని ప్రజా సంఘాలూ దీనినొక తక్షణ కర్తవ్యంగా తీసుకోవాలి. ఆ భూమిని భూమిలేని స్థానిక పేదలకు, అందులో ప్రధానంగా ఎస్.సి, ఎస్.టిలకు చవకగా అమ్మాలని, లేదా తక్కువ కౌలుకు లీజుకివ్వాలని, ఆ మాత్రం కూడ వారు చెల్లించుకోలేకపోయినట్టయితే ఎస్.సి కార్పొరేషన్ ద్వారా గానీ, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గానీ ప్రభుత్వమే కొని వారికివ్వాలని డిమాండు చేయాలి. ఈ డిమాండును ప్రభుత్వం ఏ మేరకు అమోదిస్తుందనేది భూమి సమస్య విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధికి పరీక్ష అవుతుంది.

4. భూమి లేని పేదలు, ప్రధానంగా ఆదివాసులు, సాగుచేసుకుంటున్న అటవీ భూముల విషయంలో కేంద్ర అటవీశాఖ 2004 ఫిబ్రవరి 5న జారీ చేసిన సర్క్యులర్‌ను పైన ఉటంకించాము. చాలా పట్టుదలగా ఆదివాసులు, ఆదివాసీ సంఘాలు చేసిన పోరాటాల ఫలితంగా ఈ సర్క్యులర్ వచ్చింది. దీని నెంబరు 2-1/2003-ఎఫ్‌సి (పిటి) తేది. 5-2-2004. ఈ సర్క్యులర్ ఏమంటుందంటే, అన్ని రాష్ట్రాలూ అడవిలో ఆదివాసుల సంప్రదాయక హక్కులకు చట్టాలలో చోటు కల్పించాలి. ఆదివాసులు అవిచ్ఛిన్నంగా అనుభవిస్తున్న అటవీ భూమిపైన వారికి హక్కు కల్పించేందుకు, ఆ భూమిని రిజర్వ్ ఫారెస్టు నుండి తొలగించేందుకు నిర్దిష్టమైన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వాలు తయారుచేసి కేంద్రానికి పంపించాలి. అవిచ్ఛిన్నంగా అడవి

భూమిని అనుభవిస్తుండడం అంటే 1993 డిసెంబర్ 31కి ముందు నుండీ ఇప్పటిదాకా అనుభవిస్తుండడం అని అర్థం. అయితే ఈ ప్రతిపాదనలు పంపేటప్పుడు ఆ భూమిమీద హక్కు పొందబోయే ఆదివాసులు మళ్లీ కొత్తగా అడవి కొట్టకుండ అక్కడే బతకడానికి కావలసిన ఆర్థిక తదితర సదుపాయాలు ఆ రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలి. అప్పుడు ఆ ప్రతిపాదనల మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిత భూమిని రిజర్వ్ ఫారెస్టు జాబితా నుండి తొలగించి ఆదివాసులకు ఇచ్చే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తుంది.

ఇది అమలయితే రాష్ట్రంలో ఆదివాసులకు ఒకటి రెండు లక్షల ఎకరాలకు తక్కువ కాకుండా భూములు దక్కుతాయి. కానీ దీనికి చాలా కృషి కావాలనేది స్పష్టమే. రిజర్వ్ ఫారెస్టులో ఆదివాసులు సాగుచేసుకుంటున్న భూమికి ఏ రికార్డూ ఉండదు. గ్రామీణ పేదలు దున్నుకుంటున్న ప్రభుత్వ భూముల వివరాలు అడంగల్ (పహాణీ)లోకి ఎక్కవచ్చు, ఏదో ఒక చోట గుర్తింపు పొందవచ్చు. కాని రిజర్వ్ ఫారెస్టులో చేస్తున్న సాగు ఎక్కడా నమోదు కాదు. కాబట్టి ఈ విషయాన్ని నిజాయితీగా గుర్తించి ప్రతిపాదనలు పంపే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద పడేసి కూర్చుంటే న్యాయం జరగదు. ప్రజా సంఘాలు వివరంగా సమాచారం సేకరించి ప్రభుత్వానికిచ్చి కేంద్రానికి ప్రతిపాదనలు పంపేటట్టు చూడాలి. 31 డిసెంబర్ 1993 నుండి అవిచ్ఛిన్నంగా అడవి భూమిలో సాగు చేసుకుంటున్నారన్న విషయం రుజువు చేసుకోవడమూ ఆదివాసులకు కష్టమే. దానికి కూడ ప్రజా సంఘాల సహాయం కావాలి.

5. ఏజెన్సీలో ఆదివాసుల భూములను గిరిజనేతరులు ఆక్రమించుకోకుండా నిరోధించడానికి ఉద్దేశించిన ఎల్‌టిఆర్ చట్టం అమలులో ఉన్న సంక్షోభాన్ని పైన సూచించాము. ఎల్‌టిఆర్ కింద గిరిజనేతరుల భూములపై విచారణ చాలావరకు 'జరిగిపోయింది'! ఎక్కువ భాగం, ఆదివాసులకు సమాచారం లేకుండానే జరిగిపోయింది. ఈ విచారణలు మొత్తంగా తిరగదోడాలన్న డిమాండు పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ మండలాలలో పుట్టింది. అది తీవ్రమైన గిరిజన-గిరిజనేతర ఘర్షణకు దారితీసేసరికి ప్రభుత్వం దిగొచ్చి 1998లో ఒక సర్క్యులర్ జారీ చేసింది. రెవెన్యూ అధికారులు పశ్చిమ గోదావరి ఏజెన్సీలోని ఒక్కొక్క గ్రామంలోనూ ప్రజల మధ్య కూర్చొని భూమి యాజమాన్యానికీ అనుభవానికీ సంబంధించిన రికార్డు చూపించాలనీ, ఎల్‌టిఆర్‌కు విరుద్ధంగా గిరిజనేతరులు భూమి అనుభవిస్తున్నట్టు బయటపడినట్టయితే వారిపైన కేసులు నమోదు చేయాలనీ ఆ సర్క్యులర్‌లో

ఉంది. ఒకవేళ అప్పటికే ఒకసారి ఆ భూమిపైన 'విచారణ' జరిగిపోయి గిరిజనేతరుడికి అనుకూలంగా తీర్పు వచ్చి ఉంటే మళ్లీ ప్రభుత్వమే కేసు పెడితే కోర్టులొప్పుకోవు కాబట్టి ఆదివాసులెవరయినా ఈసారి కేసు పెట్టొచ్చు.

ఈ సర్క్యులర్ పశ్చిమ గోదావరి జిల్లాకు మాత్రమే ఉద్దేశించింది. అక్కడ అది ఒక మేరకు అమలయింది. అధికారుల నిజాయితీని బట్టి, అవగాహనను బట్టి ఒకచోట సత్ఫలితాన్నిస్తే ఒకచోట ఇవ్వలేదు. ఈ సర్క్యులర్ అమలుకు ఏజెన్సీ సమస్యలతో పరిచయం ఉన్న సీనియర్ అధికారిని విడిగా కేటాయించి ఏజెన్సీ ఉన్న తొమ్మిది జిల్లాలకూ దానిని వర్తింపజేయాలి. ప్రజాసంఘాలు ఈ డిమాండుతో రాష్ట్ర ప్రభుత్వంపైన ఒత్తిడి పెట్టాలి. ఏజెన్సీలో గిరిజనేతరుల దురాక్రమణకు సంబంధించిన సమాచారం వేరే ఏ రకంగానూ దొరకదు, పరిష్కారమూ వేరే ఏ రకంగానూ సాధ్యం కాదు.

ప్రజాభూమి కమిషన్‌లో భాగమైన ప్రజా సంఘాలు, ప్రజాతంత్రవాదులు చేపట్టవలసిన పనులు, ఆందోళనలు స్థూలంగా ఇవి. దీనికి ప్రభుత్వ చిత్తశుద్ధి లోపం ఒక ఆటంకం కాగలదు. హైకోర్టు మరొక ఆటంకం కాగలదు. భూమి సమస్యకు సంబంధించిన అన్నిరకాల చట్టాల వైఫల్యాలనూ ఒక్కొక్కటిగా పరిశీలించినట్టయితే అందులో హైకోర్టు పాత్ర చిన్నదేం కాదని అర్థం అవుతుంది. భూమి మీద ఏ హక్కు లేకున్నా, రెవెన్యూ అధికారులను మెప్పించి - లేక గూండాల బలాన్ని వినియోగించి - ఒకసారి స్వాధీనంలోకి తెచ్చుకుంటే చాలు, లాయర్లకు ఫీజులిచ్చుకోగలిగినంత కాలం హైకోర్టు నుండి స్టే ఆర్డర్లు తెచ్చుకొని అనుభవిస్తూ ఉండవచ్చు. దీనికి విరుగుడుగా ఇప్పుడిప్పుడే చేయగలిగింది ఎక్కువ లేదు. అయితే సంక్షేమ రాజ్యాంగానికి తగిన న్యాయ సిద్ధాంతం భారత న్యాయ వ్యవస్థ ఎందుకు రూపొందించుకోలేక పోయిందన్న చర్చ చేస్తూ ఉండాలి.

ఈ ప్రయాస అంతా ఎందుకోసమో ఒకసారి జ్ఞాపకం చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. రాష్ట్రంలో ప్రాంతాన్ని బట్టి 10 నుంచి 30 శాతం దాకా భూమిలేని పేదలున్నారు. 1995-96 నాటి భూమి లెక్కల ప్రకారం భూమిగల రైతులలో 80 శాతం ఐదెకరాలకు లోపల ఉన్న చిన్న, సన్నకారు రైతులే. మరొక 13 శాతం పదెకరాల లోపు భూమి ఉన్నవారు. కేవలం ఏడు శాతం మంది పది ఎకరాలకు పైబడి భూమిగలవారు. వీరి చేతిలో ఉన్న సాగు భూమి మొత్తం భూమిలో 31 శాతం అని ప్రభుత్వం అంటుంది గానీ బినామీలనూ దురాక్రమణలనూ కూడ లెక్కిస్తే ఇంకా ఎక్కువే ఉంటుంది.

ఒక అంచనా ప్రకారం రోజులో ఒకపూట మాత్రమే తిండి తినేవారు రాష్ట్ర జనాభాలో 22 శాతం. 2001 గణాంకాల ప్రకారం 55 శాతం జనాభా ఒకే గది ఉన్న పూరిండ్లలో నివసిస్తున్నారు. 33 శాతం ఇండ్లకు కరెంటు లేదు. మెట్ట ప్రాంతాలలో సంవత్సరంలో మూడు నెలలకు పైగా పనులు దొరకడం లేదు. కాగా, దేశంలోని అన్ని రాష్ట్రాలకన్నా మన రాష్ట్రంలో బాల కార్మికుల సంఖ్య ఎక్కువ.

భూమి పంపిణీ ద్వారా పేదలకు చాలావరకు ఆహార భద్రత కల్పించవచ్చు. దానితోబాటు చెరువుల మరమ్మతు, వాటర్‌షెడ్ అభివృ ద్ధి, వృక్ష సంరక్షణ సరయిన అర్థంలో సక్రమంగా చేపడితే సంవత్సరం పొడవునా పేదలకు (సన్న, చిన్నకారు రైతులతో సహా) పనులు కల్పించవచ్చు. పేదల కొనుగోలు శక్తి పెరిగే కొద్దీ వినియోగ వస్తువులకు, సేవలకు డిమాండు పెరుగుతుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థ నిండుగా ఎదుగుతుంది. సామాజికంగా చూస్తే, భూమి పంపిణీ బడుగు వర్గాలలో ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. పంచాయతీల ద్వారా ప్రకటించుకున్న వికేంద్రీకరణ అర్థవంతమవుతుంది.

ఈ విషయంలో భారతదేశం, అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఘోరంగా విఫలం అయినాయి. కమ్యూనిస్టు పార్టీ పాలనలో ఉన్న చైనాలో సాగుభూమిలో 43 శాతాన్ని భూమిలేని పేదలకు పంచింది. పెట్టుబడిదారీ నమూనా సంస్కరణలు అనుసరించిన జపాన్ 33 శాతం భూమిని, దక్షిణ కొరియా 32 శాతం భూమిని పేదలకు పంచాయి. భారతదేశం కేవలం 1.5 శాతం పంచగా, ఆంధ్రప్రదేశ్ 1.8 శాతం పంచింది. ప్రజా భూమి కమిషన్ చేపట్టిన కార్యక్రమం ఆవశ్యకత గురించి ఇంతకంటె ఏమీ చెప్పనవసరం లేదు.

**(గొర్రెపాటి నరేంద్రనాథ్‌తో కలిసి రాసిన వ్యాసం)**
**మానవహక్కుల వేదిక బులెటిన్-7లో వ్యాసంగా వచ్చింది**
**మే 2005**

# వై.ఎస్. భూమి భాగోతం: ప్రజల కోణం

పేదల భూమి పోరాటాల గురించి అప్పుడెప్పుడో వింటుండేవాళ్ళం. 'ఇంక భూములెక్కడున్నాయి పోరాటాలు చేయడానికి' అని పోరాటాలు చేసినవాళ్ళే అనే దశ వచ్చింది. అంతలో ధనవంతుల భూమి పోరాటాలు అకస్మాత్తుగా ముందు కొచ్చాయి. భూమి చాలా ఉందని ఇప్పుడర్థం అవుతున్నది గానీ ఏం చేయగలమో మాత్రం తెలియడం లేదు. పేదలకు అసైన్ చేసి అన్యాక్రాంతమైన భూమే 10 లక్షల ఎకరాలు ఉందని ముఖ్యమంత్రి నిన్నగాక మొన్న స్వయంగా ప్రకటించాడు. ఖర్చుపెట్టి బాగుచేసి బావి తవ్వి లేక బోరు వేసి ఇస్తే అది పదిలక్షల పేదలకు తిండిపెట్టగలదు. పేదలకు భూములు కల్పించడం కోసమే ఇడుపులపాయ భూములు ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించేసానని చెప్తున్న ముఖ్యమంత్రి నిజంగా ఆ పని చేస్తాడా?

వై.ఎస్. రాజశేఖరరెడ్డి గురించి అటువంటి దురభిప్రాయం ఎవరికీ ఉండనవసరం లేదు. అతనిది పేదల కోసం బాధపడి ఎదిగిన మనసు కాదు. ఇడుపులపాయ భూములు అక్రమంగా స్వంతం చేసుకున్నవని తనకిన్నాళ్ళు తెలియనే తెలియదని అన్నాడు. కడప జిల్లాలో అతనికి తప్ప అందరికి ఆ సంగతి ఎప్పటినుండో తెలుసును. అయితే బలవంతుల అక్రమాల గురించి ఏమీ చేయలేమన్న సాధారణ నిస్సహాయతకు తోడు ఆ జిల్లాలో వై.ఎస్.ను వ్యతిరేకించి బతకడం సాధ్యం కాదన్న భయం జతయి దాని గురించి మాట్లాడడం ప్రజలు మానేసారు. అంతమాత్రం చేత ఎవరికీ తెలీదనుకొని తన తెలివికి తానే మురిసిపోవడం ఏ నీతీ లేని ఆ మనిషికే చెల్లింది.

వై.ఎస్. తన దురాక్రమణకు పశ్చాత్తాపం చెందడం రామోజీరావును ఇబ్బంది పెట్టడానికేనా అనే చర్చ మనకు అనవసరం. అందరూ దురాక్రమణదారులే.

పత్రికను అడ్డంపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నావని ఇతడు అతనినంటే రాజకీయాలను అడ్డం పెట్టుకొని కోట్లు గడిస్తున్నావని అతడు ఇతనినంటున్నాడు. మనకెందుకు?

మనకు కావలసింది ఒక్కటే. పేదలకు అసైన్ చేసి అన్యాక్రాంతమైనాయని ముఖ్యమంత్రి స్వయంగా ఒప్పుకున్న 10 లక్షల ఎకరాలు తిరిగి లబ్ధిదారులకే ఇవ్వాలి. దీనికి మూడు ఆటంకాలు కనిపిస్తున్నాయి. రెండు ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలోనే ఉన్నాయి. మూడవది ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌లో ఉంది.

అన్యాక్రాంతమైన భూమి సాగుయోగ్యమైనది కాకపోతే దానిని తొలినాటి లబ్ధిదారుకు తిరిగి ఇవ్వకుండ ఏదయినా 'ప్రజావసరాల' కోసం వాడుకుంటామని ముఖ్యమంత్రి అన్నాడు. (అంటే భూమిలేని పేదలకు భూమి ఇవ్వడం ప్రజావసరం కాదనా?) దీనిని తెలివితక్కువతనం అనాలో అతి తెలివి అనాలో తెలీదు. సాగుయోగ్యం కాని భూములను కాక సాగుయోగ్యమైన వాటినెప్పుడయినా పేదలకు అసైన్ చేసారా? పేదలకు అసైన్ చేసేదే బంజర్లను. అవి ఎప్పుడో తప్ప ఉన్నపళంగా సాగుయోగ్యంగా ఉండవు. ప్రభుత్వం ఆ భూమికి పేదలకు డి-ఫారం పట్టాలు ఇచ్చేసి చేతులు దులిపేసుకుంటుంది తప్ప ఆ భూమిని సాగుయోగ్యం చేసుకోవడానికి ఏ సహాయం చేయదు. పైగా, పట్టా ఇచ్చినాక ఫలానా గడువు లోపల సాగులోకి తేకపోతే అసైన్‌మెంట్ రద్దవుతుందని ఒక షరతు కూడ డి-ఫారం పట్టాలోనే ఉంటుంది. లబ్ధిదారులు గత్యంతరం లేక ఆ భూమిని పెట్టుబడిపెట్టి బాగు చేయగలవాళ్ళకు అమ్ముకోవడమో, 'కౌలుకు' ఇవ్వడమో తరచుగా జరుగుతుంది. అసైన్డ్ భూముల అన్యాక్రాంతానికి ఇదొక ముఖ్యకారణం. ఇదేమీ ఎరుగనట్టు అన్యాక్రాంతమైన భూమి సాగుయోగ్యం కానట్టయితే ప్రభుత్వమే దానిని తీసేసుకుంటుంది అనడాన్ని ఏ రకంగా అర్థం చేసుకోవాలి?

ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్‌తో దీనిని జతచేసి చూసినప్పుడే దీని భావం పూర్తిగా అర్థం అవుతుంది. 1977లో చేసిన అసైన్డ్ భూముల (బదలాయింపు నిషేధ) చట్టం కింద పేదలకు అసైన్ చేసిన భూమిని వారు వేరే ఎవరికైనా అమ్మినా, ఇతర కారణాలరీత్యా అది అన్యాక్రాంతమైనా దానిని తిరిగి లబ్ధిదారుకే ఇవ్వాలి. అది ఆచరణ సాధ్యం కానప్పుడు మాత్రమే ప్రభుత్వం దానిని తీసేసుకోవచ్చు. అసైన్మెంట్ పొందిన పేదలు గత్యంతరం లేని పరిస్థితిలోనే దానిని

అన్యాక్రాంతం కానిస్తారన్న సామాజిక అవగాహనతో ఆ చట్టం రూపొందింది. ప్రస్తుత ఆర్డినెన్స్ ఆ దౌర్బల్యానికి వారిని శిక్షించదలచుకుంది. ఒకసారి అన్యాక్రాంతం కానిస్తే ఆ భూమి పైన లబ్ధిదారుకు హక్కు పోతుంది. అది ప్రభుత్వానికే చెందుతుంది. ప్రభుత్వం బుద్ధిపుడితే వారికే తిరిగి అసైన్ చేయవచ్చు. కాని చేయాలన్న నియమం లేదు.

దీనినీ పై విషయాన్నీ కలిపి చదివితే, అప్పుడెప్పుడో బుద్ధిలేక పేదలకు ఇచ్చేసిన భూమిని వీలయిన మేరకు తిరిగి ప్రభుత్వం చేతిలోకి తీసుకోవాలన్న ఆరాటమే కనిపిస్తుంది తప్ప పేదలకు న్యాయం చేయాలన్న ఆకాంక్ష కాదు. సాగు యోగ్యం కాని బంజర్లు ప్రభుత్వానికి ఎందుకు? ప్రత్యేక ఆర్థిక మండలులకు, పెట్టుబడిదారీ కంపెనీలకు అప్పగించడానికి కాకపోతే ఇంకెందుకు?

ముఖ్యమంత్రి ఇంకొక షరతు కూడ పెట్టాడు. అన్యాక్రాంతమైన భూమిని కొనుక్కున్నది కూడ చిన్న రైతులే అయితే దానిని వారికే క్రమబద్ధీకరిస్తామన్నాడు. ఇది దుర్మార్గమైన ఆలోచన. అసలు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన ఒకటి రెండెకరాలను పేదలు ఎందుకు అన్యాక్రాంతం కానిస్తారన్న కనీస అవగాహన అతనికి ఉందా? ఒళ్లు బలిసి అమ్ముకుంటున్నారనుకుంటున్నాడా? వారికి బండలు, తుప్పలు, పుట్టలు నిండిన భూమి, ఊరి వ్యవసాయభూములకు దూరంగా ఎక్కడో గుట్టలతో ఉన్న భూమి ఇస్తారు. ఏ పూటకాపూట పనిచేసుకుంటే తప్ప గడవని వారికి దానిని సకాలంలో సాగులోకి తేవడం కష్టం. ఆ భూములు ఇతరుల చేతిలోకి పోవడానికి ఇదొక ముఖ్య కారణం.

దౌర్జన్యమూ తరచుగా జరుగుతుంటుంది. అనేక సందర్భాలలో అసైన్డ్ భూములకు డి-ఫారం పట్టా లబ్ధిదారు చేతిలో పెడతారుగానీ భూమి ఎక్కడుందో చూపించరు. లబ్ధిదారు వెతుక్కుంటూపోతే అక్కడెవరో ఆక్రమించుకొని ఉంటారు. ఇది నీదికాదు పొమ్మంటారు. అసైన్ చేసిన భూమి ఒక భూస్వామి సీలింగ్ భూమి అయినట్టయితే, తరచుగా ఆ భూస్వామి ఆ సీలింగ్ భూమిని కాగితం మీదనే తప్ప నిజంగా ప్రభుత్వానికి అప్పగించి ఉండడు. అతను తనకు అనుకూలుడైన చిన్న రైతుకే దానిని అప్పగించవచ్చు. అప్పుడు అన్యాక్రాంతమైనది చిన్నరైతుకే కాబట్టి అతనికే అప్పగిస్తామనడం ఏం న్యాయం? అయినా చిన్నరైతయితే ఫరవాలేదంటే దురాక్రమణదారులంతా చిన్న రైతులుగా అవతారం ఎత్తగలరు. కుటుంబ ఆస్తులను పది ముక్కలుగా పంచుకొని మరీ అవతారమెత్తగలరు.

వనరులు లేని పేదలకు వనరులపైన హక్కు కల్పించాలన్న న్యాయబద్ధమైన ఆలోచన పట్ల వెటకారం ఈ విధాన ప్రకటనలలోని ప్రధాన విషయం. ఒక పక్క

పేదల భూములు పేదలకే తిరిగి ఇప్పిస్తున్నట్టు కనిపించడం, మరొకపక్క రామోజీరావు, చంద్రబాబునాయుడు తదితర అసంఖ్యాక ప్రత్యర్థి భూ కబ్జాదారులపైన కక్ష తీర్చుకోవడం, పనిలోపనిగా పెట్టుబడిదారీ కంపెనీలకు ధారాదత్తం చేయడానికి ప్రభుత్వం చేతిలోకి మరింత భూమిని తెచ్చుకోవడం - ఇదీ వై.ఎస్ త్రికోణ భూమి విధానం.

1977 నుండి అమలులో ఉన్న అసైన్డ్ భూముల (బదలాయింపు నిషేధ) చట్టాన్ని (దీనిని క్లుప్తంగా 9/77 చట్టం అని పిలుస్తారు) ఉన్నదున్నట్టు అమలు చేయాలనీ, అన్యాక్రాంతమైన భూములను తొలినాటి లబ్ధిదారుకే తిరిగి అప్పగించాలనీ ప్రజాతంత్ర శక్తులంతా ఉద్యమించాల్సిన అవసరం ఉంది. అయితే మళ్లీ బంజరు భూమినే చేతిలో పెట్టకుండ దానిని సాగుయోగ్యం చేసి ఇవ్వాలి. ప్రస్తుతం రాష్ట్రంలో సగభాగంలో అమలులో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకం దీనికి ఉపయోగపడుతుంది. ఆ పథకం కింద చేపట్టగల పనులలో ఒకటి - గ్రామంలో భూమి లేని పేదలకిచ్చిన అసైన్డ్ భూములను సాగుయోగ్యం చేయడం. దీనిని ఉపయోగించుకుంటే తిరిగి ఇచ్చే ఈ డి-ఫారం భూములు మళ్ళీ అన్యాక్రాంతం కాకుండ చూడవచ్చు.

**ప్రజాతంత్ర వారపత్రిక**
**24 డిసెంబర్ 2006**

# పేదల భూములను కంపెనీలకు కట్టబెట్టే కొత్త 'భూసంస్కరణల' ప్రహసనం

**భూ**సంస్కరణలకు కాలం చెల్లిందని ఎవరన్నారు? కాకపోతే, భూస్వాముల భూములు తీసి పేదలకిచ్చే బదులు పేదల భూములు తీసి ధనవంతులకిస్తున్నారు – అంతే తేడా. ఆ భూసంస్కరణలు ఎట్లాగూ పెద్దగా సాధ్యం కాలేదు కదా, అందుకని ఇదైనా చేద్దామని మన పాలకులు నిర్ణయించుకున్నట్టున్నారు.

భూస్వాముల భూములు పేదలకి ఇవ్వడానికి ప్రయత్నించిన రోజుల్లో ఎన్నో ఆటంకాలు ఎదురయ్యాయి. భూస్వాములే కాదు, కోర్టులు కూడ కన్నెర్ర చేశాయి. స్వాధీనం చేసుకున్న మిగులు భూములకు పూర్తి స్థాయి నష్టపరిహారం ఇవ్వవలసిందేనని కోర్టులన్నాయి. రాజ్యాంగాన్ని సవరించి ఆర్టికల్ 31ని ఒకసారి తిరగరాసి, ఆ తరువాత మొత్తంగా తీసేసి భూసంస్కరణలను కాపాడవలసి వచ్చింది. అయితే కాపాడి పెద్దగా చేసిందేమీ లేదనుకోండి. దేశం మొత్తం మీద సాగు భూమిలో 2 శాతాన్ని మిగులు భూమిగా గుర్తించి సరిపెట్టుకున్నారు. అందులో పంచింది తక్కువ, పంచగా పేదల దగ్గర మిగిలింది ఇంకా తక్కువ.

ఇప్పుడు అమలవుతున్న రివర్స్ భూసంస్కరణలకు ఏ ఆటంకాలూ లేవు. పేదలు కన్నెర్ర చేసే స్థితిలో లేరు. కోర్టులు వాళ్ళ తరఫున కన్నెర్ర చేయడానికి ఉత్సాహపడడం లేదు. పేదలెవరైనా కోర్టుకెక్కితే 'అభివృద్ధికి అడ్డం రావద్దండీ, అభివృద్ధి జరగనివ్వండీ' అని న్యాయమూర్తులంటున్నారు.

ఈ మలితరం 'భూసంస్కరణలు' ఏ విధంగా ఉన్నాయో చూద్దాం.

దీన్ని గురించి పత్రికలలో కొంత – కొంతేమిటి చాలా – చూసే ఉంటారు. ఈ భూముల పంపిణీ వల్ల ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కాంగ్రెస్ వాళ్ళు ప్రయోజనం పొందుతున్నారని కడుపు మండిన చంద్రబాబు అభిమానుల పత్రికలు దీనికి వ్యతిరేకంగా విపరీతంగా రాశాయి. అయితే ఆ రాతలలో ఎవరు ప్రయోజనం పొందుతున్నారన్నది ఉన్నదే గానీ ఎవరు నష్టపోతున్నారన్నది లేదు. ఏ విధంగా నష్టపోతున్నారన్నదీ లేదు.

ఈ భూముల బదలాయింపు ఎంత వేగంగా జరుగుతున్నదంటే ఈ రిపోర్టు మీ చేతికి అందేసరికి ఇంకెన్నో చోట్ల ఇంకెన్నో రకాలుగా పేదలు తమ అనుభవంలో ఉన్న భూములు కోల్పోయి ఉంటారు. ప్రత్యేక ఆర్థిక మండలులలో లాగ ధనవంతులు పెట్టుబడులు పెట్టడం కోసం ప్రభుత్వం పేదల భూములు వారికి అప్పగించడమొక్కటే కాదు. ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయమేదీ చేయక ముందే బ్రోకర్లు రంగంలోకి దిగి ఫలానా భూములు ఫలానా అవసరాల కోసం సేకరించబడతాయని ప్రచారం చేయడం కూడ పేదల భూములు అన్యాక్రాంతం కావడానికి దోహదం చేసింది. భూసేకరణ ప్రక్రియనూ, కోర్టు కేసులనూ ఏం ఎదుర్కొంటారులే, నాకు అమ్మేయండి నేను చూసుకుంటానని వదంతులు పుట్టించిన బ్రోకరే భూములు చవగ్గా కొనుక్కుంటాడు. తీరా చూస్తే భూమి సేకరణ అక్కడ కాక పక్కనెక్కడో జరుగుతుంది. అమాయకంగా ఆ భూమిని అమ్ముకున్న పేదవారు చూస్తుండగానే వారి భూమి విలువ కొన్ని రెట్లు పెరిగి వారిని వెక్కిరిస్తుంది. హైదరాబాద్ చుట్టూ ఉన్న రంగారెడ్డి జిల్లా గ్రామాలలో ఇది ఎన్నో చోట్ల జరిగింది.

ప్రభుత్వం ఫలానా భూమి కావాలని నిర్ణయం చేయగా, ప్రభుత్వ నిర్ణయాన్ని మార్పించి పక్కనే ఉన్న నోరు లేని జనం భూములను సేకరణ చేయించి తమ భూములను కాపాడుకోవడమే కాక వాటి ధరను పెంచుకుని లాభపడిన మహానుభావులూ ఉన్నారు. హైదరాబాద్‌ను కమ్ముకుంటున్న ఔటర్ రింగ్ రోడ్డు విషయంలో ఇది పెద్దఎత్తున జరిగింది. దీనివల్ల లాభపడ్డ కాంగ్రెస్ నాయకులు, వాళ్ళ బంధుమిత్రుల జాబితా 'ఈనాడు'లోనూ, 'ఆంధ్రజ్యోతి'లోనూ చూసే ఉంటారు. అయితే తెలుగుదేశం పార్టీ నాయకులూ, వారి సన్నిహితులూ కూడ చాలామందే ఉన్నారు. నిజానికిది తెలుగుదేశం పాలనలోనే మొదలయింది. రంగారెడ్డి జిల్లాలోని నానక్‌రాంగూడ దీనికి సజీవ తార్కాణం. మాజీ టీచర్ ఆకుల రాజయ్యలాగ వట్టి అబద్ధాలు చెప్పి పేదలు దున్నుకుంటున్న భూములను కారుచవగ్గా కొని కంపెనీలకు అమ్ముకున్న వారూ ఉన్నారు.

అయితే మా దృష్టి లాభపడ్డ వారి మీద కాదు, నష్టపోయిన వారి మీద. నిజంగా భూసేకరణ అంటూ జరిగిన చోట ఆ భూమిపైన యాజమాన్య హక్కున్న రైతుకు భూసేకరణ చట్టం కింద నష్టపరిహారం దక్కుతుంది. ఈ నష్టపరిహారం అరుదుగా తప్ప తిరిగి అంత భూమి, అంతే మంచి భూమి కొనుక్కోవడానికి సరిపోదు. ఇది సాధారణ విషయం కాగా, ఈ మధ్య కాలంలో మన రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలోనూ ఎవరికీ అంతుబట్టని కారణాల వల్ల పనికిరాని భూముల ధరలు సైతం విపరీతంగా పెరిగిపోతున్న కారణంగా, ఎకరానికి ఆరేడు లక్షల నష్టపరిహారం ప్రభుత్వం ఇచ్చినా కూడ తిరిగి దగ్గర్లో ఎక్కడా అర్ధ ఎకరం కొనుక్కోవడమూ వారికి సాధ్యం కావడం లేదు. 'మా భూమి ధర యాభై లక్షలుంటుంది. (లేదా కోటి రూపాయలుంటుంది). మాకు 10 లక్షలే ఇస్తే ఎట్లా' అని నిరసన తెలిపిన నిర్వాసితుల గురించి పత్రికలలో చదివే ఉంటారు. భూములు కొనుక్కోలేకపోతే ఏదైనా వ్యాపారం చేసుకొని బతకొచ్చు కదా అన్న ప్రభుత్వం జవాబు, అనుభవం లేని వ్యాపారంలో డబ్బుపెట్టి ఆ ఇంత కూడ పోగొట్టుకుంటే ఆపైన ఏం దిక్కు అన్న రైతు ఎదురుప్రశ్న వినే ఉంటారు. లక్షల రూపాయల నష్టపరిహారం ఇస్తున్నా ఇంకా ఏడుపా అని మొదట అనిపించినా, కొంచెం ఆలోచిస్తే ఈ ఆందోళనలో న్యాయం ఉందని అర్థమవుతుంది.

కానీ భూమి నుంచి జీవనం పొందేది కేవలం దాని యజమానే కాదు. ఆ యజమాని భూమిలో కూలిచేసే వాళ్ళ దగ్గర మొదలుపెట్టి, ప్రభుత్వ భూములను యాజమాన్య హక్కు లేకుండా సాగుచేసుకునే భూమిలేని పేదలు, వంట చెరుకు, పళ్ళు, దుంపలు, ఆకులు సేకరించుకునే వారు, యాజమాన్య హక్కున్న రైతులకు అనేక సేవలందించి బతికే చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి తదితర వృత్తి కులాలు, ప్రకృతిలోని ఫలసాయంపైన ఆధారపడి బతికే గీత కార్మికులు, ఊరుమ్మడి భూములలోనూ ప్రభుత్వ బంజర్లలోనూ పశువులు మేపుకొని బతికే పశువుల కాపర్లు, రాళ్ళు కొట్టుకొని బతికే వడ్డెరలు, ఆ భూములలో ప్రవహించే వాగులలోను, అక్కడున్న చెరువులలోనూ చేపలు పట్టుకొని బతికే మత్స్యకారులు, సముద్రతీర భూములైతే అక్కడ పడవలు పెట్టుకొని వలలు ఆరేసుకొని చేపల వేటచేసే జాలర్లు, అడవి భూములైతే వాటిపైన చట్టపరమైన యాజమాన్యం లేకున్నా వాటి నుంచి అనేక రూపాలలో జీవనం పొందే ఆదివాసులు – అసంఖ్యాకమైన ప్రజానీకానికి భూమి జీవనాధారం. వీరంతా సాంఘికంగానూ అణగారిన కులాలకు చెందినవారు. ప్రాజెక్టుల కోసమో వేరే దేనికోసమో బలవంతపు భూసేకరణ చేసినప్పుడల్లా ఈ ప్రజానీకమంతా మౌనంగా

నిష్క్రమిస్తుంటారు. వాళ్ళు ఆ తరువాత ఏమయ్యారు? ఉన్నారా, పోయారా అని అడిగే వారుండరు.

అభివృద్ధి పేరిట ప్రభుత్వం చేపడుతున్న భూమి సేకరణనూ, భూసంతర్పణనూ ఈ బాధితుల కోణం నుంచి చూడడం మా ఉద్దేశం. మన రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న భూసేకరణ నేపథ్యంలో ఈ విషయాన్ని పరిశీలిద్దాం.

## ప్రత్యేక ఆర్థిక మండలులు

ఇంగ్లీష్‌లో వీటిని స్పెషల్ ఎకనమిక్ జోన్‌లు (ఎస్.ఇ.జడ్) అంటారు. వీటి స్వరూప స్వభావాలను నిర్దేశించేది ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టం, 2005. విదేశీ మార్కెట్‌కు ఎగుమతులు చేపట్టగల సంస్థలను నెలకొల్పడానికి దేశీయ విదేశీయ పెట్టుబడిదారీ కంపెనీలను ఆహ్వానించే లక్ష్యంతో ప్రత్యేక సదుపాయాలు, రాయితీలు కల్పించే వ్యవస్థ ఈ ఎస్.ఇ.జడ్ అనేది. ఎగుమతుల చుట్టూ అల్లుకున్న ఆర్థిక ప్రగతే దేశ అభివృద్ధికి ఉచితమైన మార్గం అన్న నయా ఉదారవాద సిద్ధాంతాన్ని విశ్వసించే వారిలో మన్మోహన్‌సింగ్ ఒకరు. ఆ దృష్టికి ఎగుమతి రంగానికీ, అందులో పెట్టుబడులు పెట్టగల వారికీ ప్రత్యేక రాయితీలు ఇవ్వడం సహజమైన విషయంగా కనిపిస్తుంది. ఆ అవగాహననే ప్రశ్నించేటట్టయితే – ఎగుమతులకు వాటి ప్రాముఖ్యం ఉన్నప్పటికీ దేశీయ మార్కెట్‌నూ, అందులో వ్యక్తమయ్యే ప్రజల అవసరాలనూ తీర్చడం ద్వారా చేపట్టే అభివృద్ధే ఆరోగ్యకరంగా ఉంటుందనేటట్టయితే – అసలు ఎగుమతుల ప్రోత్సాహం పేరిట ప్రత్యేక సదుపాయాలు ఇచ్చే విధానంలోని విజ్ఞత ఎంత అని అడగొచ్చు. ఆ చర్చలోకి పోవడం ఈ నివేదిక పరిధిలోని విషయం కాదుగానీ, ప్రత్యేక ఆర్థిక మండలుల ఆవశ్యకత ప్రకృతి సిద్ధమైనదైనట్టు మాట్లాడే ప్రభుత్వం వైఖరి సందేహాలకు అతీతమైనది కాదని గ్రహించడమూ అవసరమే కాబట్టి ఈ మాటలు అంటున్నాం.

ఈ సదుపాయాలేమిటి? ఒక విశాలమైన భూభాగాన్ని ప్రత్యేక ఆర్థిక మండలి కోసం కేటాయించడం జరుగుతుంది. అందులో ఫ్యాక్టరీ, లేక ఇతర రూపాలలో ఉత్పత్తి లేక సేవా ప్రక్రియ చేపట్టే ఆర్థిక సంస్థకు అవసరమైన భూమే కాక, దానికి అనుబంధంగా అవసరమైన భూమి యావత్తు కేటాయించబడుతుంది. అంటే వారి ఉద్యోగులకు నివాస స్థలాలు, రోడ్లు, పార్కులు, క్లబ్బులు, వాళ్ళ పిల్లలకు స్కూళ్ళు, మార్కెట్లు, వగైరాలకు కూడ భూమి కేటాయించబడుతుంది. ఈ అనుబంధ అవసరాలకు కేటాయించే భూమి ఆర్థిక మండలి మొత్తం విస్తీర్ణంలో 75 శాతం

ఉండవచ్చునని ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టం కింద జారీ అయిన రూల్స్ అంటాయి. అంటే ఒక్కొక్క ప్రత్యేక ఆర్థిక మండలీ ఒక చక్కటి టౌన్‌షిప్ అన్నమాట.

ఇంకా ఏమేం రాయితీలిస్తారు? సంపూర్ణమైన పన్ను రాయితీ ఇస్తారు. కంపెనీకి ఇవ్వడమే కాదు, దాని డైరెక్టర్లకు వ్యక్తిగత ఆదాయపన్ను చట్టం నుంచి కూడ అనేక మినహాయింపులు లభిస్తాయి. కేంద్ర ప్రభుత్వమే కాదు, రాష్ట్ర ప్రభుత్వాలూ తమ పరిధిలోని పన్నుల నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఇప్పటికి దేశంలో ఆమోదం పొందిన ప్రత్యేక ఆర్థిక మండలులకు ఇవ్వబోయే పన్ను రాయితీలు సాలీనా కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లకు 1 లక్ష కోట్ల రూపాయల నష్టం కలిగిస్తాయని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ అధికారులే ఆందోళన వ్యక్తం చేశారు.

పేదలకు, రైతులకు గతంలో ఇచ్చిన రాయితీలు తొలగించినప్పుడు మనం విన్న వాదనలు జ్ఞాపకం ఉన్నాయి కదా? రాయితీలు ప్రభుత్వ ఖజానా మీద పెద్ద భారమనీ, బడ్జెట్ లోటుకు అవే ప్రధాన కారణమనీ, లోటు బడ్జెట్ ఆర్థిక అరాచకత్వానికి దారితీస్తుందనీ విన్నాం. మరి పెట్టుబడిదార్లకు రాయితీలు ఇస్తే అదే జరగదా? జరగదనుకోవాలి కాబోలు. లేదా మన పాలకుల దృష్టిలో మనం విజ్ఞత లేని గొర్రెలనుకోవాలి కాబోలు.

పన్ను రాయితీలే కాదు. 'ఏ చట్టం నుండైనా ఏ మేరకైనా మినహాయింపు ఇయ్యవచ్చు' అని ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టంలోని సెక్షన్ 49 అంటుంది. కేంద్ర ప్రభుత్వం ఒక తాఖీదు జారీ చేయడం ద్వారా అటువంటి మినహాయింపు ఇయ్యవచ్చు. 'ఏ చట్టం నుండైనా' అనేది కార్మిక చట్టాలకు కూడ వర్తిస్తుందని వేరే చెప్పనక్కరలేదు గానీ సెక్షన్ 49 (2) ఈ విషయాన్ని చాలా విచిత్రంగా స్పష్టం చేస్తుంది. ఏ చట్టం నుండైనా ఒక తాఖీదు ద్వారా మినహాయింపు ఇయ్యవచ్చునంటే మరొక తాఖీదు ద్వారా దానిని మళ్ళీ సవరించవచ్చుననీ వెనక్కి తీసుకోవచ్చునీ కూడ అర్థం వస్తుంది. అయితే ఒక తాఖీదు ద్వారా ఏదైనా కార్మిక చట్టం నుంచి ఇచ్చిన మినహాయింపును మరొక తాఖీదు ద్వారా వెనక్కి తీసుకోవడానికి వీలులేదని సెక్షన్ 49 (2) అంటుంది. దీనిని బట్టి పెట్టుబడులను ఆహ్వానించడంలో కార్మిక చట్టాల సడలింపుకు ఎంత ప్రాముఖ్యం ఇస్తున్నారో అర్థం అవుతుంది. రాయితీలు ఇచ్చి పెట్టుబడులను ఆకర్షించి, ఆ తరువాత కార్మిక సంఘాలు గొడవ చేస్తున్నాయనో ఎన్నికలొచ్చాయనో వెనక్కి తీసుకునే 'ప్రమాదం' ఉంది కాబట్టి 49 (2)లో ఆ షరతు పెట్టారు. కాగా, 'ఏ చట్టం నుండైనా

మినహాయింపు ఇయ్యవచ్చును' అనేది కాలుష్య నియంత్రణ చట్టాలకూ, పర్యావరణ చట్టాలకూ కూడ వర్తిస్తుంది కదా? ఇది మరొక తీవ్రమైన ప్రమాదాన్ని సూచిస్తుంది.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ముందే 10 మందో, 15 మందో పెట్టుబడిదారులు మేము మీ దగ్గర పెట్టుబడులు పెడతామని ముందుకొస్తే వారికోసం ఒక ప్రత్యేక ఆర్థిక మండలిని ఏర్పాటు చేయడం కాదు జరుగుతున్నది. క్షేత్రాన్ని తయారుచేసి వాళ్ళను ఆహ్వానిస్తారు. వచ్చిన వాళ్ళు వస్తారు లేదా వాళ్ళు వచ్చేదాకా ఆ క్షేత్రం అట్లాగే పడి ఉంటుంది. మొదట రంగంలోకి వచ్చేది ఒక డెవలపర్. ఇతనొక వ్యక్తి కావచ్చు, ఒక కంపెనీ కావచ్చు, ప్రభుత్వమే కావచ్చు. తానొక ప్రత్యేక ఆర్థిక మండలి నెలకొల్పుతానని అర్జీ పెట్టుకుంటాడు. దీనిని పరిశీలించి నిర్ణయం తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఒక అనుమతి బోర్డును (బోర్డ్ ఆఫ్ అప్రూవల్) నెలకొల్పుతుంది. అయితే ఆ ఆమోదానికి సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి కావాలి. ఈ అనుమతి బోర్డు పాత్ర ప్రత్యేక ఆర్థిక మండలికి ఆమోదం ఇవ్వడంతో అయిపోదు. దాని అభివృద్ధి సక్రమంగా జరిగేటట్టు చూడడం కూడ ఈ బోర్డు కర్తవ్యమే. అందులో నెలకొల్పబోయే పారిశ్రామిక సంస్థలకు లైసెన్స్ ఇవ్వడం, ప్రత్యేక ఆర్థిక మండలిలో చేపట్టే రోడ్లు వగైరా నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదించడం, దాని డెవలపర్ అక్రమంగా వ్యవహరించినట్టయితే అతనికిచ్చిన అనుమతిని రద్దు చేయడం వగైరా అధికారాలు కూడ బోర్డుకు ఉన్నాయి. రద్దు చేసిన తరువాత ఒక పాలనాధికారిని (అడ్మినిస్ట్రేటర్‌ను) నియమించి, మరొక డెవలపర్‌కు ఆ అనుమతిని బదిలీ చేయడానికి బోర్డు అర్జీలు ఆహ్వానిస్తుంది లేదా కొన్ని షరతులతో పాత డెవలపర్‌కే తిరిగి అనుమతి ఇయ్యవచ్చు.

ఈ బోర్డు కింద ఒక అభివృద్ధి కమిషనర్ ఉంటాడు (డెవలప్‌మెంట్ కమిషనర్). వారు ప్రత్యేక ఆర్థిక మండలిలో ఆర్థిక సంస్థలు నెలకొల్పే విషయంలో సలహాలు, సూచనలు ఇస్తారు. ఆ సంస్థల ఎగుమతుల పెంపుదలకు దోహదపడేటట్టు చూస్తారు. డెవలపర్ పనితీరును, మండలిలో నెలకొల్పే ఆర్థిక సంస్థల పనితీరును పర్యవేక్షిస్తారు. మొత్తానికి బోర్డు ఆధ్వర్యంలో బోర్డు అప్పగించే అన్ని పనులూ చేస్తారు. ప్రత్యేక ఆర్థిక మండలిలో ఆర్థిక సంస్థలు నెలకొల్పడానికి ఉత్సాహం చూపేవారు ఈ అభివృద్ధి కమిషనర్‌కే దరఖాస్తు పెట్టుకోవాలి. దానిని ఆమోదించడానికి ఒక అప్రూవల్ కమిటీ ఉంటుంది. వారు అనుమతి ఇచ్చేటప్పుడు షరతులు పెట్టి ఇయ్యవచ్చు.

మొత్తానికి డెవలపర్ చొరవతో, రాష్ట్ర ప్రభుత్వం సమ్మతితో, కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణతో ప్రత్యేక ఆర్థిక మండలులు నెలకొంటాయి, నడుస్తాయి. (ఆ డెవలపర్ ఒక వ్యక్తి కావచ్చు, కంపెనీ కావచ్చు, కేంద్ర లేక రాష్ట్ర ప్రభుత్వం కూడ కావచ్చునని మరొకసారి గుర్తు చేయాలి).

చెప్పుకోదగ్గ మరో విషయం ఏమిటంటే ఎగుమతుల ప్రక్రియను బలోపేతం చేయడం ఈ ప్రత్యేక ఆర్థిక మండలుల లక్ష్యం అయినప్పటికీ, ఒక మండలిని డెవలపర్ ప్రతిపాదన మేరకు నెలకొల్పే దశలో అక్కడ ఏ సంస్థలు రాబోతాయో, ఏ మేరకు ఎగుమతులకు దోహదం చేయబోతాయో ఎవరికీ తెలీదు. ఆ దశలో అదింకా భవిష్యత్తుకు సంబంధించిన విషయం. అయితే అందుకు తగిన సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రాని పక్షంలో సేకరించిన భూమిని తిరిగి రైతులకిచ్చేదేమీ ఉండదు. అప్పటికే దానినంతా చదును చేసి లేఅవుట్ చేయడానికి తయారు చేసేసి ఉంటారు. ఎవరో ఒకరు వచ్చేంత వరకు ఎదురు చూస్తూ ఉంటారు. చివరికి వచ్చిన వారితో సరిపెట్టుకుంటారు. అయితే అంతా తాము అనుకున్నట్టు జరిగినా కూడ భూసేకరణ వల్ల ప్రజలకు కలిగిన నష్టం కంటే, ఎగుమతులకు ఎస్.ఇ.జడ్‌ల ద్వారా లభించే ప్రోత్సాహం కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థకు జరిగే మేలు ఎక్కువ ఉంటుందని ఎవ్వరూ హామీ ఇవ్వజాలరు. కేవలం దబాయింపుతో ఈ ఎస్.ఇ.జడ్ వ్యవస్థను దేశం మీద రుద్దుతున్నారు.

చెప్పుకోదగ్గ విషయాలు నిజానికి చాలానే ఉన్నాయి.

ఎప్పుడు వస్తాయో, వస్తాయో రావో తెలీని కంపెనీల కోసం ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేసేయొచ్చా? భూసేకరణకు అధికారాన్ని ఇచ్చే ఏకైక చట్టం 1894లో అప్పటి బ్రిటిష్ పాలకులు జారీ చేసిన భూసేకరణ చట్టం. దాని ప్రకారం ప్రజావసరాల కోసం మాత్రమే ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేయవచ్చు. ప్రైవేటు వ్యక్తులైనా కంపెనీలైనా భూమి అవసరమైతే కొనుక్కోవలసిందేనన్నది అప్పటి అవగాహన.

అయితే ఉత్పత్తిదాయకమైన పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే కంపెనీలకు భూములమ్మడానికి రైతులు సిద్ధంగా లేనప్పుడు వారు పెట్టుబడులు పెట్టలేకపోవడం దేశ అభివృద్ధికి హాని చేస్తున్నదన్న వాదనతో 1984లో భూసేకరణ చట్టాన్ని సవరించి 'కంపెనీ'ల అవసరాల కోసం కూడ ప్రభుత్వం భూసేకరణ జరపవచ్చునని శాసనం చేశారు. ఆ కంపెనీ ఏదైనా కావచ్చు. ప్రజావసరాలను ఉత్పత్తి చేసే కంపెనీయే కానక్కరలేదు. అటువంటి కంపెనీలకే

ఈ సవరణ పరిమితం చేయాలన్న అభ్యర్థనను న్యాయస్థానాలు కూడ తిరస్కరించాయి. మద్యం ఫ్యాక్టరీ కోసం కూడ ప్రభుత్వం భూసేకరణ చేయవచ్చు.

అయితే ఎస్.ఇ.జడ్‌లకు ఈ చట్ట సవరణ వర్తిస్తుందా? ఎందుకంటే ఈ భూములు సేకరించేది డెవలపర్ కోసం. డెవలపర్ ఒక కంపెనీ కానక్కరలేదు. ఒక వ్యక్తి కావచ్చు. ఇక అతని చేతిలో పెట్టే భూమిలో ఆర్థిక సంస్థను నెలకొల్పబోయే కంపెనీలంటారా, వారు భూసేకరణ జరిగేటప్పుడు కనుచూపు మేరలో ఉండరు. అటువంటి భూసేకరణ చెల్లుతుందా? న్యాయస్థానాల వైఖరి కొంతైనా బాగుంటే ఈ విషయం కోర్టులో తేల్చుకుందాం అని ఉత్సాహపడి ఉందుము గానీ న్యాయస్థానాలు ఈ ప్రశ్నకు ఏం జవాబు ఇయ్యబోతాయో ఊహించగలం కాబట్టి ఈ చర్చను ప్రశ్న దగ్గరే వదిలేద్దాం.

మరొక ప్రశ్న ఏమిటంటే–ప్రత్యేక ఆర్థిక మండలిలో నెలకొల్పబోయేది కేవలం ఉత్పత్తిదాయకమైన ప్రక్రియను చేపట్టే సంస్థను మాత్రమే కాదు. 'కనీసం 25 శాతం భూభాగంలో ఆర్థిక సంస్థ ఉండాలి' అనేది మాత్రమే ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టం కింద కేంద్రప్రభుత్వం జి.ఎస్.ఆర్ 54 (ఇ) పేరిట జారీచేసిన నియమావళి పెట్టిన నిబంధన. తక్కిన 75 శాతం భూభాగంలో ఏముంటుంది? ఆర్థిక సంస్థకు అనుబంధమైన నిర్మాణాలుంటాయి. అందరికీ అర్థమయ్యే భాషలో చెప్పాలంటే, ప్రత్యేక ఆర్థిక మండలి పేరిట ప్రభుత్వం సేకరించే భూమిలో నాలుగవ వంతు భూభాగంలో మాత్రమే ఫ్యాక్టరీ గానీ, ఇతర ఆర్థిక సంస్థగానీ నెలకొంటుంది. మిగిలిన మూడు వంతుల భూభాగంలో అందులో పనిచేసే ఉద్యోగుల నివాసాలు, పార్కులు, క్లబ్బులు, వాళ్ళ పిల్లలకు స్కూళ్ళు, విశాలమైన రహదార్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉంటాయి. అంటే ఒక్కొక్క ప్రత్యేక ఆర్థిక మండలి ఒక సుఖమయమైన టౌన్‌షిప్‌గా రూపొందుతుంది. ఇటువంటి వ్యవస్థ కోసం చేసే భూసేకరణ చట్టరీత్యా చెల్లుతుందా అన్నది ఒక ప్రశ్న కాగా, ప్రజల జీవనాధారమైన భూమిని ఇంత ధారాళంగా పెట్టుబడిదార్ల చేతిలో పెట్టనిదే దేశం అభివృద్ధి చెందదా అన్నది బహుశా అంతకంటే ముఖ్యమైన ప్రశ్న.

ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టం సెక్షన్ 3(1) ప్రకారం ప్రత్యేక ఆర్థిక మండలులలో నెలకొల్పబోయే 'ఆర్థిక సంస్థ' ఫ్యాక్టరీయే కానక్కరలేదని కూడ చెప్పాలి. అది ఉత్పత్తిదాయకమైన సంస్థ కావచ్చు. సేవా రంగ సంస్థ (అంటే బ్యాంకు, ఇన్సూరెన్స్ కంపెనీ, ఆస్పత్రి, చివరికి హోటల్ సైతం) కావచ్చు. వర్తక కేంద్రం కావచ్చు. గోడౌన్ కావచ్చు. అంతేకాదు 'ఉత్పత్తి' (మాన్యుఫ్యాక్చర్) అనే

దానికి పారిశ్రామిక ఉత్పత్తి అనే కాక వ్యవసాయ ఉత్పత్తి, పళ్ళతోటల పెంపకం, పశుపోషణ, చేపల పెంపకం అని కూడ సెక్షన్ 2 (ఆర్) లో అర్థం చెప్పారు. కాబట్టి రైతులందరినీ తరిమేసి వాళ్ళు నాటిన చెట్లను నరికేసి మళ్లీ దున్నేసి తిరిగి ఒక కంపెనీ ఆధ్వర్యంలో వ్యవసాయం లేక తోటల పెంపకం చేపట్టవచ్చు! ఒక్కటే తేడా ఏమిటంటే ఇది ఎగుమతుల కోసం జరుగుతుంది. మనం తినడం కోసం కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇదీ అదీ అన్న తేడా లేకుండా ఎగుమతుల కోసం చేపట్టే ఏ ఆర్థిక కార్యకలాపమైనా ప్రత్యేక ఆర్థిక మండలులలో నెలకొల్పవచ్చు.

ఇంకొక వింత విషయం ఏమిటంటే 'ఎగుమతులు' అంటే విదేశాలకే కానక్కరలేదు. ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఒక సంస్థ నుంచి మరొక సంస్థకు, లేక ఒక ప్రత్యేక ఆర్థిక మండలి నుంచి మరొక ప్రత్యేక ఆర్థిక మండలికి జరిగే అమ్మకం కూడ ఎగుమతేనట. మనబోటి బలహీనమైన ఆర్థిక వ్యవస్థ గల దేశాలకు చెందిన సంస్థలు అంతర్జాతీయ విపణిలో పోటీపడి అమ్మకాలు సాగించడం కష్టతరమని చెప్పి అటువంటి సంస్థలకు పన్ను రాయితీలివ్వడాన్ని ఒక పక్క సమర్థించుకుంటూ, మరొక పక్క ఇరుగు పొరుగు ప్రత్యేక ఆర్థిక మండలులకు చేసే అమ్మకం కూడ ఎగుమతేననడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? సహేతుకంగా తోచే ఒక కారణాన్ని చూపించి, దానితో ఏమీ సంబంధం లేని కార్యకలాపాలకు కూడ ఖరీదైన రాయితీలివ్వడం మోసం అనిపించుకోదా?

ప్రత్యేక ఆర్థిక మండలికి కేటాయించిన భూభాగంలో ఉత్పత్తి లేక ఇతర ఆర్థిక ప్రక్రియ నిర్వహించే ప్రాంతం 25 శాతం వైశాల్యాన్ని మించి ఉండనవసరం లేదనీ మిగిలిన 75 శాతం 'అనుబంధ' నిర్మాణాలకు కేటాయించవచ్చుననీ పైన చెప్పాము. ఈ విషయాన్ని ఇంకొంచెం వివరంగా తెలుసుకోవాలి. ఒకటి కంటే ఎక్కువ రకాల ఉత్పత్తులు చేపట్టే ప్రత్యేక ఆర్థిక మండలిని బహుళ ఉత్పత్తి (మల్టీ ప్రొడక్ట్) ఎస్.ఇ.జడ్ అంటారు. అటువంటి ఎస్.ఇ.జడ్ కనీస వైశాల్యం 2,500 ఎకరాలు (వెయ్యి హెక్టార్లు) ఉండాలి. ఇక్కడ కొంచెం భూమి అక్కడ కొంచెం భూమి కాదు, అవిచ్ఛిన్నమైన భూభాగం కేటాయించాలి. అందులో 25% మించి ఉత్పత్తి లేక ఇతర ఆర్థిక ప్రక్రియ ఉండనవసరం లేదు.

సేవా రంగానికి చెందిన కార్యకలాపాలకు పరిమితమయ్యే ప్రత్యేక ఆర్థిక మండలి వైశాల్యం అంత ఉండనవసరం లేదు. 250 ఎకరాలుంటే చాలు.

ఓడరేవు, విమానాశ్రయం నెలకొల్పే ప్రత్యేక ఆర్థిక మండలులు కూడ ఉండగలవు. వీటి వైశాల్యం 250 ఎకరాలు మించి ఉండాలి. వీటిలో ప్రధాన ప్రక్రియ 50 శాతం భూభాగంలో ఉండాలి. మిగిలిన 50 శాతం అనుబంధ కార్యకలాపాలకు వినియోగించవచ్చు. వర్తకం, గోడౌన్ల ఎస్.ఇ.జడ్ వైశాల్యం 100 ఎకరాలు మించి ఉండాలి. దీనికి కూడ 50 శాతం నియమం వర్తిస్తుంది.

మిగిలిన భూభాగం 'అనుబంధ' అవసరాలు తీర్చడం కోసం ఉద్దేశించబడిందని అంటున్నాముగానీ, ఈ 'నాన్-ప్రాసెసింగ్ ఏరియా'లో ఏం చేయవచ్చుననే విషయాన్ని చట్టం అస్పష్టంగానే ఉంచేసింది. వ్యాపార అవసరాలకు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు మొదలైన సామాజిక అవసరాలకు, హోటళ్ళకు, కాలక్షేపానికి, నివాసాలకు ఆ భూమిని డెవలపర్ కేటాయించవచ్చునని అంటుంది గానీ ఇవన్నీ ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనే ఉద్యోగుల అవసరాలతో ముడిపడి ఉండాలనదు. కాబట్టి వారి అవసరాలు తీర్చగా మిగిలిన భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వినియోగించుకోవాలనుకుంటే చట్టంలో ఆటంకం లేదు.

ఇంకొక రెండు విషయాలు చెప్పుకుంటే ఈ ప్రత్యేక ఆర్థిక మండలుల ప్రత్యేక స్వభావం పూర్తిగా అర్థం అవుతుంది. కార్మిక చట్టాల అమలును (మినహాయింపులివ్వగా ఇంకా మిగిలి ఉండే) పర్యవేక్షించే అధికారం ఉన్న కార్మిక శాఖ అధికారుల స్థానంలో డెవలప్‌మెంట్ కమిషనర్‌ను నిలబెడుతుంది ప్రత్యేక ఆర్థిక మండలుల నియమావళి. ఈ కమిషనర్ గారి ప్రధాన కర్తవ్యం ప్రత్యేక ఆర్థిక మండలి ఆర్థికంగా ఫలవంతంగా పని చేసేటట్టు చూడడం. కాబట్టి కార్మిక శాఖ అధికారాలు అతని చేతిలో పెడితే కార్మికుల హక్కులను ఎగుమతి వ్యాపారానికి లోబడిన విషయంగా చూస్తాడనడంలో సందేహం అక్కరలేదు.

చివరిగా ఈ ప్రత్యేక ఆర్థిక మండలిలో అధికారికంగా నివసించే వారందరికీ గుర్తింపు కార్డులంటాయి. ఈ గుర్తింపు కార్డులు ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఆర్థిక సంస్థ పరిసరాలలోకి ప్రవేశించడానికి అనుమతిగా పనిచేస్తాయి. ప్రమాదకరమైన ఉత్పత్తులు చేసే సంస్థలలోకి ప్రవేశాన్ని నియంత్రించడం ఎరుగుదుము కానీ ఇలాంటివి విని ఎరగం. ఈ నియమాల కింద ఏ రకమైన ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించే ప్రత్యేక ఆర్థిక మండలిలోనికైనా అనుమతించిన వారికే ప్రవేశం ఉంటుంది. ఇది భద్రతా చర్య కాదు, పారదర్శకతను నిరాకరించే చర్య. ఎగుమతి దిగుమతి సుంకాలకు సంబంధించినంత వరకు ప్రత్యేక ఆర్థిక మండలి 'విదేశీ

భూభాగంగా' పరిగణించబడుతుందని ఈ చట్టమే సెక్షన్ 53లో అంటుంది. వివరాలలోకి పోతే సుంకాల విషయంలోనే కాదు, సమాచారం విషయంలోనూ అది విదేశీ భూభాగమే అని అర్థం అవుతుంది. కార్మికుల హక్కులకిచ్చే మినహాయింపును దృష్టిలో ఉంచుకున్నట్టయితే, అది ఇంక ఏ విషయంలో స్వదేశీ భూభాగం అని మనల్ని మనం ప్రశ్నించుకోవలసిందే.

## రాష్ట్రంలోని ప్రత్యేక ఆర్థిక మండలులు

2006 డిసెంబర్ నాటికి మన రాష్ట్రంలో 43 ప్రత్యేక ఆర్థిక మండలులు అనుమతి పొందాయని ప్రభుత్వ సమాచారం. వాటి కింద 90 వేల ఎకరాలకు పైగా సేకరించబడతాయని అంచనా. ఆ 43లో 6 బహుళ ఉత్పత్తి మండలులు కాగా మిగిలినవి ఏకోత్పత్తి మండలులు. 27 ఐ.టి ఉత్పత్తులకు, 3 పాదరక్షల ఉత్పత్తికి కేటాయించబడ్డాయి. బయోటెక్నాలజీ, కాగితపు పరిశ్రమ, సెమీకండక్టర్స్, ఆభరణాలు, వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, గృహ నిర్మాణ పరికరాలకు సంబంధించి ఒక్కొక్కటి ఆమోదం పొందాయి.

అయితే ఏ రోజైనా ఇంకా ఎస్.ఇ.జడ్‌లు ఆమోదం పొందగలవు కాబట్టి, ఈ గణాంకాలు కేవలం మన రాష్ట్రంలో ప్రత్యేక ఆర్థిక మండలుల ప్రక్రియ పరిమాణాన్ని సూచించడానికి పనికొస్తాయి. ఈ పరిమాణం ఎంతటిది అంటే దేశంలో మహారాష్ట్ర తరువాత ప్రత్యేక ఆర్థిక మండలుల సంఖ్యలో మనదే రెండవ స్థానం. హైదరాబాద్ పరిసరాలలో ప్రత్యేక ఆర్థిక మండలుల రూపంలోనే కాక ఇతర రూపాలలోనూ భూములను ప్రభుత్వం పెట్టుబడిదార్లకు దత్తం చేస్తుండగా, విశాఖపట్నం ప్రత్యేక ఆర్థిక మండలుల ఏర్పాటుకు ప్రధాన క్షేత్రంగా ఉంది. విశాఖపట్నం సిటీకి కూతవేటు దూరంలో ఉన్న అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలలో ఇప్పటికే 18,000 ఎకరాల ఎస్.ఇ.జడ్‌లు ఆమోదం పొందాయి. ఆ తీరం వెంబడి ఇంకా కూడ ఆమోదం పొందగలవని వింటున్నాం. మరి రెండు పెద్ద ఎస్.ఇ.జడ్‌లు తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ దగ్గర, చిత్తూరు జిల్లాలోని సత్యవేడు, వరదయ్యపాలెం మండలాలలోనూ నెలకొనబోతున్నాయి. మొదటి దాని వైశాల్యం 10,000 ఎకరాలు. రెండవ దాని వైశాల్యం 12,000 ఎకరాలు.

ఈ మధ్య కొందరు కాంగ్రెస్ నాయకులు – ప్రధానంగా ఆ పార్టీ అధ్యక్షురాలు – లేవదీసిన చర్చనిక్కడ ప్రస్తావించాలి. ప్రత్యేక ఆర్థిక మండలులకు భూసేకరణ చేపట్టేటప్పుడు సారవంతమైన భూములను మినహాయించాలని ఆమె

సూచించారు. ప్రత్యేక ఆర్థిక మండలుల స్వరూప స్వభావాలను పైన వర్ణించాము. దానికి కేటాయించే భూమి 'అవిచ్ఛిన్నమైనది' (కంటిన్యుయస్) అని ఎస్.ఇ.జడ్ చట్టం స్పష్టంగా అంటుంది. సారవంతమైన భూములు లేని వేల ఎకరాల అవిచ్ఛిన్నమైన భూమి థార్ ఎడారి వెలుపల ఎక్కడైనా దొరుకుతుందా? సోనియాగాంధీ గారి కోరిక మేరకు చట్టాన్ని సవరించి 'అవిచ్ఛిన్నమైనది' అనే విశేషణాన్ని తీసేస్తారనుకుందాం. కానీ అట్లా మినహాయించిన సారవంతమైన భూములలో వ్యవసాయం సాధ్యమవుతుందా? ఆ పొలాల చుట్టూ ఇళ్ళుంటాయి, షాపులుంటాయి, ఫ్యాక్టరీలుంటాయి. వాటి నుంచి వెలికి వచ్చే కాలుష్యానికి ఆ పొలం బలి కాకుండా కాపాడుకోవడమే రైతుకు పెద్ద భారం కాదా?

కాకుండా సారవంతమైన నేలలు అన్నప్పుడు రెండు పంటలు లేక మూడు పంటలు పండే భూములు అనే వ్యాఖ్యానం చేస్తున్నారు. ఇది తిండిగింజల ఉత్పత్తి పడిపోతుందన్న ఆందోళనే తప్ప రైతులు, కూలివాళ్ళ జీవనం దెబ్బతింటుందన్న ఆందోళన కాదు. వ్యవసాయరంగ నిపుణుడు ఎం.ఎస్. స్వామినాథన్ ఈ విషయం స్పష్టంగానే చెప్పాడు. ఎస్.ఇ.జడ్‌ల వల్ల దేశంలో ధాన్యం ఉత్పత్తి పడిపోకుండా జాగ్రత్త పడాలన్నాడు.

కానీ భూమి సారవంతమైనదైనా, కాకున్నా దానిమీద ఆధారపడి బతికే వాళ్ళకు కనీసం కొంత ఎక్కువ నష్టపరిహారమైనా వస్తుంది. సార హీనమైన భూమికి అది కూడ రాదు. కాగా, ప్రభుత్వ భూమి, ఊరుమ్మడి భూమిని పరిశ్రమలకు ఇచ్చేయడంలో ఏ సమస్యా లేనట్టే అందరూ మాట్లాడుతున్నారు. ఆ భూమి ఒక్కొక్కచోట ఒక్కో విధంగా చాలామందికి జీవనాధారంగా ఉంటుంది. వాళ్ళకు దానిపైన చట్టం గుర్తించే యాజమాన్య హక్కు లేకుంటే లేకుండవచ్చు. ఉదాహరణకు విశాఖపట్నం జిల్లా సబ్బవరం సమీపంలో ఈ మధ్య బాక్సైట్ పరిశ్రమ రిఫైనరీ కోసం 1700 ఎకరాలను ప్రభుత్వం జిందాల్ కుటుంబానికి చెందిన ప్రైవేటు కంపెనీకి అప్పగించింది. అది ప్రభుత్వ భూమి కాబట్టి భూమి సేకరణ అక్కరలేదనింది. కానీ నిజానికి ఆ 1700 ఎకరాలలో 1000 ఎకరాలు సాగులో ఉన్నాయి. మిగిలిన బంజరు వంట చెరుకుకు, పశుగ్రాసానికి కొన్ని వందల కుటుంబాలకు ఆధారంగా ఉంది. రేపు ఆ 1700 ఎకరాలూ జిందాల్‌కు అప్పగించేస్తే ఎన్ని వేల కుటుంబాల జీవనం దెబ్బతింటుందో చెప్పడం కష్టం.

హైదరాబాద్ పరిసరాలలో హైదరాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ (హుడా) 'తన భూములు' అమ్ముకుంటున్నదంటూ వినిపించే వార్తలన్నీ ఇటువంటివే.

రాజేంద్రనగర్ మండలంలోని కోకాపేట ఖరీదైన అమ్మకానికి పేరు గాంచింది. ఒకే చోట ఉన్న 60 ఎకరాల భూమిని హుడా వేలం వేసి కోట్లు సంపాదించిందన్న వార్త సంచలనం సృష్టించింది. అది ఖాళీ జాగా అన్న అభిప్రాయమే హుడా కలిగించింది. కానీ సర్వే నెం.109 లోని ఆ 60 ఎకరాలను 36 మాదిగ కుటుంబాలవారు 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారు. 1965 నుంచి వారు డి–ఫారం పట్టాలు ఇమ్మని ప్రభుత్వానికి అర్జీ పెట్టుకుంటూ ఉన్నారు. నిరభ్యంతరకరమైన ఆక్రమణను క్రమబద్ధీకరించి డి–ఫారం పట్టాలు ఇవ్వాలని బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్ చెప్తాయి. అయినప్పటికీ పాలకులకు అంత టైం దొరకలేదు. మీకు కాక వేరే ఎవరికిస్తాం లెమ్మని కాలక్షేపం చేస్తూ వచ్చారు. ఆ భూమి ఎవరికి కావాలి లెమ్మని చేసుకుంటున్న వారు కూడ ధీమాగానే ఉన్నారు. తెలుగుదేశం పాలనలో రాష్ట్రంలో 'భూకంపం' మొదలైంది. కంపెనీలకు భూములు భారీగా బదలాయించే ప్రక్రియ షురూ అయింది.

2001లో పోలీసు అకాడెమీకి కోకాపేట సర్వే నెం.109 లోని 60 ఎకరాలను అప్పగించే ప్రయత్నం జరిగినప్పుడు ఆ భూమి చేసుకుంటున్న మాదిగలు గట్టిగా అడ్డంపడ్డారు. ఆ ప్రయత్నాన్ని ఆపించగలిగారు. కానీ రోజులు మారాయని గ్రహించి తమ ఎంఎల్ఏ సబితా ఇంద్రారెడ్డిని కలిసి ఎట్లాగైనా తమ భూమికి పట్టాలు ఇప్పించమని అడిగారు. 'తెలుగుదేశం పాలనలో కాదు – మా ప్రభుత్వం రానీ చేపిస్తానన్నది. తమ ప్రభుత్వం రాగానే భూమిని హరాజు (వేలం) పెట్టిచ్చింది' అని వాళ్ళు సగం నవ్వుతూ సగం కోపంగా అంటారు. హరాజ్ హుడా కార్యాలయంలో జరుగుతున్నదని తెలిసి ఆటంకపరచడానికి వారు పోగా సబితా ఇంద్రారెడ్డి వాళ్ళను తన దగ్గరకు పిలిపించుకొని సంప్రదింపుల పేరిట హరాజు అయిపోయే దాకా కాలక్షేపం చేసిందని వారి మరొక ఫిర్యాదు.

ఈ ఉదంతాలను ప్రస్తావించడంలో గల ఉద్దేశం, ఎవరి జీవనానికీ హాని కలిగించకుండా వేల ఎకరాల భూసేకరణ చేసేయవచ్చుననుకోవడం భ్రమ అని చెప్పడానికి మాత్రమే. కంపెనీల కోసం, రోడ్ల కోసం, ప్రాజెక్టుల కోసం చేసే బలవంతపు భూసేకరణ చాలా పరిమితమైన పరిధిలో ఉండాలి. బలవంతపెట్టని ప్రత్యామ్నాయాలను అన్వేషించాలి. అయినప్పటికీ తప్పనిసరైతే, ఆ భూమిపైన తమ జీవనం కోసం ఆధారపడే ప్రజల జీవన ప్రమాణం ఏ మాత్రం దెబ్బతినని సమగ్ర పునరావాస విధానాన్ని అమలులో పెట్టిన తరువాతే భూసేకరణ చేపట్టాలి. ప్రత్యేకించి, మూకుమ్మడిగా వేల ఎకరాల భూములను కంపెనీలకు ధారాదత్తం చేసే ప్రత్యేక ఆర్థిక మండలుల భావననే విడిచి పెట్టాలి.

చిత్తూరు జిల్లా సత్యవేడు, వరదయ్యపాలెం మండలాలలో 12,000 ఎకరాల ఎస్.ఇ.జడ్ తయారవుతున్నది. దాని కోసం 16 గ్రామాలలో భూముల సేకరణకు చర్యలు మొదలయ్యాయి. దీని డెవలపర్ సన్నాటి రవీంద్రరెడ్డి అనే వ్యక్తి ('అతను ప్రవాస భారతీయుడంట' అని తప్ప ఆ మహానుభావుడి గురించి ఎవరికీ తెలీదు). ఇతను శ్రీసిటీ (ప్రై) లిమిటెడ్ అనే కంపెనీ అధినేత.

చిత్తూరు జిల్లాలో ఏవో రెండు మండలాలంటే అవి ఎక్కడో మారుమూలన ఉన్నాయనుకునేరు. ఒక పెద్ద నగరానికి, ఒక జాతీయ రహదారికి, ఒక ప్రధాన రైల్వే మార్గానికి ఒక ఓడరేవు లేక విమానాశ్రయానికి దూరంగా ప్రత్యేక ఆర్థిక మండలి నెలకొల్పడానికి ఏ డెవలపర్ ముందుకు రాడు. (ప్రాంతీయ అసమానతలు కూడ ఎస్.ఇ.జడ్ వల్ల పెరుగుతాయని దీనిని బట్టి అర్థం అవుతుంది). సత్యవేడు, వరదయ్యపాలెం ఎస్.ఇ.జడ్ 5వ నంబర్ జాతీయ రహదారికీ, మద్రాసు-హౌరా రైల్వే లైనుకీ పక్కన ఉండడమే కాక, మద్రాసు నగరానికీ నెల్లూరు పట్టణానికీ భారీగా విస్తరణ చెందుతున్న కృష్ణపట్టణం రేవుకూ దగ్గర్లో ఉంది.

ఈ 16 గ్రామాల జనాభా 25 వేల దాకా ఉంటుంది. గ్రామ ఆవాసాలను విడిచిపెట్టి గ్రామం చుట్టూ ఉన్న భూములను మాత్రమే స్వాధీనం చేసుకుంటున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇది మొత్తం భూమిని స్వాధీనం చేసుకోవడం కంటే పెద్ద మోసం. భూములన్నీ కోల్పోయి ఇళ్ళు మాత్రం మిగుల్చుకొని అక్కడ బతికి ఏం చేస్తారు? ఆ ఇళ్ళు కొనే వాళ్ళెవరూ ఉండరు కాబట్టి ఏదో ఒక రోజు వాటిని వదిలిపెట్టి వట్టి చేతులతో వెళ్ళిపోవాలి.

మంచి పంటలు పండే భూములను ప్రత్యేక ఆర్థిక మండలుల కోసం సేకరించబోరు అన్న అభిప్రాయం ఈ మధ్య వింటున్నాం కాబట్టి ఈ 12 వేల ఎకరాలలో మూడింట రెండు వంతులు రైతుల స్వంత భూమి అనీ, మిగిలిన ఒక వంతు పేదలు చేసుకుంటున్న ప్రభుత్వ భూమి అనీ చెప్పాలి. పైగా అక్కడ చాలా చెరువులున్నాయి, వందల సంఖ్యలో బావులు, బోర్లు ఉన్నాయి. సజ్జలు, వరి, చెరుకు, వేరుశనగ పొలాలేకాక మామిడి తోటలు, మల్లెతోటలు, రోజా పూదోటలు ఉన్నాయి. పశువులు ఒక్కొక్క ఊరిలోనూ వేల సంఖ్యలో ఉన్నాయి.

భూమంతా సారవంతమైనది కాదుగానీ సారవంతమైన భూములు మాత్రం మంచి ఆదాయం ఇస్తాయి. చెరుకు వేస్తే ఒక ఎకరానికి 25 వేల నికర ఆదాయం రాగలదు. రోజా పూల తోట ఎకరానికి 1 లక్షదాకా ఇవ్వగలదు. మల్లె తోట అంత

కంటే చాలా ఎక్కువ ఇవ్వగలదు. గెణుసు గడ్డలు (చిలగడ దుంపలు) వేస్తే ఎకరానికి 50 వేల ఆదాయం రాగలదు. అన్నీ కలిసొచ్చినప్పుడే తప్ప ప్రతి సీజన్‌లోనూ ఇంత ఆదాయం రాని మాట నిజమే గానీ ఇక్కడి వ్యవసాయం ఫలవంతమైనదని గుర్తించాలి. ఇప్పుడు ఈ భూమంతా శ్రీసిటీ అనే 'డెవలపర్' చేతిలోకి పోతున్నది. మొదట్లో ఈ గ్రామాల ప్రజలు కొంత ప్రతిఘటించారు. ఎకరానికి రెండున్నర లేక మూడు లక్షల రూపాయల నష్ట పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం సంసిద్ధత ప్రకటించింది. అయితే ఈ మాత్రం పొందాలంటే రైతులు దానిపైన కోర్టుకు పోమని హామీ ఇవ్వాలి. లేకపోతే ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధర ప్రకారం వారికి 1 లక్షకు తక్కువగా నష్టపరిహారం ఇచ్చి కోర్టుల చుట్టూ తిప్పుతుంది ప్రభుత్వం.

ఎకరానికి రెండున్నర లేక మూడు లక్షల నష్టపరిహారం ఇస్తే మళీ తిరిగి ఆ పరిసరాలలో ఒక ఎకరం కొనడం సాధ్యం  కాదన్న విషయం అటుంచి, ఆ డబ్బులు కూడ వారి చేతిలో మిగలవు. ఒక ఎకరం భూమి ఉన్న ఏ రైతు ఒక లక్ష రూపాయలకు తక్కువ అప్పు పడలేదు. ఊరిలో ఉండి వ్యవసాయం చేసుకుంటున్నంత కాలం అప్పుల వాళ్ళు మరీ ఒత్తిడి పెట్టరు. కానీ భూమి అప్పగించి వెళ్ళిపోతాడనుకుంటే బాకీ తీర్చేదాకా పోనివ్వరు.

తన ప్రతిపాదనకు రైతులను ఒప్పించడానికి ప్రభుత్వం రెండు రకాల పద్ధతులు ఆశ్రయిస్తున్నది. ఒకటి భూమి ఎక్కువగా ఉండి, 50 లక్షలో, కోటి రూపాయలో నష్టపరిహారం దొరికితే వ్యవసాయం విడిచిపెట్టి ఏ వ్యాపారమో చేసుకొని బతకడానికి సిద్ధంగా ఉన్న పెద్ద రైతులను ఒప్పించి వారిచేత చిన్న రైతులపైన ఒత్తిడి పెట్టించడం. 30-40 ఎకరాల భూములు గల భూస్వాములున్న ఊర్లు కొన్ని ఉన్నాయి కాబట్టి ఈ ఎత్తుగడ సాగుతుంది. అటువంటి భూస్వాములకు వ్యవసాయ రంగం నుంచి బయటకు పోవడానికి అభ్యంతరం లేకపోవడానికి వేరే కారణం కూడ ఉంది. వాళ్ళు వ్యవసాయం స్వయంగా చేసుకోరు. రైతులకు కౌలుకిచ్చి చేయించుకుంటారు. బాగా చేసే కౌలుదార్లు దొరకరనీ, కౌలు సరిగ్గా చెల్లించరనీ మామూలుగా ఉండే అసంతృప్తి వారిలో ఉంది. అందువల్ల ఎస్.ఇ.జడ్‌కు ఇచ్చేసి ఈ 'పీడ' వదిలించుకోవడానికి వాళ్ళు సులభంగానే సిద్ధపడతారు.

సత్యవేడు మండలం చెరివి పంచాయతీలో ప్రభుత్వానికి ఈ అవకాశం లభించింది. ఆ ఊరికి చెందిన రెడ్డి కులస్థులైన భూస్వాములు కొందరు తిరుపతిలో ప్రభుత్వ అధికారులు నిర్వహించిన మీటింగ్‌లో పాల్గొని ఎకరానికి

రెండున్నర లక్షల నుంచి మూడు లక్షల దాకా నష్టపరిహారం ఇస్తే చాలనీ, ఆపైన కోర్టుకు పోమని రాసిచ్చి భూమి అప్పగించేయడానికి అంగీకరించారు. కాని గ్రామ ప్రజల ఆమోదం పొందడానికి గ్రామ సభ జరపలేదు. వేరే ఏ రూపంలోనూ ప్రజాభిప్రాయ సేకరణ చేయలేదు. ఆ గ్రామ పంచాయతీకే చెందిన చిగురుపాలెం వాసులు తమకేమీ తెలీదని, తమను అడగకుండా ఈ నిర్ణయం చేశారనీ అంటున్నారు.

ఊరిలో ఒకరిద్దరితో మాట్లాడి నిర్ణయం ఎట్లా చేస్తారని అధికారులను అడిగితే ఆ నిర్ణయాన్ని అందరూ అంగీకరించాలన్న ఒత్తిడేమీ లేదని, అంగీకరించడానికి నిరాకరించే రైతులు తమ హక్కుల కోసం కోర్టులో కేసు వేసుకోవచ్చుననీ నిజాయితీ లేని జవాబులు చెప్తున్నారు. సాంకేతికంగా చూస్తే అది నిజమే కావచ్చు. అయితే ఒప్పందాన్ని తిరస్కరించే రైతులకు ప్రభుత్వం భూసేకరణ చట్టాన్ని, దానికింద అనుసరించే ప్రక్రియను అమలుచేస్తుంది. అంటే స్థానికంగా భూముల అమ్మకాలు రిజిస్టర్ అయిన ధరలను ప్రమాణంగా పెట్టుకొని ఏ 60 వేలో, 70 వేలో ఇస్తుంది. ఆ తరువాత ఒక దశాబ్దకాలం కోర్టుల చుట్టూ తిప్పుతుంది. చివరికి నష్టపరిహారం పెరగడం తరచుగా జరుగుతుంది గానీ ఈ లోపల చేసిన అప్పులకయ్యే వడ్డీలనూ, బ్రోకర్లకూ, లాయర్లకూ (ఒక్కొక్కసారి జడ్జీలకు కూడ) చెల్లించుకునే మొత్తాన్ని దాని నుంచి మినహాయించవలసి ఉంటుంది.

ఇది చిన్న వ్యవసాయదారులకు చాలా అన్యాయం చేస్తున్నదని గ్రహించిన కారణంగా ఈ మధ్య కాలంలో 'కన్సెంట్ (సమ్మతి) అవార్డులు' అనే ప్రక్రియను ప్రవేశపెట్టారు. ప్రభుత్వం ఏకపక్షంగా భూమి ధరను నిర్ణయించి ఆపైన రైతును కోర్టు చుట్టూ తిప్పే బదులు, రైతులతో కూర్చొని మాట్లాడి ఇద్దరికీ సమ్మతమైన ధర నిర్ణయించడం కోసం జిల్లా స్థాయిలో ఒక కమిటీని, రాష్ట్ర స్థాయిలో ఒక కమిటీని నియమిస్తారు. సమ్మతి కుదిరితే ఇక ఆపైన రైతులు కోర్టుకు పోమని అంగీకరిస్తారు. ఇది మంచి ఆలోచనే.

అయితే ఎంత మంచి ఆలోచననైనా భ్రష్టు పట్టించడంలో మన పాలకులు వారికి వారే సాటి. ఈ ప్రక్రియను ప్రజాస్వామికంగా అమలు జరపదలచుకున్నట్టయితే గ్రామ సభ నిర్వహించి బహిరంగంగా చర్చించి అందరి అభిప్రాయాలూ తీసుకోవాలి. మెజారిటీ ప్రభుత్వ ప్రతిపాదనను అంగీకరించి, కొద్దిమంది మాత్రం కాదంటే ఆ కొద్దిమందితో విడిగా మాట్లాడాలి. అంతే తప్ప కొద్దిమంది మోతుబరులతో మాట్లాడి ఒక నిర్ణయం తీసేసుకుని 'సమ్మతి అవార్డు'

ఇదేనని ప్రకటించి, దానిని కాదనే వాళ్ళు కోర్టుకు పోవచ్చునని సూక్తులు వల్లించడం 'సమ్మతి' అన్న భావననే వెక్కిరించడం అవుతుంది. అయితే అన్ని భూసేకరణ ప్రక్రియలలోనూ ఇదే జరుగుతున్నది.

ప్రభుత్వం ఉపయోగిస్తున్న రెండవ ఒత్తిడి 'ఒక్కొక్క ఇంటికీ ఒక ఉద్యోగం ఇస్తాం' అన్న హామీ. ఇది రైతులను, ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల రైతులను చాలా ఆకర్షిస్తుంది. కురవని వర్షాలతో, మొలకెత్తని విత్తనాలతో, పని చేయని మందులతో, పలకని ధరలతో విసిగిపోయిన రైతులకు ఫ్యాక్టరీలో ఉద్యోగం బహుభద్రమైన ప్రత్యామ్నాయంగా తోస్తుంది. ఆ ఆకర్షణ కారణంగా వారు విచక్షణ కోల్పోయి ప్రభుత్వ ప్రతిపాదనకు అనాలోచితంగా సమ్మతిస్తారని ప్రభుత్వం ఆశ. ఇది దుర్మార్గమైన ఆలోచన. ఎందుకంటే ప్రత్యేక ఆర్థిక మండలుల విషయంలో ప్రభుత్వం ఏం చేయవచ్చు, ఏం చేయకూడదు అనేది ఎస్.ఇ.జడ్ చట్టానికి లోబడి ఉంటుంది. ఆ చట్టంలో ఎక్కడా కూడ ఎస్.ఇ.జడ్‌లో నెలకొల్పబోయే కంపెనీ ఎవరికి ఉద్యోగాలివ్వాలో ఆదేశించే అధికారం ప్రభుత్వానికి లేదు. ఒకవేళ రేపు అటువంటి అధికారాన్ని ప్రభుత్వానికి కల్పించే సవరణ చేసినా అది రాజ్యాంగ విరుద్ధం అని న్యాయస్థానాలు ప్రకటించవన్న నమ్మకం లేదు. పోనీ అటువంటి చట్ట సవరణ చేస్తామన్న ప్రకటనైనా మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం చేస్తుందా? ఎస్.ఇ.జడ్‌లలో కంపెనీలు పెట్టే వాళ్ళకు ఒక దాని తరువాత ఒకటి రాయితీలు ఇవ్వడమే ప్రభుత్వ విధానంగా ఉంది తప్ప వాళ్ళ మీద ఏ ఆంక్షా పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. పెట్టుబడుల కోసం అంతా దేబిరిస్తున్నారు. అటువంటప్పుడు చేయబోని సాహసాన్ని హామీగా చూపించడం ఎందుకు? ఒకవేళ ఏ చట్టమూ చేయకుండా కేవలం పెద్దమనుషుల ఒప్పందంగా ఆ కంపెనీల యాజమాన్యాలను ఒప్పించినా 'అర్హతను బట్టి' అన్న షరతు ఉద్యోగాల హామీకి తప్పకుండా ఉంటుంది. ఆ కంపెనీలు ఎగుమతులు చేయాలి కాబట్టి, వాటి సాంకేతిక ప్రక్రియలు అత్యాధునికంగా ఉండే అవకాశమే ఎక్కువ కాబట్టి, ఆ 'అర్హత' సత్యవేడు లాంటి చోట్ల చాలా తక్కువ మందికే ఉండబోతుంది. విశాఖపట్నం స్టీల్ ప్లాంటు, రామగుండం థర్మల్ ప్లాంటుల నిర్వాసితులకు 'అర్హతను బట్టి కుటుంబానికొక ఉద్యోగం ఇస్తామన్న హామీ లోగడ కూడ ఇచ్చారు. దాని గతేమైందో, రెండు మూడు దశాబ్దాలుగా ఎంతమంది నిర్వాసితులు హైకోర్టులో కేసు మీద కేసు వేసి ఉద్యోగం కోసం అడుక్కుంటున్నారో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తే తెలుస్తుంది.

### సత్యవేడు - వరదయ్యపాలెం ఎస్.ఇ.జడ్ కోసం
### భూములు సేకరిస్తున్న గ్రామాల వివరాలు

| వ.సం. | గ్రామం పేరు | సేకరిస్తున్న రైతువారీ భూమి | సేకరిస్తున్న ప్రభుత్వ భూమి (డి-ఫారం పట్టా భూమిని కలుపుకొని) ఎకరాలలో |
|---|---|---|---|
| **సత్యవేడు మండలం** | | | |
| 1. | పెద్ద ఈటిపాకం | 663 | 191.00 |
| 2. | రాళ్ళకుప్పం | 270 | 63.55 |
| 3. | మల్లావారిపాలెం | 1077.97 | 138.20 |
| 4. | ఇరుగుళం | 1044.14 | 228.36 |
| 5. | గొల్లావారిపాలెం | 146.68 | 41.51 |
| 6. | చెంగబాకం | 89.43 | 28.14 |
| 7. | అప్పాయపాలెం | 71.96 | 23.40 |
| 8. | ఆరూరు | 783.33 | - |
| 9. | కొల్లాడం | 525.23 | 90.25 |
| 10. | చెరివి | 1008.29 | 504.00 |
| 11. | మాదన్నపాలెం | 33.97 | - |
| | **మొత్తం** | **5714.00** | **1308.41** |
| **వరదయ్యపాలెం మండలం** | | | |
| 1. | చెదుల్లపాకం | 1071.90 | 1488.26 |
| 2. | తొండూరు | 367.37 | 164.70 |
| 3. | చిలమత్తూరు | 1024.56 | 137.15 |
| 4. | మోకూరుపల్లి | 424.72 | 2.35 |
| 5. | సిద్దమ్మ అగ్రహారం | 106.36 | 0.14 |
| | **మొత్తం** | **2994.91** | **1792.60** |

ప్రభుత్వం ప్రజలను ఒప్పించడానికి ఇంకొక అబద్ధం కూడ చెప్తున్నది. ప్రత్యేక ఆర్థిక మండలి కోసం అప్పగించబోయే భూమిలో 'బంజరు' అన్నది చాలా ఉంది. అందులో పేదలకు డి-ఫారం పట్టాలు (అసైన్‌మెంట్) ఇచ్చిన భూమీ ఉంది,

## రెండుసార్లు నిర్వాసితులు

ఒకసారి బలవంతంగా నిర్వాసితులను చేసిన వారిని వారి జీవిత కాలంలో రెండవ సారి చేయకూడదన్న నియమం ఐక్యరాజ్య సమితి రూపొందించిన విస్థాపన (బలవంతంగా తొలగించబడిన ప్రజలను నిర్వాసితులు అంటున్నాం గానీ బలవంతపు తొలగింపు ప్రక్రియకు తెలుగులో ఒక మాట ఏదీ లేదు. హిందీ, బెంగాలీ, ఒరియా భాషలలో విస్థాపన్ అంటున్నారు. స్థాపనకు అభావం విస్థాపన. కాబట్టి డిస్‌ప్లేస్‌మెంట్ అన్న ఇంగ్లీష్ పదానికి అనువాదంగా విస్థాపన అన్న మాట వాడుతున్నాం) నియమాలలో ఒకటి. అటువంటి అంతర్జాతీయ నియమాలలో దేనినీ గౌరవించిన చరిత్ర మన పాలకులకు లేనప్పుడు దీనిని గౌరవించలేదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

వరదయ్యపాలెం మండలంలోని శ్రీహరికోట కాలనీ, తొండూరు సొసైటీ గ్రామాల ప్రజలు 1972లో తమ స్వస్థలమైన నెల్లూరు జిల్లా తీర గ్రామాల నుంచి ఇక్కడికి వచ్చారు. శ్రీహరికోట రాకెట్ కేంద్రం వారిని నిర్వాసితులను చేసింది. శ్రీహరికోట కాలనీలో 114 కుటుంబాలు, తొండూరు సొసైటీలో 160 కుటుంబాలు ఉన్నాయి. దాదాపు సగం మంది దళితులు. గత విస్థాపన అనుభవం నుంచి వీరికి ప్రభుత్వ హామీల విషయంలో విపరీతమైన అనుమానం ఉంది, ఆగ్రహం ఉంది.

ఒక్కొక్క కుటుంబానికీ 5 ఎకరాల సాగుభూమి ఇస్తామని చెప్పి తీసుకొచ్చారు. ఇచ్చింది రెండున్నర ఎకరాలు. అది కూడా విడివిడిగా ఇవ్వలేదు. హరిజన్ డెవలప్‌మెంట్ సొసైటీ పేరిట ఉమ్మడిగా ఇచ్చారు. హైకోర్టులో కేసువేసి విడివిడి పట్టాలు పొందవలసి వచ్చింది. పోనీ అదైనా సాగుభూమి ఇచ్చారా అంటే లేదు. పాముల పుట్టలు నిండిన బంజరు భూమి ఇచ్చారు. దేశ సాంకేతిక ప్రగతికి చిహ్నమైన శ్రీహరికోట ఈ విధంగా ఏర్పాటయిందని అందరూ తెలుసుకోవాలి. నిర్వాసితులే శ్రమ చేసి, ఖర్చు పెట్టుకొని ఆ భూమిని సాగులోకి తెచ్చుకుని బతుకుతున్నారు. ప్రభుత్వం తవ్వించిన బావులు ఎండిపోగా స్వంతగా బావులు తవ్వుకున్నారు. ఆ తరువాత బోర్లు వేసుకున్నారు. ఇళ్ళు ప్రభుత్వం కట్టివ్వకపోతే తామే కట్టుకున్నారు. శ్రీహరికోట రాకెట్ కేంద్రంలోనే ఇంటికొక ఉద్యోగం ఇస్తామన్నారు. అందరికీ కలిపి కూడా ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదు. ఈ రెండు ఊర్ల వాళ్ళే ఎస్.ఇ.జడ్ గురించి ఎక్కువ కోపంగా ఉన్నారు. ప్రభుత్వ హామీల స్వభావం వాళ్ళకర్థమయింది కదా మరి!

ఎవరికీ చట్టపరంగా ఏ హక్కులూ కల్పించని భూమీ ఉంది. కాని ఏది ఎంత అని ప్రభుత్వం ప్రకటించడం లేదు. బహుశా, డి-ఫారం భూములకు నష్టపరిహారం ఇచ్చే ఉద్దేశం లేదు కాబట్టి వాటి గురించి వేరుగా లెక్కలు ప్రకటించనక్కరలేదని ప్రభుత్వం అభిప్రాయం కావచ్చు.

అయితే హామీలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. రైతులకు ఎంత నష్టపరిహారం ఇస్తే డి-ఫారం పట్టాదారులకూ అంత ఇవ్వడం జరుగుతుందని అధికారులు ప్రకటిస్తున్నారు. డి-ఫారం భూములున్న వాళ్ళు నమ్ముతున్నారు కూడ. వాళ్ళకు తెలియనిదేమిటంటే ఒకప్పుడు డి-ఫారం పట్టా భూములను ప్రాజెక్టుల కోసం స్వాధీనం చేసుకున్నప్పుడు ఏ నష్టపరిహారం ఇచ్చేవారు కారు. ఎందుకంటే ఆ పట్టాలోని షరతులలోనే 'ఏదైనా ప్రజావసరం కోసం దీనిని ఏ నష్టపరిహారం ఇవ్వకుండా స్వాధీనం చేసుకోవచ్చు' అని ఉంటుంది. అయితే ఇది అన్యాయమని అందరూ ఆందోళన చేయగా చేయగా రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 1307 జారీ చేసింది. దాని ప్రకారం డి-ఫారం పట్టాదారుకు కూడ భూసేకరణ సందర్భంలో ప్రాథమిక విలువను ప్రభుత్వం నష్టపరిహారంగా ఇస్తుంది. దానిపైన కోర్టుకు పోయే అవకాశం మాత్రం వారికి ఉండదు. ఈ జీవో విచిత్రమైన వ్యాజ్యాలకు దారితీసింది. చివరికి, ఎల్ఎఓ, చేవెళ్ళ వర్సెస్ మేకల పాండు అనే కేసులో ఏడుగురు జడ్జీల హైకోర్టు బెంచి డి-ఫారం పట్టాదారుకు కూడ స్వంత భూమి గల వాళ్ళకు ఇచ్చిన మోతాదులోనే నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు చెప్పింది. 2004లో వెలువడిన ఈ తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఆ సవాలు పెండింగ్‌లో ఉన్న కారణంగా రాష్ట్రంలో ఎక్కడా దానిని అమలు చేయడం లేదు. ఎస్.ఇ.జడ్‌ల దగ్గర మాత్రం ఈ వాస్తవాలన్నీ దాచిపెట్టి సమాన నష్టపరిహారం ఇస్తానని హామీ ఇస్తున్నది.

భూమి మీద యాజమాన్య హక్కులే లేకుండా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భూమి మీద ఆధారపడి వివిధ రూపాలలో జీవనం పొందుతున్న వర్గాల గురించి, భూసేకరణలో వారి ప్రస్తావన ఎక్కడా కనిపించకపోవడాన్ని గురించి మొదట్లో చెప్పాము. రైతుల పొలాలలో పనిచేసే వ్యవసాయ కూలీలు, వివిధ సేవలందించి బతికే చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి తదితర కులాలు బంజరు భూములలోనూ, పచ్చిక బయళ్ళలోనూ పశువులు మేపుకుని బతికే యాదవులు తదితర పశువుల కాపర్లు, తాటి లేక ఈత చెట్ల నుంచి కల్లు తీసి బతికే గీత కార్మికులు, నీటి వనరులలో చేపలు పట్టుకొని బతికే మత్స్యకారులు - వీరు భూసేకరణ ప్రక్రియలో అదృశ్య మానవులు. 2005లో మొట్టమొదటిసారిగా

వీరిని ఎంత పాక్షికంగానైనా చిత్రంలోకి తీసుకొచ్చే జీవో నెం.68ని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. జారీ అయితే చేసింది గానీ దాని అమలుకు తీసుకుంటున్న చర్యలు శూన్యం. అయితే ఈ సంగతి చిత్తూరు కథలో కంటే మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, యాదవులు గణనీయంగా ఉన్న తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాలలో చూడడం ఉచితంగా ఉంటుంది.

తూర్పు గోదావరి ప్రత్యేక ఆర్థిక మండలి గురించి మొదట చూద్దాం. కాకినాడ దగ్గర సహజవాయు నిక్షేపాలు బాగా ఉన్నాయి కాబట్టి ఓ.ఎన్.జి.సి వారికి శుద్ధి కర్మాగారం (రిఫైనరీ) నెలకొల్పడానికి భూమి కావాలంటూ ప్రభుత్వం చర్చ మొదలుపెట్టింది. ఒక్క ఓ.ఎన్.జి.సికే కాక ఇతర ప్రైవేటు రంగ పెట్రోలియం కంపెనీలకు కూడ రిఫైనరీలు నెలకొల్పడానికి భూమి కావాలి కాబట్టి ఇక్కడ ప్రత్యేక ఆర్థిక మండలి నెలకొల్పబోతామన్నారు. మొత్తం 10 వేల ఎకరాల ఎస్.ఇ.జడ్ నెలకొల్పుతాం అన్నారు. తొలుత కాకినాడ రూరల్, సామర్లకోట, పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాలలో నెలకొల్పుతామన్నారు. ఆ భూమిలో వరి పండించే నేలలున్నాయని రైతులూ, సంవత్సరంలో సగం రోజులు పైగా పని దొరుకుతుందని వ్యవసాయ కూలీ సంఘాలూ గొడవ చేశాయి. వాళ్ళ ఆందోళన కన్నా, అది రియల్ ఎస్టేట్ కళ్ళకు బంగారు భూమి కావడం వల్ల బిల్డర్లు ఒత్తిడి పెట్టారనీ, ఆ కారణంగా ప్రభుత్వం తన ప్రణాళిక మార్చుకుందనీ ప్రజలంటారు. ఏమైతేనేం, ప్రత్యేక ఆర్థిక మండలి యు.కొత్తపల్లి, తొండంగి మండలాలలోని తీరప్రాంత గ్రామాలకు మారింది. చెప్పాల్సిన మరొక విషయం ఏమిటంటే ఓ.ఎన్.జి.సి ఈ దశలోనే తనకు కాకినాడ దగ్గర రిఫైనరీ నెలకొల్పే ఉద్దేశం లేదని ప్రకటించింది. అయినప్పటికీ ఎస్.ఇ.జడ్ ప్రయత్నం సాగుతూనే ఉంది.

తొలి ప్రతిపాదనలో సారవంతమైన భూములు ఉన్నాయి కాబట్టి దాని స్థానంలో తీర ప్రాంతంలోని చవిటి నేలలను ఎంపిక చేశామని ప్రభుత్వం వివరణ ఇచ్చుకున్నప్పటికీ, ఇప్పుడు సేకరణ కోసం ప్రతిపాదించినవి కూడ సారహీనమైన నేలలు కావు. వందల ఎకరాల జీడిమామిడి, సరుగుడు, కొబ్బరి, సపోటా, మామిడి తోటలున్న భూములు. సరుగుడు నారు ఇక్కడి నుండే రాష్ట్రమంతటికీ ఎగుమతి అవుతుంది. అర ఎకరంలో నారుపోస్తే 2 లక్షల రూపాయల ఆదాయం వస్తుంది. సరుగుడు తోట నాలుగేళ్ళు పెంచి కలప అమ్మితే ఎకరానికి లక్షా యాభై వేల రూపాయల ఆదాయం వస్తుంది.

మారిన ప్రతిపాదనలలో మొదట యు.కొత్తపల్లి మండలంలోని మూలపేట, పొన్నాడ, రమణక్కపేట, శ్రీరాంపురం పంచాయతీలలోని భూములను సేకరణ

కోసం ప్రతిపాదించారు. అయితే అవి 6000 ఎకరాలు మించడం లేదని ఇంకొంచెం పైకి వెళ్ళి తొండంగి మండలంలో మరొక 4000 ఎకరాలకు కూడ ప్రతిపాదన పెట్టారు. ఇవి సముద్రతీరం నుంచి కొద్దిగా లోపలికి, తీరానికి సమాంతరంగా ఉన్న భూములు. వీటికీ సముద్ర తీరానికీ మధ్య అనేక మత్స్యకారుల గ్రామాలున్నాయి. వారు సముద్రంలోనే కాక, ఇప్పుడు సేకరిస్తున్న భూములలోని ఉప్పుటేర్లలో కూడ చేపల వేట చేస్తారు. ఈ ఉప్పుటేర్లన్నీ ప్రత్యేక ఆర్థిక మండలి నుంచి వెలువడే కాలుష్యానికి బలికావడం ఖాయం. ఆ కాలుష్యం సముద్రంలోకి ప్రవహించి సముద్రాన్నీ కలుషితం చేయడం ఖాయం. ఇది ఊహించి చెబుతున్నది కాదు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ వల్ల దగ్గర్లో ఉన్న సముద్రం కలుషితమై చేపలవేట బాగా దెబ్బతిన్న సంగతి అక్కడి మత్స్యకారులను అడిగితే చెప్తారు. కాబట్టి యు.కొత్తపల్లి, తొండంగి మండలాల మత్స్యకారుల జీవనం బాగా దెబ్బతింటుంది.

6000 చిల్లర ఎకరాల భూసేకరణ కోసం నోటీసులు పొందిన యు.కొత్తపల్లి మండల వ్యవసాయదారులు చట్టాన్ని ఎరిగిన వాళ్ళను సంప్రదించి వివరంగా అభ్యంతరాలు తెలుపగా, వాటికి భూసేకరణ అధికారి ఇచ్చిన జవాబులు చూస్తే ప్రభుత్వం దబాయింపును ఒక భూసేకరణ సాధనంగా ఎంతగా వాడుకుంటున్నదో అర్థం అవుతుంది. నిర్దిష్టమైన ప్రతి ప్రశ్నకూ, ప్రతి అభ్యంతరానికీ 'తగు జాగ్రత్తలు తీసుకుంటాం'. 'చట్టంలో ఎట్లా ఉంటే అట్లా చేస్తాం' అనే పడికట్టు సమాధానాలు ఇవ్వడం, కలెక్టర్ గారు వాటిని స్వీకరించి భూసేకరణ విచారణ (సెక్షన్ 5–ఎ విచారణ) ముగిసినట్టు ప్రకటించడం, జరిగిపోయింది.

ఒక అభ్యంతరాన్ని, దానికిచ్చిన జవాబునూ చూద్దాం.

## అభ్యంతరం

భూసేకరణ కోసం ఎంపిక చేయబడ్డ భూములు బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్నాయి. ఉప్పాడ నుంచి అద్దరిపేట దాకా తీరం 50 కిలోమీటర్ల పొడవు ఉంది. కాలక్రమంలో ఈ తీరం వెంబడి ఉప్పాడ, అమీనాబాద్, రామన్నపాలెం, మూలపేట, కొనపాపపేట, చోడిపల్లిపేట, హుకుంపేట, పెరుమాళ్ళపురం, దానవాయిపేట, ముసలయ్యపేట, ఎల్లయ్యపేట, వేమవరం, అద్దరిపేట అనే గ్రామాలు ఏర్పడ్డాయి. ఇవి శతాబ్దాలుగా ఉన్న గ్రామాలు. సముద్రంలో బతుకుతెరువు కోసం చేపల వేట చేసే మత్స్యకారులు సముద్ర తీరంలో ఆవాసాలు నెలకొల్పిన క్రమంలో ఈ గ్రామాలు ఏర్పడ్డాయి. సముద్ర తీరాన్ని మత్స్యకారులు

తమ పడవలు పెట్టుకోవడానికీ, వలలు ఆరేసుకోవడానికీ, చేపలను బాగుచేసుకోవడానికీ ఒక స్థలంగా వినియోగించుకుంటారు. వారి సంప్రదాయక జీవనం సజావుగా సాగాలంటే సముద్రతీరం మీద వారికి హక్కు అవసరం. ఈ మత్స్యకారులు సముద్రం మీదనేకాక సముద్రం నుంచి లోనికి వచ్చే ఉప్పుటేర్ల మీద కూడ ఆధారపడతారు. అవి సముద్రంలో పోటు వచ్చినప్పుడు మత్స్యకారుల గ్రామాలు మునగకుండా కాపాడతాయి. అంతేకాక వాటిలోనూ వారు చేపలు పట్టుకుంటారు. ఇప్పుడు ప్రత్యేక ఆర్థిక మండలిని ఏర్పాటు చేయడం వారి జీవనాన్ని దెబ్బతీస్తుంది. సముద్రతీరం నుంచి 2 కిలోమీటర్ల లోపల ఏ పరిశ్రమ నెలకొల్పినా పెద్దసంఖ్యలో ఉన్న మత్స్యకారుల జీవనం తీవ్రంగా దెబ్బతింటుంది.

**జవాబు**

ఈ అభ్యంతరానికి భూసేకరణ అధికారి (కాకినాడ ఆర్‌డివో) ఇచ్చిన, జిల్లా కలెక్టర్ (విచారణాధికారి) ఆమోదించిన జవాబిది.

మీరు పేర్కొన్న గ్రామాలలోని మత్స్యకారుల జీవనం దెబ్బతింటుందన్న ఆందోళన నిరాధారమైనది. వాళ్ళ వృత్తి వాళ్ళు కొనసాగించవచ్చు. ఈ విషయాలను ప్రభుత్వ మత్స్యశాఖ పరిశీలిస్తుంది. ఈ ఆందోళన అవాస్తవమైనది. కేవలం భూసేకరణ వల్ల ఏదో నష్టం ఉన్నట్టు చూపించడం కోసం కల్పించింది. ప్రాజెక్టు వల్ల మత్స్యకారుల జీవనం ఏ విధంగానూ దెబ్బతినదు. భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసే ముందు అన్నీ లెక్కలోకి తీసుకున్నాం. వాళ్ళ సంఘాలు ఇచ్చిన ఏ అర్జీ పెండింగ్‌లో లేదు. వాళ్ళు ఏ అధికార్లనైతే కలిశారో ఆ అధికార్లు అన్నిటికీ జవాబు చెప్పేశారు.

ఈ మహాభాగ్యానికి అభ్యంతరాలు అడగడం ఎందుకో, జవాబు చెప్పడం ఎందుకో!

మత్స్యకారుల లాగా యాజమాన్య హక్కు లేకుండా ప్రకృతి మీద ఆధారపడి బతికే వారు కల్లుగీత కార్మికులు. భూసేకరణ జరుగుతున్న రావివారిపోడు, రమణక్కపేట, ముమ్మిడివారిపోడు, కుద్రివారిపాలెం, శ్రీరాంపురం, మూలపేట, దమ్ముువారిపాలెంలలో దాదాపు 1000 దాకా గీత కార్మిక కుటుంబాలున్నాయి. కులవృత్తిగా కల్లుగీసే శెట్టి బలిజలే కాక కొన్ని ఊళ్ళలో దళితులు కూడ ఆ వృత్తి నేర్చుకుని చేస్తున్నారు. వీరి జీవనాధారం యావత్తు పోతుంది. యాదవులు ఈ రెండు మండలాలలోనూ పెద్ద సంఖ్యలో ఉన్నారు. రైతుల అనుమతితో వారి తోటలలో వీరు పశువులు మేపుకుంటారు. యు.కొత్తపల్లి, తొండంగి

## గంగవరం మత్స్యకారులు

జీవో 68 అమలుకోసం కొట్లాడి, చోడిపల్లి రాజు అనే మత్స్యకారుడిని పోలీసు తూటాలకు బలి ఇచ్చి, దాన్ని కొంతమేరకైనా అమలు చేయించుకున్న ఒకే ఒక బాధితుల సమూహం గంగవరం మత్స్యకారులు. విశాఖపట్నం సమీపంలోని పెదగంట్యాడ మండలంలో గంగవరం పోర్టు అనే ప్రైవేటు పోర్టు కడుతున్నారు. దానిని దిబ్బపాలెం అనే తీర గ్రామం వద్ద కడుతున్నారు కాబట్టి ఆ ఒక్క ఊరి భూములు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం గంగవరం పోర్టు కోసం సేకరించింది. అయితే దిబ్బపాలెం తీరాన్ని ఆసరా చేసుకొని చేపల వేటకు పోయే మత్స్యకారులు ఒక్క దిబ్బపాలెం వాళ్ళే కాదు. గంగవరం, జాలరిపల్లిపాలెం, పెదపల్లిపాలెం, చినపల్లిపాలెం గ్రామాల జాలర్లు కూడా దిబ్బపాలెం తీరం నుంచే చేపల వేట చేసేవారు. అయితే గంగవరం పోర్టుకు వాళ్ళ ఊర్లున్న భూములు అక్కరలేదు కాబట్టి వాళ్ళు నిర్వాసితులు కారు. అంటే ప్రాజెక్టు వాళ్ళను అక్కడ నుంచి పొమ్మనదు.

కానీ దిబ్బపాలెం తీరాన్ని తమకు లేకుండా చేస్తే వాళ్ళు వెళ్ళిపోక తప్పదు. జీవో 68 పరిభాషలో వాళ్ళు కూడా ప్రాజెక్టు బాధితులే. ఆ జీవోలోని సహాయ పునరావాస ప్రణాళికను వారికి కూడా అందించవలసి ఉంది. అయితే ప్రభుత్వం ఎప్పటిలాగే 'దిబ్బపాలెం గ్రామాన్ని మాత్రమే తొలగిస్తున్నాము కాబట్టి వారు మాత్రమే మా దృష్టిలో నిర్వాసితులు. ఏమిచ్చినా వారికే ఇస్తాం. మిమ్మల్ని ఎక్కడికీ పొమ్మనలేదు కాబట్టి మీరు మీ ఊర్లలోనే హాయిగా బతకొచ్చు' అంది. అయితే మిగిలిన నాలుగు ఊర్ల మత్స్యకారులు ఆందోళనకు దిగి హైకోర్టులో కేసు వేయగా అధికారులే వెనక్కి తగ్గి వారికి కూడా పునరావాస పథకాన్ని ఒక మేరకు వర్తింపజేశారు. అప్పికొండ అనే ప్రత్యామ్నాయ స్థలంలో చేపల వేట చేసుకోవడానికి జెట్టీ కట్టిస్తామనీ, గంగవరం నుంచి అక్కడి దాకా రోడ్డు వేస్తామనీ, పడవలను అప్పికొండకు తరలించడానికయ్యే ఖర్చు ఇస్తామనీ ఒప్పుకున్నారు. అప్పికొండ అనేది చేపల వేటకు అంత అనుకూలమైన చోటు కాదనీ, గంగవరంలో ఉంటూ ప్రభుత్వ ఉద్యోగిలాగా బస్సెక్కి అప్పికొండకు పోయి చేపలు పట్టుకొని రావడం కష్టమనీ, మత్స్యకారులందరినీ బాధితులుగా గుర్తించకుండా మత్స్యశాఖ గుర్తింపు కార్డులిచ్చిన వారిని మాత్రమే గుర్తించడం అన్యాయమనీ, కట్టిస్తామన్న జెట్టీ కట్టే దాఖలాలు లేవనీ గంగవరం జాలర్లు అసంతృప్తిగా ఉన్నప్పటికీ పునరావాస హక్కుకు గుర్తింపు సాధించిన ఘనత వారికే దక్కింది.

మండలాలలో 15 వేల యాదవ కుటుంబాలు ఉన్నాయని అంటారు. రైతల భూములు పోతే వీరి జీవనం కూడ తీవ్రంగా దెబ్బతింటుంది.

మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, యాదవులు, వ్యవసాయ కూలీలు – వీరందరికీ సామాన్యంగా ఉండే లక్షణం ఏమిటంటే ప్రభుత్వం సేకరించే భూమి మీద వీరికి యాజమాన్య హక్కు లేకున్నా, ఆ భూసేకరణ వీరి జీవనాన్ని గణనీయంగా దెబ్బతీస్తుంది. ఒకప్పుడు అటువంటి ప్రజలకు ఏ రకమైన నష్టపరిహారం లభించేది కాదు. కానీ ఆందోళన చేయగా చేయగా వారికి కూడ నగదు రూపంలో కొంత నష్టపరిహారం లభించే అవకాశం ఇప్పుడు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం 2005లో జీవో నెం. 68 అనే తాఖీదు జారీ చేసింది. దాని ప్రకారం ప్రాజెక్టు నిర్వాసితులనే కాక ప్రాజెక్టు బాధితులను కూడ గుర్తించాలి. వారి జీవన స్థితిగతుల గురించి సామాజిక ఆర్థిక సర్వే జరపాలి. ప్రత్యేకించి, సగటున వారు ఎంత దైనందిన ఆదాయం పొందుతున్నారో అంచనా వేయాలి. ఆ ప్రాతిపదికన వారికి నష్టపరిహారం ఇవ్వాలి. కానీ రాష్ట్రంలో ఎక్కడా జీవో 68 అమలుకు కావలసిన ప్రాథమిక సర్వే కూడ జరపడం లేదు. అది జరపకుండా ప్రాజెక్టు కట్టేస్తే, రేపు ప్రాజెక్టు బాధితులు మా సంగతి ఏమిటని అడిగే స్థితిలో కూడ ఉండకపోవచ్చు. తాము బాధితులమని రుజువు చేసుకోవడానికి వారి వద్ద ఏం ఆధారాలుంటాయి? భూసేకరణ జరగక ముందే వారికి సంబంధించిన సామాజిక ఆర్థిక సర్వే జరిపినట్టయితే గ్రామం ఇంకా ఉంటుంది, గ్రామస్తులుంటారు, నిజమో అబద్ధమో చెప్తారు. అంతా అయిపోయిన తరువాత ఏం ఆధారం మిగులుతుంది?

కాకినాడ ఎస్.ఇ.జడ్ గురించి ఇంకొక రెండు విషయాలు చెప్పాలి. అది 'పోర్టు ఆధారిత ప్రత్యేక ఆర్థిక మండలి. అంటే ఆ ఎస్.ఇ.జడ్ నుంచి జరిగే ఎగుమతులకు కాకినాడ పోర్టు కీలకం. కానీ కాకినాడ పోర్టు చాలా చిన్నది. అందువల్ల దానిని పెద్దది చేసే కార్యక్రమం కూడ ఎస్.ఇ.జడ్ స్థాపనతో పాటు చేపట్టారు. కాకినాడ సీపోర్టు లిమిటెడ్ ఆధ్వర్యంలోని పోర్టులో ప్రస్తుతం కేవలం 4 బెర్తులు ఉన్నాయి. వాటిని 25కు పెంచే కాకినాడ డీప్‌వాటర్ పోర్ట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు.

దీనివల్ల ఈ తీరం వెంబడి చేపల వేట చేసుకొని బతుకుతున్న మత్స్యకారుల జీవనం దెబ్బ తింటుంది. 500 ఇళ్ళున్న హార్బర్‌పేట అనే మత్స్యకారుల గ్రామం తొలగిపోనుంది. అయితే వీరికి సముద్రం మీద పట్టా లేకపోవడమే కాక, ఇళ్ళ స్థలాలకూ పట్టాలు లేని కారణంగా భూసేకరణ చట్టానికి ఈ ప్రజలు లేనట్టే. వాళ్ళకు కనీసం నోటీసు ఇవ్వకుండా అదనపు బెర్తులు ఒక దాని తరువాత ఒకటి కట్టుకుంటూ పోతున్నారు. హార్బర్‌పేట వాసులే కాక ఇతర మత్స్యకారులు కూడ

– మొత్తం దాదాపు 30 వేల మంది – ఈ తీరం వెంబడి చేపలు పట్టుకొని బతుకుతున్నారు. వారు ఊర్లు ఖాళీ చేయనక్కర లేదు గానీ చేపల వేట ఇక అక్కడ సాగదు.

ఈ కుటుంబాలలో మగవాళ్ళు పడవలలో సముద్రం మీదికి పోయి చేపలు, పీతలు తెస్తారు. ఒడ్డు మీదనే వాటిని వేలం వేస్తారు. అదే గ్రామానికి చెందిన స్త్రీలు పాడుకొని కొనుక్కొని పోయి కాకినాడ మార్కెట్‌లో అమ్ముకొని వస్తారు. వేట బాగా జరిగిన రోజున భార్యా, భర్త కలిసి 200 రూపాయల పైనే సంపాదించగలరు. పెద్దగా చదువులు లేవు కాబట్టి ఉద్యోగాలు చేస్తున్న వారు లేరు. రేపు డీప్ వాటర్ పోర్ట్ ప్రాజెక్టు అమలైతే ఈ 30 వేల జనాభా దిక్కులేని వారవుతారు. జీవో 68 ప్రకారం తమకు నష్టపరిహారం ఇవ్వాలన్న ఆందోళన ఇప్పుడిప్పుడే మొదలుపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం గానీ, జిల్లా యంత్రాంగం గానీ స్పందించడం లేదు. సకాలంలో సామాజిక ఆర్థిక సర్వే జరిపించుకోలేకపోతే 'మీరక్కడ చేపలు పట్టుకొని బతికారన్న రుజువేమిటి?' అన్న ప్రశ్న వాళ్ళను వెక్కిరించగలదు.

నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టు నిర్మాణంలో కూడ మత్స్యకారులు ఇదే రకమైన సమస్య ఎదుర్కొంటున్నారు. అక్కడ రాష్ట్రంలో ఎక్కడా లేనంత భారీ విద్యుదుత్పత్తి కేంద్రం వెలుస్తున్నది. ఒకటి 4000 మెగావాట్లు, ఇంకొకటి 1600 మెగావాట్లు ఉత్పత్తి చేసే రెండు ప్లాంట్లు రానున్నాయి. రెండూ థర్మల్ ప్లాంట్లే కాబట్టి బూడిద దండిగా వస్తుంది. ఇదంతా సముద్రంలోకి పోతుందనడంలో అనుమానం లేదు. అది ఆ తీర ప్రాంతంలో చేపల వేటను బాగా దెబ్బతీస్తుంది.

దీనికి అనుబంధంగా కృష్ణపట్నం రేవును కూడ పెద్దది చేస్తున్నారు. ఇప్పటిదాకా అక్కడ 'బెర్త్'లు లేవు. ఓడలు దూరాన ఆగి పడవల ద్వారా సరుకులు దించి పోతున్నాయి. ఇప్పుడు మూడు బెర్త్‌లు నిర్మిస్తున్నారు. రేవు రాక ముందు అక్కడ జెట్టిపాలెం అనే మత్స్యకారుల గ్రామం ఉండేది. వారిని అక్కడి నుంచి తొలగించి, తీరం నుంచి లోపలికి పంపించారు. స్థానిక ఎంఎల్ఏ వారికి చేసిందేమీ లేకున్నా వారు వేసుకున్న గుడిసెలకు ఎ.పి.రెడ్డినగర్ అని పేరు పెట్టుకున్నారు. ఇప్పుడు 3 బెర్త్‌లు వచ్చి కృష్ణపట్నం రేవు పెద్దదైతే దానికి రైల్వే లైను, గోడౌన్ అనుబంధంగా వస్తాయి కాబట్టి మత్స్యకారులు ఎ.పి.రెడ్డి నగర్‌నూ కృష్ణపట్నం తీరాన్ని కూడ వదిలిపెట్టి పోవాలి.

కాకినాడ ఎస్.ఇ.జడ్‌కు తిరిగి వద్దాం. యాజమాన్య హక్కు గల రైతులకు సైతం తక్కువ నష్టపరిహారం ఇచ్చి తప్పించుకోవడానికి ప్రభుత్వం పెద్ద నాటకమే

ఆడుతున్నది. ఈ ఎస్.ఇ.జడ్ డెవలపర్ కాకినాడ స్పెషల్ ఎకనమిక్ జోన్ లిమిటెడ్ అనే కంపెనీ. దాని తరఫున హైదరాబాద్‌లో కర్నాటి వెంకటేశ్వరరావు అనే డైరెక్టర్ ఉన్నాడు. అతను ప్రభుత్వం ప్రమేయం లేకుండా, ప్రతిపాదిత ఎస్.ఇ.జడ్ భూభాగంలోని భూములు అమ్ముకోవడానికి సిద్ధంగా ఉన్న రైతులతో నేరుగా బేరం పెట్టి ఎకరానికి 3 లక్షలిచ్చి కొనేస్తున్నాడు. 10 వేల ఎకరాలలో 4 వేల ఎకరాలు ఇప్పటికే కొనేశాడని అంచనా. కొనుగోలు పత్రంలో 'ఈ భూమి నుంచి నాకు ఆదాయం రావడం లేదు కాబట్టి అమ్మేస్తున్నాను' అని రాయించుకుంటున్నాడు. రేపు వేరే ఎవరైనా ఇవి సారవంతమైన భూములు కాబట్టి, ఎక్కువ ధర కావాలని తగాదా పెట్టుకుంటే చూపించడానికి కాబోలు.

ప్రభుత్వం ఏం చేస్తున్నదంటే తక్కిన వాళ్ళను ఈ అమ్మకాలు చూపించి బెదిరిస్తున్నది. 'మీరు కూడ వాళ్ళలాగ 3 లక్షలకు కర్నాటి వెంకటేశ్వరరావుకు అమ్మేయండి. లేకపోతే ప్రభుత్వ రేటు ప్రకారం ఎకరానికి ఒక లక్షో, లక్షన్నరో ఇస్తాం. ఆపైన పదేళ్ళో, పదిహేనేళ్ళో కోర్టుల చుట్టూ తిరగండి' అంటున్నది. కోర్టులంటే సహజంగా ఉండే భయంతో డెవలపర్‌కు 3 లక్షలకు అమ్ముకొని పోతారని ప్రభుత్వ ధీమా. నిజానికి రాష్ట్రమంతటా పెరుగుతున్నట్లే ఇక్కడ కూడ భూముల ధరలు పెరుగుతున్నాయి. ప్రతిపాదిత ఎస్.ఇ.జడ్ ప్రాంతాన్ని దాటి పైకిపోతే ఇటువంటి భూములే 8 లేక 10 లక్షలు పలుకుతున్నాయి. అయినప్పటికీ ఎవరికి వాళ్ళు విడివిడిగా నిర్ణయం తీసుకొనేటట్టయితే అధిక భాగం 3 లక్షలకు అమ్మేసుకోవడం, మిగిలిన వాళ్ళు గత్యంతరం లేక వారిని అనుసరించడం జరగొచ్చు. ప్రభుత్వమూ, కర్నాటి వెంకటేశ్వరరావుగారూ కూడ ఆ దినం కోసమే ఎదురు చూస్తున్నట్టున్నారు.

రాష్ట్రంలోని అతి పెద్ద ప్రత్యేక ఆర్థిక మండలి విశాఖపట్నం జిల్లాలో రానుంది. గాజువాక నుంచి యలమంచిలికి పోయే రహదారికీ, బంగాళాఖాతానికీ మధ్యన అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలలో మొత్తం 19,200 ఎకరాలలో దీనిని ప్రతిపాదించారు. మొదటి దఫా అచ్యుతాపురం మండలంలో 9,200 ఎకరాలు, రెండవ దఫా రెండు మండలాలలోను కలిపి 10,000 ఎకరాలు తీసుకుంటున్నారు. ప్రత్యేక ఆర్థిక మండలుల కోసం సారవంతమైన నేలలు తీసుకోము అనే బుకాయింపు వింటూనే ఉన్నాము కాబట్టి, రాంబిల్లి మండలాన్ని విశాఖపట్నం జిల్లా కోనసీమ అని అంటారని చెప్పుకోవాలి.

అచ్యుతాపురం మండలంలో సేకరిస్తున్న భూమిలో భాభా అణుపరిశోధన కేంద్రానికి (బార్క్) అప్పగిస్తున్న 3,829 ఎకరాల భూమి స్థానిక ప్రజలను ఎక్కువ

ఆందోళనకు గురిచేస్తున్నది. ఇప్పటికే చెప్పాడ, జోగన్నపేట, దోసూరు, జంగులూరు, మడంతూరు గ్రామాలలో 'బార్క్' కోసం 2,115 ఎకరాలు సేకరించారు. ఇంకా తింతిడి, దోసూరు, చిప్పాడ, జోగన్నపాలెంలలో 1,714 ఎకరాలు సేకరించనున్నారు. ఇది కేవలం పరిశోధనా కేంద్రం కోసమేనని పాలకులు దబాయిస్తున్నా, ఇక్కడ అణువిద్యుత్ కేంద్రం నెలకొల్పబోతున్నారన్న అనుమానం ప్రజలలో ఉంది. కేవలం పరిశోధనా కేంద్రానికి అంత భూమి ఎందుకు అవసరం ఉంటుంది? దేశంలో కొత్తగా నెలకొల్పబోయే విద్యుదుత్పత్తి కేంద్రాలలో అణు కేంద్రాలకు ప్రాముఖ్యం ఇవ్వనున్నట్టు ప్రధాన మంత్రి అనేకసార్లు ప్రకటించి ఉన్నాడు. ఇప్పటికి 15 ఉన్నాయనీ ఇంకొక 19 నిర్మించే ఆలోచన ఉన్నదనీ అంటున్నారు. అచ్యుతాపురంలో 'బార్క్' కోసం అని కేటాయించిన భూమి వాటిలో ఒక దానికోసమన్న అనుమానం సహేతుకమైనదే.

ఒక వేళ అచ్యుతాపురం భూములలో నెలకొల్పబోయేది అణుపరిశోధనా కేంద్రమే అయినా అణుకాలుష్య ప్రమాదం ఉంటుంది. అందువల్ల కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి కావాలి. దానికి ముందు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ పర్యావరణ ప్రభావాన్ని గురించి, కాలుష్య నియంత్రణ కోసం బార్క్ నెలకొల్పబోయే వ్యవస్థ గురించి బహిరంగ విచారణ జరగాలి. దానికి ముందు బార్క్ వారు తాము చేపట్టబోయే కార్యకలాపాలేవో, వాటి పర్యవసానంగా ఉండగల అణుకాలుష్య ప్రమాదం ఎటువంటిదో, దాని నియంత్రణ కోసం తాము చేపట్టబోయే చర్యలెట్లాంటివో తెలిపే నివేదికలు రూపొందించి స్థానిక ప్రజలకు అందుబాట్లో ఉంచాలి. ఇవేవీ జరగకుండా భూసేకరణ చేసేయడంలోని ఆంతర్యం ఏమిటి? అంతా మా వాళ్ళే కాబట్టి అన్ని సమ్మతులూ అనుమతులూ లభించక చస్తాయా అన్న ధీమా కాక మరేమిటి?

పైన చెప్పినట్టు ఈ 19,200 ఎకరాల భూమి చాలా ఫలవంతమైనది. జీడితోటలు, సరుగుడు తోటలు, కొబ్బరి తోటలు, వరిచేలు, చెరుకు, మిర్చి తోటలు, కాయగూరల తోటలు, సమృద్ధి అయిన పాడి, చేపల వేట ఇక్కడ ప్రజలకు పలు విధాల జీవనాధారాన్ని కల్పిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిపాదించిన నష్టపరిహారం తోటలకైతే ఎకరానికి 2.95 లక్షలు, ఆపైన జీడి చెట్టు ఒకటికి రూ. 200 చిల్లర, కొబ్బరి చెట్టు ఒకటికి రూ. 1,000 చిల్లర, సరుగుడు చెట్టుకు మాత్రం శూన్యం. అంటే ఎకరానికి సగటున 60 చెట్లు వేసుకుంటే ఒక ఎకరా తోటకు మూడు నుంచి మూడున్నర లక్షల నష్టపరిహారం (గరిష్ఠం నాలుగు లక్షలు)

లభించగలదు. కానీ రాంబిల్లి మండలంలో ఎకరం కొబ్బరి తోట 15 లక్షలకు పోతుంది. జీడితోట 13 లక్షలకు పోతుంది.

నిరుడు అచ్యుతాపురం మండలంలో భూసేకరణ జరిగిపోయిన గ్రామాల వారు నష్టపరిహారంతో మళ్ళీ అంత భూమి కొనడానికి దూరాన ఉన్న చోడవరం, మాడుగుల పోవలసి వచ్చింది. ఇప్పుడు అక్కడ కూడ దొరకదు. ఇంకా పైకి పోతే ఏజెన్సీ మొదలవుతుంది. కాబట్టి అంత భూమి ఇక జిల్లాలో ఎక్కడా కొనలేరు.

కల్లుగీసి బతికే శెట్టిబలిజ, యాత కులాలు, పశువులు పోషించుకొని బతికే యాదవులు, చేపలు పట్టుకొని బతికే మత్స్యకారులు, చేలలో కూలిచేసే దళితులు – వీళ్ళంతా భూమిపైన యాజమాన్య హక్కు లేకపోయినా ఏదో ఒక రూపంలో భూమి లేక సముద్రం నుంచి జీవనం పొందుతున్నారు. వాళ్ళకు కనీసం జీవో నెం. 68 కింద నష్టపరిహారమైనా ఇవ్వాలి. కానీ దానికి కావలసిన సామాజిక ఆర్థిక సర్వే జరిగితే కదా?

నెల్లూరు జిల్లా కృష్ణపట్నం రేవు గురించి పైన చెప్పాము. అక్కడ తీరాన్ని ఆనుకొని దాదాపు 600 ఎకరాలలో ఉప్పు కొటార్లు ఉన్నాయి. సంవత్సరంలో దాదాపు 7, 8 నెలలు ఏదో ఒక పని దొరుకుతుంది. దినకూలీ 50 రూపాయలిస్తారు కాబట్టి పొలాలలో పని దొరికితే ఉప్పుకొటార్లకు రారు గానీ వ్యవసాయ కూలి దొరకని వారు, లేదా దొరకని సీజన్లలోనూ ఇక్కడికే వచ్చి పని చేసుకుంటారు. పెరుగుతున్న కృష్ణపట్నం రేవు వల్ల ఈ కొటార్లు మూతపడతాయి. వాటి యజమాన్లు లీజుదార్లే కాబట్టి లీజు గడువు పూర్తి కానట్టయితే నష్టపరిహారం పొందుతారు గానీ, వందల మందికి పని చేసుకునే అవకాశం మాత్రం శాశ్వతంగా పోతుంది. వీరి విషయం కూడ జీవో 68 కింద సర్వే జరిపి తగిన నష్టపరిహారం ఇయ్యవలసి ఉందిగానీ, మళ్ళీ అదే ప్రశ్న వేసుకోవాలి. అసలు సర్వే జరిపితే కదా?

## రంగారెడ్డి జిల్లా

రంగారెడ్డి జిల్లాలో పెద్ద ప్రత్యేక ఆర్థిక మండలి ఏదీ లేదుగానీ చిన్నవి ఉన్నాయి. వాటికింద, ఔటర్ రింగ్‌రోడ్డు వంటి వెర్రి ప్రాజెక్టుల కింద అసైన్డ్ భూముల వేలం పాట రూపకంగా, బ్రోకర్ల మోసం కారణంగా, ధనవంతులకిచ్చే ప్రభుత్వ భూముల లీజు రూపకంగా చిన్న రైతులు, ముఖ్యంగా డి–ఫారం పట్టా ఉన్న భూమిలేని పేదలు, వివిధ వృత్తుల వారూ విపరీతంగా నష్టపోతున్నారు. భూములే కాక కష్టపడి కట్టుకున్న నివాసాలు కూడ బుల్‌డోజర్లకు చవకగా

అప్పగించి ఎక్కడ గుడిసె వేసుకునే జాగా దొరుకుతుందా అని వెతుక్కుంటున్నారు. హైదరాబాద్ పరిసరాల 'అభివృద్ధి' రంగారెడ్డి జిల్లా బడుగు వర్గాల శ్రేయస్సును, జీవనాన్ని ఎంతగా బలి తీసుకోబోయేదీ అంచనా వేయడం కూడ కష్టం. ఎందుకంటే ఇక్కడ దాడి ఒక రూపంలో లేదు.

ఔటర్ రింగు రోడ్డు కథలు పత్రికలలో చాలా వచ్చాయి. మొదట్లో చెప్పినట్టు ఎవరు లాభపడుతున్నారు, ఎంతగా లాభపడుతున్నారు అనేదే పత్రికల కథనాల సారాంశం. అయినప్పటికీ ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న భూమి కబ్జా ప్రక్రియ గురించి కొంత సమాచారం ఆ కథనాలలో దొరుకుతుంది. దానికి బాధితులకు సంబంధించిన సమాచారాన్ని కూడ జతచేస్తే ఒక సమగ్ర చిత్రం లభిస్తుంది. రాజేంద్రనగర్ మండలం కోకాపేటలో 'హుడా' వారి డబ్బు దాహంవల్ల ఎప్పుడో పట్టాలు దక్కవలసిన భూమి చేజారిపోయిన 36 మాదిగ కుటుంబాల గురించి ఈ రిపోర్టు మొదట్లోనే చెప్పాము.

రంగారెడ్డి జిల్లాలో భూమి కబ్జాల ప్రక్రియ తెలుగుదేశం పాలనలో మొదలై కాంగ్రెస్ పాలనలో కొనసాగుతున్నదని మొదట చెప్పాలి. ఎందుకంటే కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న వ్యవహారాల గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్న రెండు దినపత్రికల యాజమాన్యాలూ చంద్రబాబునాయుడు అభిమానులే.

ఔటర్ రింగు రోడ్డు అని పేరు పెట్టినది హైదరాబాద్ నగరాన్ని బైపాస్ చేసి బెంగుళూరు బొంబాయి రహదార్లను విజయవాడకు, ఉత్తర తెలంగాణ ద్వారా మధ్య భారతానికీ, ఖమ్మం ద్వారా ఉత్తరాంధ్రకూ కలిపే 500 అడుగుల వెడల్పున్న రోడ్డుకు. ఇది హైదరాబాద్ చుట్టూ ఉంటుంది గానీ ప్రస్తుతం భూసేకరణ, రోడ్డు నిర్మాణం జరుగుతున్నది శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని గచ్చిబౌలి ద్వారా బొంబాయి రహదారికి కలిపే భాగం మాత్రమే. ఈ మేరకు – శంషాబాద్ నుంచి గచ్చిబౌలికి – విశాలమైన రోడ్డు వేసే ప్రతిపాదన తెలుగుదేశం పాలనలోనే మొదలయింది. అప్పుడే ఆ బూచిని చూపించి భూములు చవగ్గా కొనుక్కోవడం మొదలయింది. నార్సింగి (రాజేంద్ర నగర్ మండలం)లో రోడ్డు వేయబోతారని దిమ్మెలు పాతిన భూమి ఒకప్పటి ఈనాం భూమి. చాలామంది దళితులు, ముస్లింలు ఆ భూమిని సాగు చేసుకుంటున్నారు. ఈనాంలు రద్దయిన తరువాత వారు సెటిల్‌మెంట్ పట్టాల కోసం అర్జీ పెట్టుకుని పొంది ఉంటే వారికి యాజమాన్య హక్కు ఉండేది కానీ 'ఎప్పటి నుంచో మనమే చేసుకుంటున్నాము కదా' అన్న భావనతో ఆ భూమి చేసుకుంటున్న వాళ్ళు చాలావరకు ఆ ప్రయత్నం చేయలేదు.

అస్పష్టమైన వారి యాజమాన్య హక్కు ముప్పా వెంకయ్య చౌదరి అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఉపయోగపడింది. 'మీ భూములు పోతాయి, మీరు కోర్టులో కొట్లాడి నష్టపరిహారం తెచ్చుకోలేరు కాబట్టి నాకు అమ్మేయండి. ఆ సంగతేదో నేను చూసుకుంటాను' అని వారిని భయపెట్టి ఎకరానికి ఒక లక్ష, రెండు లక్షలు ఇచ్చి దిమ్మెలు పాతిన భూములు కొనేశాడు. వంద ఎకరాలు కొన్నాడని గ్రామస్తులంటారు. ఇది తెలుగుదేశం హయాంలోనే జరిగింది.

ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదన వచ్చింది. తొలుత రూపొందించిన శంషాబాద్ – గచ్చిబౌలి రోడ్డు ఔటర్ రింగు రోడ్డులో భాగం అయింది. పైన చెప్పినట్టు ఔటర్ రింగ్ రోడ్డు పని జరుగుతున్నది ఇక్కడే. అయితే మొదట్లో దిమ్మెలు పెట్టిన చోట కాక అలైన్‌మెంట్ పక్కకు జరిగింది. పక్కన అప్పటికే ముప్పా వెంకయ్య చౌదరి గారు ఇంకొక 25 ఎకరాల దాకా భూమి కొని ఉన్నాడు. ఈ భూమి కొన్నదీ దళితుల నుంచి, ముస్లింల నుంచే. వీరికి చూపించిన బూచి కూడ అదే – ఇవి ఈనాం భూములు, మీ యాజమాన్య హక్కు అస్పష్టమైనది, నాకమ్మేస్తే నేనన్నీ చూసుకుంటాను అని. ఇట్లా ఒకసారి కాదు ఏడుసార్లు ఔటర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మారింది. అలా ముప్పా వెంకయ్య చౌదరి గారి ముప్పాహోమ్స్ ప్రైవేటు లిమిటెడ్ చేతిలోకి చాలా భూమి పోయింది. చవగ్గా ఆ భూమిని కోల్పోయిన వారిలో ఆ భూమిని ఎప్పటి నుంచో స్పష్టాస్పష్టమైన హక్కుతో చేసుకుంటున్న వారు చాలామందే ఉన్నారు. స్వాతంత్ర్య సమర యోధులుగా భూములు పొంది, భూసేకరణ తలనొప్పి మనమెక్కడ భరిస్తామని భయపడి ముప్పా వారికి అమ్మివేసిన పెద్దలూ చాలామంది ఉన్నారు. ముప్పా వారు ఇచ్చిన డబ్బులతో వారు పొలాలు కాదు కదా ఇళ్ళ స్థలాలు కూడ రాజేంద్రనగర్ మండల గ్రామాలలో ఎక్కడా కొనలేరు. వేరే ఏ రకంగానూ జీవనం పొందే అవకాశం వారిలో ఎక్కువమందికి లేదు.

ఈనాం భూమి లాంటిదే జాగీరు భూమి. రాజేంద్రనగర్ మండలం మణికొండలో జాగీరు భూములున్నాయి. నానక్‌రాంగూడకు చెందిన వారు దాదాపు 80 మంది ఇందులో 252 ఎకరాలు సాగు చేసుకుంటున్నారు. 1917లో అప్పటి జాగీర్దారు వాళ్ళకు ఇచ్చాడు. జాగీర్లు రద్దయిన తరువాత వాళ్ళు సెటిల్‌మెంట్ పట్టాలు పొందే ప్రయత్నం చేయలేదు. తాతల కాలం నుంచి మా భూమే కదా అనుకున్నారు. పైగా వాళ్ళు హిందీ మాట్లాడే లోధాలు. స్థానిక పరిస్థితులతో పరిచయం తక్కువ, సామాజిక సంబంధాలు తక్కువ. చంద్రబాబునాయుడు పాలనలో ఈ భూములన్నీ ఏ నష్టపరిహారం ఇవ్వకుండా

ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు అప్పగించడం, ఇన్ఫోసిస్, విప్రో, పొలారిస్ మొదలైన సాఫ్ట్‌వేర్ కంపెనీలకు దత్తత చేయడం జరిగిపోయింది. రైతులు హైకోర్టులో కేసు వేశారు గానీ ఎంత ఫలితం వస్తుందో తెలీదు.

గచ్చిబౌలి నుండి లింగంపల్లి వెళ్ళే రహదారిపైన ఉంది నానక్‌రాంగూడ. రహదారి ఊరిపక్క నుంచి పోతుంది. అయితే ఆ గ్రామాన్ని రహదారితో కలుపుతూ ఒక రోడ్డు గ్రామంలోకి వచ్చి, తిరిగి అవతలి వైపు రహదారిని కలుస్తుంది. ఈ రహదారిని చంద్రబాబునాయుడు హయాంలో వెడల్పు చేశారు. నానక్‌రాంగూడ పక్కన ఉన్న భాగాన్ని వెడల్పు చేస్తే విజయనిర్మల అనే తెలుగు సినీనటికి సంబంధించిన భూమిలో నుంచి పోతుంది కాబట్టి దాని బదులు గ్రామంలో నుంచి పోతున్న రోడ్డును వెడల్పు చేశారు. దీని కోసం చాలా దుకాణాలు దెబ్బతినడమే గాక ఆ తరువాత ఊరిలో నుంచి పోయే రోడ్డే మెయిన్ రోడ్డయిపోయి ట్రాఫిక్ రొద ఎక్కువయింది. ఏమైతేనేం, సినీనటి ఆస్తి పదిలంగా ఉంది.

ఆ తరువాత రాజశేఖరరెడ్డి ప్రభుత్వం వచ్చింది, ఔటర్ రింగ్‌రోడ్డు వచ్చింది. అందులోని శంషాబాద్ – గచ్చిబౌలి భాగం నానక్‌రాంగూడ మీదుగా పోవలసి ఉంది. అయితే మొదట ప్రతిపాదించిన మార్గం రామానాయుడు స్టూడియోస్ మీదుగా పోతుంది కాబట్టి దానిని తప్పించారు. రెండవ ప్రతిపాదన కొర్ర శ్రీనివాసరావు అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి కొన్న భూముల మీదుగా పోతుందని దాన్నీ తప్పించారు. (ఇతను చంద్రబాబు బంధువని వదంతి. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అతని ఆస్తిని కాపాడింది). చివరికి సర్వే నెం. 149 నుంచి వేస్తున్నారు. ఇది ఆ గ్రామ దళితులు 'ఇందిరమ్మ కాలం నుంచి' చేసుకుంటున్న 10 ఎకరాల భూమి. దానికి డి–ఫారం పట్టాలు (తెలంగాణలో వాడుకలో ఉన్న పరిభాషలో లావోణి పట్టాలు) ఇమ్మని వాళ్ళు చాలా కాలంగా అడుగుతున్నా అధికారులు ఇదిగో ఇస్తాం, అదిగో ఇస్తాం అంటూ జాప్యం చేస్తూ వచ్చారు. వాళ్ళు బావులు తవ్వుకున్నారు, ఎస్.సి కార్పొరేషన్ సహాయంతో బోర్లు వేసుకున్నారు. కానీ పట్టా ఏదీ లేని కారణంగా దమ్మిడీ నష్టపరిహారం ఇవ్వకుండా వారి భూములలో భూతం లాంటి 500 అడుగుల వెడల్పు రోడ్డు వేసేస్తున్నారు.

హైందవ సమాజంలో ఏదీ దళితుల దగ్గరికి తనంతట తాను పోదుగానీ రోడ్లు మాత్రం దళితుల భూములను వెతుక్కుంటూ పోతాయనడానికి నానక్‌రాంగూడ మంచి ఉదాహరణ.

ఆ ఊరు మరొక ప్రముఖమైన కోర్టు కేసులోనూ భాగం అయింది. సర్వే నెం. 115/1లో 82.28 ఎకరాల భూమిలో 18 మంది భూమిలేని పేదలకు డి-ఫారం పట్టాలు ఇచ్చి ఉన్నారు. 2000 సంవత్సరంలో ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనపరచుకున్నప్పుడు అన్ని చోట్లలాగే డి-ఫారం పట్టాలు ఉన్నవారికి నష్టపరిహారం ఇవ్వాలా అన్న ప్రశ్న తలెత్తింది. ఒకప్పుడు ఏ నష్టపరిహారం ఇచ్చేవారు కారని ఇదివరకే చెప్పాం. ఎందుకంటే భూమిలేని పేదలకు ఇచ్చే డి-ఫారం పట్టాలోనే ఏదైనా ప్రజావసరం కోసం ప్రభుత్వం ఈ భూమిని ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా వెనక్కి తీసుకోవచ్చునని ఒక షరతు ఉంటుంది. అయినప్పటికీ ఇది అన్యాయం అనీ, ఏళ్ళ తరబడి చట్టబద్ధంగా సాగుచేసుకుంటున్న భూమి నుంచి వట్టి చేతులతో పంపించి వేయడం తప్పనీ ఆందోళన చేయగా, రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 1307 జారీ చేసింది. దాని ప్రకారం రైతులకిచ్చినంతే (అంటే ప్రభుత్వం నిర్ణయించిన ధర) డి-ఫారం పట్టాదార్లకు ఇస్తారు. అయితే అది చాలదని ప్రభుత్వం మీద కోర్టు కెక్కే హక్కు డి-ఫారం పట్టాదారుకు ఉండదు.

అంతలో డి-ఫారం భూములను స్వాధీనం చేసుకుంటే ఏ నష్టపరిహారం ఇవ్వనక్కర లేదని రాష్ట్ర హైకోర్టు ఐదుగురు జడ్జీల బెంచి తీర్పు చెప్పింది. డి-ఫారం పట్టాలోనే రాసి ఉంటుంది కదా - ప్రజావసరాలకు కావలసి ఉంటే నష్టపరిహారం ఇవ్వకుండా తీసేసుకుంటామని, మరి నష్టపరిహారం ఎందుకిస్తావు? అని హైకోర్టు అంది. ప్రభుత్వమే పెట్టిన షరతును తొలగించే అధికారం ప్రభుత్వానికి ఎందుకు లేదో చట్టం చదువుకోని పామరులకర్థం కాకపోవచ్చును గానీ అప్పటి రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి గారైన సత్యవ్రత సిన్హా గారికి కూడ అర్థం కాకపోతే ఎలా? ఈ తీర్పు అన్యాయమనీ దానిని తిరగదోడాలనీ కోర్టులో కేసులు వేయగా, ఏడుగురు జడ్జీల బెంచి కూర్చొని కొన్ని కేసులలో ఉమ్మడి తీర్పు ఇస్తూ, సిన్హాగారి తీర్పు చెల్లదని ప్రకటించడమే గాక, డి-ఫారం పట్టాదారుకు ప్రభుత్వ ధర ప్రకారం ఇచ్చిన నష్ట పరిహారం పైన కోర్టుకు పోయే హక్కు లేదని జీవో 1307 అనడం చెల్లదనీ, స్వంత భూమి గల రైతుకు ఇచ్చినంత నష్టపరిహారం డి-ఫారం పట్టాదారుకూ ఇవ్వాలనీ తీర్పు చెప్పింది. ఈ తీర్పు ఉమ్మడిగా చెప్పిన కేసులలో నానక్‌రాంగూడలో సర్వే నెం. 115/1లోని డి-ఫారం భూముల కేసూ ఒకటి. ఈ ఏడుగురు జడ్జీల తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఆ తరువాత రాష్ట్రంలో జరుగుతున్న భూసేకరణ ప్రక్రియలలో డి-ఫారం భూములున్న వారికి ప్రభుత్వం బుద్ధికి తోచిన అబద్ధం చెప్తున్నది. ఒక్కొక్కచోట

# రాష్ట్ర ప్రభుత్వ సహాయ పునరావాస విధానం : జీవో ఎం.ఎస్ నెం. 68, నీటిపారుదల శాఖ, తేది : 8-4-2005

ప్రాజెక్టుల కోసం ప్రజలను బలవంతంగా తొలగించడం వీలైనంత తక్కువ జరగాలనీ, ప్రజల తొలగింపు అనివార్యమైన మేరకు వారిపట్ల ముందుచూపుతో, మానవతతో వ్యవహరించాలనీ గుర్తించి ఈ విధానాన్ని రూపొందించినట్టు ఈ జీవో చెప్తుంది.

దీని లక్ష్యం స్థిరాస్తులు లేని పేదల శ్రేయస్సు అని ప్రకటిస్తుంది.

ప్రాజెక్టు నిర్వాసితులు, ప్రాజెక్టు బాధితులు అనే రెండు వర్గాలను గుర్తిస్తుంది. నిర్వాసితులు అంటే భౌతికంగా తొలగించబడే వారు. బాధితులు అంటే మూడేళ్ళుగా అక్కడే ఉంటూ, ప్రాజెక్టు కోసం జరిగే భూసేకరణ వల్ల జీవనం గణనీయంగా దెబ్బతినేవారు.

ప్రతి ప్రాజెక్టుకూ జాయింట్ కలెక్టర్ కంటే తక్కువ కాని హోదా గల అడ్మినిస్ట్రేటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఆ అధికారి ముఖ్య కర్తవ్యాలు– ప్రజల విస్థాపన వీలైనంత తక్కువ ఉండేటట్టు చూడడం, ప్రాజెక్టు నిర్వాహకులతో మాట్లాడి అతి తక్కువ విస్థాపన గల ప్రత్యామ్నాయాన్ని రూపొందించడం, బలహీన వర్గాలకు ఆదివాసీ తెగలకూ చెందిన నిర్వాసితుల ప్రయోజనాలను కాపాడడం, నిర్వాసితుల సహాయ పునరావాస పథకాన్ని రూపొందించడం. జాయింట్ కలెక్టర్‌కు తగ్గని హోదా గల అడ్మినిస్ట్రేటర్‌తో బాటు, ప్రభుత్వ కార్యదర్శి హోదా గల కమిషనర్ కూడా ఉంటారు. అడ్మినిస్ట్రేటర్ కమిషనర్‌కు లోబడి ఉంటారు.

ప్రతి ప్రాజెక్టు విషయంలోనూ దానివల్ల ప్రభావితమయ్యే ప్రాంతాన్ని సూచిస్తూ ప్రభుత్వం పత్రికలలో ప్రకటన ఇవ్వాలి. ఆ తరువాత ఆ ప్రాజెక్టు కోసం నియమించబడ్డ అడ్మినిస్ట్రేటర్ సామాజిక ఆర్థిక సర్వే చేపడతారు. భూములు, ఉపాధి కోల్పోయే వారి గురించి, తమ వృత్తికి లేక వ్యాపారానికి దూరమయ్యే వారి గురించి ఈ సర్వేలో సమాచారం సేకరిస్తారు. వ్యవసాయ కార్మికులను, వ్యవసాయేతర శ్రామికులను వేరు వేరుగా గుర్తిస్తారు. ఈ సర్వే, ప్రభావిత ప్రాంతాన్ని ప్రకటించిన 90 రోజుల లోపల పూర్తి కావాలి. ఈ సర్వే ఫలితాలను

అన్ని సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించి అభ్యంతరాలు విని 30 రోజుల లోపల దానికి తుదిరూపం ఇవ్వాలి.

నిర్వాసితులు చెల్లాచెదురై పోకుండా, వీలైనంత వరకు ఒకేచోట, వీలైతే పాత గ్రామ పంచాయితీ పరిధిలోనే ఉండేటట్టు చూడడం అడ్మినిస్ట్రేటర్ విధి. అందుకోసం వారి పునరావాసం నిమిత్తం సమీప ప్రాంతాలలో భూమిని గుర్తించి, దానిని 'పునరావాస ప్రాంతం' (రీసెటిల్‌మెంట్ జోన్)గా ప్రకటించడం జరుగుతుంది. ఆ తరువాత ప్రాజెక్టు నిర్వాసితులనూ, ప్రాజెక్టు బాధితులనూ అడ్మినిస్ట్రేటర్ సంప్రదించి, పునరావాస పథకాన్ని రూపొందిస్తారు. దాని ఖర్చు ప్రాజెక్టు ఖర్చులో భాగంగా లెక్కించబడుతుంది. ఈ పునరావాస పథకంలో ప్రాజెక్టు బాధితులొక్కొక్కరి వివరాలు పేర్కొనబడాలి.

ఈ పునరావాస పథకంలో ఏమేమి ఉంటాయి? ఇళ్ళు కోల్పోయిన వారికి ఉచితంగా ఇంటి స్థలం ఇస్తారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబమైతే ఇల్లు కట్టుకోవడానికి 40 వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తారు. వ్యవసాయ భూమి కోల్పోయే వారు నష్టపరిహారం బదులు ప్రత్యామ్నాయ భూమి కావాలని కోరుకున్నట్టయితే అందుబాట్లో ఉంటే కనక రెండున్నర హెక్టార్లు మించకుండా ప్రత్యామ్నాయ భూమి, దానిని బాగుచేసుకోవడానికి 5,000 నుంచి 10,000 రూపాయల ఆర్థిక సహాయం ఇస్తారు. ప్రాజెక్టు బాధిత కుటుంబం పశువులను కలిగి ఉన్నట్టయితే పునరావాస స్థలంలో పశువుల కొట్టం నిర్మించుకోవడానికి 3,000 రూపాయల ఆర్థిక సహాయం లభిస్తుంది. పునరావాస స్థలానికి తరలి వెళ్ళడానికి 5,000 రూపాయల ఆర్థిక సహాయం లభిస్తుంది. స్వయం ఉపాధి మీద బతికే గ్రామీణ వృత్తి పనివారికి, చిన్న వ్యాపారికి పునరావాస స్థలంలో షాపు నిర్మించుకోవడానికి 25,000 రూపాయలు ఆర్థిక సహాయం ఇస్తారు. భూమి పూర్తిగా కోల్పోయి భూమిలేని వాళ్ళుగా మారే వారికి 750 రోజుల కనీస వ్యవసాయ వేతనాలిస్తారు. చిన్నకారు రైతుగా మారినట్టయితే 365 రోజుల వేతనం, సన్నకారు రైతుగా మారినట్టయితే 500 రోజుల వేతనం ఇస్తారు. వ్యవసాయ, వ్యవసాయేతర శ్రామికులకు 625 రోజుల కనీస వ్యవసాయ వేతనం ఇస్తారు. పునరావాస స్థలంలో సామాజిక, సాంస్కృతిక సంబంధాలు దెబ్బతినకుండా ఉండే పద్ధతిలో ఒక చోట ఉన్న వారికి ఇళ్ళ స్థలాలు ఒక చోటే ఇస్తారు. పునరావాస స్థలాన్ని అన్ని మౌలిక వసతులూ గల ఆదర్శ గ్రామంగా రూపొందిస్తారు.

ఈ పునరావాస విధానం వచ్చి రెండేళ్ళు కావస్తోంది. అయితే ఇది ఎక్కడా శతాంశం కూడా అమలు కాలేదు.

మీకేమీ ఇవ్వనక్కర లేదని చెప్తున్నది. ఒక్కొక్కచోట రైతులతో సమానంగా ఇస్తామని చెప్తున్నది. ఇవ్వడం మాత్రం ఇప్పటిదాకా జరగలేదు.

డి-ఫారం పట్టాభూములకు నష్టపరిహారం ఇస్తారా ఇవ్వరా అని ఆదుర్దాగా ఎదురు చూస్తున్న వారిలో మహేశ్వరం మండలంలోని శ్రీనగర్, రావిరాల, జిన్నాయగూడెం గ్రామవాసులూ ఉన్నారు. వీళ్ళకు ఔటర్ రింగ్‌రోడ్డు దెబ్బ ఉంది. ఫ్యాబ్‌సిటీ దెబ్బ ఉంది. మొత్తం ఎన్ని ఎకరాలు తీసుకుంటారో ఇప్పటికింకా తెలీదు. రావిరాల, జిన్నాయగూడెంలలో కలిపి 827 ఎకరాలు కచ్చితంగా తీసుకుంటారని తెలుసు. అందులో 100 ఎకరాలు (సర్వే నెం. 88లో) భూమిలేని పేదలకు డి-ఫారం పట్టాలు ఇచ్చిన భూస్వాముల సీలింగ్ మిగులు భూములు. అయితే ఈ ఊర్లలో ఇంకా చాలా సీలింగ్ మిగులు భూమి ఉంది. అదంతా కూడ ఫ్యాబ్‌సిటీ, రింగ్ రోడ్ల కోసం తీసేసుకోబోతారని అంటున్నారు. ఆ పేదలకు ఏ మాత్రమైనా నష్టపరిహారం వస్తుందా లేదా అనేది సుప్రీంకోర్టులో నలుగుతున్న కేసు తీర్పును బట్టి ఉంటుంది.

మంచాల మండలంలో ఆకుల రాజయ్య అనే టీచర్ వందల ఎకరాలు పేద రైతుల నుంచి కారుచవగ్గా కొన్న వైనాన్ని పత్రికలు బాగానే రాశాయి. ఈ భూములు లోయపల్లి, ఆరుట్ల గ్రామాలలో ఉన్నాయి. ఇది నల్గొండ జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలాన్ని ఆనుకొని ఉన్న ప్రాంతం. అదీ ఇదీ అంతా గుట్టలతో, బండలతో నిండి ఉన్న భూమి. ఈ ప్రాంతాన్ని రాచకొండ ఏరియా అంటారు. ఇక్కడి భూములు ఒకప్పుడు పెద్ద పెద్ద భూస్వాములకు చెందినవి. 1,100 ఎకరాలకు యజమాని అయిన యూనుస్ ఖాన్ వారిలో పెద్దవాడు. గుట్టల మయమైన ఈ భూమిని వేరే ఏ రైతులూ సాగులోకి తేలేకపోదురు. అది లంబాడాలకే సాధ్యం  అయింది. వారే చేశారు, వారే దున్నుకుంటూ ఫలం తీసుకుంటూ ఉన్నారు. మొత్తం 4,000 ఎకరాల దాకా ఉన్న ఈ భూమిని దున్నుకుంటున్నది ఆంబోతుతండ, సత్యంతండ, బాలిగుట్టతండ, లోయపల్లి (గ్రామము, తండ), బండలేమూరు, హరిజనతండ, ముచ్చెర్లకుంట, బోడకొండ, కుర్రవానితండ, ఎల్లమ్మ తండలకు చెందిన పేదలు, అత్యధికంగా లంబాడీ గిరిజనులు. వాళ్ళు దశాబ్దాలుగా ఈ భూమిని చేసుకుంటున్నారే గానీ ఆ భూమిని యజమానుల నుంచి కొనుక్కోలేదు, తమ అనుభవాన్ని క్రమబద్ధం చేసుకోలేదు. ఇది గమనించిన ఆకుల రాజయ్య వాళ్ల దగ్గరికొచ్చి 'భూస్వామి దగ్గర ఈ భూమి కొనేశాను అని చెప్పి 5 వేలో, 10 వేలో వాళ్ళ చేతిలో పెట్టి ఆ భూమిని కబ్జా

చేసుకున్నాడు. ఆశ్చర్యంగా 4,000 ఎకరాలనూ సొంతం చేసుకోవడమే కాక మొత్తమంతటినీ వివిధ కంపెనీలకు అమ్మేశాడు కూడ.

భూములన్నీ కోల్పోయిన లంబాడా గిరిజనులు ఇప్పుడిప్పుడే మేలుకొని విషయాన్ని గ్రహిస్తున్నారు. భూములు కొన్నవాళ్ళు వాటిని స్వాధీనం చేసుకోలేదు కాబట్టి నష్టమేమీ జరగలేదన్న అభిప్రాయంతో ఉన్నారు వాళ్లు ఇన్నాళ్లూ. ఆ భూములు వ్యవసాయ భూముల నుంచి పారిశ్రామిక భూములుగా ఇంకా బదలాయింపు జరగలేదు కాబట్టి ఆకుల రాజయ్య దగ్గర కొన్న కంపెనీలు ఆగాయి గానీ అది జరిగితే వాళ్ళు రంగంలోకి దిగి ఆ భూమినంతా స్వాధీనం చేసుకుంటారని ఈ విషయాలు తెలిసిన వాళ్ళంటున్నారు. అది జరిగిన నాడు 1,000 నుంచి 1,200 కుటుంబాలు జీవనాధారాన్ని కోల్పోతాయి.

నిజానికి రంగారెడ్డి జిల్లా పేదలు అన్ని రకాలుగా దౌర్భాగ్యులు. ఇళ్ళ స్థలాల కోసం, సేద్యం కోసం వారు ప్రభుత్వ భూములపైనే ఆశలు పెట్టుకుంటారు. అర్జీలు పెట్టుకుంటారు, లేకపోతే ఎంఆర్ఓతో సహా ఏ అధికారి గ్రామానికొచ్చినా చేతులు ముడిచి అడుక్కుంటారు. ఒకనాటి పాలనా సంస్కృతిలో అప్పుడప్పుడు వారి కోరిక తీరేది. స్వయంగా తీరకపోతే అధికార్లకు లంచమిచ్చో, ఎంఎల్ఏ కోసం ఎన్నికలప్పుడు పనిచేసో తెచ్చుకునే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుత పరిస్థితి వేరు. రాజధాని పరిసరాలలోని ప్రభుత్వ భూమి ఇప్పుడు పేదలది కాదు. పరిశ్రమలది, రియల్ ఎస్టేట్ వ్యాపారులది. నగరం వెలుపల ప్రశాంతంగా ఫామ్ పెట్టుకోవాలని కోరుకునే ధనవంతులది. వారి చేతిలో పెట్టడం కోసం ప్రభుత్వం ఆ భూములను ఆం.ప్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు, హుడాకు అప్పగిస్తుంది. మొదటి సంస్థ దానిని పరిశ్రమలకిస్తుంది. హుడా అయితే వేలం పాట పెట్టి అమ్మేస్తుంది. ఇవి రెండూ కాకపోతే ప్రభుత్వమే నేరుగా కొన్ని ప్రైవేటు సంస్థలకు భూములు అమ్మేస్తుంది లేదా లీజుకిస్తుంది. ఎంతెంత ప్రభుత్వ భూమి ఈ రకంగా భూమి లేని పేదలకు దూరం అయిందో చూస్తే ధనవంతుల భూదాహం ఎంతటిదో అర్థం అవుతుంది.

ఆం.ప్ర. ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు లింగంపల్లి, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్, సరూర్‌నగర్, హయత్‌నగర్, బాలానగర్, షామీర్‌పేట, మహేశ్వరం, ఉప్పల్, మేడ్చల్, చేవెళ్ల, గండీడ్, కీసర మండలాలలో 6,490 ఎకరాలు అప్పగించారు. ఒక్క నానక్‌రాంగూడలోనే 505 ఎకరాలు, మణికొండలో జాగీర్ భూములు 650 ఎకరాలు, రావిరాలలో ప్రజలకు అనేక

రకాలుగా ఉపయోగపడే కంచె 1,650 ఎకరాలు, మాధాపూర్‌లో 310 ఎకరాలు, రాయదుర్గ్‌లో 480 ఎకరాలు, మామిడిపల్లిలో 53 ఎకరాలు, కొల్తూరులో 297 ఎకరాలు, మహేశ్వరంలో 275 ఎకరాలు, గాజుల రామారంలో 231 ఎకరాలు, బాగ్ హయత్‌నగర్‌లో 199 ఎకరాలు, దుండిగల్‌లో 200 ఎకరాలు ఈ విధంగా అప్పగించబడ్డాయి. ఇందులో ప్రభుత్వ బంజరు ఉంది, డి–ఫారం పట్టా భూములున్నాయి, భూసేకరణ కింద స్వాధీనం చేసుకున్న రైతాంగ భూములున్నాయి. ఈ భూములు ఇళ్ళ స్థలాలకూ వ్యవసాయానికీ ఉపయోగపడడమే కాదు, వంట చెరుకు కోసం, పశుగ్రాసం కోసం, పళ్ళు, ఆకులు, కల్లు మొదలైన ఫలసాయం కోసం ప్రజలు తరతరాలుగా వాడుకుంటున్నవి. వీటి చుట్టూ ఎ.పి.ఐ.ఐ.సి వారిప్పుడు ఫెన్సింగ్ వేసేసి ప్రజలనూ, వారి అవసరాలనూ బయటపెట్టేశారు.

హుడాకు అప్పగించిన భూములైతే వేలంపాటలో ధనవంతులకు అమ్ముకోవడానికే. దానికి పారిశ్రామీకరణ అనే ఆచ్ఛాదన సైతం లేదు. హుడాకు బాలానగర్, మల్కాజ్‌గిరి, శంషాబాద్, లింగంపల్లి, రాజేంద్రనగర్, కీసర, ఉప్పల్, షామీర్‌పేట, సరూర్‌నగర్, కుత్బుల్లాపూర్, హయత్ నగర్ మండలాలలో 5,880 ఎకరాలు అప్పగించారు. ఒక్క మియాపూర్‌లోనే 890 ఎకరాలు, పక్కనున్న చందానగర్‌లో 153 ఎకరాలు, పుప్పాల్‌గూడలో 332 ఎకరాలు, కోకాపేటలో (ఇప్పటికే పత్రికల కెక్కిన 60 ఎకరాలు కలుపుకొని) 620 ఎకరాలు, సాహెబ్‌నగర్‌లో 367 ఎకరాలు, షామీర్‌పేటలో 2,360 ఎకరాలు ఈ విధంగా అప్పగించబడ్డాయి.

పర్యాటక శాఖకు అప్పగించిన భూమి కూడ ఉన్నవాళ్ళ వినోదానికే. రాజేంద్రనగర్, లింగంపల్లి, షామీర్‌పేట, శంషాబాద్, వికారాబాద్ మండలాలో 845 ఎకరాలు పర్యాటక శాఖకు అప్పగించబడింది. అందులో పెద్ద మొత్తాలు– షామీర్‌పేట మండలం జవహర్‌నగర్‌లో 500 ఎకరాలు, రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో 200 ఎకరాలు.

చివరి ఖాతా విభిన్న వ్యక్తులకు, సంస్థలకు ప్రభుత్వం అప్పగించిన భూమి. ఇందులో కారు చవగ్గా అప్పగించినది చాలా ఉంది. ఇది చంద్రబాబు కాలంలోనూ జరిగింది, రాజశేఖరరెడ్డి కాలంలోనూ జరుగుతున్నది. రాజేంద్రనగర్ మండలం మణికొండలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అనే ఖరీదైన ప్రైవేటు విద్యాసంస్థకు చంద్రబాబు హయాంలో ఎకరా 25,000 కు 250 ఎకరాలు ఇచ్చిన వైనాన్ని

హైకోర్టులో సవాలు చేసీ ప్రయోజనం లేకుండా పోయింది. అందులో తప్పేమీ లేదని హైకోర్టు తీర్పు ఇచ్చింది.

అదే సమయంలో భారత పారిశ్రామిక సమాఖ్య (సిఐఐ)కి లింగంపల్లి మండలం మాదాపూర్‌లో 'గ్రీన్ బిజినెస్' (అంటే ఏమిటో!) నెలకొల్పడానికి 5 ఎకరాల భూమిని సంవత్సరానికి ఒక్క రూపాయి కిరాయితో 25 ఏళ్ళకు లీజుకిచ్చారు! ఊరికే ఇవ్వబుద్ధికాక ఒక్క రూపాయి తీసుకుంటున్నట్టున్నారు. బ్రహ్మకుమారీలు అనే మత ప్రచార సంస్థకు గచ్చిబౌలిలో ఎకరా వెయ్యి రూపాయల కిరాయికి 37 ఎకరాలు 25 సంవత్సరాలకు లీజుకిచ్చారు. కాంగ్రెస్ వారు అధికారానికొచ్చిన తొలిరోజులలో వారి మిత్రులుగా ఉన్న సిపిఐ (ఎం) వారి సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి గచ్చిబౌలిలో ఎకరా 10 వేలకు 4 ఎకరాలు అమ్మేశారు. మల్కాజ్‌గిరి మండలం అల్వాల్‌లో లయోలా అకాడెమీ అనే ప్రైవేటు విద్యాసంస్థకు ఎకరా 33,880 రూపాయల చొప్పున 132 ఎకరాలు అమ్మేశారు. ఆ పాలనలోనూ ఈ పాలనలోనూ ప్రభుత్వ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీలకు దమ్మిడీ తీసుకోకుండా 586 ఎకరాల భూమిని మూడు దఫాలుగా హైదరాబాద్ పరిసరాలలో అప్పగించారు. ఈ ప్రైవేటు అప్పగింతలన్నీ (కొన్ని కారుచవగ్గా, కొన్ని మార్కెట్ ధరకు) కలుపుకుంటే 1,562 ఎకరాలయింది.

పైన చెప్పిన లెక్కలన్నీ కలుపుకుంటే హైదరాబాద్ పరిసరాలలోని రంగారెడ్డి జిల్లా గ్రామాలలో 14,778 ఎకరాలు ప్రభుత్వం ద్వారా కలవారి పాలయ్యాయి. ఇది విశాఖపట్నం ప్రత్యేక ఆర్థిక మండలి తరువాత ఒకే ప్రాంతంలో అతిపెద్ద మొత్తం.

ముగింపుగా అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్యనే తీసుకొచ్చిన దుర్మార్గమైన సవరణను గురించి చెప్పుకుందాం. ఈ చట్టాన్ని క్లుప్తంగా 9/77 చట్టం అంటారు. పేదలకు డి-ఫారం పట్టాలు ఇచ్చిన భూమిని ఎవరికీ బదలాయించడానికి వీలు లేదనీ, ఎటువంటి బదలాయింపూ చెల్లదని 9/77 చట్టం అంటుంది. పేదలు గత్యంతరం లేని పరిస్థితిలోనో లేక బలవంతుల దౌర్జన్యం కారణంగానో తమకు అసైన్ చేసిన భూమిని ఇతరులకు బదలాయించడం జరుగుతున్నదని గుర్తించి, అటువంటి ఏ బదలాయింపు ఎంఆర్ఓ దృష్టికి వచ్చినా ఆ అధికారి దానిని రద్దుచేసి తొలి లబ్ధిదారుకే దానిని అప్పగించాలని అంటుంది. దీనికి 2006లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన సవరణ అక్రమంగా బదలాయింపుకు గురైన భూమిని లబ్ధిదారుకు తిరిగి ఇవ్వకుండా ప్రభుత్వం ఖాతాలో వేసుకుని అమ్ముకోవడానికి మార్గం సుగమం చేసింది.

ప్రభుత్వం ప్రకటించిన కొన్ని ప్రాంతాలలో అక్రమ బదలాయింపును రద్దు చేసిన తరువాత ఆ భూమిని లబ్ధిదారుకు తిరిగి ఇవ్వనక్కర లేదనీ, బదలాయింపు తరువాత ఆ భూమిని తొలినాడు ఉద్దేశించిన వినియోగానికి భిన్నంగా వినియోగించినట్టయితే దానిని తొలి లబ్ధిదారుకు తిరిగి ఇయ్యనక్కర లేదనీ ఈ సవరణ అంటుంది. హైదరాబాద్ పరిసరాలలోని రంగారెడ్డి జిల్లా భూములను ఈ సవరణ వర్తించే భూములుగా ప్రకటించబోతారని నిస్సందేహంగా చెప్పవచ్చు. రాజధాని పరిసరాలలో పేదలకు చోటులేదన్న పాలనా విధానం చంద్రబాబు కాలం నుంచి రాష్ట్రంలో అమలులో ఉంది. అది ఈ సవరణ రూపంలో కొనసాగుతున్నది. రంగారెడ్డి జిల్లాలో భూముల కోసం ఎదురుచూసే పేదలకు ముందు ముందు మరిన్ని గడ్డు రోజులు ఉన్నాయి.

**మానవహక్కుల వేదిక బులెటిన్-8లో వ్యాసంగా వచ్చింది**
**మే 2007**

# సిపిఐ(ఎం) భావ దారిద్ర్యం

ముదిగొండ కాల్పుల నుండి చాలా ప్రశ్నలు వచ్చాయి. చాలా సంవాదం ఉత్పన్నమయింది. నందిగ్రాంతో పోలిక అనివార్యంగా ముందుకొచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో భూమి సమస్యను వామపక్ష పాలకులు ఎంతమేరకు పరిష్కరించారు, ఎంతమందికి భూములిచ్చారు అన్న చర్చ కూడ జరిగింది. ఉండవల్లి అరుణ్‌కుమార్ లాంటి అక్షరాస్యులైన కాంగ్రెస్ నాయకులు సిపిఐ(ఎం)ను సవాలు చేస్తూ అచ్చులోకి సహితం దిగారు.

కాల్పుల కంటే కొంచెం ముందుకు పోయి వామపక్షాల 'భూమి పోరాటం' గురించే కొంత చర్చ జరపవచ్చు. వాళ్లు భూమి పోరాటాలు చేయక దశాబ్దాలు గడిచాయి. కాబట్టి ఈ చర్చ వాళ్లకు కొత్తగా తోచవచ్చును గానీ, నక్సలైట్ పార్టీల రాజకీయ ఆచరణ గురించి జరిగిన చర్చతో పరిచయం ఉన్నవారికి ఇందులో కొత్తేమీ లేదు. భూమి హక్కులు సంపూర్ణంగా చట్టంతో ముడిపడి ఉంటాయి. అటువంటప్పుడు చట్టాన్ని అసలే పట్టించుకోకుండ గోడౌన్లపైన కరువుదాడి చేసిన పద్ధతిలో 'ప్రభుత్వ భూముల'పైన దాడిచేసి జెండాలు పాతితే చివరికి వచ్చే ఫలితం ఏమీ ఉండకపోవచ్చునన్న విమర్శ కొట్టి పారేయదగింది కాదు. 'ప్రభుత్వ భూమి'గా భావించేది చట్టం కళ్లలో శ్మశానం కావచ్చు. చెరువు శిఖం కావచ్చు. బాటపోరంబోకు కావచ్చు. గ్రామ కంఠం కావచ్చు. ఇప్పటికే ఇతరులకు అసైన్ చేసిన భూమి కావచ్చు. కొంత పోరంబోకు కావచ్చు. వీటిలో ఏదైనా, 'ఏడ్చి గీపెట్టినా' ఆ భూమిలో ఇళ్ల స్థలాలకు గానీ వ్యవసాయానికి గానీ ప్రభుత్వం పట్టాలు ఇవ్వదు. ఇచ్చినా న్యాయస్థానాలు ఒల్లవు. అటువంటప్పుడు చట్టాన్ని చూసుకోకుండ పోరాటంలోకి ప్రజలను దించడం ఏం న్యాయం?

దీనికి మూడు జవాబులు విన్నాము. పోరాటాలు భూమి రికార్డులు చూసుకొని చేయడం లేదు గానీ మరీ అంత గుడ్డిగానూ జరగడం లేదనేది ఒకటి. గ్రామస్తులకు తమ గ్రామం శివారులో ఉన్న భూమి గురించి అవగాహన అసలే లేకుండా పోదు. పంపకానికి తగిన భూమి అన్న అభిప్రాయం ఉన్న వాటిలోనే జెండాలు పాతుతున్నారనేది ఈ వివరణ. భౌతిక ఫలితం రాకపోయినా భూమి పోరాటం చేయదగినదనీ, పేదల భూమి కాంక్ష న్యాయమైనదనీ, ప్రజలలో అది కలిగించే చైతన్యం దానంతటదే విలువైనదనీ రెండవ జవాబు. హైదరాబాద్ పాతబస్తీలో కమ్యూనిస్టులనెన్నడూ చూసి ఎరగని ప్రాంతాలలో సహితం పేదలు వామపక్షాల నిరాహారదీక్ష శిబిరాలలో పెద్దసంఖ్యలో వచ్చి కూర్చుని నినాదాలిస్తున్న వైనాన్ని చూసిన వారికిది అర్థం అవుతుంది. మూడవ జవాబు సిపిఐ నాయకులు నారాయణ గారి నుండి విన్నాం. ఖాళీగా ఉన్న భూములను పేదలు ఆక్రమించుకోకపోతే ధనవంతులు ఆక్రమించుకుంటారు. వారికి ఏ చట్టమూ ఆంక్షలూ అడ్డం రావు. ఆ లోపల పేదలు ఆక్రమించుకుంటే వారికి హక్కు దక్కినా దక్కకున్నా ధనవంతుల దురాక్రమణను ఆపిన వారవుతారని. విపరీత పరిమాణానికి చేరుకున్న ధనవంతుల భూమి దాహాన్ని చూస్తున్నాము కాబట్టి ఈ జవాబు అర్థం చేసుకోగలము.

మూడు జవాబులలోనూ కొంత సత్యం ఉంది. భూమి పోరాటం కేవలం ఆర్థిక పోరాటం కాదనీ, అది రాజకీయ పోరాటం కూడననీ గుర్తించడం ఇక్కడ కీలకం కావచ్చు. అయితే ఆర్థిక ఫలితం అసలే ఇవ్వని రాజకీయ పోరాటం ప్రజలలో అసంతృప్తిని మిగల్చడమే కాక అది ప్రజలపట్ల న్యాయమైన వైఖరి కాదు కూడ కాబట్టి ఏ భూమి, ఎవరి భూమి అనేది చూసుకొని వీలయినంత మేరకు, వీలయినంత మందికి పట్టాలు కూడ వచ్చే పద్ధతిలో భూమి పోరాటం చేయడం ఉచితంగా ఉండదా? మూడు నెలలు కాదు, ముప్పై ఏళ్లు నక్సలైట్ పార్టీలు భూమి పోరాటం చేసాయి. ఇవ్వాళ ఏం మిగిలింది? రిజర్వ్ ఫారెస్టులో ఆదివాసులు కొట్టుకున్న భూములు మినహాయిస్తే మైదాన ప్రాంతాల భూమి పోరాటం మిగిల్చింది చాలా తక్కువ. మిగిల్చిన చోట కూడ భూమి మాదయితే చాలు, ఈ ప్రభుత్వం, దాని చట్టం ఇచ్చే గుర్తింపు మాకెందుకు అన్న వైఖరి అనుసరించడం వల్ల ఆ భూమిని ప్రభుత్వం ఏ ప్రాజెక్టు కిందో సేకరించదలచుకున్నప్పుడు నష్టపరిహారం – జెండాలు పెట్టి స్వంతం చేసుకున్న పేదలకు కాక వారి పోరాటం వల్ల ఆ భూమిని కోల్పోయిన భూస్వాములకే దక్కింది. పోలవరం నుండి పులిచింతల దాకా ఇట్లాంటి భూమి చాలానే వుంది.

భూమి పోరాటాలెందుకు? ఖాళీగా ఉన్న లేక అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూములెక్కడున్నాయో చెప్పినట్టయితే మేమే పంచుతాం కదా అని కాంగ్రెస్ నాయకులు అతి తెలివిగా మాట్లాడుతున్నారు. ఆ పని కోసం ప్రయత్నిస్తున్న స్వచ్ఛంద సంస్థలూ, ఏ సంఘాలూ లేని పేదలూ చాలామందే ఉన్నారు. వాళ్లకు అరిగిన చెప్పులు తప్ప దక్కిందేమీ లేదు. ముందు భూమిని ఆక్రమించుకుంటే తప్ప ప్రభుత్వం మన ముఖం సహితం చూడదన్న ఆలోచన చాలా సహేతుకమైనదే. ఆ పని రాష్ట్ర వ్యాపితంగా ఒకేసారి ఉద్యమ రూపంలో చేయడం ఒకరిని చూసి ఒకరు స్ఫూర్తినీ, ధైర్యాన్నీ పొందడానికి ఉపయోగపడుతుంది. ఎటొచ్చీ ముందు కొంచెం 'హోంవర్క్' చేసి, ఈ భూమి రికార్డులు చూసి చట్టపరమైన సాధ్యాసాధ్యాలు లెక్కలోకి తీసుకొని, ఆక్రమణతోపాటు దాని క్రమబద్ధీకరణకు అవసరమైన చట్టపరమైన ప్రయత్నాలు కూడ అదే ఉద్యమస్ఫూర్తితో చేపడితే బాగుండేది. ఆ పని చేయకపోతే మీకు కావలసింది భూమా? లేక రాజకీయాలా? అన్న ప్రశ్నకు బలం చేకూరుతుంది.

ఇక పశ్చిమబెంగాల్‌లో పేదలకు ఎంత చేసారు, ఆంధ్రప్రదేశ్‌లో ఎంత చేసారు అన్న ప్రశ్న సిపిఐ(ఎం) నాయకులను కొంత ఇరకాటంలో పెట్టినా ఆ ప్రశ్న వేయడంలో తప్పేమీ లేదు. ఎటొచ్చీ ఈ రకమైన ప్రశ్నలు వేసుకునేటప్పుడు, జవాబులు చెప్పుకునేటప్పుడు గణాంకాల భావాన్ని సహేతుకంగా అర్థం చేసుకోకుండ ఏవో అంకెలు గుప్పించి దబాయించడం తగదు. పశ్చిమబెంగాల్ కంటే ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రభుత్వాలు పేదలకు ఎక్కువ భూమి పంచాయనీ, రెండు చోట్లా కాంగ్రెస్ ప్రభుత్వాలే ఆ పని చేసాయనీ కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. దీనికి మద్దతుగా గణాంకాలు గుప్పిస్తున్నారు. ఇక్కడ కొన్ని విషయాలు దృష్టిలో ఉంచుకోవడం అవసరం. మన దేశంలో పేదలకు ప్రభుత్వాలు పంచిన భూములు రెండు రకాలు. ఒకటి భూస్వాముల నుండి స్వాధీనం చేసుకున్న సీలింగ్ భూములు, రెండు బంజర్లు. సీలింగ్ భూముల పంపకం అన్ని రాష్ట్రాలకంటే పశ్చిమ బెంగాల్‌లోనే ఎక్కువ జరిగిన మాట వాస్తవం. దేశం మొత్తం మీద పంచిన సీలింగ్ భూములలో సగం కంటే ఎక్కువ ఆ రాష్ట్రంలోనే పంచారని తేల్చిన పరిశోధనలున్నాయి. ఇది జరిగింది ఎక్కువగా కాంగ్రెస్ పాలనలోనే అని కాంగ్రెస్ వారు అంటే, వామపక్షాల ఉద్యమాలు, అవి పెట్టిన ఒత్తిడే దానికి కారణం అని వామపక్షాలు అనగలవు. ఇంకొంచెం వివరమైన విశ్లేషణ చేయకుండ ఇక్కడ ఎవరి దబాయింపు ఎంత అనేది తేల్చలేం.

పేదలకు పంచిన ప్రభుత్వం బంజర్ల విషయానికొస్తే, ఒక్క పశ్చిమబెంగాలే కాదు, దేశంలోని ఏ రాష్ట్రమూ ఆంధ్రప్రదేశ్‌కు సాటి కాదు. దేశవ్యాప్తంగా

పేదలకు పంచిన ప్రభుత్వ భూములలో సగంపైగా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే పంచిన మాట వాస్తవం. చంద్రబాబు హయాంలో పంచింది శూన్యం కాబట్టి (ఈ మాట బహిరంగంగా అనడానికి వామపక్ష పార్టీలకిప్పుడు ఇబ్బంది అనిపించవచ్చుగాక), ఎన్టీ రామారావు పరిపాలన సాగింది కొంత కాలమే కాబట్టి, దీనిని కాంగ్రెస్ వాళ్లు తమ ఘనతేనని చెప్పుకుంటే వారిని తప్పుపట్టలేం. అయితే ఇక్కడ రెండు విషయాలు చెప్పుకోవాలి. పశ్చిమబెంగాల్ వంటి గంగానది మైదాన ప్రాంతాలలో బంజరు భూములు చాలా తక్కువ. ఆ రాష్ట్రంలో కురిసే సగటు వర్షపాతం కూడ మన కంటే రెండు నుండి నాలుగు రెట్లు ఎక్కువ ఉంటుంది. పేదలకు పంచడానికి ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు అక్కడ అతి స్వల్పంగా ఉంటాయి. రెండవది మన రాష్ట్రంలో పంచిన భూములవల్ల పేదలకు జరిగిన మేలు పంచిన భూముల పరిమాణంతో సమానంగా లేదు. భూములను బాగుచేసి సాగునీటి సదుపాయం కల్పించి పంచితే తప్ప అది పేదల దగ్గర నిలవదనీ, మేలు చేయదనీ చేసిన అభ్యర్థనను ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అందువల్ల పంచిన భూమిలో ఎక్కువ భాగం అయిదువందలకో వెయ్యికో అన్యాక్రాంతం అయింది. భూస్వాముల దౌర్జన్యం వల్లనూ చాలా అన్యాక్రాంతం అయింది. అంతేకాక పట్టాలు ఇచ్చి భూమి అప్పగించని కాగితపు పంపిణీ చాలా జరిగింది. అసలు భూమి ఎక్కడుందో చూపించని పట్టాల పంపిణీ కూడ చాలా జరిగింది. ఈ ఘనత కూడ కాంగ్రెస్ వారిదే మరి.

పేదలకు నివాస హక్కు కల్పించలేదని పశ్చిమబెంగాల్ ప్రభుత్వంపైన కాంగ్రెస్ వారు పెడుతున్న విమర్శ సమంజసమైనదే. మన దగ్గర కాంగ్రెస్ వారు కల్పించారని కాదు గానీ, ఒక నివాస హక్కు అనేది ప్రజలకు లేకపోవడం భారతదేశ రాజ్యాంగంలోనూ చట్టాలలోనూ ఉన్న అత్యంత లజ్జాకరమైన లోపం. రాజ్యాంగాన్ని సిపిఐ(ఎం) ఏం చేయజాలదు గానీ తనకు అధికారం ఉన్న చోటయినా చట్టపరమైన నివాసహక్కు కల్పించకపోవడం జవాబు చెప్పుకోవలసిన వైఫల్యమే. మా దగ్గర బంజరు భూమి లేదనేది నివాస హక్కు కల్పించక పోవడానికి సాకు కాజాలదు. కంపెనీల కోసం భూసేకరణ చట్టాన్ని ఉపయోగించి భూములు సేకరించడానికి వెనుకాడని వారు పేదలకు నివాసస్థలం కల్పించడానికి భూసేకరణ ఎందుకు చేయరు?

ముదిగొండ కాల్పుల తరువాత సిపిఐ(ఎం) పెడుతున్న రాజకీయ డిమాండు – వై.ఎస్. రాజీనామా చేయాల్సిందేననడం – విస్మయం కలిగించేదే. పాలనా యంత్రాంగం వల్ల ఒక ఘోరం జరిగినప్పుడు దాని అధినేత రాజీనామా

చేయాలన్న డిమాండు పెట్టడం నైతికంగా సమర్థనీయమే కావచ్చును గానీ దానిని ఖమ్మం నుండి ఢిల్లీ దాకా అతిముఖ్యమైన డిమాండ్ చేసి ఆందోళన చేయడం వెనుక వేరే ఏదో రాజకీయం ఉందనుకోవాలో, లేక భావ దారిద్ర్యం అనుకోవాలో తెలీదుగానీ దానినొక హేతుబద్ధమైన డిమాండ్‌గా స్వీకరించడం కష్టం. వీధి కొట్లాట కారణంగా అలకపాన్పు ఎక్కిన పి.జనార్ధనరెడ్డికి బి.వి.రాఘవులు మద్దతు ప్రకటించినప్పుడు వారికీ వారి పార్టీకీ రాజకీయ భావదారిద్ర్యం పట్టుకుందని ఏర్పడిన సందేహం ముదిగొండ కాల్పుల తరువాత పెరిగింది. వై.ఎస్. రాజీనామా బదులు కాల్పులకు బాధ్యులైన అడిషనల్ ఎస్.పి, సి.ఐ, ఎస్.ఐలపైన హత్య కేసు పెట్టాలన్న డిమాండ్‌ను కేంద్ర విషయం చేసి సీతారాం యేచూరి, బృందా కారత్ కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికలు చేసి ఉంటే బాగుండేదని తోచని పార్టీ గురించి వేరే ఏం అనుకోవాలి?

**ప్రజాతంత్ర వారపత్రిక**
**12 ఆగస్టు 2007**

# వామపక్షాలూ... ఆలోచించండి

కోనేరు రంగారావు కమిటీ సిఫారసులన్నీ అమలు చేయాలని వామపక్ష పార్టీలు పట్టుబడుతుండగా ముప్పాతిక భాగం అమలు చేస్తామని రాజశేఖరరెడ్డి అనడం వింటున్నాం. ఏ ముప్పాతిక అని రాజశేఖరరెడ్డి విడమరచి చెప్పినట్టు నాకయితే తెలీదు. అంతా అమలు చేస్తే ఏం జరుగుతుందో వామపక్ష పార్టీలూ చెప్పడం లేదు – న్యాయం జరుగుతుందని తప్ప.

కోనేరు రంగారావు రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి. ఉన్నంతలో తెలివయినవాడనే ఆయనకు గుర్తింపు వుంది. అయితే ఆయన పేరు మీద వున్న కమిటీ రిపోర్టులోని అధిక భాగం సూచనలూ, సలహాలూ ఆయన అనుభవం నుండి పుట్టినవి కావు. ఆ కమిటీలోని ఎనిమిది మంది సభ్యులలో నలుగురు ఐఏఎస్ అధికారులు ( ఒకరు రిటైర్డు, ముగ్గురు సర్వీంగు). ఐఏఎస్ అధికారులకు వేరే ఏమైనా తెలియక పోవచ్చును గానీ భూముల వ్యవహారాలు బాగానే తెలిసుంటాయి. ట్రెయినీలుగా ఉన్న దశ నుండి ప్రిన్సిపల్ సెక్రటరీగా రిటైరయ్యే దాకా వారు పాలనాధికారులుగానూ న్యాయనిర్ణేతలుగానూ భూముల వ్యవహారాలు చాలా నడిపిస్తూ ఉంటారు. తినేవాళ్లు బాగా తింటారు. పేదలకు న్యాయం చేయాలనుకునేవారు నా చేతిలోని పనే కదా అనుకొని దూకుడుగా ముందుకురికి కరణాలూ ఆర్.ఐలూ తాసీల్దార్లూ పెట్టిన మందుపాతరలకు బలవుతుంటారు. అయినా అప్పుడప్పుడు కొంత న్యాయమూ చేస్తుంటారు. అధిక భాగం ఇదీ అదీ కాదు, చట్టం తన పని తాను చేసుకుపోతుంది అనే సూత్రాన్ని వల్లిస్తూ అంటీ ముట్టనట్టు బతికేస్తుంటారు.

కొంచెం చేద్దామనుకునే రెవెన్యూ అధికారులకు చట్టాలలోని అసమగ్రత, అమలులోని ఆటంకాలూ, న్యాయస్థానాల వ్యతిరేక వైఖరీ బాగానే తెలుస్తాయి. ఏం

చేస్తే ఈ ఆటంకాలు కొంత మేరకైనా అడ్డం తొలుగుతాయన్న విషయంలో కొన్ని అభిప్రాయాలూ ఉంటాయి. అవన్నీ క్రోడీకరిస్తే వచ్చిందే కోనేరు రంగారావు కమిటీ రిపోర్టు.

ఆ రిపోర్టును ఉన్నదున్నట్టు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తప్పేమీ లేదు. రాజ్యాంగాన్ని ఉన్నదున్నట్టు అమలు చేయాలనీ రాజ్యాంగ ఆదేశిక సూత్రాలను ఉన్నదున్నట్టు ఆచరించమనీ కూడ డిమాండు చేయొచ్చు. అందులోనూ తప్పేమీ లేదు. డిమాండ్ చేస్తే ఏమొస్తుందన్నదే ప్రశ్న. పేదవాళ్లు రెండుపూటలా తినాలనీ, వారి తలమీద ఒక చూరు ఉండాలనీ కోరుకునే అధికారులు, జడ్జిలు మైనారిటీలో ఉన్నంత కాలం పాలనా వ్యవస్థలోనూ న్యాయ నిర్ణయ వ్యవస్థలోనూ ఎన్ని మార్పులు చేసినా పెద్దగా మార్పు రాదన్న నైరాశ్యాన్ని నేను బోధించదలచుకోలేదు గానీ హక్కుల స్పృహ అటుంచి అయ్యో పాపం అనే మానవత ఉన్న అధికారులు కూడ మైనారిటీయేనన్న వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకోవడమూ అవసరమే. ఈ విషయంలో ప్రభుత్వ అధికారుల కంటే కోర్టులను ఎక్కువగా తప్పు పట్టవలసి ఉంటుంది. హైకోర్టు వకీలుకు ఫీజు ఇచ్చుకునే స్తోమత మీకుండాలే గానీ ఆవగింజంత హక్కు లేకుండ ప్రభుత్వ బంజర్లనూ దేవాదాయ భూములనూ ఇనాం భూములనూ గతించిపోయిన ఎస్టేట్ భూములనూ కేవలం హైకోర్టు స్టే ఆర్డర్లతో ఏళ్ల తరబడి అనుభవించవచ్చు. పశ్చిమ గోదావరి ఏజెన్సీ గ్రామాలకు చెందిన బలిసిన గిరిజనేతరులు తమ గ్రామాలను ఏజెన్సీ నుండి తొలగించాలని గవర్నర్‌కొక అర్జీ రాసిచ్చి, దాని మీద ఏదో ఒక నిర్ణయం జరిగేంత వరకు తమ భూములకు ఎల్‌టిఆర్ చట్టాన్ని వర్తింపజేయొద్దని హైకోర్టు నుండి స్టే తెచ్చుకుని ఒక దశాబ్దకాలం ఆదివాసీ భూములను అనుభవించిన వైనం మన రాష్ట్ర న్యాయవ్యవస్థ చరిత్రలో అత్యంత లజ్జాకరమైన ఘట్టం. కనీసం దానిని గుర్తించిన ఘనత కూడ హైకోర్టుది కాదు. జీలుగుమిల్లి ఆదివాసీ పోరాటం దానిని బయటపెట్టింది.

ఇవి ఉబుసుపోక చెప్తున్న మాటలు కావు. ఒక భూమి కమిషన్‌ను నియమించి పేదలకు రాగల భూములను వేగంగా ఇప్పించాలని వామపక్ష పార్టీలు డిమాండు చేస్తున్నాయి. భూమి కమిషన్ అంటే పేదలకు దక్కగల అన్ని రకాల భూములకు సంబంధించిన వివాదాలనూ పరిష్కరించే 'సింగిల్ విండో' వ్యవస్థ అన్నదే వారి అభిప్రాయమైతే, పైకి ఆకర్షణీయంగా కనిపించే ఈ ప్రతిపాదన సమస్యలను మరింత జటిలం చేయగలదు. భూమి సమస్య అనేది చట్టాల పుట్ట. ఒక్కొక్క రకం భూమికీ ఒక్కొక్క చట్టం వర్తిస్తుంది. ఒక్కొక్క పరిష్కార యంత్రాంగం ఉంటుంది.

దేవాదాయ భూముల యంత్రాంగం వేరే, అసైన్డ్ భూముల యంత్రాంగం వేరే, ఇనాం భూముల యంత్రాంగం వేరే, రద్దయిన ఎస్టేట్ భూముల యంత్రాంగం వేరే, సీలింగ్ భూముల యంత్రాంగం వేరే, ఏజెన్సీ భూముల యంత్రాంగం వేరే. అన్నిటిలోనూ అదే తాసీల్దార్లూ అదే ఆర్‌డివోలూ అదే కలెక్టర్‌లూ కొత్త అవతారం ఎత్తుతుంటారు. కానీ ఒక్కొక్క అవతారానికీ వర్తించే చట్టం వేరే, నియమాలు వేరే. ఇప్పుడన్నిటినీ రద్దు చేసి ఒక భూమి కమిషన్ నెలకొల్పాలని ప్రయత్నించడం చట్టపరమైన గందరగోళానికీ వివాదానికీ దారి తీయగలదు. బరువు వకీళ్లు రంగంలోకి దిగి దీని ఏర్పాటే చెల్లదన్న వివాదం లేవదీసి కొన్ని సంవత్సరాల పాటు భూమి వివాదాల పరిష్కార ప్రక్రియను ఆపేయగలరు. పేదల పొట్ట కొట్టే పని వకీళ్లు, జడ్జిలు ఎందుకు చేస్తారని అనుకుంటారేమో. వోట్ల కోసం కక్కుర్తి పడే రాజకీయ నాయకుల నుండి చట్టాన్నీ, చట్టబద్ధపాలననూ తాము కాపాడుతున్నామన్న అతిశయం ఈ రెండు వర్గాలలో ఎంతగా ఉంటుందంటే వాళ్లేమయినా చేయగలరు. పేదలకు అందగల వేలాది ఎకరాల పంపణీని ఆపేసి చట్టబద్ధపాలనను కాపాడామని కాలరెగరేసుకొని తిరగగలరు. వకీళ్లకయితే ఆస్తులున్న వారి తరఫున భూవివాదాల పరిష్కారాన్ని అటకాయించడం లాభసాటి బేరం కాబట్టి చట్టాన్నీ, బ్యాంక్ అకౌంట్‌నూ కూడ కాపాడుకున్న సంతృప్తి పొందగలరు.

కాబట్టి కోనేరు రంగారావు కమిటీ సిఫారసులన్నీ అమలు చేయాలన్న డిమాండ్‌నూ, భూ వివాదాల పరిష్కారానికి భూమి కమిషన్‌ను నియమించాలన్న డిమాండ్‌నూ పక్కనపెట్టి కోనేరు రంగారావు కమిటీ ప్రస్తావించిన కొన్ని నిర్దిష్టమైన అంశాల మీద దృష్టి పెట్టడం ఉచితంగా ఉంటుందేమో.

అసైన్డ్ భూముల జాబితా అన్ని మండలాఫీసుల్లోనూ ఉంటుంది. దానిని బయటకు తీసి పట్టా యిచ్చి భూమి ఎక్కడుందో చూపించని కేసులెన్ని, భూమి చూపించినా గట్లు పెట్టి అందియ్యని కేసులెన్ని, అవన్నీ చేసి ఇచ్చినా పుట్టలూ రాళ్ళమయమైవున్న కారణంగా సాగుకాని కేసులెన్ని, ఏ కారణంగానయినా అన్యాక్రాంతం అయిన కేసులెన్ని అని గుర్తించి అందరినీ వాస్తవంగా భూమిలోకి దించి, భూమిని బాగుచేసి, వీలయిన మేరకు ఏదో ఒక నీటి వసతి కల్పించాలని డిమాండ్ చేయడం ఆచరణయోగ్యమైన డిమాండవుతుంది. దేవాదాయ భూములు కౌలుకు చేసుకుంటున్న భూమిలేని పేదలు ఆ భూములను మార్కెట్ రేటులో ముప్పావలాకు కొనుక్కోవచ్చునని చట్టం చెప్తున్నప్పటికీ వారి కౌలు రిజిస్టర్ కాయితం మీద లేని కారణంగా కొన్ని తరాలుగా దేవాలయ భూములను కౌలుకు

చేస్తూ క్రమం తప్పకుండ కౌలు చెల్లిస్తున్న పేదలు ఈ హక్కును పొందలేకున్నారు. (ఈ సమస్య ఏ కారణంగానో కోనేరు రంగారావు కమిటీ దృష్టికి రాలేదు.) రిజిస్టర్ కౌలునామా లేకపోయినా వాస్తవంలో కౌలుదారుగా ఉండి క్రమం తప్పకుండ కౌలు చెల్లిస్తున్న భూమి లేని పేదలకు ఈ హక్కు లభిస్తుందన్న చట్ట సవరణ చేసినట్టయితే ఎంత లేదన్నా ఒక లక్ష ఎకరాల దాకా పేదలకు దక్కగలవు.

భూమి లేని పేదలు ఉన్నవాళ్ల దగ్గర భూములు కొనుక్కున్నప్పుడు రిజిస్ట్రేషన్ ఖర్చుకు వెరచి ఈ కొనుగోలును రిజిస్టర్ చేసుకోరు. కొనుగోలు ఒప్పందం తెల్లకాగితం మీద ఉండిపోతుంది. దీనివల్ల పేదలు కొనుక్కున్న కొన్ని లక్షల ఎకరాల భూమిపైన వారి హక్కు అభద్రంగా ఉందని ప్రభుత్వం గుర్తించి, ఆలస్యంగానయినా పన్ను కట్టి రిజిస్టర్ చేసుకొమ్మని గడువు పొడిగిస్తూ ఉంది. అయినా చాలామంది ముందుకు రావడం లేదని కోనేరు రంగారావు కమిటీ గుర్తించి, అసలు ఇటువంటి భూములకు రిజిస్ట్రేషన్ రుసుము రద్దు చేయరాదా అని సూచించింది. ఆ సూచనను అమలు చేయమని ఒత్తిడి పెడితే చాలామంది పేదల కష్టార్జితమైన ఆస్తికి భద్రత కల్పించిన వాళ్లమవుతాము.

ఇటువంటి కొన్ని నిర్దిష్టమైన విషయాలు ఎంచుకొని ఆందోళన చేయడం భూమి కమిషన్ డిమాండ్ కంటే ఉచితంగా ఉంటుందేమో వామపక్ష పార్టీలు ఆలోచించాలి.

**ప్రజాతంత్ర వారపత్రిక**
**26 ఆగస్టు 2007**

# ప్రభుత్వం మీ భూమికోసం వస్తే...

ప్రభుత్వంవారు మీ భూమిని సేకరించదలచారా?

వేరే ఏ రకంగానూ దాన్ని ఆపలేకపోతే కనీసం చట్టాలలో ఏముందో తెలుసుకొని, తగిన జాగ్రత్తలు పాటిస్తే కొంతవరకైనా మీకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది.

భూసేకరణ జరుగుతున్నది 1894 నాటి భూసేకరణ చట్టం కింద. ఆ చట్టం 'ప్రజా ప్రయోజనం' పేరుతో ప్రజల భూములనూ, ఇతర స్థిరాస్తులనూ సేకరించే అధికారం ప్రభుత్వానికిస్తుంది. అయితే ఏ అవసరం కోసమైతే భూమి సేకరిస్తున్నారో అది 'ప్రజా ప్రయోజనం' కిందికి వస్తుందా, ఒకవేళ వచ్చినా మీ భూమికాక వేరే ప్రత్యామ్నాయాలు ఉన్నాయా అనే విషయంలో అభ్యంతరం చెప్పే, ప్రత్యామ్నాయాలనూ సూచించే అవకాశం మీకు ఉంది. వాటి గురించి ఆలోచించమనీ, అభ్యంతరాలకు జవాబు చెప్పమనీ ప్రభుత్వంపైన ఒత్తిడి పెట్టగల అవకాశమూ మీకు ఉంది. అతితక్కువ భూమిని సేకరించి, అత తక్కువ మందిని నిర్వాసితుల్ని చేసే ప్రత్యామ్నాయాల గురించి ప్రభుత్వం ఆలోచించాలని మన రాష్ట్ర ప్రభుత్వం 2005లో జారీ చేసిన సహాయ పునరావాస విధానంలోనే అంది. ఒకవేళ భూసేకరణ తప్పనిసరైతే దాని ధర నిర్ణయించే ముందు మీ అభిప్రాయం తీసుకోవాలని, ఆ తర్వాత కూడ ఆ ధర (నష్టపరిహారం) తక్కువనిపిస్తే అభ్యంతరం తెలిపే హక్కు మీకు ఉందని, మీరు అభ్యంతరం తెలిపితే కనక తాను నిర్ణయించిన ధర మీకు చెల్లిస్తూ కూడ అది న్యాయమా కాదా అన్న వ్యాజ్యాన్ని ప్రభుత్వం తానే కోర్టుకు నివేదించాలని ఈ విధానం అంటుంది.

ఇప్పుడు ఒక్కొక్క అడుగూ ఈ వ్యవస్థ వివరాలు చూద్దాం. దానిని అధికారులు ఏ రకంగా వక్రీకరిస్తారో, మీరు దానిని ఏ రకంగా ఎదుర్కోవచ్చో కూడ చూద్దాం.

## 1. నోటీసు ఇవ్వనిదే మీ భూమి జోలికి రాకూడదు

మొదట జిల్లా కలెక్టర్ గానీ, ఇందు నిమిత్తం ప్రభుత్వం నియమించిన సబ్‌కలెక్టర్ గానీ ఏ అవసరం కోసం ఏయే ఊర్లలో ఎంతెంత భూమి సేకరించదలచుకున్నదీ, సర్వే నంబర్ల వారీగా రెవెన్యూ రికార్డుల ప్రకారం దాని యజమానులెవరు అనే విషయాన్ని ప్రకటించాలి. దీనిని 4(1) నోటీసు అంటారు. అంటే భూసేకరణ చట్టంలోని సెక్షన్ 4(1) కింద ఇచ్చిన నోటీసు అని అర్థం. ప్రభుత్వ గెజెట్‌లోనే కాక రెండు స్థానిక దినపత్రికలలోనూ ఈ నోటీసు ప్రకటించాలి. వాటిలో ఒకటి తెలుగు దినపత్రిక అయి ఉండాలి. ఆ తరువాత 40 దినాల లోపల ఆ భూమిని సేకరిస్తున్న ప్రాంతంలో బహిరంగ స్థలంలో ఆ నోటీసును అతికించాలి. ఇవన్నీ జరిగినప్పుడే ప్రజలకు నోటీసు ఇచ్చినట్టవుతుంది. ఆ తరువాతే అధికారులు ఆ భూమిలోకి దిగడంగానీ, కొలతలు తీసుకోవడంగానీ, మట్టిని పరీక్షించడానికి శాంపిల్స్ తీసుకోవడంగానీ చేయవచ్చు.

## 2. అప్పుడు మీరు అభ్యంతరాలు చెప్పవచ్చు

ఆ నోటీసు ప్రచురించిన తరువాత మీరు అభ్యంతరాలు తెలుపవచ్చు. ఈ హక్కు మీకు భూసేకరణ చట్టంలోని సెక్షన్ 5ఎ ఇస్తుంది. మీరు అన్ని రకాల అభ్యంతరాలూ తెలపవచ్చు. ఆ అవసరం ప్రజావసరమే కాదనవచ్చు. దానికి ఈ భూమి తగినది కాదనవచ్చు. మీకు ఉన్నది ఈ భూమే అయితే అది మొత్తం తీసేసుకునే బదులు ఎక్కువ భూమి ఉన్నవాళ్ళ ఆస్తిలో ఒక భాగం తీసుకోవడం న్యాయం అనవచ్చు. లేదా ఎవరూ ఉపయోగించని ప్రభుత్వ భూమి ఊరిలో ఉంది కాబట్టి అది తీసుకొమ్మని సూచించవచ్చు. ఈ అభ్యంతరాలు తెలపడానికి మీకు 30 దినాల గడువు ఉంటుంది. అయితే అభ్యంతరాలు కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా తెలపాలి. ఆపైన కలెక్టర్ ముందు హాజరై మీరుగానీ, మీ తరపున వేరే ఎవరైనాగానీ మీ అభ్యంతరాలు సమంజసమైనవని వాదించవచ్చును. కలెక్టర్ మీ వాదనలు విని, అవసరమైతే ఈ విషయంలో మరింత విచారణ జరిపి, తన అభిప్రాయాలూ, సూచనలూ ప్రభుత్వానికి నివేదించాలి. దానిపైన ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుంది.

## 3. ప్రభుత్వం అడ్డదారి తొక్కితే...

అయితే ఆ భూసేకరణ అత్యవసరమైన లక్ష్యం కోసమైతే అభ్యంతరాలు చెప్పుకునే అవకాశం ఇవ్వకుండా నేరుగా తదుపరి చర్యలు చేపట్టవచ్చునని సెక్షన్ 17(4) అంటుంది. ఈ అధికారాన్ని అరుదుగా మాత్రమే ఉపయోగించాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ మన రాష్ట్రంలో దాదాపు ప్రతి భూసేకరణలోనూ సెక్షన్ 17(4)ను పేర్కొని అభ్యంతరాలు చెప్పుకునే అవకాశం లేకుండా చేయడం పరిపాటి అయింది. ఈ విషయాన్ని 4(1) నోటీసులోనే రాసేస్తున్నారు. అయితే నిజంగా అర్జెన్సీ లేని సందర్భాలలో అట్లా చేస్తే మీరు ఊరుకోనక్కరలేదు. భూమిని కోల్పోయే వారంతా ఒకటై మీ అభ్యంతరాలను వినితీరాలని కలెక్టర్‌పైన ఒత్తిడి పెట్టొచ్చు. అప్పటికీ వినకపోతే హైకోర్టులో కేసు వేయొచ్చు. నూటికి తొంభై కేసులలో హైకోర్టు సెక్షన్ 5ఎ కింద విచారణ జరిపి తీరాలని ఆదేశం ఇస్తున్నది.

## 4. అభ్యంతరాలు విన్న తరువాత...

మీ అభ్యంతరాలు విని, వాటిపైన ప్రభుత్వం తన నిర్ణయం తెలియజేసిన తరువాత కలెక్టర్ మరొకసారి ప్రభుత్వం సేకరించబోయే భూమి వివరాలను సర్వే నంబర్‌ల వారీగా యజమానుల పేర్లు వగైరా తెలియజేస్తూ సెక్షన్ 6 కింద మళ్ళీ నోటీసు జారీ చేస్తాడు. అది కూడ రెండు దినపత్రికలలో ప్రకటిస్తాడు. వాటిలో ఒకటి తెలుగు దినపత్రిక అయి ఉండాలి. ఇదివరకటిలాగే ఆ ప్రకటన భూమి సేకరిస్తున్న చోట బహిరంగ స్థలంలో అంటించాలి. ఆ తరువాత భూమిని కొలిచి, దాని సరిహద్దుల్లో గుర్తులు పెట్టుకోవచ్చు. అయినా అప్పటికింకా భూమి మీదే. అది ప్రభుత్వం స్వాధీనం కావడానికి ఇంకొన్ని దశలున్నాయి. మొదట కలెక్టరు సెక్షన్ 9 కింద మరొక నోటీసు జారీ చేయాలి. ఇది గెజెట్‌లోనూ, పత్రికలలోనూ ప్రచురించే నోటీసు కాదు. ఆ భూమి అనుభవదారునికి, ఆ భూమిపైన ఏదైనా హక్కు ఉన్నదని ప్రభుత్వం దృష్టికి వచ్చిన వారికి, లేదా వారు ఇందు నిమిత్తం నియమించిన ప్రతినిధులకు చేతికి అందిచ్చే నోటీసు. మీరు ఆ జిల్లాలో లేనట్టయితే మీకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపించాలి. అంతేకాక, సేకరిస్తున్న భూమి పరిసరాలలో బహిరంగ ప్రదేశంలో ఈ నోటీసును అంటించాలి కూడ. ఇందులో ఏముంటుందంటే ఫలాన సర్వే నంబర్‌లోని ఫలాన విస్తీర్ణంగల భూమిని సేకరించడం జరుగుతున్నదనీ, ఫలాన తేదీనాడు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి మీ హక్కు ఏమిటో (అంటే యజమాని, కౌలుదారు, కొనుగోలుచేసిన వ్యక్తి, వగైరా) చెప్పి ఆ భూమికి ఎంత నష్టపరిహారం కోరుకుంటారో తెలపమని ఉంటుంది.

నోటీసు చేతికి అందించిన రోజుకూ, కలెక్టర్ ముందు హాజరు కావలసిన రోజుకూ నడుమ కనీసం 15 దినాల గడువు ఉండాలి. మీరు సెక్షన్ 9 నోటీసుకు స్పందించి కలెక్టర్ ఎదుట హాజరైనప్పుడు ఆ భూమిలో ఇంకా ఎవరెవరికి ఏమేమి హక్కులున్నాయో మీకు తెలిసిన మేరకు చెప్పమని మిమ్మల్ని ఆదేశించే అధికారం కలెక్టర్‌కు ఉంది. మీరు తప్పనిసరిగా చెప్పాలి.

## 5. నష్టపరిహారం ఎంత, ఎవరెవరికి

మీరు చెప్పిన విషయాలు విని, మీరు సమర్పించిన పత్రాలు పరిశీలించిన తరువాత కలెక్టర్ సెక్షన్ 11 కింద తన 'అవార్డు' ప్రకటిస్తాడు. సేకరిస్తున్న భూమి పరిమాణం ఎంత, దానికి ఇవ్వదగ్గ నష్టపరిహారం ఎంత, దానిలో ఎవరెవరికి ఎంత వాటా ఇవ్వాలి అనే విషయాలు అవార్డులో ప్రకటిస్తాడు. సెక్షన్ 6 కింద ఏ భూములు సేకరించబోయేదీ తెలిపే నోటీసు ప్రకటించిన రెండు సంవత్సరాల లోపల ఈ అవార్డు ప్రకటించాలి. రెండు సంవత్సరాలు దాటిపోయినట్టయితే ఈ భూసేకరణ ప్రక్రియ చెల్లదు. కలెక్టర్ మీ సమక్షంలో అవార్డు ప్రకటించినట్టయితే దాని ప్రతిని మీ చేతికి ఇస్తారు. అప్పుడే నష్టపరిహారమూ ఇస్తారు. మీరు అక్కడ లేనిపక్షంలో దానిని రిజిస్టర్డ్ పోస్టు ద్వారా మీకు పంపిస్తారు. అవార్డు ప్రకారం మీకు ఇవ్వాల్సిన మొత్తాన్ని కోర్టులో డిపాజిట్ చేస్తారు. ఆ నష్టపరిహారం పట్ల మీకు మూడు రకాల అభ్యంతరాలు ఉండవచ్చు. భూమి విలువ తక్కువగా లెక్కించారన్న అభ్యంతరం ఉండవచ్చు. దాని పరిమాణాన్ని తక్కువగా లెక్కించారన్న అభ్యంతరం ఉండవచ్చు. ఆ ఆస్తిలో హక్కులేనివారికి కూడ నష్టపరిహారంలో వాటా ఇచ్చారన్న అభ్యంతరం ఉండవచ్చు. ఏ అభ్యంతరం ఉన్నా ఆ విషయాన్ని కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా తెలిపి మీ అభ్యంతరాన్ని కోర్టుకు నివేదించమని కలెక్టర్‌ను మీరు కోరవచ్చు. కోరినట్టయితే కలెక్టర్ మీ అభ్యంతరాన్ని సంబంధిత సివిల్ కోర్టు ముందు ఉంచుతారు. ఇది సెక్షన్ 18 కింద మీకు ఉండే హక్కు. కలెక్టర్ సెక్షన్ 11 కింద అవార్డు మీ సమక్షంలో ప్రకటించి ఉంటే ఆనాటి నుండి 6 వారాల లోపల మీ లిఖిత పూర్వక అభ్యంతరాలను కలెక్టర్‌కు తెలియజేయాలి. రిజిస్టర్డ్ పోస్టులో పంపినట్టయితే మీకది అందిన రెండు నెలల లోపల తెలియజేయాలి.

కలెక్టర్ ఇచ్చిన నష్టపరిహారం తీసుకొని కూడ అభ్యంతరం తెలిపి కోర్టుకు నివేదించమని కోరవచ్చును. అయితే నష్టపరిహారం తీసుకునేటప్పుడే మీ వద్ద వారు తీసుకునే రశీదుపైన మీ నిరసనను లేక అభ్యంతరాన్ని సూచిస్తూ రాసి

సంతకం చేయాలి. నిరసన తెలపకుండా తీసేసుకుంటే ఆ తరువాత సెక్షన్ 18 కింద అభ్యంతరం తెలిపే అవకాశం ఉండదు. మామూలుగా ఇంగ్లీష్‌లో 'అండర్ ప్రొటెస్ట్' అని రాస్తారు. అయితే ఇంగ్లీష్‌లోనే రాయనక్కరలేదు. మీ నిరసనను సూచించే వాక్యమేదైనా తెలుగులో అయినా రాయవచ్చును.

నష్టపరిహారం తీసుకోవడానికి మీరు నిరాకరించినా దానివల్ల మీరేమీ నష్టపోరు. కలెక్టర్ దానిని సివిల్ కోర్టులో డిపాజిట్ చేస్తాడు. నిర్దేశించిన గడువు లోపల మీరు మీ అభ్యంతరాలను కలెక్టర్‌కు తెలియజేసి కోర్టుకు నివేదించమని కోరితే నివేదిస్తాడు. ఒకవేళ మీ అభ్యంతరాలన్నిటినీ కోర్టు తిరస్కరించినా, కలెక్టర్ డిపాజిట్ చేసిన మీ నష్టపరిహారం మీకే వస్తుంది.

## 6. 'ఒప్పుకోలు' అవార్డు

కలెక్టర్ సెక్షన్ 11 కింద మీ భూమి మార్కెట్ విలువను బట్టి మీకు నష్టపరిహారం ఇస్తాడు. (గడిచిన మూడు సంవత్సరాలలో ఆ ప్రాంతంలో జరిగిన భూముల అమ్మకాల సగటు రిజిస్ట్రేషన్ ధరకు 30 శాతం పరిహారం చేర్చి, నోటిఫికేషన్ తేదీనుండి అవార్డు తేదీ వరకు 12 శాతం వడ్డీ చేర్చి ఇస్తారు). అయితే ఇక్కడ మార్కెట్ విలువ అంటే అర్థం సెక్షన్ 4(1) నోటీసు జారీచేసే నాటికి మీ ప్రాంతంలో ఆ రకమైన భూమిని కొనుక్కున్న వాళ్ళు రిజిస్ట్రేషన్ నిమిత్తం చూపించిన సగటు విలువ అని. అది నిజమైన విలువ కంటే చాలా తక్కువ ఉంటుంది కాబట్టి అనివార్యంగా రైతులు సెక్షన్ 18 కింద అభ్యంతరాలు తెలపడం, సివిల్ కోర్టులో, హైకోర్టులో (ఒక్కొక్కసారి సుప్రీంకోర్టులో కూడ) ఏళ్ళతరబడి కేసులు నలగడం, వకీళ్ళ ఫీజులకు మధ్యవర్తుల కమిషన్లకు వచ్చిన నష్టపరిహారంలో ఎక్కువ భాగం సమర్పించుకోవడం సాధారణ అనుభవం. అందుకని దాని స్థానంలో ప్రభుత్వం మిమ్మల్ని సంప్రదించి ఇద్దరికీ ఆమోదనీయమైన నష్టపరిహారాన్ని నిర్ణయించినట్టయితే, మీరు లిఖిత పూర్వకంగా ఆ మొత్తం మీకు ఆమోదనీయమని రాసి కలెక్టర్‌కు ఇస్తే కలెక్టర్ దానినే అవార్డుగా ప్రకటించవచ్చు. 11(2) దీనికి అవకాశం ఇస్తుంది.

ఈ మధ్య ప్రభుత్వం ఎక్కువగా ఈ 'ఒప్పుకోలు' మార్గాన్నే అనుసరిస్తున్నది. అయితే దీనికొక సవ్యమైన మార్గం ఉంది. అపసవ్యమైన మార్గమూ ఉంది. సవ్యమైన మార్గంతోపాటు ప్రభుత్వం ఎక్కువగా అనుసరిస్తున్న అపసవ్యమైన మార్గం గురించి కూడ వివరిస్తాము.

# అసైన్‌మెంట్ భూములకు నష్టపరిహారం

భూమి హక్కులలో బలహీనమైనదిగా భావించబడేది అసైన్‌మెంట్ పట్టా పొందిన వారి హక్కు. భూమిలేని పేదలకు ప్రభుత్వ భూమిని సాగు కోసం గానీ ఇళ్ల స్థలాల కోసం గానీ ఇచ్చే వాడుక స్వాతంత్ర్యానికి పూర్వం నుండి ఉంది. బ్రిటిష్ పాలిత ప్రాంతాలలో ఈ హక్కు ఇచ్చే పత్రాన్ని డి–పట్టా (డి–ఫారంలో ఉంటుంది కాబట్టి) లేక దరఖాస్తు పట్టా, డీకేటి పట్టా అని పిలుస్తారు. తెలంగాణలో లావోణి పట్టా అంటారు. హక్కుదారు ఈ భూమిని తప్పనిసరిగా వినియోగంలోకి తేవాలి. ఏ అవసరం కోసం ఇస్తారో దానికోసం మాత్రమే వినియోగించాలి. వంశపారంపర్యంగా అనుభవించవచ్చును గానీ వేరొకరికి అమ్ముకోవడంగానీ వేరే ఏ యితర రూపంలో బదలాయించడానికి గానీ వీలు లేదు. అయితే ప్రభుత్వానికి ఆ భూమి వేరొక ప్రజా ప్రయోజనం కోసం అవసరమయినట్టయితే, ఎటువంటి నష్టపరిహారం లేకుండా వెనక్కి తీసేసుకోవచ్చు. ఈ షరతులన్నీ డి–పట్టామీద రాసి ఉంటాయి.

ప్రభుత్వం ఇచ్చిన భూమిని బాగు చేసుకొని ఏళ్లతరబడి సాగుచేసుకొని దాని చుట్టూ కుటుంబం భవిష్యత్తును ఊహించుకున్న ప్రజలు, అకస్మాత్తుగా వేరే ఏదో ఒక ప్రాజెక్టుకో దేనికో అది కావలసి వచ్చిందని ప్రభుత్వం పైసా ఇవ్వకుండ తీసేసుకుంటే ఒక్కసారిగా వీధిన పడతారు. ఇది అన్యాయం అని ఆందోళన చేయగా చేయగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అన్యాయమయిన పరిస్థితిని సవరించే ఆదేశాలు జారీ చేస్తూ వచ్చింది. వాటిలో చివరిది 1993 డిసెంబర్ 23న జారీ చేసిన జీవో నెం. 1307. దాని ప్రకారం, స్వంత భూమికిచ్చినట్టే అసైన్‌మెంట్ భూమికి కూడ ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ధర, దానికి అదనంగా బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నందుకు 30 శాతం పరిహారం (సొలేషియం) ఇవ్వాలి. అయితే స్వంత భూమికి ఇచ్చినట్లు నోటిఫికేషన్‌కూ భూమి అప్పగింతకూ మధ్య కాలానికి వడ్డీ చెల్లించరు. అంతకంటే ముఖ్యంగా దీనిని సవాలు చేస్తూ కోర్టుకు పోయే అవకాశం పట్టాదారులకు ఉండదు.

ఈ షరతులనే మన రాష్ట్ర హైకోర్టు 2004లో ఇచ్చిన తీర్పులో రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించి కొట్టేసింది. అసైన్‌మెంట్ పట్టాను పూర్తి స్థాయి యాజమాన్యంగా పరిగణించి స్వంత భూమి ఉన్న రైతుతో సమానంగా నష్టపరిహారం ఇవ్వాలనింది.

సవ్యమైన మార్గం ఆంధ్రప్రదేశ్ భూసేకరణ (సంప్రదింపుల కమిటీ) నియమాలు అనే 1992 నాటి రూల్స్‌లో ఉంది. దీని ప్రకారం ఒక జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ, ఒక రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ ఉంటాయి. జిల్లా స్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్, ఒక రిటైర్డ్ జిల్లా జడ్జి, పదవిలో ఉన్న సీనియర్ సివిల్ జడ్జి, జాయింట్ కలెక్టర్ తదితరులు ఉంటారు. సెక్షన్ 11 కింద కలెక్టరు అవార్డు జారీ చేసిన తరువాత, ఆసక్తి ఉన్నవారు సంప్రదింపుల కమిటీ ముందుకు రావలసిందని కోరుతూ ఆయన ఫారం-1 నోటీసును గ్రామంలో రెండు బహిరంగ ప్రదేశాలలో ప్రకటిస్తాడు. లేదా రైతులే తమ అర్జీలను సంప్రదింపుల కమిటీకి నివేదించమని కలెక్టర్‌ను కోరవచ్చు.

ఈ సంప్రదింపుల కమిటీకి ఒక మేరకు మాత్రమే నష్టపరిహారాన్ని పెంచే అధికారం ఉంది. అంతకంటే ఎక్కువ పెంచమన్న డిమాండ్ వచ్చినట్టయితే కేసును రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీకి నివేదించాలి. ఈ కమిటీలు రైతుల మీద ఎటువంటి ఒత్తిడి పెట్టకూడదు. ఒప్పుకోలు స్వచ్ఛందంగా ఇచ్చిన పిమ్మట ఇచ్చిన వారి వరకు సెక్షన్ 11(2) కింద ఒప్పుకోలు అవార్డు ప్రకటించబడుతుంది. ఒప్పుకోనివారు పైన వివరించిన పద్ధతి ప్రకారం కోర్టులో న్యాయం కోసం వ్యాజ్యం నడుపుకోవచ్చు.

## 7. అపసవ్యమైన 'ఒప్పుకోలు'

ఇది సవ్యమైన మార్గం కాగా, ప్రస్తుతం అన్ని ప్రాజెక్టుల విషయంలోనూ పూర్తిగా అపసవ్యమైన ఒప్పుకోలు మార్గాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్నది. ఇందులో సంప్రదింపుల కమిటీకి స్థానం లేదు. మీ ప్రాంతపు ఆర్‌డివో లేక భూసేకరణ సబ్-కలెక్టర్ భూమి కోల్పోతున్న వారిలో కొందరిని ముందు చేరదీసి వారితో ఒక ధరకు ఒప్పుకోలు పత్రాలు రాయించుకుంటారు. వారు పాలక పార్టీకి చెందినవారై ఉండి, వేరే ఏదో ప్రయోజనాలను ఆశించి ఈ నాటకంలో భాగస్వాములు కావచ్చు లేదా వేరే వ్యాపారాలో, ఉద్యోగాలో ఉన్న కారణంగా భూములు చవకగా అమ్ముకొని పోవడానికి సిద్ధపడినవారు కావచ్చు. వారితో ఒక ధరకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంటుంది. ఆ ధర సెక్షన్ 11 కింద కలెక్టర్ ప్రకటించే అవార్డులోని నష్టపరిహారం కంటే ఎక్కువే ఉంటుంది. అయితే మీ ఊరి పరిసరాలలో మళ్ళీ అంత భూమి కొనుక్కొని వ్యవసాయం చేసుకోవడానికయ్యే ఖర్చుకంటే బాగా తక్కువ ఉంటుంది.

ఆ ఒప్పుకోలు పత్రాన్ని అధికారులు మీ ముఖాన కొట్టి మీరు కూడ అదే ధరకు ఒప్పుకోవాలని ఒత్తిడి పెడతారు. 'ఫలాన సుబ్బయ్య ఈ ధరకు తన భూమి

ఇచ్చేశాడు మీకేమయింది?' అని దబాయిస్తారు. 'రేపు మీరు కోర్టుకు పోయినా ఈ ఒప్పుకోలు పత్రం చూసిన తరువాత కోర్టు మీకు ఇంతకంటే ఎక్కువ రేటు ఇస్తుందనుకుంటున్నారా?' అని బెదిరిస్తారు. 'వచ్చే నెల 31వ తేదీ లోపల ఈ ధరకు ఇచ్చేదీ లేనిదీ తేల్చి చెప్పేయండి. లేదంటే సెక్షన్ 11 కింద కలెక్టర్ ఇచ్చిన అవార్డు ప్రకారం నష్టపరిహారం చేతిలో పెడతాం, తీసుకోకపోతే కోర్టులో డిపాజిట్ చేస్తాం. ఆపైన ఒక పదేళ్ళు కోర్టుల చుట్టూ తిరగండి' అని దబాయిస్తారు.

రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలోనూ ఇదే జరుగుతున్నది. మీ ఊరిలోనూ జరగబోతుంది. ఈ మోసపూరితమైన 'ఒప్పుకోలు'కు లొంగకుండా ఉండాలంటే భూమిని కోల్పోయే రైతులంతా ఒకటిగా ఉండాలి. 1992లో ప్రకటించిన రూల్స్ ప్రకారం జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీలను నియమించి వాటి ద్వారా సంప్రదింపులు చేపట్టాలే తప్ప ఈ అడ్డదారి ఒప్పుకోలు ప్రయత్నాలకు లొంగం అని ఐక్యంగా నిలబడండి.

పైన చెప్పిన అన్ని విషయాలూ రైతుల స్వంత భూములకేకాక అసైన్‌మెంట్ లేక డి-ఫారం (డికెటి, లావోణి) పట్టా భూములకు కూడ వర్తిస్తాయని గుర్తుంచుకోండి. ఆ భూములకు భూసేకరణ నియమాలు వర్తించవనీ, అవి ప్రభుత్వ భూములే కాబట్టి ఎప్పుడైనా తీసేసుకోవచ్చనీ అధికారులు 'దబాయించినట్టయితే' మన రాష్ట్ర హైకోర్టు 2004లో భూసేకరణ అధికారి, చేవెళ్ళ మరియు మేకల పాండు కేసులో ఇటువంటి భూములకూ, స్వంత భూములకూ ఒకే రకమైన భూసేకరణ పద్ధతి వర్తిస్తుందనీ, ఒకే మోతాదులో నష్టపరిహారం ఇవ్వాలనీ తీర్పు ఇచ్చిన విషయం గుర్తు చేయండి. ఆ తీర్పుపైన రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన అప్పీల్‌లో ఇప్పటికింకా ఏ తీర్పూ రాలేదని గుర్తుచేయండి. అందువల్ల హైకోర్టు తీర్పును పాటించాలని చెప్పండి. అది కాకపోతే కనీసం 1993 నాటి జీవో నెం. 1307ను అనుసరించి మార్కెట్ విలువకు 30 శాతం పరిహారం చేర్చి ఇవ్వాలి. (బాక్స్ చూడండి). ఏమీ ఇవ్వనక్కరలేదన్నట్టు, ఒకవేళ ఇస్తే అది ప్రభుత్వం దయ అయినట్టు వ్యవహరించే ప్రభుత్వ అధికారుల వైఖరి చట్ట విరుద్ధం అని గుర్తించండి.

## 8. ఏ పట్టా లేకపోతే?

అయితే డి-ఫారం పట్టా కూడ లేకుండా ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న పేదలుంటారు. వాళ్ళకు నష్టపరిహారం ఇస్తారా, ఇవ్వరా? పేదలు

అసైన్‌మెంట్ పట్టా ఇవ్వదగిన ప్రభుత్వ భూములను అనుభవిస్తున్నట్టయితే, వారి ఆక్రమణను నమోదు చేయాలి. వారి సామాజిక ఆర్థిక స్థితిగతుల గురించి విచారణ జరపాలి. నిజంగా భూమిలేని పేదలైతే వారికి డి-ఫారం పట్టాలు ఇవ్వాలి. ఇది ప్రభుత్వం బాధ్యత అని బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్ చెప్తాయి. ఆ తరువాత ఆ భూమిని ఏదైనా ప్రజా ప్రయోజనం కోసం ప్రభుత్వం సేకరిస్తే, పైన చెప్పిన హక్కులు వర్తిస్తాయి. కానీ ప్రభుత్వ అధికారులు ఆ పని చేయకపోతే? పేదలు ప్రభుత్వ భూములను ఏళ్ళతరబడి సాగు చేసుకుంటున్నా వారికి పట్టాలు ఇవ్వకపోతే? అటువంటి భూమిని ఆ తరువాత ప్రభుత్వం ఏదైనా ప్రజావసరం కోసం తీసుకుంటే వారికి నష్టపరిహారం దక్కుతుందా? దక్కాలి. కాని వారికి నష్టపరిహారం ఇవ్వాలని చెప్పే చట్టం ఏదీ లేదు. వారికి డి-ఫారం పట్టాలు ఇయ్యవలసి ఉండీ అధికారులు ఇవ్వలేదు కాబట్టి ఇచ్చినట్లే భావించి నష్టపరిహారం ఇవ్వాలని చెప్పే కోర్టు తీర్పులూ లేవు. అయితే ఆందోళన చేయగా చేయగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కోసం సేకరించిన భూమిలో ఈ కోవకు చెందిన పేదలకు మొట్టమొదటిసారిగా నష్టపరిహారం ఇచ్చారు. ఎకరానికి 65 వేలు ఇచ్చారు. కాబట్టి మీరు డి-ఫారం పట్టా సైతం లేకుండా ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్నవారైతే, శంషాబాద్ సూత్రాన్ని మీకు కూడ వర్తింపజేయాలని ఆందోళన చేయండి. ఎకరానికి 65 వేలే అడగనక్కరలేదు. అది 2003నాటి సంగతి. ఇప్పటి పరిస్థితికి తగినంత అడగండి.

## 9. ఏ భూములూ లేనివారి గతి ఏమిటి?

రైతుల భూములు పోతే ఆ భూములలో కూలిచేసుకొని బతికే భూమిలేని కూలీల జీవనం కూడ పోతుంది. సాగు భూములే కాక గ్రామం ఖాళీ చేయవలసి వస్తే గ్రామంలో చాకలి, మంగలి, కమ్మరి మొదలైన వృత్తులు చేసుకొని బతికే పేదల జీవనమూ పోతుంది. రైతుల భూములు, డి-ఫారం పట్టా భూములు, పట్టా లేకుండా ఎవరో ఒకరు సాగు చేసుకుంటున్న భూములే కాక సాగులో లేని ప్రభుత్వం బంజర్లను కూడ ప్రాజెక్టులకు, పరిశ్రమలకు అప్పగించడం జరుగుతున్నది. ఆ భూములలో తాడిచెట్లు, ఈతచెట్ల కల్లుతీసి బతికే గీత కార్మికుల జీవనం పోతుంది. రాళ్లు కొట్టి అమ్ముకొని బతికే వడ్డెరల జీవనం పోతుంది. ఆ భూములలో వాగులు ఉంటే వాటిలో చేపల వేట చేసుకొని బతికే మత్స్యకారుల జీవనం పోతుంది.

చాలాకాలం ఈ ప్రజలకు ఏ నష్టపరిహారం దక్కేది కాదు. కానీ 2005 మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.68 లో ఈ ప్రజలకు కూడ నగదు నష్టపరిహారం ఇవ్వాలని రాశారు. ఒక ప్రాజెక్టుకోసం భూసేకరణ చేపట్టేటప్పుడు భూములు కోల్పోయేవారే కాక జీవనం కోల్పోయేవారూ ఉంటారని ఈ జీవో గుర్తించి, అటువంటి కుటుంబాలకు 625 రోజుల కనీస వ్యవసాయ కూలి వేతనం నష్టపరిహారంగా ఇవ్వాలని చెప్తుంది. ఉదాహరణకు కనీస వ్యవసాయ కూలీ వేతనం 80 రూపాయలైతే, ఒక్కొక్క కుటుంబానికి 50 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలి. వ్యవసాయ కూలీలకే కాదు, జీవనం కోల్పోయే సకల వృత్తుల వారికీ 625 రోజుల కనీస వ్యవసాయ కూలి వేతనం ఇవ్వాలి. ఎందుకంటే అన్ని వృత్తులకూ కనీస వేతనాలుండవు కాబట్టి. అడవిప్రాంత ఆదివాసులైతే అటవీ ఉత్పత్తులు కోల్పోతారు కాబట్టి ఇంకొక 500 రోజుల కనీస వేతనం ఇవ్వాలి.

ఈ జీవోను ఆందోళన చేస్తే తప్ప ఎక్కడా అమలు చేయడం లేదు కాబట్టి, డిమాండ్ చేసి అమలు చేయించుకోండి. గ్రామం ఖాళీ చేయకముందే సకల వృత్తులవారి సామాజిక ఆర్థిక సర్వే జరిపి రికార్డు తయారయ్యేట్టు చూసుకోండి. ఖాళీ చేసిన తరువాత నేను ఫలాన ఊరిలో చాకలి పనిచేసే వాడిని అంటే దానికి రుజువు ఏం ఉంటుంది? కాబట్టి జీవో 68 కింద ఇయ్యవలసిన నష్టపరిహారం ఇవ్వకుండా లేదా కనీసం సర్వే జరిపి రికార్డు సమగ్రంగా తయారు చేయకుండా, ఊరు ఖాళీ చేయొద్దు.

ఈ జీవోను అమలుచేయమని అడిగితే దీనిని జారీ చేసింది రాష్ట్రప్రభుత్వ నీటిపారుదలశాఖ కాబట్టి ఇది నీటిపారుదల ప్రాజెక్టులకే తప్ప ఇతర ప్రాజెక్టులకు వర్తించదని అధికారులు దబాయిస్తారేమో. జీవో ఏ శాఖ జారీ చేసినా అది ప్రభుత్వ జీవోయే తప్ప ఆ శాఖ జీవో కాదు. జీవోలో వాడిన పరిభాష ప్రకారం ఎవరెవరికి వర్తించాలో వారందరికీ వర్తిస్తుంది. జీవో 68లో వాడిన పరిభాష అన్ని రకాల ప్రాజెక్టులకూ దానిని వర్తింపజేస్తుంది. నీటిపారుదల ప్రాజెక్టు కానటువంటి గంగవరం ఓడరేవు ప్రాజెక్టు నిర్వాసితులు దీనిని అమలు చేయించుకున్నారు కాబట్టి మీరు ఏ ప్రాజెక్టు నిర్వాసితులైనా మీరు కూడ అమలు చేయించుకోవచ్చు.

## 10. పునరావాసం సంగతేమిటి?

వ్యవసాయ భూములేకాక నివాస ప్రాంతాలలో కూడ ప్రభుత్వం భూముల్ని సేకరించినట్టయితే, ఇళ్ళకు కూడ భూసేకరణ చట్టం కింద మొదట్లో పేర్కొన్న

నియమాలు యావత్తు వర్తిస్తాయి. అంటే ఇళ్లకు, ఇంటి స్థలానికి కూడ నష్టపరిహారం లభిస్తుంది.

ఆ తరువాత ఖాళీచేసి వెళ్ళిపోవలసిందేనా? అంటే మొన్నటిదాకా అంతే. అయితే జీవో 68 జారీ అయిన తరువాత పరిస్థితి పూర్తిగా కాకున్నా కొంత మెరుగయింది. గ్రామస్తులందరూ గానీ, గ్రామంలో ఒక సామాజిక వర్గంగానీ ఒక చోట కలిసి ఉండదలిస్తే వారికి ఒకచోటే పునరావాసం కల్పించాలి. వారికి ప్రభుత్వం ఉచితంగా ఇంటిస్థలం ఇవ్వాలి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికైతే 40,000 రూపాయల ఆర్థిక సహాయం ఇవ్వాలి. ఆ పునరావాస స్థలాన్ని ఆదర్శగ్రామంగా సకల వసతులతో తీర్చిదిద్దాలి. రోడ్లు, కరెంటు, బడి, రక్షిత మంచినీటి వ్యవస్థ, ఆటస్థలం వగైరాలన్నీ ఏర్పాటు చేయాలి. ఖాళీ చేసిన ఊరినుంచి అక్కడికి పోవడానికి ఒక్కొక్క కుటుంబానికి 5000 రూపాయలు ఖర్చులకోసం ఇవ్వాలి. పశువులున్న వారికి పశువుల కొట్టం కట్టుకోవడానికి 3000 రూపాయలు ఇవ్వాలి. చిన్న అంగళ్ళు లేక ఉత్పత్తి కేంద్రాలు పెట్టుకొని బతుకుతున్న వారికి కొత్తచోట అవి కట్టుకోవడానికి 25,000 రూపాయల ఆర్థిక సహాయం ఇవ్వాలి. సాగుభూమికి నష్టపరిహారం వద్దు భూమికి భూమి కావాలని కోరినట్టయితే, సాగుయోగ్యమైన భూమి కనక అందుబాట్లో ఉన్నట్టయితే రెండున్నర ఎకరాల తరి, 5 ఎకరాల మెట్ట మించకుండా ఇవ్వొచ్చు. నిర్వాసితులు ఆదివాసులైతే ఆదివాసీ ప్రాంతంలోనే వారు ఎంచుకున్న చోట పునరావాసం కల్పించాలి. ఒకవేళ అది సాధ్యం కాకపోతే, పైన చెప్పిన అన్ని మొత్తాల మీద 25 శాతం వారికి అదనంగా ఇవ్వాలి. నష్టపరిహారం బదులు భూమికి భూమి ఇచ్చే విషయంలో ఆదివాసులకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది.

ఈ హక్కుల అమలు సంక్లిష్టంగా ఉండగలదు కాబట్టి, ప్రతీ ప్రాజెక్టుకూ జీవో 68లోని పునరావాస పథకం అమలు నిమిత్తం జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారిని 'అడ్మినిస్ట్రేటర్'గా ప్రభుత్వం నియమించాలి. ఆ అధికారి చేపట్టవలసిన మొట్టమొదటి పని, అతి తక్కువ మందిని నిర్వాసితులు చేసే ప్రత్యామ్నాయాన్ని అన్వేషించడం. ఆ తరువాత నిర్వాసితులను సంప్రదించి, పైన పేర్కొన్న పునరావాస పథకానికి ఆచరణ రూపం ఇవ్వాలి. అయినప్పటికీ అవకతవకలూ అవినీతీ ఉండే ప్రమాదం ఉంది కాబట్టి ప్రతీ ప్రాజెక్టుకూ నిర్వాసితుల భాగస్వామ్యంతో ఒక పర్యవేక్షణ కమిటీ, ఒక ఫిర్యాదుల కమిటీ వేయాలి.

ఈ పునరావాస పథకం ఇప్పటికెక్కడా సక్రమంగా అమలు కాలేదు కాబట్టి దీని వివరాలు తెలుసుకొని అమలు చేయించుకుంటారని ఆశిస్తూ పై వివరాలు ఇచ్చాము.

ఒక్క విషయం జ్ఞాపకం పెట్టుకోండి. వర్తక వాణిజ్య రంగాల పెద్దల ప్రయోజనాలను కాపాడడం కోసం తయారుచేసిన చట్టాలు వాటంతటవి అమలవుతాయిగానీ మీబోటి సాధారణ ప్రజల అవసరాల కోసం చేసిన చట్టాలు, జీవోలు అడుగడుగునా నిఘావేసి అమలు చేయించుకుంటే తప్ప అమలు కావు.

**మానవహక్కుల వేదిక బుక్‌లెట్‌గా వచ్చింది**

**జూన్ 2008**

# భూములెందుకు ఇచ్చేయాలి?

ప్రైవేట్ పరిశ్రమల కోసం ప్రభుత్వం భూసేకరణ చేయకూడదనీ ఆ ప్రైవేట్ కంపెనీలే రైతుల దగ్గర కొనుక్కోవాలనీ ఒక అభిప్రాయం ప్రచారంలో ఉంది. ప్రభుత్వం తనకు భూసేకరణ చట్టం ఇచ్చిన బలవంతపు భూసేకరణ అధికారాన్ని వినియోగించడం వల్ల తలెత్తుతున్న నిరసన, ఆందోళనల నేపథ్యంలో బలవంతానికి తావులేని ప్రత్యామ్నాయంగా ఇది ముందుకొచ్చింది. స్వచ్ఛందంగానే కొనుక్కునేట్టయితే రైతులు అడిగినంత భూమీ ఎందుకు అమ్మేస్తారు? తమకు తెలిసిన ఏకైక జీవితమైన సేద్యాన్ని వదిలిపెట్టి ఎందుకు వెళ్ళిపోతారు? కొనుక్కునే వాడికి ఆ భూమి చాలా లాభాలకు భూమిక కాబోతుందని వారికి తెలుసును కాబట్టి ఒకవేళ భూమిని వదిలిపెట్టడానికి సిద్ధపడినా చాలా పెద్దమొత్తం కోరుతారు. ఎక్కడికక్కడ తక్కువ ఖర్చుతో సాగించుకోవాలని చూసే కంపెనీలు దీనికి ఎందుకు సిద్ధపడతాయి? కాబట్టి ప్రభుత్వం ఎక్కడయినా ప్రైవేట్ కంపెనీలే రైతుల నుంచి భూమి కొనుక్కోవాలి– మేం సేకరించం అని ప్రకటిస్తే అక్కడేదో మర్మం దాగి ఉందని సందేహించడం సబబుగా ఉంటుంది. భారీగా పెట్టుబడులు పెట్టి ప్రకృతి వనరులను భారీగా కొల్లగొట్టి భారీగా లాభాల కోసం వేటాడే వ్యవహారంలో వారంతట వారు ఏ ప్రజాతంత్ర సూత్రాన్నయినా గౌరవిస్తారనుకోవడం భ్రమే అవుతుంది.

ఈ మర్మం ఏమిటన్నది జార్ఖండ్‌లో చూడగలము. జార్ఖండ్ అపారమైన ఖనిజ సంపద గల రాష్ట్రం. ఇనుము, బాక్సైట్, బొగ్గు, యురేనియంలతో మొదలుపెట్టి అనేక చిన్నతరహా ఖనిజాల దాకా అక్కడ విస్తారంగా దొరుకుతాయి. అయితే ఈ భూమి అధికంగా షెడ్యూల్డు ప్రాంతం. అంతేకాక తమ భూమి మీదికి వచ్చిన తెల్లవారిపైన పోరాటాలు చేసిన పూర్వీకులను ఇప్పటికీ జ్ఞాపకం చేసుకుంటున్న

హో, ముండా, ఒరవాన్, సంథాల్ తెగలు అధికంగా నివసించే ప్రాంతం కూడ. అందువల్ల రాజ్యాంగం షెడ్యూల్డు ప్రాంతంలో భూబదలాయింపుల పైన పెట్టిన నియంత్రణేకాక స్థానిక ఆదివాసుల ప్రతిఘటనను కూడ జార్ఖండ్ ప్రభుత్వం లెక్కలోకి తీసుకోకుండ పారిశ్రామీకరణ వ్యూహాలు రచించజాలదు. కాగా, అన్ని ప్రాంతాల లాగ జార్ఖండ్‌లోనూ రాజకీయ నాయకులకూ బ్యూరోక్రాట్లకూ సకల బుద్ధి జీవులకూ ఈ ఖనిజ సంపద 'వృథా' కాకూడదన్న విశ్వాసం బలంగా ఉంది. దానినంతా వేగంగా వెలికితీసి భారీ పెట్టుబడులు జతచేసి పారిశ్రామీకరణ త్వరత్వరగా చేపట్టడం వల్ల వచ్చే 'అభివృద్ధి' అభిలషణీయమని నిజంగా ఎంతగా నమ్ముతున్నారో చెప్పడం కష్టంగానీ ఈ క్రమంలో తమకు రాగల ప్రయోజనం కోసం తపిస్తున్నారన్నది మాత్రం నిజం. కాబట్టి జార్ఖండ్ ప్రభుత్వం టాటా, జిందాల్, మిట్టల్ వంటి పారిశ్రామికవేత్తలతో చాలా ఒప్పందాలు చేసుకుంది. వారు వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెడతారు, ఖనిజ పరిశ్రమలు, ఇనుము ఉక్కు బాక్సైట్ విద్యుత్ తదితర కర్మాగారాలూ నెలకొల్పుతారు. ప్రభుత్వం వారికి అన్నిరకాల సహాయ సహకారాలూ అందిస్తుంది. ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంటే ఇస్తుంది. అయితే రైతుల భూమి మాత్రం సేకరించి పెట్టదు. కంపెనీలు రైతులతో ప్రత్యక్షంగా ఒప్పందాలు చేసుకొని భూమి కొనుక్కోవడం అంటే ఏమిటో అక్కడి గ్రామాలలో చూడవచ్చు. గ్రామాలలో దళారులను తయారు చేసుకోవడం, వారికి పైసలీయడం, తినబెట్టడం, తాగబోయడం, వారి గుండాయిజంతో ఇతర ప్రజలను లొంగదీసుకొని ఒప్పించాలని చూడడం పెద్ద పెద్ద కంపెనీల కన్ను పడ్డ అన్ని గ్రామాలలోనూ కనిపించే చిత్రం. చివరికి రైతు ఎందుకొచ్చిన గొడవలెమ్మని అమ్మకానికి ఒప్పుకున్న నాడు అది స్వచ్ఛందమైన 'సేల్‌డీడ్' రూపమే తీసుకుంటుంది.

అతని చేత కొట్టి సంతకం చేయిస్తారనుకోనక్కరలేదు. అమ్మకాలకు అనుకూలమైన గుంపు గ్రామంలో తయారు చేయబడుతుంది. వారికి అకస్మాత్తుగా చేతినిండా డబ్బులు, మోటార్ సైకిళ్లు లభిస్తాయి. వారు అమ్మకాన్ని వ్యతిరేకించేవారితో గొడవ పెట్టుకుంటారు. ఆ వ్యతిరేకత సంఘటితమైన చోట వారి మీటింగ్‌లలో అల్లరి చేస్తారు. క్రిమినల్ కేసులవుతాయి. పోలీసులు ఏకపక్షంగా కేసులు పెడతారు. ఇదంతా జరుగుతుండగా మరో వైపు ఒప్పించే ప్రచారమూ జరుగుతుంటుంది. ఎకరానికి రెండు లక్షలిస్తారట, ఉద్యోగాలిస్తారట, భూమి ఇచ్చేస్తే ఏం అన్న చెవికొరుకుడు సాగుతుంటుంది. ఈ అశాంత పరిస్థితిని ఎక్కువకాలం తట్టుకోవడానికి చాలా సంకల్పం కావాలి. ఆదివాసులు మాత్రమే

నివసించే ప్రాంతాలలో నాగరిక సమాజపు బలహీనతలింకా పూర్తిగా ఒంటబట్టలేదు కాబట్టి అక్కడ ఈ పాచిక ఎక్కువగా పారలేదు. మిశ్రమ గ్రామాల పరిస్థితి వేరే. అక్కడ దళారులు దొరుకుతున్నారు, ఆశపెట్టి, భయపెట్టి, విసిగించి లోబరుచుకునే ప్రయోగమూ సాగుతున్నది. ఉదాహరణగా టాటాలనూ, జిందాల్‌నూ, మిట్టల్‌నూ కూడ తీసుకోవచ్చును గానీ టాటా కంపెనీకి సంబంధించిన ఒక ఉదాహరణే చెప్పుకుందాం. ఎందుకంటే టాటా వారు మర్యాదస్తులనీ మురికి పనులు చేయరనీ ఒక అభిప్రాయం ప్రచారంలో ఉంది. జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూం జిల్లా నుంచి వేరు చేసి కొత్తగా ఏర్పరిచిన సరాయికేలా-ఖర్సవాన్ జిల్లాలోని సుమారియా బ్లాక్‌లో టాటావారు సాలీనా 12 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయగల కార్ఖానా నెలకొల్పుతామని రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. నాలుగు గ్రామ పంచాయితీలలోని 23 గ్రామాలలో భూమికోసం వేట మొదలుపెట్టారు. ఆ గ్రామాలలో గట్టి ప్రతిఘటన ఎదురయింది. వ్యతిరేకించే రైతులు భూమిరక్షా గ్రామీణ ఏక్తామంచ్ అనే వేదిక ఏర్పాటు చేసుకొని ఆందోళనకు దిగారు. టాటావారు చూసి చూసి ఆ వేదిక నాయకులనే లొంగదీసుకున్నారు. వారే టాటావారి ఏజెంట్లుగా మారారు.

అయితే ఒకనాడు మంచ్ నాయకులు టాటావారు నెలకొల్పిన ఒక ఎన్‌జివోతో కలిసి ఆ గ్రామాలలో సర్వే మొదలు పెట్టేసరికి ప్రజలకు అనుమానం వచ్చింది. ఎందుకోసం సర్వే చేస్తున్నారని అడిగితే రేషన్‌కార్డులివ్వడం కోసం అని సమాధానం చెప్పారు గానీ వారు ప్రజలచేత నింపిస్తున్న ఫారాలలో కేవలం ఆదాయం వివరాలేకాక సర్వే నెంబర్లు, సరిహద్దులతో సహా భూముల వివరాలూ ఉన్నాయి. అసలు సంగతి గ్రహించిన గ్రామస్తులంతా ఒకటయి అప్పటిదాకా తమకు నాయకత్వం వహిస్తున్న మంచ్‌ను తొలగించి భూమిరక్షా గ్రామీణ ఆందోళన్ అభియాన్ అనే కొత్త వేదికను ఏర్పాటు చేసుకున్నారు. మంచ్‌కూ అభియాన్‌కూ మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. ఈ సంవత్సరమే మే నెల 21వ తేదీన టాటావారు మంచ్ ప్రతినిధులతో కలిసి టెంటోపోసీ అనే గ్రామంలో టైలరింగ్ నేర్పించే పునరావాస కేంద్రాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేయగా అభియాన్ నాయకత్వంలో గ్రామస్తులు జనతా కర్ఫ్యూ విధించి ఆ ఊరికి వచ్చే దారిలో ఉన్న వంతెనకు అడ్డంగా నిలబడి టాటా వారిని గ్రామంలోకి రానియ్యలేదు. వంతెన దగ్గరే అభియాన్‌లో చురుకయిన కార్యకర్త అయిన హీరాలాల్ మహతోకూ, దళారులుగా తయారయిన మంచ్ నాయకులకూ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ చొరవకు హీరాలాల్ మూల్యం చెల్లించవలసి

వచ్చింది. సెప్టెంబర్ 12న అతను మోటార్ సైకిల్‌పై తన స్వగ్రామమయిన టిడింఘిపా నుంచి జిల్లా కేంద్రానికి పోవడానికి బయలుదేరగా ఊరిబయట మంచ్ నాయకులు అతనిపైన బాంబులు వేసి కాల్పులు జరిపి హత్య చేశారు. దీనితో అతని గ్రామంలో ఎంతటి భయవాతావరణం ఏర్పడిందంటే ముగ్గురు పిల్లలున్న అతని భార్య మేనకను పరామర్శించడానికి కూడ అతని ఇంటికెవరూ పోయే పరిస్థితి లేదు. ఆ వాతావరణం ఇంకొక మూడు నాలుగు గ్రామాలలో తీసుకురాగలిగితే ఆ 23 గ్రామాలలో తమ 12 మిలియన్ టన్నుల ఉక్కు కర్మాగారానికి కావలసిన భూమి దొరికేస్తుందని టాటావారు భావిస్తుండవచ్చు. కానీ అది జరగకూడదని అభియాన్ కార్యకర్తలు గట్టి సంకల్పంతో ఉన్నారు. నష్టపరిహారం, పునరావాసం దక్కుతాయి లెమ్మన్న ఆశ ఈ ప్రాంత ప్రజలలో కల్పించడం కష్టం. వారికి దగ్గరలోనే జాదుగూడ ఉంది. కొంచెం దూరంలో జంషెడ్‌పూర్ ఉంది. జాదుగూడలోని యురేనియం కార్పొరేషన్‌వారి గనులకూ కర్మాగారానికీ భూముల్చిన వారు 'ఇప్పుడు ఏ హోటల్‌లో ప్లేట్లు కడుగుతున్నారో, ఏ బస్టాండులో మూటలు మోస్తున్నారో మాకు తెలీదా' అంటారు. దేశ పారిశ్రామిక చరిత్రలో ప్రఖ్యాతి గాంచిన జంషెడ్‌పూర్ ఉక్కు కర్మాగారం గురించి కూడ వారికి ఆసక్తికరమైన జ్ఞాపకాలున్నాయి. తొలుత టాటావారు ఉక్కు కర్మాగారం నెలకొల్పినప్పుడు సాంకేతిక స్థాయి చాలా వెనకబడి వుండింది. విపరీతమైన వేడిలో చేతుల్తో ఎక్కువ పనిచేయవలసి ఉండింది. ఆ దశలో ఆ కర్మాగారం కోసం భూములిచ్చిన ఆదివాసులు ఆ కర్మాగారంలోనే పెద్ద సంఖ్యలో పని చేశారు. అయితే కాలక్రమంలో యంత్రాల ఆధునీకరణ పెరిగిన కొద్దీ ఆదివాసులు ఒక్కొక్కరుగా బయటకు పోయి ఆదివాసీయేతరులు చేరారు. భూమి పోయినా పని దొరుకుతుంది అన్న వాదనకు జవాబుగా వారు మరొక అనుభవాన్ని కూడ చెప్తారు. సమీపంలోని రఖా అనే గ్రామం వద్ద 1967లో రాగిలోహపు ఖనిజం తవ్వితీసే గనులు ప్రారంభమయ్యాయి. దానికోసం భూమి కోల్పోయిన వారిలో చాలామంది ఎప్పటిలాగే చెల్లాచెదురయిపోగా కొద్దిమందికి ఆ పరిశ్రమలోనే చిన్నవే అయినా పనులు దొరికాయి. వారు బాగుపడ్డారనే అందరూ అనుకున్నారు. కానీ 30 సంవత్సరాలు గడిచిన తరువాత ఆ గనులనుంచి ఖనిజం తీయడం ఇంక లాభదాయకం కాదని మూసివేసారు. ఇప్పుడు వారికి భూమీ లేదు, ఉద్యోగమూ లేదు. కంపెనీ మూసివేసినప్పుడు ఇచ్చిన పైసలు ఖర్చయిపోయిన తరువాత ఏమీ లేదు. వస్తుందో రాదో, వస్తే ఎన్ని రోజులుంటుందో తెలియని ఉద్యోగం కోసం భూములెందుకు ఇచ్చేయాలి? అని వారు అడుగుతున్నారు.

నేలకింద ఉన్న ఖనిజాలు అలాగే ఉండిపోవలసిందేనా అని ఆందోళన చెందే వారుంటారు. ఇది సులభంగా తెగే చర్చ కాదు కానీ విస్థాపన గురించి, బలవంతపు భూసేకరణ గురించి, అమలుకాని పునరావాస ప్రక్రియ గురించి జరుగుతున్న వివాదం నిజానికి భిన్న అభివృద్ధి నమూనాల మధ్య వివాదం అని గుర్తించాలి. రాజకీయ పక్షాలు, టాటా జిందాల్ అంబానీలు, మీడియా అన్నీ కలిసి ఏకైక అభివృద్ధి నమూనా ఉందని ఊదరగొడుతున్నాయి. భారీగా పెట్టుబడులు ఆహ్వానించి అత్యధిక వృద్ధి రేటు సాధించడం, సకల మానవ ప్రాకృతిక వనరులనూ దానికి దాసోహం చేయడం ఈ నమూనా. ఇది కలిగించే విధ్వంసాన్ని వ్యతిరేకిస్తున్న ప్రజలు వేస్తున్న ప్రశ్న–దీనికి ప్రత్యామ్నాయాలు లేవా అని. ప్రకృతిని ప్రజల జీవన వనరుగా గుర్తించి, వారి జీవన ప్రమాణాలను క్రమంగా మెరుగుపరిచే దిశగా వారి భాగస్వామ్యంతో దేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడం సాధ్యం కాదా అన్నది పాలక అభివృద్ధి నమూనా నిరసనోద్యమాల నుంచి ఎదుర్కొంటున్న సవాలు. ఈ సంవాదంలో అన్ని ప్రశ్నలకూ సులభమైన జవాబులు లేకపోవచ్చు. కానీ ఇక్కడొక సంవాదమే లేనట్టు, చర్చించేదేమీ లేనట్టు, పాలకులు అభివృద్ధి అని పేరు పెడుతున్న దానిని వ్యతిరేకించే వారంతా అజ్ఞానులు, మూర్ఖులు, అవకాశవాదులు అయినట్టు వ్యవహరించడం క్షంతవ్యం కాదు.

**ఆంధ్రజ్యోతి దినపత్రిక**
**8 అక్టోబర్ 2008**

# భూసేకరణ, పునరావాస బిల్లులు: అసలే అరకొర... ఆపై ఆలస్యం

అప్పుడెప్పుడో బ్రిటిష్ పాలకులు రోడ్లు, రైల్వేలైన్లు వేయడం కోసం, ప్రభుత్వ కార్యాలయాలు నెలకొల్పడం కోసం జారీ చేసిన భూసేకరణ చట్టం(1894)ను స్వాతంత్ర్యానంతరం పరిశ్రమల కోసం, నీటిపారుదల ప్రాజెక్టుల కోసం అవసరమైన భారీ భూసేకరణ ప్రక్రియ కొరకు వాడుకోవటం ఈ మధ్యకాలంలో తీవ్ర విమర్శకు గురయింది. గ్రామంలో కొన్ని ఎకరాల భూమిని సేకరించడం కాదు, గ్రామాలకు గ్రామాలే ఈ భారీ భూసేకరణలో ఖాళీ అయిపోతాయి. వాటిలో నివసించే ప్రజలకు ఏ రకమైన ప్రత్యామ్నాయం గానీ పునరావాసం గానీ 1894 నాటి భూసేకరణ చట్టంలో లేదు. స్వతంత్ర భారత ప్రభుత్వమూ దానికోసం నియమాలు రచించలేదు. 1984లో ఆ చట్టాన్ని సవరించి ప్రజావసరాల కోసమే కాక కంపెనీల కోసం కూడ ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేయవచ్చునన్నారే తప్ప ప్రజలకు ఉపయోగకరమైన మార్పులేవీ చేయలేదు. ఖాళీ చేసిన గ్రామాలలో స్థిరాస్తులున్న వారికి 1894 నాటి చట్టం ప్రకారం నష్టపరిహారం దక్కింది గానీ స్థిరాస్తి లేకుండా లేదా స్థిరాస్తి ఉండీ దానిని రుజువు చేసే ఆధారాలేవీ లేకుండ ఆ గ్రామాలలో బతికిన వారికి ఏ నష్టపరిహారమూ దక్కలేదు.

పోనీ నిర్వాసితుల సంఖ్య స్వల్పమా అంటే కాదు. 2007 నాటికి మన 60 సంవత్సరాల అభివృద్ధి 6 కోట్ల మందిని నిర్వాసితులను చేసిందని అంచనా. వీరిలో అతికొద్ది మంది గురించి తప్ప తక్కినవారు ఏమయ్యారు, ఎక్కడున్నారు, ఎట్లా ఉన్నారు అన్న సమాచారం ఎవరి దగ్గరా లేదు. దేశంలోగానీ ఏ

రాష్ట్రంలోగానీ పునరావాస చట్టమేదీ లేదు కాబట్టి ఇన్నేళ్లలో కొద్దిమంది మాత్రమే ఏదో ఒక మేరకు తాత్కాలిక విధాన నిర్ణయాల దయ వల్ల పునరావాసం పొందారు. అది వాళ్ల జీవన ప్రమాణాలను పెంచే పునరావాసం కాకపోయినా కనీసం వారు ఏదో ఒక పని చేసుకొని బతుకుతున్నారన్న సమాచారమైనా ఉంది. తక్కినవారి గురించి ఏ సమాచారమూ లేదు.

మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే నిర్వాసితులయిన వారిలో 40 శాతం ఆదివాసులు. ఆదివాసీ జనాభా దేశ జనాభాలో 7.5 శాతం కాగా ప్రాజెక్టు నిర్వాసితులలో వారి సంఖ్య 40 శాతం. దీని పర్యవసానం ఏమిటంటే దేశంలోని ఆదివాసులలో నూటికి 30 శాతం ఏదో ఒక రోజు ఏదో ఒక ప్రాజెక్టు కింద నిర్వాసితులయిన వారే.

గడచిన 10–15 సంవత్సరాల కాలంలో ఈ పరిస్థితి తీవ్ర విమర్శకు గురయింది. న్యాయమైన నష్టపరిహారం, సమగ్రమైన పునరావాసం కల్పించకుండ అభివృద్ధి పేరిట లక్షలాది ప్రజలను వారి భూముల నుండి, ఆవాసాల నుండి గెంటివేయడం అన్యాయం అని నిర్వాసితుల తరఫున ముందుకొచ్చిన ఉద్యమాలు అన్నాయి. వీటిలో అందరికీ బాగా తెలిసింది నర్మదా బచావో ఆందోళన్ (ఎన్‌బిఏ). నర్మదా నదిపైన కడుతున్న సర్దార్ సరోవర్ ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులవుతున్న రెండు లక్షలమంది ప్రజలకు ప్రతినిధి ఈ సంస్థ. మళ్లీ విస్థాపనలో సర్దార్ సరోవర్‌తో పోల్చదగ్గ ప్రాజెక్టు మన పోలవరమే. అయితే నర్మదా ఆందోళనలో పదవ వంతు ఉద్యమం కూడ మన దగ్గర జరగలేదు. అందుకు అందరమూ సిగ్గుపడాలి.

## ఏడేళ్లుగా పెండింగ్‌లో...

ఈ విమర్శ ఫలితంగా 2003 లో మొట్టమొదటిసారి కేంద్ర ప్రభుత్వం ఒక సహాయ పునరావాస విధానాన్ని ప్రతిపాదించింది. ఆ ప్రతిపాదన మీద జరిగిన చర్చ ఫలితంగా 2006లో దానికంటే బలమైన ముసాయిదాను నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ తయారు చేసింది. అయితే దానికి చట్ట రూపం ఇచ్చేసరికి మళ్లీ కొంత నీరుగార్చారు. చివరికి 2007లో పునరావాస చట్టాన్ని బిల్లు రూపంలో పార్లమెంటులో ప్రవేశపెట్టారు (రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ చట్టం, 2007). రెండేళ్లు గడిచినా దానిని చర్చించి చట్టం జారీ చేయడానికి పార్లమెంటుకు తీరిక దొరకలేదు. అయినా ఈ రెండేళ్లలో లక్షల ఎకరాల భూసేకరణ మాత్రం జరిగిపోయింది.

దానితోబాటు 1894 నాటి భూసేకరణ చట్టాన్ని సవరించే 'భూసేకరణ (సవరణ) చట్టం, 2007' ను కూడ బిల్లు రూపంలో పార్లమెంటులో ప్రవేశపెట్టారు. దానిని చర్చించడానికీ పార్లమెంటుకు తీరిక లేకుండా పోయింది కాబట్టి అది కూడ ఇంకా చట్టం రూపం తీసుకోలేదు. బలవంతపు భూసేకరణ వల్ల జరుగుతున్న అన్యాయాన్ని సవరించడానికని చెప్పి ప్రవేశపెట్టిన బిల్లులను పార్లమెంటులో కనీసం చర్చించకుండా, వాటికి చట్టరూపం ఇవ్వకుండా, మరొకపక్క రెండంకెల వృద్ధిరేటు దిశగా సెజ్‌లకూ, పెద్దపెద్ద విమానాశ్రయాలకూ, ఓడరేవులకూ, గనులకూ అనుమతులు ఇస్తూ భూములు అప్పగిస్తూపోతున్న పాలకుల చిత్తశుద్ధి గురించి, నిజాయితీ గురించి కొత్తగా విడమరచి విమర్శించాల్సిన అవసరం లేదు కాని ఆ బిల్లులలో ఏముందో చూద్దాం.

## భూసేకరణ (సవరణ) చట్టం, 2007

భూసేకరణ చట్టం ప్రభుత్వానికి పౌరుల భూమిని బలవంతంగా స్వాధీనం చేసుకునే అధికారం ఇస్తుంది. బలవంతంగా అంటే ఉద్దరకు అని కాదు. నష్టపరిహారం ఇస్తుంది, కానీ రైతుకు తన భూమి ఇవ్వడానికి ఇష్టం లేకున్నా తీసుకోగలదు. బెంగాల్‌లో నందిగ్రాం, సింగూరు ఆందోళనలు తలెత్తిన నేపథ్యంలో ఈ చట్టాన్నే రద్దు చేయాలనీ, ఇష్టపూర్వకంగా ఇచ్చిన భూమిని ప్రభుత్వం తీసుకోవాలే తప్ప బలవంతంగా సేకరించడానికి వీలు లేదనీ ఒక వాదన ముందుకొచ్చింది. అయితే ప్రజావసరాల కోసం ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేయక తప్పని సందర్భాలు నిజంగానే ఉండగలవు.

ఉదాహరణకు ఒక గ్రామంలో బడి కట్టాలనుకోండి దానికి భూమి కావాలి. ఆ గ్రామంలో ప్రభుత్వ భూమిలేని పక్షంలో ఎవరిదైనా ప్రైవేట్ భూమి తీసుకోక తప్పదు. ఆ గ్రామంలో భూమిగల రైతులంతా తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపిస్తున్నారనుకోండి. ప్రభుత్వ స్కూలు కేవలం భూమిలేని పేదల అవసరమేననుకోండి (ఇది నిజానికి ఇవాళ దాదాపు అన్ని గ్రామాలలో ఉన్న పరిస్థితే). ఆ కారణంగా రైతులెవ్వరూ ప్రభుత్వ బడి కోసం స్వచ్ఛందంగా భూమి ఇవ్వడానికి ఇష్టపడరనుకోండి. అప్పుడు బలవంతంగా సేకరించక తప్పదు. ఇటువంటి సందర్భాలు అనేకం ఉంటాయి. ఒక రహదారి, ఒక రైలుమార్గం అవసరం అని అందరూ ఒప్పుకోవచ్చును గానీ 'నా భూమి ఇవ్వను పక్కవాళ్లది తీసుకొమ్మ'నే వైఖరి అందరూ అనుసరించవచ్చు. అప్పుడు ఎవరో ఒకరి భూమిని ప్రభుత్వం తీసుకోక తప్పదు.

## ఏది ప్రజోపయోగం?

అయినప్పటికీ రెండు విషయాలలో బలవంతపు భూసేకరణను విమర్శించే అవకాశం ఉంది. ఒకటి, ప్రజావసరం లేక ప్రజోపయోగం అంటే అర్థం ఏమిటి? అనేది. 1894 నాటి భూసేకరణ చట్టం దానికి స్పష్టమైన నిర్వచనం ఇవ్వలేదు. ఒక స్కూలు, ఒక రైల్వే లైను, ఒక ఆస్పత్రి మాత్రమే కాక టాటావారి చిన్నకారు కూడ ఆ చట్టం కింద ప్రజావసరమే అయింది. ప్రత్యేక ఆర్థిక మండలి కూడ ప్రజావసరమే అయింది. దీనిని మార్చి ప్రజావసరాన్ని స్పష్టంగా, అర్థవంతంగా నిర్వచించాలనేది ఒక చర్చ. రెండవది, భూసేకరణ వల్ల కేవలం ఆస్తులే కాదు, జీవనం కూడ పోతుంది. స్వంత ఆస్తులు కోల్పోయిన వారికి మాత్రం నష్టపరిహారం ఇచ్చి జీవనం కోల్పోయిన వారికి మొండి చేయి చూపించడం అన్యాయం.

ఏ ప్రాజెక్టువల్లనయినా ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం పొందేది కొందరే అయినా దానిని దేశానికి అభివృద్ధికరంగా భావించడం జరుగుతుంది. అటువంటప్పుడు ప్రాజెక్టువల్ల కలిగే నష్టాన్ని కూడ దేశానికి నష్టంగా భావించి ప్రత్యక్షంగా, పరోక్షంగా నష్టపోయే వారిని దేశం ఆదుకోవడం న్యాయం. ఆస్తులున్న వారినీ లేనివారినీ కూడ దేశం ఆదుకోవాలి. వారు కోల్పోయే జీవనాన్ని పూర్తిస్థాయిలో వారికి తిరిగి ఇవ్వాలి. ఇప్పుడు జరుగుతున్నదేమిటంటే స్వంత ఆస్తులున్న వారికిచ్చే నష్టపరిహారం సహితం తిరిగి అంత ఆస్తి కొనుక్కోవడానికి ఎక్కడా సరిపోవడం లేదు. ఇక ఆస్తిహక్కు రుజువు చేసుకోలేని వారికి, పట్టా లేకుండా ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న వారికి, కూలి చేసుకొనీ, వివిధ వృత్తులు చేసుకొనీ జీవనం పొందుతున్న వారికి అసలు నష్టపరిహారమే రావడం లేదు. పశువుల బీళ్లు, కుంటలు మొదలయిన ఉమ్మడి వనరులు కోల్పోవడం వల్ల కలిగే నష్టం లెక్కలోకే రావడం లేదు.

2007 సవరణ, కొత్త పునరావాస చట్టం రెండూ ఈ చర్చకు పూర్తి న్యాయం చేయవు. ప్రజావసరం నిర్వచనం ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. నష్టపరిహారం, పునరావాసాల స్థితి మెరుగవుతాయి గానీ పూర్తిస్థాయిలో బాధితుల జీవనాన్ని, జీవన ప్రమాణాన్ని అవి కాపాడలేవు.

పైన చెప్పినట్లు భూసేకరణ చట్టం 'ప్రజావసరం' అనే మాటనే నిర్వచించలేదు. చట్టంలో నిర్వచించని మాటలకు సాధారణ అర్థమే ఉంటుందని న్యాయ సిద్ధాంతం

అంటుంది కానీ ఆచరణలో వాటి అర్థాన్ని కోర్టులు నిర్ణయిస్తాయి. 1894 నాటి భూసేకరణ చట్టం కొన్ని రకాల అవసరాల్ని పేర్కొని ఇవన్నీ ప్రజావసరాల కిందికే వస్తాయనింది. అంతే తప్ప అవి మాత్రమే ప్రజావసరాలు అనలేదు. న్యాయస్థానాలు రంగంలోకి దిగి 'ప్రజావసరం' అనే దానికి విస్తృత అర్థం కల్పించాయి. ప్రత్యేకించి పారిశ్రామిక అభివృద్ధి పేరిట జరిగే ఏ భూసేకరణయినా ప్రజావసరం కోసమేనన్నాయి.

అన్ని రాష్ట్రాలూ పారిశ్రామిక అభివృద్ధికి అవసరమయిన మౌలిక వసతులు నెలకొల్పి పరిశ్రమలను ఆహ్వానించే బాధ్యతగల సంస్థలను ఏర్పాటు చేసాయి. మన రాష్ట్రంలో ఎ.పి.ఐ.ఐ.సి అటువంటిదే. భూమి సేకరించి ఎ.పి.ఐ.ఐ.సి చేతిలో పెట్టడం ప్రజావసరాల పేరిట సమర్థనీయం అయింది. ఆపైన ఆ భూములను అది ప్రైవేటు కంపెనీలకు అమ్ముకోవచ్చు. అయితే 1984లో భూసేకరణ చట్టాన్ని సవరించి ప్రజావసరాల కోసమే కాక 'కంపెనీల' కోసం కూడ బలవంతంగా భూసేకరణ చేయవచ్చునని అన్నారు. అప్పటినుండి ఈ ముసుగు అవసరం కూడ లేకుండ పోయింది.

## 'ప్రజావసరం' అవగాహనలో మార్పు

2007 సవరణ కూడ ప్రజావసరం అనే దానిని నిర్వచించలేదు. పాత చట్టంలాగే కొన్ని అవసరాలను పేర్కొని ఇవన్నీ ప్రజావసరాలు అని వదిలేసింది తప్ప సమగ్ర నిర్వచనం ఇవ్వలేదు. అయితే పాత చట్టం ఇచ్చిన జాబితాకూ దీనికీ స్పష్టమైన తేడా ఉంది. పాత చట్టం విద్య, ఆరోగ్యం, ఆవాసం, మురికివాడల పునరావాసం, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, ప్రభుత్వరంగ సంస్థల అవసరాలను ప్రజావసరాలుగా పేర్కొంటే 2007 సవరణ అవన్నీ తొలగించి విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, రహదార్లు, వంతెనలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, రైల్వేలు, గనులు, నీటిసరఫరా ప్రాజెక్టులు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశుధ్య ప్రాజెక్టులు మొదలయిన 'మౌలిక సదుపాయాల'ను, సైనిక అవసరాలను ప్రజావసరాలుగా పేర్కొనింది.

దీని అర్థం విద్య, ఆరోగ్యం, ఆవాసం మొదలయినవి ఇక మీదట ప్రజాప్రయోజనాల కిందికి రావని కాదు. ఆ ప్రయోగానికి ఉండే సాధారణ భావం కారణంగా అవి ఇప్పటికీ ప్రజాప్రయోజనాల కిందే లెక్కకు రావచ్చు. ఎటొచ్చీ ఆ సంగతి ఇక మీదట కోర్టులు తేల్చవలసి ఉంటుంది. కానీ రహదార్లు, విమానాశ్రయాలు వగైరాల విషయంలో సందేహానికి ఆస్కారం లేకుండ ఇవి

ప్రజాప్రయోజనాలే అని సవరణ చట్టం చెప్తుంది. 'అభివృద్ధి' అనే భావనకు గడచిన 10-15 సంవత్సరాలుగా పాలనా విధానాలలో స్థిరపడిన వ్యాఖ్యానం ప్రభావం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. ఈ అభివృద్ధి ప్రజావసరమేనని భూసేకరణ చట్టం చేతనే ఇప్పుడు చెప్పిస్తున్నారు.

ప్రజావసరం కోసమే కాక కంపెనీల కోసం కూడ భూసేకరణ చేయవచ్చునని 1894 చట్టానికి 1984లో చేసిన సవరణలో చేర్చారని చెప్పాము. 2007 సవరణ దానిని తొలగించింది. అయితే 'ప్రజావసరం' నిర్వచనంలోనే ప్రజాసామాన్య అవసరాలను తీర్చే ప్రైవేట్ కంపెనీల అవసరాలను చేర్చారు. ప్రజాసామాన్య అవసరాలను తీర్చాలి అనేది పెద్ద షరతేం కాదు. ఎందుకంటే ఉపాధి కల్పన ఒక ప్రజావసరమేనని ఇప్పటికే న్యాయస్థానాలు తీర్మానించి ఉన్నాయి. ఏ కంపెనీ అయినా ఎంతో కొంత ఉపాధి కల్పిస్తుంది కాబట్టి ఆ రకంగా ప్రజాసామాన్య అవసరాలను తీరుస్తుందని వాదించవచ్చు. అయితే ఇంకొక్క తేడా 2007 సవరణలో పెట్టారు. ప్రైవేట్ కంపెనీ తన అవసరంలో 70 శాతం భూమి రైతుల నుండి కొనుక్కున్నట్టయితే మిగిలిన 30 శాతాన్ని ప్రభుత్వం సేకరించి అప్పగించవచ్చునని ఈ సవరణ అంటుంది. అంటే ప్రైవేట్ కంపెనీల మొత్తం అవసరాన్ని ప్రభుత్వం తీర్చకూడదు. 70 శాతం వాళ్లు భూమి యజమానుల దగ్గర కొనుక్కుంటే తక్కిన భూమిని ప్రభుత్వం సేకరించి ఇవ్వొచ్చు.

ఇది ఇప్పుడున్న దానికంటే మెరుగేకానీ, కాకినాడ సెజ్‌కోసం డెవలపర్ కొంత కొనుగోలు, ప్రభుత్వం కొంత సేకరణ చేసిన వైనాన్ని దృష్టిలో ఉంచుకుంటే ఇది ఏ రకంగా దుర్వినియోగానికి గురవుతుందో ఊహించవచ్చు. మొదట కొంతమంది స్వచ్ఛందంగానే అమ్ముతారు, తక్కువ ధరకూ అమ్ముతారు. వ్యవసాయం మీద ఆసక్తి లేనివారు, ఎంతో కొంతకు అమ్మేసి బయటపడదామని చూసేవారు ఉంటారు. ఆ తరువాత ఇరుగు పొరుగు రైతులపైన ఒత్తిడి పెరుగుతుంది. మీరు కూడ స్వచ్ఛందంగా అమ్మేయకపోతే చివరికి ప్రభుత్వం సేకరించే 30 శాతం కోటాలో పడతారు అని కొనుగోలుదారుడే కాదు, రెవెన్యూ అధికారులు సహితం బెదిరిస్తారు. ప్రభుత్వ సేకరణలో ఉన్న తలనొప్పిని తప్పించుకోవడానికి ఒక్కొక్కరుగా అమ్మడం మొదలుపెడతారు. చివరికి 30 శాతం భూసేకరణ చేయవలసిన అవసరం సహితం ఉండకపోవచ్చు. ఇంకొక రకంగా చెప్పాలంటే ప్రభుత్వం భూసేకరణ బెదిరింపు కంపెనీ కొనుగోలుకు సాధనంగా పనిచేస్తుంది.

## నష్టపరిహారాన్ని ఎలా లెక్కగడతారు?

భూసేకరణలో ప్రభుత్వం చెల్లించే నష్టపరిహారం విషయంలో 'ఇప్పుడున్న జీవన ప్రమాణాన్ని తిరిగి పొందగలిగేంత ఇవ్వాలి' అన్న ప్రమాణాన్ని అందుకోకపోయినా, 2007 సవరణ ప్రస్తుత పరిస్థితి కంటే మెరుగే. ప్రస్తుతం ఆ భూమి 'మార్కెట్ ధర'ను, దానిపైన 30 శాతం (బలవంతపు సేకరణకు గాను ఇచ్చే పరిహారాన్ని చట్టపరిభాషలో సొలేషియం అంటారు), మరొక 12 శాతం అదనపు మార్కెట్ విలువను చెల్లిస్తున్నారు. 'మార్కెట్ ధర' అనేదానికి భూసేకరణ చట్టంలో నిర్వచనం లేదు. ఆయా ప్రాంతాలలో గడచిన మూడు సంవత్సరాలలో రిజిస్టర్ అయిన అమ్మకాల సగటును అనుసరించి ప్రభుత్వం మార్కెట్ విలువను ప్రకటిస్తుంది. రిజిస్ట్రేషన్ ఖర్చులు తగ్గించుకొనడానికి అమ్మకాలలో ధర తరచుగా తక్కువ చూపిస్తారు కాబట్టి ఇది అసలు ధరకంటే తక్కువగా ఉంటుంది. దానిపైన రైతు కోర్టులో కేసులు వేసుకోవడం, ప్రతీ భూసేకరణా జిల్లా కోర్టు నుంచి హైకోర్టుకు, అప్పుడప్పుడు సుప్రీంకోర్టుకు పోవడం పరిపాటి అయింది. వకీళ్లకూ బ్రోకర్లకూ ఇదొక పెద్ద ఆదాయ మార్గం అయింది.

2007 సవరణ చట్టంలోనే ప్రభుత్వం మార్కెట్ ధర లెక్కించే పద్ధతిని రాసేసింది. గడచిన మూడు సంవత్సరాలలో ఆయా ప్రాంతాలలో జరిగిన మొత్తం అమ్మకాలలో అధిక ధర పలికిన 50 శాతాన్ని లెక్కలోకి తీసుకొని వాటి సగటును మార్కెట్ ధరగా తీసుకోవాలని అంటుంది. అంటే అమ్మకాల సగటు ధరను కాక అధిక ధరకు జరిగిన అమ్మకాల సగటు తీసుకోవాలంటుంది. దానిపైన పరిహారం (సొలేషియం) 30 శాతం కాక 60 శాతం చెల్లించాలంటుంది. అంతవరకు బాగానే ఉంది గానీ, భూమి కోల్పోయిన వారెవరయినా వేసుకునే మొదటి ప్రశ్న, మరీ దూరం పోకుండ మళ్లీ అంత భూమి, అదే కోవకు చెందిన భూమి కొనుక్కోగలనా అనేది. దానికి మాత్రం భరోసా లేదు. నిజానికి పారిశ్రామిక మౌలిక సదుపాయాల కోసం భారీగా భూసేకరణ చేసిన సందర్భాలలో చుట్టూ భూముల ధరలు రెండు కారణాలుగా వేగంగా పెరుగుతాయి. పరిశ్రమలు రాబోతాయన్న ఆశతో పెరుగుతాయి. భూమి కోల్పోయిన వారందరూ చేతిలో పైసలు పట్టుకొని ఆ పరిసరాలలో భూమి కొనుగోలు చేయాలని చూడడం వల్ల కూడ భూముల ధరలు పెరుగుతాయి. కాబట్టి ఎట్టి పరిస్థితిలోనూ భూములు కోల్పోయినవారు ఆ పరిసరాలలో అంత భూమి కాదు కదా, అందులో సగం కూడ కొనుగోలు చేయలేరు.

ప్రజల నుండి భూమిని చవకగా సేకరించి ఆ తరువాత ఎక్కువ ధరకు ప్రైవేట్ కంపెనీలకు అమ్ముకుంటున్నారన్న ఫిర్యాదు ప్రభుత్వాలపైన తరచుగా వింటున్నాం. పోలేపల్లి సెజ్ వ్యతిరేక ఆందోళనకు ఈ మోసం ఒక ప్రధాన హేతువు అయింది. 2007 సవరణ ఈ విషయంలో ఒక మంచి షరతును చేర్చింది. సేకరించిన భూమిని ఎవరికైనా అమ్మడం జరిగితే సేకరించిన ధరకూ, అమ్మిన ధరకూ మధ్యనున్న తేడాలో 80 శాతం ఆ భూమి యజమానికి ఇవ్వాలి.

ప్రైవేట్ కంపెనీ కోసం భూమి సేకరించేటట్టయితే వారు 70 శాతం కొనుగోలు చేస్తే 30 శాతం మాత్రమే ప్రభుత్వం సేకరించాలన్న నియమం చూసాము. అప్పుడు ఆ 30 శాతం భూమికి ఇచ్చే నష్టపరిహారం కంపెనీ చేసిన కొనుగోలు ధర కంటే తక్కువ ఉండడానికి వీలు లేదని కూడ నియమం పెట్టారు.

## పునరావాస చట్టం, 2007

నష్టపరిహారాన్నీ పునరావాసాన్నీ నిజానికి వేరు చేయలేము. భూములు, ఊర్లు ఖాళీ చేసి జీవనాధారాన్ని కోల్పోతున్నందుకు నష్టపరిహారం ఇవ్వాలి, ఆ తరువాత మళ్లీ బతుకు కొనసాగించడానికి పునరావాసం కల్పించాలి. వారంతా ఊరు ఊరుగా దగ్గరిలో ఒకచోట బతకగలగాలి, తిరిగి ఒకనాటి జీవన ప్రమాణం అనుభవించగలగాలి అనేది కనీస నియమం. దేశ అభివృద్ధికోసం వారు త్యాగం చేస్తున్నారు కాబట్టి వారు ఇంకా మెరుగయిన జీవనం పొందాలన్న ఆలోచన కూడ న్యాయమైనదే. ఎటొచ్చీ మొదటి దానికే భరోసా లేనప్పుడు అంతకంటే ఎక్కువ కోరి ప్రయోజనమేముంది అని నిస్పృహ చెందడం సహజం.

భూసేకరణ చట్టాన్ని సవరించి, కొత్తగా పునరావాస చట్టాన్ని తయారు చేసినా కూడ ఆ భరోసా మాత్రం లేదు. స్వంత ఆస్తికిచ్చే నష్టపరిహారాన్ని మొదటి దానిలో ఉంచి, వివిధ వృత్తులు చేసుకొని, కూలి చేసుకొని బతికే వారికిచ్చే నష్టపరిహారాన్ని, అందరికీ ఇచ్చే పునరావాసాన్ని రెండవదానిలో (పునరావాస చట్టంలో) రాసారు. ఈ పునరావాస చట్టంలో కొట్టచ్చినట్టు కనిపించే విషయం 400 కుటుంబాలకు పైగా (కొండ ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాలలోనయితే 200కు పైగా) భౌతికంగా నిర్వాసితులయ్యే ప్రాజెక్టుల పునరావాస ప్రక్రియకు ఒక పద్ధతి, అంతకంటే తక్కువ సంఖ్యలో నిర్వాసితులయ్యే ప్రాజెక్టుల పునరావాస ప్రక్రియకు వేరొక పద్ధతి నిర్దేశించడం. మొదటి దానికి (క్లుప్తంగా 'పెద్ద ప్రాజెక్టులు' అందాం) కొంత పారదర్శకత, బాధిత ప్రజలకు నిర్ణయాలలో పాత్ర ఉండే పద్ధతి, రెండవ దానికి (కుప్తంగా 'చిన్న ప్రాజెక్టులు' అందాం) పూర్తిగా

ఏకపక్షమైన పద్ధతి పెట్టారు. దీనికి ఏ కారణమూ కనిపించదు. ఈ చట్టం పునరావాసం ఇచ్చేది కేవలం భౌతికంగా విస్థాపనకు గురయ్యే వారికే కాదు. అంటే ఇళ్లు ఖాళీచేసి వీధిన పడిన వారికి మాత్రమే కాదు. ప్రాజెక్టు బాధితులందరికీ ఇస్తుంది. అంటే ఇల్లు ఖాళీ చేయకపోయినా జీవనం కోల్పోయే వారందరికీ ఇస్తుంది. నిర్వాసిత కుటుంబాల సంఖ్య 400 కంటే ఎక్కువ ఉన్నా తక్కువ ఉన్నా బాధితుల సంఖ్య ఎంతయినా ఉండగలదు. అటువంటప్పుడు నిర్వాసితుల సంఖ్యను బట్టి వర్గీకరించటంలో అర్థం ఏమిటి? నిజానికి ఈ మధ్యకాలంలో ఊరిని ముట్టుకోకుండ ఊరి శివారులోని పంటభూములు, బీడు భూములు సేకరించే నేర్పు ప్రభుత్వం ప్రదర్శిస్తున్నది. మన రాష్ట్రంలో గడచిన అయిదేళ్లలో జరిగిన భూసేకరణలో అధికభాగం ఈ రకంగా జరిగింది. లేదా ప్రాజెక్టును దశలవారీగా విడగొట్టి కొద్దికొద్దిగా విస్థాపన కలిగించే పద్ధతిలో భూసేకరణ చేయొచ్చు. అటువంటి ఎత్తుగడలు అనుసరించేటట్టయితే చట్టంలోని అందమయిన పారదర్శక విధానాలు కాగితం మీదే ఉండిపోయి ఏకపక్షమైన పునరావాస ప్రక్రియ మాత్రమే ప్రాజెక్టు బాధితులందరికీ దక్కే ప్రమాదం ఉంది.

## ఎవరు బాధితులు

పోతే ప్రాజెక్టు బాధితులకు ఈ చట్టం విస్తృతమైన నిర్వచనమే ఇచ్చింది గానీ అందులోనూ సమస్యలున్నాయి. భూసేకరణవల్ల నివాసం, ఆస్తి, జీవనం దెబ్బతినే వారందరూ ప్రాజెక్టు బాధితులేనంటుంది. ఇందులోకి భూమి కోల్పోయేవారే కాక, ఇప్పటికి 5 సంవత్సరాలుగా నిరంతరాయంగా సంబంధిత ప్రాంతంలో ఏదయినా వృత్తి లేక చిన్న వ్యాపారం ద్వారా జీవనం పొందుతూ ఉండి ఇప్పుడు భూసేకరణవల్ల ఆ జీవనాధారాన్ని కోల్పోయినవారు, తమ వృత్తి నుండి లేక వ్యాపారం నుండి పూర్తిగా గానీ చెప్పుకోదగ్గ మోతాదులో గానీ దూరం అయినవారు వస్తారు. 'అప్పటికి 5 సంవత్సరాలుగా నిరంతరాయంగా ఆ ప్రాంతంలో ఏదయినా వృత్తి చేసుకుంటూ ఉండాలి' అన్న నియమం కఠినమైనదే. కేవలం చుట్టపుచూపుగా వచ్చి తాత్కాలికంగా సంబంధిత ప్రాంతంలో ఉంటున్న వారిని మినహాయించడమే ఉద్దేశ్యమయితే 5 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా అక్కడే జీవనం పొందుతూ ఉండాలి అన్న నియమం పెట్టడం భావ్యమా? ఇది వివిధ వృత్తుల వారిని బాధితులుగా గుర్తించడానికి పెట్టిన నియమం కాగా, వ్యవసాయ కూలీల విషయంలో అప్పటికి 5 సంవత్సరాలుగా వారు ప్రాథమికంగా సంబంధిత ప్రాంత నివాసులయి ఉండాలి, భూసేకరణ నాటికి వ్యవసాయ కూలీలుగా జీవనం పొందుతూ ఉండాలి, భూసేకరణవల్ల జీవనాధారాన్ని కోల్పోయి ఉండాలి అని

నియమం పెట్టారు. అటువంటి వారంతా ప్రాజెక్టు బాధితుల నిర్వచనంలోకి వస్తారు. కూలి దొరకక తాత్కాలికంగా వలసపోయేవారిని కూడ లెక్కలోకి తీసుకునే ఉద్దేశ్యంతో 5 సంవత్సరాలు నిరంతరాయంగా సంబంధిత ప్రాంతంలో కూలి చేసుకుంటూ ఉండాలి అనే బదులు 5 సంవత్సరాలు ప్రాథమికంగా ఆ ప్రాంత నివాసి అయి ఉండి చివరి ఘడియ దాకా వ్యవసాయకూలీగా జీవనం పొందుతూ ఉండాలి అన్నారు. భూసేకరణ ప్రకటన వెలువడే నాటికి తమ ఊరిలో పని దొరకక నాట్ల కోసమో, కోతల కోసమో వేరే ప్రాంతానికి తాత్కాలికంగా వలసపోయిన వారు కూడ ఈ నిర్వచనంలోకి వస్తారు. మరి ఇతర చిన్న వృత్తుల వారికి కూడ ఈ వెసులుబాటు ఎందుకియ్యలేదో! వలసలు తప్పనిసరయిన ప్రాంతాలలో కేవలం వ్యవసాయ కూలీలే కాదు, చాకలి వంటి కుల వృత్తుల మీద ఆధారపడి బతికేవారు, చిన్న దుకాణాలు పెట్టుకొని బతికేవారు కూడ తాత్కాలికంగా వలసపోయి మళ్లీ వర్షాలు పడినాక వెనక్కి వస్తుంటారు. అటువంటి వారికి 5 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా సంబంధిత ప్రాంతంలోనే వృత్తి చేసుకుంటూ ఉండాలి అన్న నియమం ప్రతిబంధకం కావచ్చు. 2006 నాటి జాతీయ పునరావాస విధానంలో ఈ వివక్ష లేదు. ఎవరైనా సరే, 3 సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో సాధారణంగా జీవిస్తున్నవారయితే చాలు.

ఈ బాధితులకు లభించే పునరావాసమెటువంటిది? భూసేకరణ ప్రకటనతో బాటే ప్రభుత్వం పునరావాస ప్రక్రియ నిమిత్తం ఒక అడ్మినిస్ట్రేటర్‌ను నియమిస్తుంది. ఆ అధికారి మొదటి కర్తవ్యం వీలయినంత తక్కువమందిని నిర్వాసితులను చేసే ప్రత్యామ్నాయం కోసం అన్వేషించడం. ఆ అధికారి సూచించే ప్రత్యామ్నాయాన్ని ప్రభుత్వం తప్పనిసరిగా అమోదించాలా అన్న ప్రశ్నకు చట్టంలో జవాబు లేదు. బహుశా అది కేవలం ఒక సలహా లేక సూచనే కావచ్చు. తరువాతి ప్రక్రియ 400 కంటే ఎక్కువ కుటుంబాలు (కొండ ప్రాంతాలలో, ఏజెన్సీ ప్రాంతాలలో 200 కంటే ఎక్కువ కుటుంబాలు) నిర్వాసితులయ్యే ప్రాజెక్టులకు మాత్రమే వర్తిస్తుంది.

## సామాజిక ప్రభావంపై అంచనా

మొదటిగా ప్రాజెక్టుకు ఉండగల సామాజిక ప్రభావాన్ని అంచనా వేసే నిపుణుల బృందం రంగంలోకి దిగుతుంది. ఈ బృందంలో ఇద్దరు సామాజిక శాస్త్రవేత్తలుంటారు, ఏ సంస్థ అవసరాల కోసమైతే భూసేకరణ జరుగుతున్నదో ఆ సంస్థ ప్రతినిధి ఒకరుంటారు, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఉంటారు. వీరు

ఆ ప్రాజెక్టు ప్రాకృతిక వనరులపైన, సామాజిక వసతులపైన ఉండగల ప్రభావాన్ని అంచనా వేస్తారు. వారి నివేదిక పర్యావరణ ప్రభావ నివేదికను పోలినదని చట్టం సూచనప్రాయంగా అంటుంది. ప్రాజెక్టు రాబోయే ప్రాంతంలోని రోడ్లు, స్కూళ్లు, ఆస్పత్రులు, వివిధ పాలనా సంస్థలు, వసతులపైన ఆ ప్రాజెక్టు ప్రభావాన్ని తెలియజేసే ఈ నివేదిక పర్యావరణ నివేదికతోబాటు ప్రజలకు అందుబాట్లో ఉంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతారు. ఆ తరువాత పర్యావరణ అనుమతిలాగే సామాజిక అనుమతి కూడ ప్రాజెక్టు పొందాలి. ప్రభుత్వం షరతులతో కూడిన అనుమతి ఇయ్యవచ్చు.

## పునరావాస ప్రక్రియ

తరువాత పునరావాస ప్రక్రియ మొదలవుతుంది. పైన పేర్కొన్న అడ్మినిస్ట్రేటర్‌ను అధ్యక్షునిగా గల పునరావాస కమిటీ ఒకటి ఏర్పడుతుంది. అందులో ప్రభుత్వ అధికారులు, బాధితుల ప్రతినిధి ఒకరు, స్థానిక ఎంఎల్ఎ, ఎంపి, ఊరి సర్పంచ్, ఏ సంస్థ కోసమయితే భూసేకరణ జరుగుతున్నదో ఆ సంస్థ ప్రతినిధి ఒకరు ఉంటారు. (ఈ చట్టంలో కమిటీలు చాలా ప్రతిపాదించబడ్డాయి. ఇప్పటికి చెప్పినవి కాక, రాష్ట్ర ప్రభుత్వం స్థాయిలో ఒక పర్యవేక్షక కమిటీ, కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో దేశంలోని సకల పునరావాస ప్రక్రియల పర్యవేక్షణ కోసం ఒక జాతీయ పునరావాస కమిటీ ఉంటాయి).

మొదట ప్రభుత్వం ఆ ప్రాజెక్టులవల్ల దుష్ప్రభావానికి గురయ్యే 'బాధిత ప్రాంతాన్ని' ప్రకటిస్తుంది. ఆపైన అడ్మినిస్ట్రేటర్ ఆ ప్రాంతంలో వివరమైన సామాజిక ఆర్థిక సర్వే జరుపుతాడు. వివిధ వృత్తులలో ఉన్నవారి వివరాలు సేకరించి ప్రకటిస్తాడు. రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తులవారు, చిన్న వ్యాపారులు, సేవారంగానికి చెందినవారు మొదలయిన సకల వర్గాల బాధితుల వివరాలు ఈ ప్రకటనలో ఉంటాయి. ఈ ప్రకటనపైన బాధిత ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేయవచ్చు. ఫలాన లెక్క తప్పని, ఫలాన సమాచారం విస్మరించారని అడ్మినిస్ట్రేటర్‌కు చెప్పవచ్చు. ఆ అధికారి ఈ అభ్యంతరాలు లెక్కలోకి తీసుకొని సర్వేని పూర్తి చేయాలి. అడ్మినిస్ట్రేటర్ ఆపైన బాధితులను సంప్రదించి ఒక పునరావాస పథకాన్ని రూపొందిస్తాడు. దానిని కూడ ప్రకటిస్తాడు. దానిని బాధిత ప్రాంత గ్రామ సభలలో చర్చిస్తారు. తరువాత దానిని ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుంది. ఆ పునరావాస పథకంలో తప్పనిసరిగా ఉండవలసిన అంశాలను చట్టమే చెప్తుంది. ఈ పద్ధతి యావత్తు 'పెద్ద ప్రాజెక్టులకు' మాత్రమే వర్తిస్తుందని చెప్పాము. 'చిన్న ప్రాజెక్టులకు' కూడ

పునరావాసం ఉంటుంది గానీ ఈ పద్ధతేమీ ఉండదు. అడ్మినిస్ట్రేటర్ తనపాటికి తాను చట్టంలోని నియమాలను అనుసరించి పునరావాస పథకాన్ని నిర్ణయిస్తాడు.

## పూర్తిస్థాయిలో గ్రామం నెలకొల్పాలి

బాధితులందరికీ ఒకేచోట లేదా గుంపులు గుంపులుగా రెండు మూడు చోట్ల పునరావాసం కల్పిస్తారు. చిన్న ప్రాజెక్టుకయితే అందరికీ ఒకేచోట కల్పిస్తారు. అదొక పూర్తిస్థాయి గ్రామం రూపంలో ఉండాలి. 'పెద్ద ప్రాజెక్టు' అయితే వసతులన్నీ 'సమగ్రంగా' కల్పించబడతాయి. చిన్నదయితే 'మౌలిక వసతులు మాత్రమే కల్పించబడతాయి. అయితే ఇళ్లు ప్రభుత్వం కట్టియ్యదు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు మాత్రమే (అందులోనూ అయిదు సంవత్సరాలు నిరంతరాయంగా సంబంధిత ప్రాంతంలో ఉండిన వారికే) ప్రభుత్వం ఇల్లు కట్టిస్తుంది. తక్కిన వారికి ప్లాటు మాత్రమే దక్కుతుంది. ఇది నిజానికి అన్యాయం, ఎందుకంటే ఒకవేళ వాళ్లు ఇళ్లు కోల్పోయి వలస వచ్చిన వారయినా ఆ యింటికి వచ్చే నష్టపరిహారం కొత్తచోట ఇల్లు కట్టుకోవడానికి ఏమాత్రం సరిపోదు. ఇల్లు కోల్పోకపోయినా అక్కడే ఉండి బతకడం సాధ్యం కాక (నిర్వాసితులుగా కాక బాధితులుగా) పునరావాస గ్రామానికి వచ్చిన వారు ఏం పెట్టి కొత్తచోట ఇల్లు కట్టుకోవాలి? పాత ఇంటి పెంకులూ, వాసాలూ, ఇటుకలూ ఒక్కొక్కటిగా తొలగించి తీసుకొచ్చి ఇక్కడ కట్టుకోవాలా?

ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన వారికి పునరావాస గ్రామం దగ్గర భూమి అందుబాట్లో ఉంటే ఎంత కోల్పోతే అంత భూమి (తరిపొలం 2 1/2 ఎకరాలు, మెట్ట అయితే 5 ఎకరాలు మించకుండ) ఇస్తారు. ఇది నష్టపరిహారానికి అదనంగానా లేక నష్టపరిహారానికి బదులా అనేది చట్టంలో స్పష్టంగా లేదు. భూమి సేకరించింది సాగునీటి ప్రాజెక్టు కోసమైతే, బాధితులందరికీ కొత్త ప్రాజెక్టు కమాండ్ ఏరియాలో ప్రభుత్వ భూమి కేటాయింపులో మొదటి హక్కు ఉంటుంది. అంటే అప్పటిదాకా నిరుపయోగంగా ఉండి కొత్త ప్రాజెక్టువల్ల సాగుయోగ్యం అయిన భూమిని కేటాయించినప్పుడు వీరికి మొదటి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. ఈ కేటాయింపు పునరావాస ప్రదేశానికి దగ్గరగా ఉండదు కాబట్టి దీనిని స్వీకరించేవారు పునరావాసాన్ని వదులుకోవలసి రావచ్చు. ఈ విధంగా భూమి పొందిన వారికి దానిని బాగు చేసుకోవడానికి 10 వేల రూపాయలు (ఆ భూమి కమాండ్ ఏరియాలోనిదయితే) లేక 15 వేల రూపాయలు (అది పునరావాస కేంద్రానికి సమీపంలో ఉన్న బంజరు భూమయితే) ఇస్తారు. పశువుల

కొట్టం ఉన్న రైతుకు పునరావాస కేంద్రంలో పశువుల కొట్టం వేసుకోవడానికి 15 వేల రూపాయలు, చిన్న వ్యాపారం లేక చేతివృత్తి చేసుకొనే వారికి పునరావాసంలో భాగంగా 25 వేల రూపాయలు ఇస్తారు. ఏ సంస్థ కోసమయితే భూసేకరణ జరుగుతున్నదో ఆ సంస్థలోని ఉద్యోగాలలో (అర్హతలను బట్టి అని వేరే చెప్పనవసరం లేదు) భూసేకరణ బాధితులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. భూమిగానీ ఉద్యోగం గానీ దక్కని బాధితులకు 750 రోజుల వ్యవసాయ కూలీ కనీస వేతనం లభిస్తుంది. నిజానికి భరోసా ఉండేది ఇదొక్కటే. మిగిలినవన్నీ లభ్యతను బట్టి, యోగ్యతను బట్టి, అర్హతను బట్టి దక్కుతాయి.

ఈ నష్టపరిహారం పైకం రూపంలోనూ ఇయ్యవచ్చు లేదా భూసేకరణ ఏ సంస్థ కోసం చేస్తున్నారో ఆ సంస్థ పెట్టుబడులలో వాటా రూపంలోనూ ఇయ్యవచ్చు. అయితే షేర్ల రూపంలో ఇచ్చేది నష్టపరిహారంలో నాలుగవ వంతుకు తక్కువ ఉండడానికి వీలులేదు. కానీ నగదు రూపంలో తీసుకునేదీ, షేర్ల రూపంలో తీసుకునేదీ బాధితుల ఇష్టం. వారికి బలవంతంగా షేర్లు అంటగట్టడానికి వీలులేదు.

## మళ్లీ అదే స్థాయిలో బతకగలగాలి

పార్లమెంటులో పెండింగ్‌లో వున్న పునరావాస బిల్లులోని విషయాలు ఇవి. ఏమీ లేకుండటం కంటే ఎంతో కొంత ఉండడం మేలనుకుంటే వేరే సంగతిగానీ సూత్రబద్ధంగా ఆలోచించేటట్టయితే ఎంతోకొంత ఇస్తున్నారులెమ్మని సంతృప్తి చెందనవసరం లేదు. ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులవుతున్న వారు తమ కోరిక మేరకు వెళ్లిపోవడం లేదు. దేశ అభ్యుదయం కోసం వాళ్లను వెళ్లగొడుతున్నామని పాలకులు అంటున్నారు. అటువంటప్పుడు వారిని ఆదుకోవడం దేశం బాధ్యత కాదా? వారి ఊళ్లనుండి, వారి జీవనం నుండి వారిని వెళ్లగొట్టక ముందు వారు ఏ విధంగా బతికారో మళ్లీ కనీసం అదే బతుకు పొందే హక్కు వారికి లేదా? అది ఏ విధంగా వారికిస్తారన్నది ఆయా పరిస్థితులను బట్టి ఉంటుంది. కానీ సంకల్పం ఉంటే అది సాధ్యమే. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న చట్టంలో ఆ స్పృహ లేదు. ఒక ఇంటి ప్లాటు, 750 దినాల కనీస వేతనం మాత్రమే వారందరికీ ఈ చట్టం భరోసా ఇచ్చే హక్కులు. మిగిలినవి హామీలు మాత్రమే. నగదు రూపంలో ఉన్న నష్టపరిహారం నాలుగు రోజుల తర్వాత వారి చేతులలో మిగలదన్నది అందరూ ఎరిగిన జీవిత సత్యం. ఆ తరువాత పని దొరికిన రోజు కూలిచేసుకొని దొరకని రోజు పస్తు ఉండడమేనా వారి గతి?

ముగించే ముందు ఈ బిల్లులోని ఒక సంతోషదాయకమైన విషయాన్ని ప్రస్తావించాలి. ఇది కేవలం ప్రాజెక్టుల భూసేకరణ వల్ల నిర్వాసితులయిన వారికే కాదు. 'ఏ యితర కారణాలవల్లనయినా నిర్వాసితులయిన వారికి' కూడ వర్తిస్తుంది. సామాజిక ఘర్షణలవల్ల ఊరూ వాడా విడిచిపెట్టిపోయేవారు చాలామందే దేశంలో ఉన్నారు. వారికిప్పుడు ఏ రక్షణా లేదు. దీనికి ప్రముఖ ఉదాహరణ ఛత్తీస్‌గఢ్ నుండి సల్వాజుడుం కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు పారిపోయి వచ్చిన గుత్తికోయలు. వారికి కూడ ఈ బిల్లు చట్టమయితే వర్తిస్తుంది.

**మానవహక్కుల వేదిక బులెటిన్-10లో వ్యాసంగా వచ్చింది**
**జూన్ 2009**


# అభివృద్ధి - సంక్షేమం





బడుగువర్గాల జీవితాలు బాగుపడడాన్ని మనం ఇంకా 'అభివృద్ధి'గా అర్థం చేసుకోవడం లేదు. సంక్షేమంగా మాత్రమే అర్థం చేసుకుంటున్నాం. 'అభివృద్ధి' ఆదాయాన్ని తెచ్చిపెడితే 'సంక్షేమం' ఖర్చును పెంచుతుందని చెప్పి దానిని ఒక కంట కనిపెట్టి ఉంచాలనుకుంటాం. చవక బియ్యం, ఉచిత కరెంటు, ఎస్.సి, బి.సి స్కాలర్‌షిప్‌లు, వికలాంగులకు బస్‌పాసులు, ఇవన్నీ ప్రభుత్వానికి ఖర్చు పెంచే సంక్షేమ చర్యలు అనుకుంటాము కాబట్టి వీటికొక సీలింగ్ పెట్టి అంతకంటే ఎక్కువ అడగొద్దనీ ఇవ్వొద్దనీ అంటాం. అదే వెడల్పయిన రోడ్లు, టెలికాం లైన్లు, పర్యాటక కేంద్రాలు - ఇటువంటివయితే 'అభివృద్ధి'కి సంబంధించిన విషయాలనీ, వాటిపైన ఎంత ఖర్చు పెట్టగలిగితే అంత మంచిదనీ అనుకుంటాం. కానీ నిజానికి 'సంక్షేమం' అనేది ఎంత 'అభివృద్ధో' గ్రహించినట్టయితే ఈ విషయాల గురించి మనం చర్చించే పద్ధతే మారిపోతుంది. ప్రభుత్వ ఖజానాకూ ప్రైవేట్ బ్యాంక్ అకౌంట్లకూ పెట్టుబడులను వేగంగా జమచేసేది మాత్రమే అభివృద్ధి కాదనీ, ప్రజల జీవితాలను బాగుపరిచేదీ అభివృద్ధే అనీ గ్రహించే రోజు ఎప్పుడొస్తుందో.

కె. బాలగోపాల్



A HRF Publication